Urdu Literature
(Telugu)

ఉర్దూ సాహిత్యం

డాక్టర్ ఎస్. సదాశివ

విషయ సూచిక

- అభినందనలు 05
- నా మాట 07
- గురువుగారు! 09
- ఉర్దూ భాష 11
- అమీర్ ఖుస్రూ 14
- దక్షిణ భారతదేశంలో ఉర్దూ 18
- వలీ దకనీ 22
- దిల్లీలో ఉర్దూ సాహిత్యం 25
- ఉర్దూ మహాకవిత్రయం 30
- లఖ్నోలో ఉర్దూ కవిత 40
- లఖ్నో మర్సియాలు 46
- ఉర్దూలో మొదటి ప్రజాకవి 47
- దిల్లీలో ఉర్దూ కవిత చివరి వెలుగు 75
- జోఖ్ 81
- మోమిన్ ఖాన్ మోమిన్ 83
- మిర్జా గాలిబ్ 86
- మోమిన్, జోఖ్, గాలిబుల తర్వాత... 96
- సాంప్రదాయిక కవితలో చివరి మహాకవులు కొందరు 98

◆ నవ జాగృతి-ఉర్దూ కవులూ, రచయితలూ 103
◆ షిబ్లీ నోమాని 109
◆ అక్బర్ ఇలాహాబాదీ 111
◆ పండిత్ బ్రిజ్‌నారాయణ్ చక్బస్త్ 114
◆ డా. సర్ మహమ్మద్ ఎక్బాల్ 117
◆ మరి కొందరు సుప్రసిద్ధ కవులు 122
◆ హస్రత్ మోహానీ 124
◆ ఫానీ బదాయూనీ 127
◆ అస్గర్ గోండ్వీ - జిగర్ మురాదాబాదీ 129
◆ జోష్ మలీహాబాదీ 133
◆ ఫిరాఖ్ మొదలయిన కొందరు కవులు 136
◆ అంజుమన్ తరక్కీ పసంద్ ముసన్నిఫీన్ 141
◆ మరికొందరు అభ్యుదయ కవులు 144
◆ ఉర్దూ గద్య వికాసం 148
◆ ఉర్దూ నవలా రచన ప్రారంభదశ 155
◆ ఉర్దూ నవల 160
◆ ఉర్దూ కథ 168
◆ ఉర్దూ సాహిత్యంలో వివిధ ప్రక్రియలు 171
◆ మిర్జా గాలిబు గజళ్ల అందాలు 174

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy *Ex.M.P.*
M.A.,Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road, Hyderabad - 500 001.
Tel: (off) 24753724

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్‌డి., డిలిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు-500 001.
ఫోన్: (అ) 24753724

అభినందనలు

"ఉర్దూ సాహిత్యం" అనే ఈ గ్రంథాన్ని రూపొందించిన డా. ఎస్. సదాశివ గారు ఉర్దూ విద్వాంసుల్లో అగ్రేసరపంక్తికి చెందిన తెలుగు మాతృభాషీయులు. సదాశివగారికి ఉర్దూలో ప్రావీణ్యంతోపాటు ఫారసీ, అరబ్బీ, హిందీభాషల్లో సముచిత ప్రవేశం ఉండడం గణనీయ విషయం. సదాశివగారి మరొక ప్రజ్ఞాపార్శ్వం శాస్త్రీయ సంగీత పరిజ్ఞానం. సాహిత్య సంగీతరంగాలపైన వారు రచించిన వివిధ వ్యాసాలు ప్రామాణిక పాఠ్యాంశాలకోవకు చెందినవి.

సదాశివగారు రచించిన ఈ గ్రంథంలో ఉర్దూ సాహిత్య చరిత్ర సమస్తం 'కొండ అద్దమందు' అన్నట్లుగా ప్రతిబింబించింది.

ఉర్దూభాష తొలినాళ్ళలో హిందీ అని, జుబానె హిందుస్తాన్ అని, హిందుస్తానీ అని వ్యవహరించబడినా 18వ శతాబ్ది చివరి భాగంలోనే దానికి 'ఉర్దూ' అనే పేరు స్థిరపడిందని సత్యావిష్కరణ చేశారు సదాశివగారు.

షమ్సు వలీవుల్లా వలీని ఉర్దూ కవితకు ఆద్యుడుగా ప్రతిపాదిస్తూ అందుకు తగిన ఉపపత్తులను చూపుతూ, ఆ కాలంలోని ఢిల్లీలోని ఉర్దూ సాహిత్య వికాసాన్ని ఉల్లేఖించారు సదాశివగారు. అంతేకాదు- తెలుగుకు కవిత్రయం ఉన్నట్లే ఉర్దూ భాషకు సౌదా, దర్ద్, మీర్ కవిత్రయంగా భాసిల్లినట్లు సదాశివగారు ప్రస్తావించారు.

ఉర్దూ సాహిత్య ప్రక్రియల్లో కసీదా, మస్నవీల్లాంటివున్నా అన్నిటికీ శిరోమణి లాంటిది గజల్ ప్రక్రియ. గజల్ వల్లనే ఉర్దూ సంపన్న సాహిత్య భాషగా రూపుదిద్దు కున్నదని నా అభిప్రాయం. ఆ దృష్టితోనే సదాశివగారు గాలిబ్ మొదలుకొని ఆధునిక గజల్ కవుల వరకు విపులంగా చర్చించారు. కొంతవరకు నవల, కథానిక లాంటి ప్రక్రియలను గురించి ముచ్చటించారు. ఈ గ్రంథం ముగింపు ఉర్దూ గజల్ కవీంద్రుడు గాలిబ్ గజల్ల అందాలకు సంబంధించిన చర్చతో. కారణం? సదాశివగారి మాటల్లో "ఉర్దూ అంటే గజల్. గజలంటే గాలిబు. ఇది జనాభిప్రాయం. గజల్‌కు గౌరవం దొరికినంతకాలం గాలిబును సాహిత్య లోకం మరచిపోజాలదు." ఇది ప్రత్యక్షర సత్యం.

ఉర్దూ సాహిత్యేతిహాసాన్ని రెండువందల పుటల్లో సర్వాంగీణంగా అందించిన డా॥ సదాశివగారిని, దానికి ప్రచురణ రూపమిచ్చిన తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ వారిని అభినందించడం నా ధర్మం.

తేది: 26 మే, 2007 (డా. సి. నారాయణ రెడ్డి)

నా మాట

జనాబ్ ఎస్.ఎమ్. మలిక్ గారితో నాకు ఉర్దూ అకాడమిలో పరిచయం కలిగింది. మొదటి పరిచయంలోనే నాకు వారు మాట్లాడే తీరు నచ్చింది. వారు కార్యదీక్షాపరులనే భావం ఏర్పడింది. హైదరాబాదులో వుండే నా చిన్నకొడుకు ఎస్. చంద్రశేఖర్ అడ్వొకేటు ఇంటికి రావలసిందిగా వారిని కోరినాను. వారు వచ్చినారు. వారు జమాఅతె ఇస్లామీ హింద్‌కు సంబంధించిన వారని తెలిసింది. ఆ సంస్థ తరపున తెలుగు మాతృభాషగా గల ముస్లిముల కోసం ఇస్లామీయ ధర్మాన్ని, పవిత్ర ఖుర్‌ఆన్‌లోని అంశాలను తెలుగులో రాసీ, రాయించీ 'గీటురాయి' అనే పేర ఒక పత్రిక తీస్తున్నట్లు చెప్పినారు. వారు తెలుగులో సరళ సుందరమైన వచనం రాయగలరు. అలాగే కవిత్వం గూడా రాయగలరు. అంతేగాక చక్కని ఉర్దూ కూడా రాయగలరు. "ఇస్లామీయ ధర్మప్రచారం తెలుగులోకంటే ఉర్దూలో ఇంకా చక్కగా చేయవచ్చుగదా! తెలుగు మాట్లాడే ముస్లిం సోదరుల కోసం ఉర్దూ భాషా సాహిత్యాల పరిచయం చేస్తే మంచిదేమో!" అన్నాను. "ఆ పని మీరు చేయండీ" అన్నారు మల్లిక్‌గారు. నేను 1949 నుంచి చేస్తున్న పని అదే. తెలుగు పత్రికలన్నింటిలో ఉర్దూ భాషా సాహిత్యాల గురించి, కవుల గురించి రాస్తున్నాను. ఉర్దూ పత్రికలల్లో తెలుగు సాహిత్యాన్ని, కవులను, రచయితలను గురించి రాస్తున్నాను. తెలుగు పత్రికలల్లో ఉర్దూ సాహిత్యాన్ని, కవులను, రచయితలను గురించి రాస్తున్నాను. కాబట్టి "గీటురాయి కోసం ఉర్దూ భాషా సాహిత్యాలను గురించి రాస్తాను" అని సంతోషంగా అంగీకరించినాను.

అప్పటి నుంచి గీటురాయిలో ఉర్దూ భాషోత్పత్తి వికాసాలను, ఎందరో కవులను, రచయితలను, కథా రచయితలను, నవలా రచయిత

లను సాహిత్య చరిత్రకారులను గురించి అనేక వ్యాసాలు రాసినాను. ఫారసీలోని షేఖ్ సాదీ గులిస్తాన్‌ను సంక్షిప్తం చేసి రాసినాను. కబీర్ దోహాలను గురించి రాసినాను. ఇవన్నీ ఇతర పత్రికలకు రాసినట్లుగా కాక నా పత్రికకే రాస్తున్నానన్నంత ఉల్లాసంతో, ఉత్సాహంతో రాసినాను. అట్లా రాయటానికి కారణం మల్లిక్‌గారు నా పట్ల చూపిన ఆదరణే. గీటురాయి పత్రికలో పనిచేసే మిత్రులందరి ప్రవర్తన అటు వంటిదే. గీటురాయి సభల్లో ఎందరో పెద్దలతో, లబ్ధప్రతిష్ఠులైన కవి మిత్రులతో పరిచయా లేర్పడినాయి.

ఇతర పత్రికల్లో వరుసగా రాసే నా వ్యాసాలు పుస్తక రూపంలో వచ్చినాయి. గీటురాయిలో నేను రాసిన వ్యాసాలు కొన్ని పుస్తక రూపంలో వస్తే బాగుండేదని నాలో నేను అనుకునేవాన్ని. నన్నంత గౌరవంగా, ప్రేమగా చూచే మల్లిక్‌గారితో ఆ మాట అనలేకపోయినాను. ఇన్నాళ్లకు మల్లిక్‌గారు నా వ్యాసాలను పుస్తక రూపంలో తెస్తున్నందుకు నిజంగా సంతోషిస్తున్నాను. దీన్ని నా ఎనభయ్యవ జన్మదిన కానుకగా స్వీక రిస్తున్నాను.

ఆదిలాబాదు — సదాశివ
16-05-2007.

గురువుగారు!

ఆయన పండితుడు, బహుభాషా ప్రవీణుడు. సంగీత ప్రేమికుడు, రాగ, తాళ రసజ్ఞుడు. ఉర్దూ భాష దార్శనికుడు, తెలుగు భాషావిజ్ఞుడు. కవి, కళా పిపాసి- ఇవన్నీ అందరికీ తెలిసిన విషయాలే. ఇతర విషయాలేవి చెప్పాలన్నా ఆయనతో పరిచయం లేనివారి కొరకే చెప్పాలి. ఆయన్ని ఒక్కసారి కలుసుకుంటే ఎవరయినా మళ్ళీ కలసుకోకుండా ఉండలేరు. ఆయన్ని ఒకటికి రెండుసార్లు కలసుకున్న వాళ్ళు ఆయన లోని పాండిత్యాన్ని, బహు విషయ పరిజ్ఞానాన్నీ మాత్రమేకాక ఆయనలోని అన్యగుణా లను, అన్యస్వభావాలను, ప్రత్యేకతలనూ దర్శించకుండానూ ఉండలేరు.

ఆయనది రసజ్ఞత గల కళా హృదయం. సంగీతమన్నా, కవిత్వమన్నా, సాహిత్యమన్నా ఆయనకు ఆరవ ప్రాణం. ఆస్తికుడు, మానవతావాది.

ఏ విషయమయినా ఆయన తనదయిన శైలిలో ముచ్చటముచ్చటగా చెప్పాలె, మనం వినాలె! వినేవారికి ఓపిక ఉండాలిగాని ఆయన ముచ్చట్లు మటుకు విషయ వైవిధ్యం కలగలుపుకుని వీనులలో తీయ్యదనాలను బొట్టు బొట్టుగా రాలుస్తూనే ఉంటాయి, మనసును అలరిస్తూనే ఉంటాయి.

ఉర్దూ షాయిరీ గురించి కదలించినా, హిందూస్తానీ కర్ణాటక సంగీతం, రాగాలు, వాయిద్యాలు, గాయనీ గాయకులను గురించి స్పర్శించినా ఏ విషయాన్ని ఎత్తుకున్నా ఆయన తన అనుభవాల రాశుల్లోనుంచి ఆ విషయాన్ని అతి సునాయాసంగా తీసి దొంతరలు దొంతరలుగా, సరళంగా, మనోజ్ఞానంగా ప్రబుద్ధమయ్యేలా మరీ వర్ణించి చెబుతారు. ఉపాధ్యాయుడాయె, బోధపరచడం, మనోగతపరచడం, జ్ఞానం, వినోదం సమ్మిశ్రమం చేయడం ఆయన సహజ వ్యాపారం గనక అన్నీ సాకల్యంగా వివరించి మరీ ముచ్చటిస్తారు. పండితుల మధ్య నిండు కుండవోలె వ్యవహరిస్తారు. మాబోటి విద్యార్థుల మధ్య ప్రబోధనాసక్తి కనబరుస్తారు. ప్రేమ ఒలకబోస్తారు, వాత్సల్యం కురి పిస్తారు. వయసు చాటేదేమయినా మనసు మాత్రం యవ్వనోత్తేజాన్నే ప్రతిఫలిస్తుంది. వెన్నెల వంటి పలుకు- తీయగా, తెల్లగా, మెల్లగా, చల్లగా!

ఉర్దూ ఆయన ప్రేమ, ప్రాణం; ఉర్దూ ఆయన పిచ్చి, ఉర్దూ ఆయన రాగం, తాళం, మకుటం, చరణం, పల్లవి! ఉర్దూ ఒడిలో, ఉర్దూ షాయిరీని కావలించుకుని ఉర్దూను ముచ్చటించడం ఆయన వ్యసనం!! ఉర్దూ పట్ల చిత్తశుద్ధితో బాధపడేవారిలో ఆయనా ప్రముఖుడే. ఉర్దూను, ఉర్దూ ఎరుగని ప్రపంచానికి పరిచయం చేసి, సాహిత్యమంటే, సంస్కారమంటే, సంవేదన అంటే ఉర్దూయే అని ధీమాగా, సుబోధకంగా వాదించి, ఒప్పించగల ఉర్దూ యోధుడాయన.

ఆయనదో తరం. ప్రేమతరం, స్నేహతరం, సంగమ తరం, సమరస తరం, సమన్వయ తరం, సమజీవన తరం, సహగమన తరం, సమ్మిశ్రమతరం, వ్యాకులతరం, ఆవరణా కాంక్షగల తరం, అంతరించిపోతున్న తరం! మళ్ళీ రాదేమో అని కళ్ళు చెమర్చజేస్తున్న తరం!!

చేవ్రాత మనసుకు అద్దం అని అంటారు. ఆయన ఎంత సునాయాసంగా ముచ్చటిస్తాడో అంతే సరళంగా వ్రాస్తారు. పలుకులు ఎంత స్పష్టంగా ఉచ్చరణ దోషాలు లేకుండా వెల్లడిస్తారో అక్షరాలూ అంతే అందంగా ముత్యాల్లా కాగితంపైన అమర్చి పెడతారు. వ్రాతలో కృత్రిమత, సంక్లిష్టత, తకల్లుఫ్ ఎంతమాత్రం గోచరించవు, భాషలోను, భావంలోనూ, అక్షరాల్లోనూ!

మలివ్రాతలుండవు. కొట్టివేతలు చాలా తక్కువ. సహజంగా ఆలోచిస్తారు, సహజంగా మాటలాడతారు, సహజంగానే వ్రాస్తారు- తెలుగయినా, ఉర్దూ అయినా సమంగానే, సుందరంగానే, సమగ్రంగానే వ్రాస్తారు. తెలుగుతనం జాలువారే తెలుగయితే 'ఉర్దూయియత్' ఉట్టిపడే ఉర్దూ. అచ్చుగుద్దినట్లే వ్రాస్తాడు. చిన్నపిల్లవాడయినా సునాయాసంగా చదువుకోవచ్చు. పదహారణాలా ఉపాధ్యాయుడు!! ఆయన లేఖలు, ఉర్దూ, తెలుగు లేఖలు నా వద్ద భద్రంగా ఉన్నాయి.

నేను ఆయన్ని పరిచయం చేసుకున్న సందర్భం ఆయన చెప్పిందే (యాదిలో) సరయినది, కాని, నేటి నేను పదేళ్ళ క్రితం యువకునిగా కనిపించి ఉంటానా? ఏమో! తరచి తరచి ఆలోచించినా ఆ అవకాశమే లేదు. కాని వాత్సల్యం నిండిన ఆయన చూపు ఆ రూపును అలా ముద్రించింది ఆయన యాదిలో. ఆ క్షణాన ఆయన ఏమని అనుకున్నారోగాని నా గురించి ఆ పరామర్శ చదివి నేనుమటుకు సంబరపడిపోయాను. ఆయన్ని తొలిసారిగా అలా కలసుకున్నప్పుడు కూడా నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు. వ్యక్తిగత ప్రయోజనమూ ఆశించి ఉంటాను, దాన్నీ కాదనను, కాని అది ప్రముఖం కాదు.

'గీటురాయి'కి తగిన గురువు లభించాడని మురిసిపోయాను. ఆయన్ని పూర్తిగా స్వంతం చేసుకోవాలని శతవిధాలా ప్రయత్నించాను. ఆయన్ని పూర్తిగా జుర్రుకోవాలని కోరుకున్నాను. ఆయన సాంగత్యం, సహచర్యం చిరస్థాయి కావాలని ఆశపడ్డాను. అన్నీ మనం అనుకున్నట్లే జరిగితే మనిషీ దేవుడనే వారికి సందేహముండేది కాదేమో. ఎవరి పరిమితులు వారికున్నాయి. అందువల్లనే ఈ జీవన కర్మాగారం సజావుగా సాగుతోంది. లేకపోతే ఏమయ్యేదో.

ఉర్దూను గురించి తెలుగువారికి పరిచయం చేసే ఈ పుస్తకం ఎప్పుడో రావలసింది. గీటురాయిలో ప్రచురిస్తున్నప్పుడే అనుకున్నాను దీన్ని పుస్తకరూపంలో తేవాలని. కాని పరిస్థితులు అనుకూలించలేదు. ఏదో ఒక అవాంతరం, ఏదో ఒక కారణం. పని జరగడానికి సాధనాలెలా అమరుతాయో, జరగకపోవడానికీ అలాగే అడ్డంకులు ఎదురవుతాయి....... ఏది ఏమయినా కడకు ఈ పుస్తకం పాఠకులను అందజేస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది.

హైదరాబాద్, - మలిక్

21-05-2007

ఉర్దూ సాహిత్యం

ఉర్దూ భాష

ప్రొఫెసర్ రషీద్ అహ్మద్ సిద్దీఖీ వచన రచన అనుపమానమయింది. అతని ప్రతి వాక్యం ప్రామాణికమయింది. ఉర్దూ భాషను గురించి ఇలా రాసినాడు. "మొగల్ పాదుషాలు మనదేశానికేమిచ్చినారని ఎవరైనా ప్రశ్నిస్తే మూడు శ్రేష్ఠమైన బహుమతులిచ్చినారని నేను సమాధానం చేస్తాను. తాజ్‌మహల్, ఉర్దూ, గాలిబు."

తాజ్‌మహల్ గురించి ప్రొఫెసర్ సిద్దీఖీ చెప్పిన మాటను ఎవరూ కాదనరు. కాని ఉర్దూను గురించి అతడు చెప్పిన మాట ఆలోచించదగిందే.

మొదటి పానిపట్టు యుద్ధంలో ఉత్తర భారతదేశాన్ని జయించి దిల్లీ చక్రవర్తులైన మొగలులు తమ వెంట తుర్కీ, ఫారసీ భాషలను తెచ్చినారు. ఉర్దూను వాళ్లు తేలేదు. ఆ భాష ఇక్కడి ప్రజావ్యవహారంలో అంతకుముందు నుంచే వున్నది. అయితే, దానికాపేరు ఆనాడు లేదు. మొగలులు దాన్ని గుర్తించనూ లేదు. ఫారసీ భాషకు రాజభాషా గౌరవం కలిగించినారు. పరిపాలనా వ్యవహారాల కదే భాష. కళా సాహిత్యాల అభివ్యక్తికదే భాష. శిష్టజనుల సంభాషణ కదేభాష. బాబర్ తన ఆత్మకథను తుర్కీ భాషలో రాసుకున్నాడు. అతని మునిమనుమడు జహాంగీర్ తన ఆత్మకథను ఫారసీలో రాసుకున్నాడు. అంటే జహాంగీర్ కాలం నాటికే తుర్కీ భాష వ్యవహార భాషగా మారింది. ఫారసీ గౌరవం పెరిగింది. మొగల్ చక్రవర్తుల కాలంలో ఎందరో ఫారసీ కవులు ఈరాన్ నుంచి వచ్చి అక్కడి ఆస్థాన కవులయినారు. ఇక్కడ జన్మించిన వాళ్లు కూడ ఫారసీ కవులే అయినారు. మూడవ పానిపట్టు యుద్ధంలో మొగలులు తమ ప్రాభవం కోల్పోయినారు. అంతకు పదేళ్లు ముందే నాదిర్‌షా మన దేశంపై దండెత్తి వచ్చి దిల్లీలో మారణహోమం జరిపినాడు. దిల్లీ ఖజానాను కొల్లగొట్టినాడు. అతని వెంట దేశసంపద చాలా వరకు వెళ్లిపోయింది. బ్రిటిష్ కంపెనీవాళ్ల ప్రాబల్యం క్రమక్రమంగా పెరిగింది. షాహ ఆలం చక్రవర్తి ఎంతటి దయనీయ స్థితిలో

జీవితం గడిపినాడో, చివరి మొగల్ చక్రవర్తి బహాదుర్‌షా జాఫర్ గతి యేమయిందో చరిత్ర చదివిన వాళ్లకు తెలిసిన సంగతులే. ఇక్కడ నేను మొగల్ చక్రవర్తుల చరిత్ర చెప్పటం లేదు. నేను గుర్తు చేయదలచుకున్నది మొగలుల ప్రాభవాన్నీ పతనాన్నీ గురించి. మొగలుల ప్రాబల్యంతో మనదేశంలో, అంటే, ఉత్తర భారతదేశంలో ఫారసీ ప్రాబల్యం పెరిగింది. వాళ్ల పతనంతో దాని ప్రాబల్యం తగ్గింది. దాని స్థానం ప్రజల భాషకు లభించింది. అప్పటి ప్రజల భాష ఉర్దూ. ఆనాడు దానికాపేరు లేదు. దాన్ని హిందీ, హిందుయీ, జుబానె-హిందూస్తాన్, హిందుస్తానీ అని రకరకాల పేర్లతో వ్యవహరించేవాళ్లు. పద్ధెనిమిదవ శతాబ్ది చివరి భాగాన ఆ భాషకు ఉర్దూ అనే పేరు స్థిరపడింది.

ప్రొఫెసర్ సిద్దీఖీ అన్నమాట నిజమే గదా. బలహీనులైన మొగలులు మనదేశభాష ఉర్దూ వికాసానికి తోడ్పడ్డారు. చివరి మొగల్ చక్రవర్తి బహాదుర్‌షా జఫర్ మిర్జాగాలిబును మనకు అప్పగించినాడు.

ఇక్కడొక ప్రశ్న తలెత్తటం సహజం. ఉర్దూ భాష ఎలా రూపొంది వుంటుంది? ఏ భాషయినా ఎలా యేర్పడుతుందో, ఎలా వికసిస్తుందో, ఎలా పరిణతి చెందుతుందో భాషాశాస్త్రవేత్తలు చెప్పగలరు. మన మిక్కడ అంత గంభీరంగా ఆలోచించే అవసరం లేదు. సాధారణంగా ఒక భాష ఎందుకేర్పడవలసి వస్తుందో, ఎలా ఏర్పడుతుందో ఆ ప్రక్రియను పైపైనే పరిశీలిస్తే సరిపోతుంది. మానవుడు సంఘజీవి. ఒక సంఘంలో వుండే వ్యక్తులు తమ అవసరాలను, తమ భావాలను, తమ కష్టసుఖాలను ఇతర వ్యక్తులకు తెలియజేసుకోకుండా వుండలేరు. అలావుంటే సహజీవనం చేస్తూ బ్రతుకలేరు. తెలియజేయటానికి, తెలుసుకోవటానికి ఒక'మీడియా' అవసరం. అదే భాష. ఒకచోట వుండే వ్యక్తులొక భాష మాట్లాడుతారు. ఇంకోచోట ఇంకోభాష మాట్లాడుతారు. వేరువేరు సంఘాల్లో, వేరువేరు ప్రాంతాల్లో వుండే వ్యక్తులు ఒక్కచోట కలిసి వ్యవహరించవలసి వస్తే వాళ్లకొక క్రొత్త మీడియా అవసరమవుతుంది. అన్ని భాషల్లోని కొన్ని కొన్ని శబ్దాలను కలగాపులగం చేస్తేగాని అందరికీ స్పష్టాస్పష్టంగా అర్థమయ్యే ఒక భాష యేర్పడదు. ముసల్మానులు మనదేశానికి వచ్చేనాటికి ఉత్తరభారత దేశంలో వుండే ప్రజలు మాట్లాడే భాషలు పలురకాల ప్రాకృతాలు- శౌరసేనీభాష అపభ్రంశాలు. బ్రాజ, రాజస్థానీ, భోజ్‌పురీ, పంజాబీ, హర్యానీ, ఖడీబోలీలు అప్పటి భాషలు. ముసల్మాను పాదుషాలు తుర్కీ, ఫారసీ, అరబీ భాషలు మాట్లాడేవాళ్లు. పాలకులకు, పాలితులకు మధ్య సంబంధ వ్యవహారాలు అనివార్యమైనవి. అవసరమైనవి. ఆ

అవసరం తీరాలంటే అన్ని భాషల్లోని కొన్నికొన్ని శబ్దాలు కలిసి ఒక కలగాపులగం భాష ఏర్పడాలెగదా! అదిగో, అలా ఏర్పడిన భాషే ఉరుదూ- ఇది ఏ ప్రాంతానికో చెందిన భాష కాదు. ఏ దేశం నుంచో వచ్చిన భాష కాదు. మనదేశంలో రూపుదిద్దుకున్న భాషే. కనుక ఇది మన భాష. ఇది ఏ సంఘానికో, ఏ మతానికో చెందిన భాష కాదు. కనుక ఇది మనందరి భాష.

ముసల్మానులు మన దేశానికి పాలకులుగా వచ్చినారు. కొన్ని రాజవంశాలు ఢిల్లీని రాజధానిగా చేసుకొని పాలించినాయి. వాళ్లకు, వాళ్ల పరివారానికి, వాళ్ల వెంటవచ్చిన సైనికులకు తుర్కీ, ఫారసీ, అరబీ తప్ప ఇక్కడి భాషలేవీ తెలియవు. పాలకులకు తెలియకున్నా ఫరవాలేదు. సైనికులకు తెలియకుంటే సాగుతుందా? సైనిక శిబిరాల్లో ఇక్కడి సైనికులు చాలమంది వుండే వాళ్లాయె. వాళ్లంతా ఒక ప్రాంతం వాళ్లా? ఒక భాష మాట్లాడేవాళ్లా? హిందువులు, ముస్లిములు, సిక్కులు, జాట్లు- రాజస్థానీ, పంజాబీ, హర్యానీ, ఖడీబోలీల లాంటి పలురకాల భాషలు మాట్లాడేవాళ్లు. పరస్పరం భావ వినిమయం చేసుకోక తప్పదు. ఒకరితో ఒకరు మాట్లాడుకోక తప్పదు. ఏ భాషలో మాట్లాడుకోవాలె? 'అవసరం ఆవిష్కరణకు తల్లి' అనే లోకోక్తి ప్రకారం ఒక క్రొత్త భాషను ఆవిష్కరించుకున్నారు. ఆ భాషలో తుర్కీ, ఫారసీ, అరబీ, ఖడీబోలీ, పంజాబీ, హర్యానీ, రాజస్థానీ శబ్దాలు; ఆయా భాషల క్రియా రూపాలు, వాక్య నిర్మాణ పద్ధతులు కలగాపులగమైపోమయినాయి. దాన్నే తర్వాత ఉర్దూ అన్నారు. సైన్యాన్ని ఫారసీలో లష్కర్ అంటారు. ఉర్దూకు లష్కరీ భాష అనేపేరు గూడ వున్నది. అంటే సైనిక శిబిరాల్లో రూపొందిన భాష.

రాజమహల్లలో బాజార్లుంటాయి. బేగములకు అవసరమైన వస్తువులమ్ముతారక్కడ. అమ్మేవాళ్ల భాష అనేక రకాలయింది. బేగములు వాళ్ల దాసీలు క్రయవిక్రయాలకు అలాంటి భాషనే తయారు చేసుకున్నారు. అదీ తర్వాత ఉర్దూ అనబడింది. ఉర్దూకు మహల్లాతీ-జుబాన్, ఉర్దూ-యె-మొఅల్లా అనే పేర్లు గూడ వున్నాయి.

ఎందరో ముసల్మాను సూఫీ ఫకీర్లు మన దేశానికి వచ్చి ఎవరికి నచ్చిన చోట వాళ్లు ఖాన్ఖాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈశ్వరధ్యాన తత్పరులైన ఆ ఫకీర్లలో కొందరికి మహిమ లుండేవని ప్రజల విశ్వాసం. ఇప్పటికీ ప్రజలు సాధువుల, ఫకీర్ల సిద్ధులను మహిమలను గురించి కథలు కథలుగా చెప్పుకుంటారు. అటువంటి సత్పురుషులకు తమ ఆధివ్యాధుల గురించి తెల్పుకోవటం వాళ్ల ఆశీస్సులు పొందటం భారతీయుల స్వభావమే- అయితే, 'సూఫీ' యోగులకు

భారతీయ భాషలురావు. భారతీయులకు , ముఖ్యంగా గ్రామీణులకు అరబీ ఫారసీలు రావు- అవసరం మిక్కుటమయింది. ఒక కలగా పులగం భాష తయారు చేసుకోక తప్పింది కాదు. దాన్నీ ఉర్దూ అన్నారు. నిత్యప్రయోగం వలన ఈ భాష వికసించ నారంభించింది. కొన్నాళ్లకు రాజాదరణ వలన ప్రభుత్వ వ్యవహారాలకు పనికి వచ్చే భాష అయింది. సాహిత్య నిర్మాణానికి తగిన సౌష్టవాన్ని సంతరించుకున్నది. ఇదంతా సంవత్సరాల్లో జరిగింది కాదు. శతాబ్దాల్లో జరిగింది.

ఇక్కడొక మహాపురుషున్ని స్మరించుకోవటం అవసరం.

◆ ◆ ◆

అమీర్ ఖుస్రూ

భారతదేశంలో జన్మించి ఈరాన్ కవులు ప్రశంసించే విధంగా ఫారసీ కవిత చెప్పిన వాళ్ళను వేళ్ళమీద లెక్కించవచ్చు. ఆ లెక్కన చిటికెన వేలు మీద చేరే పేరు అమీర్ ఖుస్రూది.

మనదేశాన్ని ముస్లిమ్ ప్రభువులు పాలించే కాలంలో ఈరాన్ నుంచి ఎందరో కవులు ఇక్కడికి వచ్చి కనీవినీ ఎరుగనంతటి ఘనసన్మానాలంది వెళ్ళినారు. కొందరిక్కడ బహుకాలం నివసించినారు. అయితే వాళ్లు ఈ దేశాన్ని మత దేశమనుకోలేదు. ఇక్కడి సమాజంలో కలిసిపోలేదు. ఇక్కడి ఆచార వ్యవహారాలను ఆదరించలేదు. పైగా ఇక్కడి ఫారసీ కవులను పరహసించినారు. ఒక్క అమీర్ ఖుస్రూ మాత్రం ఈ దేశాన్ని తన మాతృదేశ మనుకున్నాడు. నిజానికి అతని తండ్రి తుర్కిస్తాన్ నుంచి వచ్చినవాడు కాని అతని తల్లి ఈ దేశంలో జన్మించిన మహిళ. కాబట్టి అతడు ఈ దేశాన్ని తన మాతృదేశమనుకోవటం సహజమే. అతడిక్కడి ప్రతి వస్తువును ఆత్మీయ భావంతో ప్రేమించినాడు. ఇక్కడి సమాజంలో కలిసిపోయినాడు. ఇక్కడి ఆచార వ్యవహారాలను ఆదరించినాడు. ఇక్కడి సాహిత్యంలోనే కాక ఇక్కడి సంగీతంలోనూ పాలుపంచుకొని దానికి క్రొత్త వన్నెలు కూర్చినాడు. క్రొత్త చిన్నెలు చేర్చినాడు. క్రొత్త తెన్నులు వేసినాడు. యమన్ అతడు

ప్రవేశపెట్టిన శాస్త్రీయ రాగం. ఇప్పటికీ హిందుస్తానీ సంగీతంలోని కాల్యాణ్‌థాట్ రాగాల్లో ప్రముఖ రాగం. తబలా, సితార్ అతని సృష్టే. తరానా గాయనాన్ని, ఖవ్వాలీ గాయనాన్ని అతడే ప్రవేశపెట్టినాడు.

ఖుస్రూ జన్మతః కవి. స్వభావతః యోగి, వృత్తి రీత్యా రాజోద్యోగి. అతని కవిత శుకాలాపం. (చుఁ మన్ తూతియే హిందమ్) "నేను భారత దేశపు చిలుకను" అన్నాడతడు. "హిందుయీ పలుకులు తీయగా పలుక గలను." అనిన్నీ అన్నాడు. హిందుయీ అంటే అప్పటి ఔత్తరాహుల వ్యవహార భాష.

అతడు రాజోద్యోగి. బానిసవంశానికి చెందిన బాల్బన్‌ను, ఖిల్జీవంశపు జలాలుద్దీన్, అలావుద్దీన్‌లను తుగ్లక్ వంశానికి చెందిన ఘయాసుద్దీన్ తుగ్లక్‌ను సేవించినాడు. పగలల్లా రాజాస్థానంలో గడిపి రాత్రులు హజ్రత్ ఖ్వాజా నిజాముద్దీన్ ఔలియా సేవలో గడిపేవాడు. ఔలియా సన్నిధిలో తాను వివిధ రాగాలలో రచించిన చీజులను, ఫారసీ గజల్లను, ఖవ్వాలీలను వినిపించేవాడు. ఈశ్వర స్తుతిపరమైన అతని సంగీతాన్ని వింటూ ఔలియా పరవశుడయ్యేవాడు. అలాటి పారవశ్యాన్ని సూఫీల పరిభాషలో "వజ్దానీ కైఫియ్యత్" అంటారు. చాల కాలం తర్వాత ఖుస్రూ కవితాగానం విని దర్దీలయిన శ్రోతలు ఎలా వజ్‌లోకి వచ్చేవాళ్లో జహంగీర్ తన ఆత్మకథ "తుజకె జహంగీరీ"లో సోదాహరణంగా చర్చించినాడు.

భగవదావేశ కారకమైన సంగీత శ్రవణం సూఫీయోగులకు సమ్మతమే. ఇమామ్ గజ్జాలీ తన "ఇహ్యా ఉల్-ఉలూమ్" అనే గ్రంథంలో సంగీత ప్రశస్తి చేసినాడు. శేఖ్ అబ్దుల్ ఖాసిమ్ గిర్గానీ కొన్ని మినహాయింపులతో సంగీత శ్రవణాన్ని ఆమోదించినాడు. అమీర్ ఖుస్రూ ఫారసీ కవిత సుమారు లక్ష పంక్తులని, అందులో కొంత భాగం అతనిది కాదని విద్వాంసుల అభిప్రాయం. అతని హిందుయీ కవిత కూడా సామాన్యమైంది కాదు. "ఖాలిఖెబారీ" అనే పద్యమయ నిఘంటువు అతని పేర ప్రచారంలో వున్నది. అందులో చాల భాగం అతనిది కాదని విద్వాంసులంటారు. మొత్తం అతనిది కాదని ఎవరూ అనలేరు. అచ్చుయంత్రాలు లేని ఆకాలంలో అన్ని భాషల్లోనూ నిఘంటువులు పద్యమయమైనవే. కంఠస్థం చేయటానికి పద్యమే అనువైంది గదా. ఖాలిఖె బారీలో ఒకముక్క ఫారసీ. రెండువ ముక్క దాని అనువాదమైన హిందుయీ. ఉదాహరణకొక షేర్ రాస్తాను.

బయా బిరాదర్- ఆవ్‌రె భాయి
బనషీఁ మాదర్- బైఠ్‌రి మాయి

ఆ కాలంలో ఈలాటి నిఘంటువులు ఎంత అవసరమైనవో చెప్పేపని లేదుగదా.

అతడు రాజోద్యోగి. ఫారసీకవి. ఆనాటి రాజభాష ఫారసీ. భారతీయులు మాట్లాడే భాషలో మాట్లాడే అవకాశం అతనికెక్కడిది? సామాన్య ప్రజలు మాట్లాడే శూరసేనీ ఇత్యాది ప్రాకృత భాషలు నేర్చుకోవలెనంటే అతడు జనసామాన్యంలోకి దిగి రావాలె. ఆ పనే చేసినాడతడు. అలా చేయటానికి ముఖ్యకారణం ఇక్కడి ప్రజల్లో కలసిపోవాలనే కోరిక. ఇంకొక కోరికకూడా వుండేదతనికి. తాను దిల్లీలో నివసించే సూఫీయోగి హజ్రత్ నిజాముద్దీన్ ఔలియాకు ప్రియశిష్యుడు కనుక, ఇక్కడి ప్రజలకు సాధుసంతుల పట్ల, సూఫీ ఫకీర్ల పట్ల శ్రద్ధాభక్తులు కనుక వాళ్ల ఆవేదనను, ఆరాటాలను నివేదించటానికి ఔలియాకు ప్రజలకు మధ్యవర్తిగా వ్యవహరించాలన్న కోరిక అది. ప్రజల పలు రకాలయిన ప్రాకృత శబ్దాల్లో తన ఫారసీ, అరబీ, తుర్కీ శబ్దాలనుచేర్చి అందరికీ అర్థమయ్యే ఒక భాషను రూపొందించినాడు. దాన్ని హిందుయీ అన్నాడు. ఆ హిందుయీలో అతడు ప్రజలను రంజించే చాల కవితలు చెప్పినాడు. అలాటి కలగాపులగం భాషొకటి అదివరకే తయారయింది. కొంత సూఫీ ఫకీర్లవలన, మరికొంత పలుప్రాంతాల సైనికులు పరస్పరం ముచ్చటించుకోవటం వలన. కాని దానికొక పద్ధతి వుండేది కాదు. దానికొక వ్యవస్థితమైన రూపం గలిగించినాడు ఖుస్రూ. దాన్ని హిందుయీ అన్నాడు. ఆ హిందుయీ కాలక్రమాన రెండు భాషలుగా విడిపోయింది. ఫారసీ, అరబీ, తుర్కీ పదాలను తగ్గించుకొని దేవనాగర లిపితో హిందీ యేర్పడింది. సంస్కృత, ప్రాకృత పదాలను తగ్గించుకొని ఫారసీ లిపితో ఉర్దూ అయింది. కాని దానికి ఉర్దూ అనే పేరు పద్దెనిమిదవ శతాబ్దం చివర్లో స్థిరపడింది. అంతకాలం దాన్ని హిందుయీ అని, జుబానె-హిందుస్తాన్ అని, హిందుస్తానీ అని, రేఖ్తా అని పిలిచేవాళ్లు- నాలుగు శతాబ్దాల వరకు అది ప్రజల వ్యవహార భాషగానే వుండిపోయింది కాని సాహిత్య భాష కాలేదు.

అమీర్ ఖుస్రూ తన వాళ్లనుకున్న భారతీయులలో బ్రతికినాడు. తీయని మాటలతో, హాయిగొలిపే పాటలతో దున్నేవాళ్ల సేదదీర్చే వాడతడు. గత కాలపు గాథలు తవ్వుకుంటూ కళ్లు మూసుకొని ఒళ్లో మనుమళ్లను మనుమరాళ్లను వేసుకొని హుక్కాదమ్ములాగే ముదుసళ్ల నరసన కూర్చుండి తానూ దమ్ములాగుతూ, వర్తమాన వైభవాన్ని వర్ణిస్తూ బ్రతుకాస బలపరిచేవాడు. నీలాటి రేవుల్లో కన్నె పిల్లలకు 'కహ్‌ముకరణీలు' చెప్తూ కాలక్షేపం చేసేవాడు. ప్రజలు

ఆబాలగోపాలం అతన్ని తమ ఆప్తుడుగా భావించేవాళ్లు. తమ కష్టసుఖాలు చెప్పుకునేవాళ్లు. అందరికతడు సలహాలిచ్చేవాడు. సదుపదేశం చేసేవాడు. ఔలియా ఆశీర్వచనాలందజేసి ఆ మహనీయుని ప్రవచనాల సారాంశాన్ని ప్రజల భాషలో వివరించేవాడు.

'కహముకరణీ'లంటే పొడుపు కథలు. కొన్నిటిలో జవాబులు వాటిలోనే వుంటాయి. కొన్నిటిలో వుండవు. మచ్చుకు రెండు:

1. బాలా థా జబ్ సబ్‌కో భాయా
బడాహువా కుఛ్ కామ్‌న ఆయా

ఖుస్రూ కహదియా ఉస్కా నాంవ్
బూఝే నహీతో ఛోడో గాంవ్ (దీపం)

"చిన్నగా వుండగా అందరికీ పసందయింది. పెరిగిపోతే (ఆరిపోతే అని కూడా అర్థం) పనికి రాకుండ పోయింది. ఖుస్రూ దాని పేరు చెప్పినాడు. గ్రహించలేని వాళ్లు గ్రామం విడిచిపోవాలె."

మూడవ పంక్తిలో "కహదియా" అంటే 'చెప్పినాడు' అని అర్థం. అందులో "దియా" అంటేదీపం.◆

2. ఏక్‌థాల్ మోతీసె భరా
సబ్‌కే సర్‌పర్ ఔంధా ధరా
చారోం వోర్ థాల్ ఫిరై
మోతీ ఉస్‌సే ఏక్‌న గిరై (ఆకాశం)

"అందరి శిరస్సుల మీద బోర్లించిన ముత్యాల పళ్లెరం, ఆ పళ్లెరం నాల్గు వైపులా తిరిగినా అందులోంచి ఒక్క ముత్యమైనా జారిపడదు."

హజ్రత్ అమీర్ ఖుస్రూను గురించి మాట్లాడుకునేది చాల వున్నది. కాని మనమిప్పుడు ఉర్దూ భాషోత్పత్తిని గురించి మాట్లాడుకొంటున్నాము. గనుక ఆ మేరకే అతన్ని స్మరించుకున్నాము.

❖ ❖ ❖

◆ "ఖుస్రూ చెప్పాడు దాని పేరు" అని ఒక అర్థమయితే, "ఖుస్రూ, చెప్పు, 'దీపం' దాని పేరు" అని మరో అర్థం.

దక్షిణ భారతదేశంలో ఉర్దూ

పద్నాల్గవ శతాబ్దంలో దక్షిణ భారతదేశాన బహమనీ సామ్రాజ్యం స్థాపించబడింది. అది స్వతంత్ర సామ్రాజ్యం. బహమనీ సుల్తానులు కూడా భారతీయులు కారు. బయటి నుంచి వచ్చినవాళ్లే. అయితే వాళ్లు తమ ఫారసీ, తుర్కీ భాషలను ప్రక్కకు పెట్టి ఇక్కడి ప్రజా వ్యవహారంలో వున్న దక్కనీ ఉర్దూకు ప్రభుత్వ భాషా గౌరవం కలిగించినారు.

దక్కనీ భాష యెలా యేర్పడిందంటే భారతదేశం చరిత్ర పుటలు తిరగవేయాల్సి వుంటుంది. అలాయుద్దీన్ ఖిల్జీ దక్షిణ భారతదేశం మీద దండెత్తి వచ్చిన మొదటి దిల్లీ చక్రవర్తి. అతని సైనికులు, సైనికుల అవసరం కోసం వచ్చిన వివిధ వృత్తి పనివాళ్లు కొందరు మళ్లీ దిల్లీకి వెళ్లలేక దక్షణి ప్రాంతాననే స్థిరపడిపోయినారు. వాళ్లు తమ భాషలో ఇక్కడి రకరకాల భాషల శబ్దాలు చేర్చుకొని ఒక కలగాపులగం భాష తయారుచేసుకొని వుండక తప్పదు గదా. మొహమ్మద్ తుగ్లక్ దిల్లీ నుంచి రాజధానిని దేవగిరికి మార్చి దానికి దౌలతాబాద్ అని పేరు పెట్టినాడు. దిల్లీ ప్రజలంతా దేవగిరికి తరలిరావాలని కఠినంగా శాసించినాడు. చాల మంది దేవగిరికి వచ్చినారు. మళ్ళీ చక్రవర్తి మనసు మారింది. రాజధానిగా దిల్లీ వుంటేనే బాగుంటుందనుకున్నాడు. దిల్లీ నుంచి వచ్చిన వాళ్లు మళ్లీ దిల్లీకి వెళ్లిపోయినారు. పోలేని వాళ్లు, పోవాలనుకోనివాళ్లు దేవగిరిలోనే వుండిపోయినారు. వాళ్లకూ ఒక కలగాపులగం భాష అవసరమే కదా.

హజ్రత్ ఖ్వాజా బందా నవాజ్ గేసూ దరాజ్ అనే సూఫీయోగి దిల్లీ నుంచి వచ్చి గుల్బర్గాలో స్థిరనివాసం చేసినాడు. హజ్రత్ ఖ్వాజా నిజాముద్దీన్ ఔలియా సంప్రదాయానికి చెందిన ఆ మహనీయుడు అరబీ ఫారసీల్లో అసమాన పాండిత్యం కలవాడు. దక్షిణ దేశంలో ప్రజావసరాలకోసం ఏర్పడిన కలగాపులగం బాషకొక సువ్యవస్థిత రూపం కలిగించి అందులో అనేక గద్యపద్య రచనలు చేసినాడు. అతని వంశీయులు కూడా చాల రచనలు చేసినారు. ఆ కలగాపులగం భాషలో మహారాష్ట్ర ప్రాకృతం కొంత చేరింది. ఇంకా దక్షిణాన వుండే ద్రవిడ భాషలు అంతగా చేరలేదుకాని ఉచ్చారణ, యాస ఆ భాషకు కలిగినవి. ఇలా యేర్పడిన ఆ భాషకు దక్కనీ, లేదా ఉర్దూ అనే పేరు స్థిరపడింది. దక్కనీ ఉర్దూలో గద్యరచన

చేసిన మొదటి రచయిత హజ్రత్ గేసూ దరాజ్. ''మేరాజుల్ ఆషిఖీన్'' అనే గద్యరచన అతని పేర ప్రచారంలో వున్నది. అందలి భాష దక్కనీ. రెండు వాక్యాలు గమనించండి:

''నబీకహే తహఖీఖ్‌కే దర్మియాఁతే సత్రహ హజార్ పర్దే
ఉజ్యాలేకే హౌర్ అంధ్యారేకే, అగర్ ఉస్మేతే ఏక్ పర్దా
ఉర్ జాయెతో ఉస్కీ ఆంచ్‌సే మై జులూఁ

దర్మియాఁతే అనే మాటనిప్పుడు దర్మియాఁసే అంటాము. అలాగే ఉస్మేతే అనే మాటను ఉస్మేసే అంటాము. ఉజ్యాలేను ఉజాలే అని, అంధ్యారేను అంధేరే అని, హౌర్‌ను ఔర్ అని అంటాము. దక్కనీ భాషా సాహిత్యంలో భారతీయత అధికంగా కనిపిస్తుంది. పదిహేనవ శతాబ్దంలో బహమనీ సామ్రాజ్యం విచ్ఛిన్నమై ఐదు స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయింది. ఆ ఐదు రాజ్యాల్లో గోలకొండను పాలించిన కుతుబ్షాహీలు, బీజాపూర్‌ను పాలించిన అదిల్‌షాహీలు కళా సాహిత్య పోషకులు. స్వయంగా కవులు. కుతుబ్‌షాహీ వంశంలో ఐదవ వాడు సుల్తాన్ ముహమ్మద్ ఖులీఖుతుబ్షా అతని తల్లి భగీరథి తెలుగు వనిత. కాబట్టి అతడు తెలుగు భాషలో 'తురకమాన్' అనే కలం పేరుతో కొంత కవిత చెప్పినాడట. అదిప్పుడు అలభ్యం. అతడు పారసీలోను, దక్కనీలోను కవిత చెప్పినాడు. అతని దకనీ కవిత 'దీవానె-ఖులీఖుతుబా' అనే పే సంకలనం చేయబడింది. దకనీ భాషలో మొట్టమొదట దీవాన్ (కవితా సంకలనం) తయారు చేసుకున్న కవి 'సుల్తాన్ మొహమ్మద్ ఖులీ ఖుతుబ్షా.' అతడే హైద్రాబాద్ నగరస్థాపకుడు. అతని ప్రేయసి భాగ్మతి. ఆమెను సుల్తాన్ 'హైదర్ మహల్' అనే బిరుద నామంతో అనుగ్రహించినాడట. అతని తండ్రి మలికభరాముడుగా తెలుగు కవుల నోట కీర్తింపబడిన మలిక్ ఇబ్రాహీమ్ ఖుతుబ్‌షా. ఈ వంశంలోని చివరి ముగ్గురు కూడా కవులూ,సారస్వత పోషకులున్నూ.

మొహమ్మద్ ఖులీ ఖుతుబ్షా కవిత:

పియా వాజ్ ప్యాలా పియా జాయెనా
పియా వాజ్ ఏక్ తిల్ జియా జాయెనా

నహీ ఇష్క్ జిస్కో బడా కోర్ హై
కధీ ఉస్‌సె మిల్ బైసియా జాయెనా

కుతుబ్‌షా నదేముర్షు దివానేకొ పంద్
దివానే కొ కుఛ్ పంద్ దియా జాయెనా

ఈ మూడు షేర్లలోని ఖాఫియాల గురించి చెప్పవలసిన పనిలేదు. కథీ, బైసియా అనే రెండు పదాలు మహారాష్ట్ర ప్రాకృతానికి చెందినవి. అతని కవితలో 'దిస్తా' అనే పదం కూడ వున్నది. అదీ మరాఠీ పదమే. మరాఠీ ఆర్యభాషా కుటుంబానికి చెందిన ప్రాకృతం. ద్రవిడ భాషల శబ్దాలంతగా చేరలేదు దకనీలో-ఉచ్చారణ మాత్రం ద్రవిడ భాషలలాగే వుండేది. మొహమ్మద్ ఖులీ ఖుతుబ్షా భారతీయ భాషల శబ్దాలను, యాసను మాత్రమే కాక ఇక్కడి ప్రకృతిని, ఇక్కడి పూలను, చెట్టు చేమను, పండుగలను, పర్వాలను గూడ తన కవితా వస్తువుగా చేసుకున్నాడు. దకనీ కవులందరూ అతని మార్గాన్నే అవలంబించినారు.

అతని ఆస్థాన కవుల్లో ముల్లావజీహ్ అందరి కంటే గొప్ప కవి. అతడు తన పాదుషా ప్రేమగాథను"ఖుతబ్-ముష్తరీ" పేర దకనీ భాషలో మస్నవీ రూపంగా చెప్పినాడు- దకనీ భాషలో అది గొప్ప మస్నవీ. ఆ ప్రేమ కథ కవి కల్పనే. వజీహ్ భాష సరళం కాదు. అతని భాషలో అరబీ, ఫారసీ, సంస్కృత, తత్సమ, తద్భవ శబ్దాలు విరివిగా కనిపిస్తాయి. అతని శబ్ద ప్రయోగం స్వతంత్రమయింది. కొన్ని పంక్తులు వినండి.

ఘపీ రాత్ ఉజాలా హువా దీస్‌కా
లగా జగ్ కరన్ సేవ్ పరమేస్ కా

సూరజ్ యూఁహై రంగ్ ఆస్మానీ మనే
కె ఖిలియా కమల్ ఫూల్ పానీ మనే

"రాత్రి తొలగిపోయింది. ఉదయకాంతులు వెల్లివిరిసినాయి. ప్రపంచంలోని జనులు పరమేశ్వరుని సేవలో మగ్నులయినారు. ఉదయించే సూర్యుడు ఊదారంగు ఆకాశంలో నీళ్లలో కమలమున్నట్లున్నాడు."

ఈ రెండు పంక్తుల్లోని ఎన్ని తత్సమ శబ్దాలు, తద్భవ శబ్దాలు ప్రయోగించినాడో చూడండి. ఖిలా అనే మాటకు దకనీ ఉచ్చారణ ఖిలియా. మే అనటానికి మనే.

ముల్లా వజీహ్ 'సబ్‌రస్' అనే గద్య కావ్యం రాసినాడు. అందలి ప్రతి వాక్యం సాలంకారికం. అతి సుందరమైన వచన రచన. ఇతి వృత్తం వేదాంతపరమైంది. సంస్కృతంలో ప్రబోధ చంద్రోదయమనే వేదాంత నాటకం వున్నది. దాన్ని తెలుగులో కావ్య రూపంలో అనువదించినారు నంది మల్లయ్య, గంట సింగనలనే కవులు. ఆ నాటకంలోని పాత్రల లాంటివే సబ్‌రస్‌లోని పాత్రలు. మనోబుద్ధి అహంకారాలు, ఇంద్రియాలు, పంచతన్మాత్రలు. కథ తేలికగా బుర్రకెక్కకున్నా చదువటానికి కమనీయమైన వచన కావ్యం సబ్‌రస్. అది దకనీ భాషలో వుండటం విశేషం. వజీహ్ తర్వాత కుతుబ్ షాహీలను ఆశ్రయించిన కవుల్లో గౌవసీ, ఇబిన్నిషాతీలు ముఖ్యులు.

అదిల్షాహీ సుల్తాను లెనమండుగురూ కళా సాహిత్య పోషకులే. ఇబ్రాహీం ఆదిల్షా ఉత్తరాది నుండి సంగీత విద్వాంసులను, బ్రజభూమి నుండి భాషా పండితులను రప్పించి తానుసంగీత శాస్త్రాన్ని, బ్రజభాషను అభ్యసించి "నౌరస్" అనే సంగీత గ్రంథాన్ని బ్రజభాషలో రాసినాడు. దానికి జహూరీ అనే ఫారసీ కవి "సెహనస్త్ర" అనే పేర పీఠిక రాసినాడు. నౌరస్ సంగీత విద్యలో ఎంత శ్రేష్ఠరచనో దాని పీఠిక ఫారసీ వచనంలో అంతశ్రేష్ఠరచన. అక్బర్ చక్రవర్తి బీజాపూర్‌ను జయించినప్పుడు 'నౌరస్" నుతన వెంట తీసుకవెళ్ళినాడు. అయినా దాని లిఖిత ప్రతులు పలుచోట్ల లభిస్తాయి.

ఆదిల్షాహీ సుల్తానులను ఆశ్రయించిన ప్రసిద్ధ దకనీ కవుల్లో రుస్తుమీ, మలిక్-ఖుష్నూద్, దౌలత్‌షా, నుస్రతీ, హాష్మీ పేర్కొన దగినవాళ్లు. ఈ కవులందరూ మస్నవీ రచనలో సిద్ధహస్తులు.

◆ ◆ ◆

వలీ దకనీ

షమ్సు వలీవుల్లా వలీని ఉర్దూ కవితకు ఆద్యుడు (కవి పితామహుడు) అంటారు. అంతకు ముందే కావ్యసంకలనం (దీవాన్) సిద్ధం చేసుకున్న సుల్తాన్ మొహమ్మద్ ఖులీఖుతుబ్షాను ఆది కవి అన్నారు గదా! మళ్ళీ వలీని ఆద్యుడనట మేమిటి? అనిపిస్తుంది. ఈ వంద సంవత్సరాల్లో ఎందరో గద్య పద్య రచనలు చేసిన కవులు వెలసినారు. వాళ్ల కాలంలో దకనీలోని కొన్ని శబ్దాలు, కొన్ని అక్షరాలు, కొన్ని పలుకుబళ్లు తొలగించబడినాయి. ఇలా భాషను జల్లెడపట్టి తొలగించే సంస్కరణోద్యమం దకనీలోను, ఉత్తరాది ఉర్దూలోను చాలా సార్లు జరిగింది. తెలుగులో మనం దీర్ఘకాలం ఉద్యమించి గ్రాంధికాన్ని వ్యావహారికం చేసుకో గలిగినాము. ఆ వ్యావహారిక భాషకొక ప్రామాణిక స్వరూపం ఏర్పడనే లేదింకా. సంస్కరించిన దకనీ భాషలో వలీ ఫారసీ గజళ్లకు తీసిపోని గజల్లు చెప్పినాడు. ఉత్తరాది విద్వాంసులకు ఉర్దూలో కవిత చెప్పేప్రేరణ కలిగించినాడు. ఉత్తరాది ఉర్దూలోని సుందర శబ్దాలను తన కవితలో చేర్చుకున్నాడు. ఇన్ని కారణాల వలన వలీని దకనీ కవితకు ఆద్యుడన్నారు. వలీ దీవాన్ మన దేశంలోనే కాక విదేశాల్లోనూ పలు తడవలు ప్రకాశితమయింది. అతని తొలినాళ్ల కవితలో కనిపించే దక్కనీ తనం మలినాళ్ల కవితలో మరుగున పడిపోయింది. ఫారసీ పదాలు, పద బంధాలు అధికంగా చేరినవతని భాషలో. దాన్ని గురించి మళ్లీ రాస్తాను. వలీ అహ్మదాబాద్‌లో జన్మించి విద్యాభ్యాసం కోసం ఔరంగాబాద్, దిల్లీ లాంటి నగరాలకు పలు తడవలు పర్యటించాడు. అక్కడి అనేక కవులను దర్శించు కున్నాడు. దిల్లీలో సాదుల్లా గుల్షన్ అనే సూఫీ కవి వుండేవాడు. అతడు సూఫీ ఫకీరు గనుక అతన్ని షాహ గుల్షన్ అనే వాళ్లు. అతని సహవాసం వలన వలీకి సూఫీ ప్రేమతత్వం అవగతమయింది. కనుక అతని గజల్లలో విశాల ప్రేమ భావాలు వెల్లి విరిసినాయి. వలీ దకనీ కవిత యిలా వుంటుంది.

1. జిసే ఇష్క్ కా తీర్ కారీ లగే
ఉసే జిందగీ క్యోం న భారీ లగే
2. న హోవే ఉసే జగ్ మె హర్‌గిజ్ ఖరార్

జిసే ఇష్క్ కీ బేఖరారీ లగే
3. వలీ కో కహే తూ అగర్ ఎక్ బచన్
రఖీబోంకె దిల్‌కో కటారీ లగే

ఈ మూడు షేర్ల తాత్పర్యం చిత్తగించండి:

1. ప్రేమ బాణం తగిలిన వానికి జీవితం భారం కాక ఏమవుతుంది?

2. ప్రణయతప్తుడైన వానికి ప్రపంచంలో ఉద్విగ్నత తప్ప ఊరట దొరకదు.

3. నువ్వు (ప్రేయసిని ఉద్దేసించి) వలీతో ప్రేమగా ఒకమాట మాట్లాడితివా పగవాళ్ళ (ప్రేమలో) గుండెలకు బాకు తగులుతుంది.

దకనీలో ఇంత చక్కని కవితా నిర్మాణం జరుగుతుండగా దిల్లీలో మాత్రం ఫారసీ కవితనే పట్టుకు పాకులాడుతూ ఉండిరి అక్కడి కవులు. అక్కడి ఫారసీ కవుల్లో ఖాన్ ఆర్జూ అగ్రగణ్యుడు. మొగల్ సామ్రాజ్యం పూర్తిగా బలహీనమయింది. ఫారసీ ప్రాబల్యం తగ్గింది. సర్వత్రా ప్రజా వ్యవహారంలోవున్న హిందుస్తానీ భాష అవసరమే పెరిగి పోయింది. అయనా, సాహిత్య రంగం మీద ఫారసీ ప్రభావం తగ్గలేదు. పాలకులకు వినే ఒపిక లేదు. విన్నా సన్మానించే తాహతు లేదు. ప్రజలకది అర్థం కాని కవిత. కవులు మాత్రం ఫారసీలో కవిత చెప్పటమే ప్రతిష్ఠాకరమని, హిందూస్తానీలో గజల్ వంటి కవితలు చెప్పటం సాధ్యం కాదని భావిస్తూ భ్రాంతిలో బ్రతుకుతుండిరి. దక్షిణం నుంచి వలీ గజల్లు ఢిల్లీకి చేరుతున్నాయి. ప్రజలు చదివి సంతోషిస్తున్నారు. ఫారసీలో కవిత చెప్పే వాళ్లు మాత్రం అదంతా పట్టించుకునే స్థితిలో లేరు- అలాంటి స్థితిలో ప్రజలు వలీని ఢిల్లీకి ఆహ్వానించినారు. బ్రహ్మాండమైన సాహిత్య సభ ఏర్పాటు చేసినారు. వలీ గజల్లు వింటూ ప్రజలు పరమానందభరితులైన్నారు. ఫారసీ వ్యామోహం గల పండిత కవుల భ్రాంతి విడిపోయింది. ప్రజల భాషలోనూ కమనీయాలైన గజల్లు చెప్ప వచ్చుననే నమ్మకం కలిగింది. ఖాన్ ఆర్జూ ఉర్దూ గజల్లు రాసే ప్రయత్నం ప్రారంభించినాడు. అప్పటికే అంతో యింతో ఉర్దూ కవిత చెప్పేవాళ్ళకు ఉత్సాహం కలిగింది. వలీ సమకాలికులూ, కొంచెం ఇటీవలి వాళ్ళూ ఉర్దూలో శ్రేష్ఠమైన గజల్లు చెప్పినారు. అలాంటి వాళ్లలో ఆబ్రూ, నాజ్, హాతిమ్, యక్రంగ్, మజ్హర్ జాన్ జానాన్, మజ్నూ, ఫుగాఁ, తాబాఁ ముఖ్యులు. ఈ కవుల తరువాత ఉర్దూ కవిత్వాన్ని ఉన్నతోన్నత శిఖరాలకు చేరవేసిన మీర్ తఖీమీర్, మిర్జారఫీ సౌదా, ఖ్వాజామీర్ దర్ద్ లాంటి మహాకవులు ఉర్దూ సారస్వతాకాశాన ఉజ్వల తారలుగా

వెలుగొందినారు. మీర్ తఖీమీర్‌ను ఉర్దూ కవిసార్వభౌమ అన్నారు. అతని స్థానం ఆనాడూ ఈనాడూ సర్వశ్రేష్ఠమయిందే. ఈ మహాకవుల గురించి మళ్లీ మాట్లాడుకుందాం. ఉత్తరాది కవులకు ఉర్దూలో కవిత్వం చెప్పే సాహసం కలిగించిన వలీ దకనీ ఉర్దూ పలుకుబళ్లను, ఫారసీ శబ్ద సౌందర్యాన్ని తన కవితలో మిళితం చేసుకున్నాడు. వలీ దకనీ, దకనీ కవితను దిల్లీ కవితకు తాకట్టు పెట్టినాడని, భారతీయమైన దకనీ కవితను ఈరాన్ వైపు త్రిప్పినాడని విమర్శించిన వాళ్లనేకులున్నారు- సంధి కాలంలో అలా జరగటం సహజమే. ఆది కవి నన్నయ తెలుగును సంస్కృతమయం చేసినాడు. అతడు చేసిన పనే వలీ చేసినాడు. దాని వలన కవితా గౌరవం పెరిగింది, ప్రచారం పెరిగింది. కాని పరువు తగ్గలేదు.

వలీ సమకాలికుల్లో సిరాజ్ ఔరంగాబాదీ, బహరీ అనే మహాకవులు పేర్కొనదగిన వాళ్లు. సిరాజ్ సూఫీ కవి. అతని భాషలో ఫారసీ పదాలధికం. అతడు వలీని అనుకరించినాడు. బహరీ కూడా సూఫీ కవే. కాని అతడు సిసలైన దకనీలోనే కవిత చెప్పినాడు. "మన్‌లగన్" అనే అతని కావ్యం ప్రసిద్ధమయింది. కాని గూఢమైన సూఫీ భావాలు అందరికీ అర్థమయ్యేవి కావు. కనుక అతడే తన దకనీ కావ్యానికి ఫారసీలో సుదీర్ఘమైన వ్యాఖ్యానం రాసుకున్నాడు. ఆ ఫారసీ వ్యాఖ్యానాన్ని అతని శిష్యుడొకడు "అర్థ మన్‌లగన్" అనే పేర మళ్లీ దకనీ భాషలో అనువదించినాడు. బహరీ కవిత యిలా వుంటుంది;

1. సూర్ తుఝ్ ముఖ్ మిసాల్ నై సచ్ హై
   లాల్ తుఝ్ లబ్ సె లాల్ నై సచ్ హై
2. ధన్ తేరే మద్‌మతే నయన్ కె నిమన్
   పుర్తగాలీ కలాల్ నై సచ్ హై
3. అబ్ ఖుషామద్ తూ మత్ కర్ అయ్ బహరీ
   తుఝ్ పర్ ఉస్కా ఖయాల్ నై సచ్ హై

   తాత్పర్యం:

1. నీ ముఖ మండలానికి సూర్య మండలం సమానం కాదు, నిజం. రత్నం నీ పెదవులకంటే ఎరుపైంది కాదు, నిజం.
2. నీ మదాలసాలయిన నయనాల వలె బుడుతకీచు మద్యవిక్రేత (అంటే మద్యమనే అర్థం గ్రహించాలె) ధన్యుడు కాడు, నిజం.

3. బహరీ! ప్రేయసీని ప్రశంసతో ఎందుకు మురిపించాలని చూస్తావు? ఆమెకు నీ ధ్యాసే లేదు, నిజం.

ఈ గజల్ పంక్తుల్లో బహరీ దకనీ భాష స్పష్టంగా కనిపిస్తున్నది. నహీ అనే మాటకు నై అనటం, సూర్, ధన్, నయన్, నిమన్ అనే శబ్దాల ప్రయోగం అందుకు నిదర్శనం.

ఇంతవరకు మనం ఉర్దూ భాషోత్పత్తి వికాసాలను, దకనీ భాషోత్పత్తి వికాసాలను గురించి మాట్లాడుకున్నాము. ఇకమహాకవి మీర్ తఖీ మీర్ ప్రసక్తితో కొందరు ముఖ్యులైన ఉర్దూ కవుల గురించి మాట్లాడుకుందాము.

అంతకంటే ముందు ఒకమాట. ఇప్పటికీ దక్కనులో దకనీ భాష తెలుగు యాసతో మాట్లాడబడుతున్నది. ఉస్మానియా యూనివర్శిటీ స్థాపనకు ముందు హైదరాబాద్‌లోనూ దకనీ భాషే వుండేది. ఇప్పటికీ వున్నది. ఉత్తరాది ఉర్దూ భాషలో పండితుల మనుకునే వాళ్లు దక్కనీ భాషను, యాసను పరిహసిస్తారు. అలా పరిహసించే వాళ్లు ఉత్తరాది ఉర్దూ భాష ఎంత ప్రామాణికమో, దకనీ భాష అంతే ప్రామాణికమనే సత్యాన్ని గుర్తించని వాళ్లు. దకనీ భాషలో మనం గర్వించదగిన సాహిత్య సంపద వున్నది.

◆ ◆ ◆

దిల్లీలో ఉర్దూ సాహిత్యం

వలీ దకనీ రాకతో దిల్లీ నగరాన ప్రసిద్ధులైన ఫారసీ కవులకు గజల్ లాంటి సులలిత భావాల సుందర కవిత ప్రజల భాషలోనూ చెప్పవచ్చుననే నమ్మకం కలిగింది. అప్పటి దిల్లీ ఫారసీకవులు ఫిత్రత్, ఉమ్మీద్, బేదిల్, నదీమ్, అర్జూలు- అందరిలో సిరాజుద్దీన్‌ఖాన్ ఆర్జూ గొప్పవాడు. అతన్ని సాధారణంగా ఖాన్ ఆర్జూ అంటారు. ఖాన్ ఆర్జూ దిల్లీ ఉర్దూలో కొన్ని షేర్లు చెప్పటం ప్రారంభించి నాడు. అతని వెంట అనేకులు ఆ మార్గాన్ని అనుసరించినారు. వలీ దిల్లీకి చాలాసార్లు వచ్చినాడు. అక్కడ వుండే షాహ్ గుల్షన్ వలీకి ఆధ్యాత్మిక గురువు (పీరొముర్షిద్). కాని దిల్లీ ముషాయిరాలో పాల్గొని తన గజల్లు వినిపించిన నాడే దిల్లీ కవులు అతని దకనీ వుర్దూ గజల్లకు ముగ్ధులైనారు. వలీ భాష దకనీ ఉర్దూ-ఆ భాషలో అతనికి నూరేళ్ల ముందే సుల్తాన్ ఖులీఖుతుబ్బా దీవాన్ తయారయింది.

దకనీ ఉర్దూకు దిల్లీ ఉర్దూకు భాషలోనే కాక భావాల్లోనూ భేదము కనిపిస్తుంది. దకనీ భాషకు మూడు శతాబ్దాల చరిత్ర వున్నది. ఆ భాషలో దక్షిణాది భాషల శబ్దాలు కలిసి వుండటమే కాక కవితలో చాలా వరకు ఇక్కడి ప్రకృతి, ఇక్కడి అలంకారాలు, ఇక్కడి పురాణగాథల ప్రసక్తి (దాన్ని తల్మీహ్ అంటారు) వుంటుంది. బుల్బుల్‌తో పాటు శుకపిక మయురాలుంటాయి. గులో లాలతోపాటు జాజులు చేమంతు లుంటాయి. పరీలతోపాటు అప్సరసలుంటారు. కాని దిల్లీ ఉర్దూ కవులు అప్పుడే దేశభాషలో కవిత ప్రారంభించి నారాయె. వాళ్లకు దేశీయత ఎలా అబ్బుతుంది? పైగా వాళ్లు సామాన్య ప్రజానీకంలో కలిసి తిరిగిన వాళ్లూ కాదయిరి. ప్రజా జీవితంలో పరిచయమున్న వాళ్లూ కాదయిరి. కాబట్టి దిల్లీ ఉర్దూ కవులు ఫారసీక వాతావరణాన్ని తమ గజల్లలో చిత్రించినారు. దిల్లీ కవుల సహవాసం వలన వలీ దకనీ కూడా తన గజల్లను ఈరాన్ వైపు మళ్లించినాడు. వలీ ప్రసక్తిలో ఈ మాట రాసినాను.

దిల్లీలో ఫాయెజ్, ఆబ్రూ, నాజ్, హాతిమ్, ఎక్రంగ్, జాన్ జానాన్, మజ్నూ, ఫుగాఁ, తాబాఁ అనే కవులు గజల్ రచనలో సిద్ధహస్తులైనారు. కాని వాళ్ల గురించిన వివరాలు అంతగా తెలియవు. తర్వాత ఫారసీలో రాయబడిన తజ్కిరా (కవి పరియాలు)లలో వాళ్ల గురించి కొన్ని మాటలు తెలుపబడినవి. కొన్ని షేర్లు ఉదాహరింపబడినవి.

రెండు మూడేళ్లుగా ప్రొఫెసర్ సయ్యదా జాఫర్ హైదరాబాద్ నుంచి వెలువడే సియాసత్ అనే ఉర్దూ దినపత్రికలో వారం వారం 'అదబె-ఆలియా' పేర ప్రాచీన కవుల నుంచి ప్రారంభించి వరుసగా కవుల పరిచయం చేస్తున్నది. ఎన్నెన్ని తజ్కిరాలను, పరిశోధక వ్యాసాలను పరిశీలించి ఆమె ఇంత వరకు తెలియని చాల విషయాలు సేకరించి రాస్తున్నది. ఈ సంక్షిప్త చరిత్రలో అవన్నీ మనకు అవసరమైనవి కావు. ప్రొఫెసర్ సాహెబా రాస్తున్న వ్యాసాలు విలువైనవి. పరిశోధకులు తప్పక చదువ దగినవి. ఈ పుస్తకంలో నేను ఉర్దూ భాషా సాహిత్యాల పరిచయం మాత్రమే చేస్తున్నాను కనుక మనకు అవసరమైనవి కావంటున్నాను. పైన పేర్కొన బడిన కవుల్లో ఫాయెజ్‌ను గురించి అంతగా తెలియదు. దిల్లీ ఉర్దూలో భారతీయ వాతావరణాన్ని చిత్రించిన మొదటికవి అని మాత్రమే తజ్కిరాలు తెల్పినవి. కొన్నాళ్ల క్రిందట ప్రొఫెసర్ మసూద్ హసన్ రిజ్వీ పరిశ్రమతో కూడిన పరిశోధన చేసి అతని జీవిత విశేషాలలో దొరికినంత వరకు అతని కవితను సవ్యాఖ్యానంగా ప్రచురించినాడు. తన సమకాలీనులైన కవుల కవిత కంటె అతని

కవిత భిన్నమైంది. దకనీ కవితను పోలివున్నది. అతని పేరు సదరుద్దీన్ మొహమ్మద్, దిల్లీ ఆస్థానంలో ఉన్నతోద్యోగి. ధనవంతుడు. అతని ఫారసీ కవితలనేకం, ఉర్దూలోను అన్ని రకాల కవితలు రాసినాడు. ఒక కవితలోని కొన్ని పంక్తులు:

హై ఇందర్‌కి మానో సభా జల్వాగర్

కి హర్ నార్ దిస్తీహై రంభాసాఁవర్

కమర్ పర్ జో పత్తేహై సబ్ మూయె-సర్

ఉనా బీబ్‌మిల్ జాతా మూయె-కమర్

హర్ ఎక్‌నార్ సూరజ్ సి శోభాధరే

ఖదీ హో సూరజ్ కీ తపస్యాకరే.

దిస్తీ అనే క్రియా పదం దకనీ భాషది. మహారాష్ట్ర ప్రాకృతం నుంచి వచ్చి చేరింది. ఉనా అనేమాట దకనీదే. ఇక ఇందలి హిందీ మాటలు తెలిసినవే. ఇందర్, రంభా, వర్ (శ్రేష్ఠమైన), నార్ (నారి), శోభా, ధరే (ధరించటం), సూరజ్, తపస్యా-

మూ అంటే పారసీలో వెంట్రుక- మూయె-కమర్ అంటే వెంట్రుకలాంటి నడుము-

ఈ కవి గజల్లలోనూ హిందీ శబ్దాలు విశేషంగా ప్రయోగిస్తాడు. ఒక షేర్ హిందీ శబ్దాలంతగా లేనిది వినండి.

భంవాఁ తేరీ షమీర్ జుల్ఫాఁ కమంద్

పలక్ తేరీ జైసే కటారీలగే.

"నీ కనుబొమలు తలవార్లు- శిరోజాలు ఉరిత్రాళ్లు- (కమంద్ అంటే నిజానికి ఉరిత్రాడు కాదు- కోట గొడపై ఎగ బ్రాకటానికి వేసే బలమైనత్రాడు. ప్రియురాలి శిరోజాల ద్వారా ఉరిత్రాడు దనుక చేరటం ఉర్దూ కవులు చేసే ప్రయాణం- అంటే లౌకిక ప్రేమ ద్వారా పరమాత్మలో విలీనమయ్యేదాక ప్రయాణం.) ఈ కాలపు కవులందరూ ఛందస్సును, వ్యాకరణాన్ని కచ్చితంగా పాటించినవాళ్లు కాదు- వీళ్లంతా పద్దెనిమిదవ శతాబ్దిలో జీవించినవాళ్లే.

షాహముబారక్ ఆబ్రూ ఒక పీఠాధిపతి. కవితలో ఖాన్ ఆర్జూ శిష్యుడు. ఇతని కవితలో హిందీ శబ్దాలుండవు- ఒక షేర్,

ఫిర్తే థే దష్త్ దష్త్ దివానే కిధర్ గయే

వో ఆషిఖీ కె హాయ జమానే కిధర్ గయే

"అడవులూ ఎడార్లూ పట్టు కొని తిరిగే ఆ పిచ్చివాళ్లెటు పోయినారు? ప్రేమించే ఆ కాలం ఎటు పాయింది?." ఇది తర్వాతి కవులకు మార్గదర్శకమైన కవిత.

సయ్యద్ అహ్మద్ షాకిర్ నాజ్ కవితలో హిందీ శబ్దాలు కనిపిస్తున్నాయి.

నమ్కిూం హుస్న్ దేఖ్‌కర్ పీకా

రంగ్ గుల్ కా ముఝేలగా ఫీకా

పీ అంటే హిందీలో ప్రేయసి- నమ్కిూన్ అంటే ఉప్పన- "ప్రేయసి లావణ్యమయమైన సౌందర్యాన్ని చూచిన నాకు గులాబి రంగు చప్పగా (వెలిసి పోయినట్లు) కనిపిస్తున్నది." పీకా, ఫీకా అనే ఖాఫియాలో ఒక శబ్దాలం కారమున్నది.

షేఖ్ జహూరుద్దీన్ షాహ్ హాతిమ్ చాల గొప్పకవి. దీర్ఘకాలం జీవించిన ఈ కవి కవిత్వంలో వచ్చే పరివర్తనను చూచినాడు. తన తొలినాళ్ల కవితను దీవాన్‌గా సంకలనం చేసుకున్నాడు. తర్వాతి కాలంలో మారిన తన కవిత్వాన్ని గూడ చిన్న దీవాన్‌గా సంకలనం చేసుకొని దానికి 'దీవాన్ జాదా' అని పేరు పెట్టినాడు. దాని చివరి పుటల్లో తన శిష్యుల పేర్లు రాసుకున్నాడు. మొదటి పేరు మిర్జా రఫీ సౌదా ది. సౌదా గురించి తర్వాత మాట్లాడుకుందాము. ఉర్దూ కవుల్లో కవిత్రయ మన బడే ముగ్గురు మహాకవుల్లో సౌదా ఒకడు. షాహ్ హాతిమ్ కవితల్లో వున్నది ప్రేమ, సూఫీ తత్వమే. అతడు తన 'దీవాన్ జాదా' పీఠికలో భావప్రకటనలోను, భాషా ప్రయోగంలోను కలుగుతున్న మార్పులను గమనించి ఆ మార్పులకు గల కారణాలను, వాటి ఆవశ్యకతను చక్కగా విశ్లేషించినాడు. సాహిత్య విద్యార్థు లకు ఆ పీఠిక అవశ్యపఠనీయమైంది. అతని శైలి తెల్పటానికి ఒక్క షేర్.

పీరీ మె హాతిమ్ అబ్ న జవానీకి బాత్‌కర్

సూఖే దరఖ్త్ భీ కహీం హోతేహైం ఫిర్ హరే

"హాతిమ్! ముసలి తనంలో పడుచునాళ్లను గుర్తుచేసుకోకు-

మోడు వారిన చెట్లు మళ్లీ చిగురిస్తాయా?"

మిర్జా మజ్హర్ జాన్ జానాన్ గొప్ప విద్వాంసుడు. సూఫీ తత్వవేత్త. ఎనభైయేళ్లు జీవించిన ఆ వృద్ధ మహాకవి నెవరో హత్య చేసినారు. అతడు 1791వ

సంవత్సరాన మరణించినాడు. షాహ్ హాతిమ్ మృత్యువు కూడా ఇంచుమించు ఆకాలంలోనే, అంటే, పద్ధెనిమిదవ శతాబ్ది చివరి దశకంలో జరిగింది. మజ్హర్‌కూడ అలంకార వ్యామోహాన్ని తగ్గించటానికి, భాషను సంస్కరించటానికి కృషి చేసినవాడే; ఒక షేర్;

యె హస్రత్ రహ్‌గయీ క్యాక్యామజే సేజిందగీ కర్తే

అగర్ హోతా చమన్ అప్నా, గుల్ అప్నా, బాగ్బాఁ అప్నా.

"తోట మనదే, పూలు మనవే, తోటమాలి మనవాడే అయితే ఎంత హాయిగా జీవించే వాళ్లమో అనే కోరిక అలాగే వుండి పోయింది." (ఏదీ మనది కాలేదని భావం)

ఫుగాఁ పేరు అష్రఫలీఖాన్. నదీమ్ శిష్యుడు. ఢిల్లీ పాడుపడిన తర్వాత అందరికంటె ముందు దిల్లీని విడిచి అన్యసంస్థానాలకు వెళ్లినాడు. తొలుత అవధ్ వెళ్ళినాడు. తర్వాత పాట్నా (అజీమాబాద్) వెళ్ళినాడు. పాట్నా పాలకుడు రాజాషితాబ్ రాయ్ అతన్ని చివరి వరకు సన్మాన పూర్వకంగా నిల్పుకున్నాడు. అతని కవిత ఇలా వుంటుంది;

జఖ్మె దిల్‌తో సియానహీ జాతా

బిన్ సియే భీ రహా నహీ జాతా

అయ్ ఫుగాఁ! దేఖ్నా, సమఝ్‌లేనా

దేకె దిల్ ఫిర్ లియా నహీ జాతా

ఉర్దూ గజల్ ఎలా క్రమ వికాసం చెందుతున్నదో తెలియజేయటానికే ఈ షేర్లు ఉదాహరిస్తున్నాను. దీని భావం,

"హృదయానికి తగిలిన గాయాన్ని కుట్టుకోరాదు. కుట్టుకోకుండా ఉండ లేము. ఫుగాఁ! బాగా అర్థం చేసుకో. హృదయ మెవరికైనా యిచ్చినా మంటే తిరిగి తీసుకోలేము." మీర్ అబ్దుల్ హై తాబాఁ కవిత సరళ సుందరము. అతడూ సుందరుడే. అతడు కూర్చుండే వీధిలోంచి పాదుషా వారి సవారీ వెళ్లేదట. అతని సౌందర్యాన్ని చూడాలనే.

పైన ప్రస్తావించిన కవులందరిని మొతఖద్దమీన్ వర్గంలో చేర్చినారు. అంటే ప్రాచీన కవులు. తొలుత తరం కవులు. ఇప్పుడు 'ముతవస్సతీన్' అంటే మధ్యయుగం కవుల గురించి మాట్లాడు కుందాము. ఈ మధ్యయుగం ఉర్దూ సాహిత్యంలో ఏ విధంగా చూచినా స్వర్ణయుగమే.

◆ ◆ ◆

ఉర్దూ మహాకవిత్రయం

ఇప్పుడు మనం ఉర్దూ సాహిత్య చరిత్రలో ఎల్లకాలం స్వర్ణయుగముగా అభివర్ణిచబడిన యుగానికి చెందిన ముగ్గురు మహాకవుల గురించి ముచ్చటించు కుందాము. వయసులో అందరికంటె పెద్దవాడు మిర్జారఫీ సౌదా (1713-1795). అతని తండ్రి ఈరాన్ నుంచి భారతదేశానికి వ్యాపారార్థం వచ్చి ఇక్కడే స్థిర పడ్డాడు. ఐశ్వర్యంలో పుట్టి పెరిగిన మిర్జా మొహమ్మద్ రఫీ సౌదాది ధనికుల స్వభావం. హాస పరిహాస ప్రియుడు. రాజ దర్బారులో ప్రవేశం కలవాడు. అమీర్లు, సంప న్నులు అతని మిత్రులు. దిల్లీ చక్రవర్తి షాహ్ ఆలం పరిస్థితి చాల దయనీయమైన తర్వాత కవులూ, కళాకారులూ దిల్లీని వదిలి పెట్టినారు. అవధ్ వజీర్‌నవాబులు అమిత సంపన్నులు. కళా సాహిత్య పోషకులు. కొన్నాళ్లు ఫరూ ఖాబాద నవాబు సేవలో గడిపి సౌదా కూడా అవధ్ రాజధాని ఫైజాబాద చేరుకున్నాడు. ఒకప్పుడు అవధ్ నవాబు షుజావుద్దౌలా సౌదా కీర్తి విని, "ప్రియసోదరా!" అని సంబోధిస్తూ స్వహస్తాలతో జాబురాసి ఆహ్వానించినాడు. దానికి జవాబుగా సౌదా ఒక రుబాయీ రాసి పంపుతూ రాలేనని విన్నవించు కున్నాడు. మళ్లీ ఆ నవాబు దగ్గరికే వెళ్ళినప్పుడు నవాబతన్ని సాదరంగా ఆహ్వానించినాడు. ఎత్తిపొడుపుకో మరే వుద్దేశంతోనే గాని రాలేనని ఒకప్పుడు సౌదా రాసి పంపిన రుబాయి వినిపించినాడు. కవికి తలతీసి నట్లయింది. నవాబుకు సలామ్ చేసి ఆస్థానం విడిచి వెళ్ళిపోయినాడు. రాజాశ్రాయం లభించకున్నా సౌదాకు సారస్వత రసికుల ఆదరణ లభించింది. మళ్లీ కొన్నాళ్లకు రాజాశ్రయం కూడా లభించింది. నవాబు ఆసిఫొద్దౌలా ఆస్థానంలో. షుజావుద్దౌలా తర్వాత అతని కొడుకు ఆసిఫొద్దౌలా అవధ్ నవాబయినాడు. అతడు తన రాజధానిని ఫైజాబాద నుంచి లఖ్నోకు మార్చినాడు. అమీర్లూ, సర్దార్లూ లఖ్నో చేరుకున్నారు. సౌదా కూడ లఖ్నో చేరినాడు. సౌదా తనను ఆదరించిన నవాబుల, అమీర్ల ప్రశంసలో ఖసీదాలు రాసినాడు. అతని ఫారసీ భాషా పాండిత్యం కావ్యాలంకార శాస్త్ర పరిచయం సాటిలేనిది. ఉర్దూ ఖసీదా రచయితల్లో అతడే అగ్రగణ్యుడు. గజల్లు, మస్నవీలు, మర్సియాలు రాసినాడు కాని ఖసీదాలే అతనికి ఎనలేని కీర్తి తెచ్చి పెట్టినాయి. ఖసీదా రచనతో పాటు హిజో రచన కూడా అతనికి ఇష్టమైన వ్యాసంగం- హిజో అంటే నిందాత్మకమైన రచన. ఫారసీ

ఖసీదా రచనలో పైగంబరన బడిన అన్వరీకి కూడా హిజో రచనపట్ల వ్యామోహం వుండేది. దాని కారణంగా అతడెన్నో కష్టాలు పడ్డాడు. అవమానాల పాలయినాడు. సౌదా కూడ హిజో రచన వలన ఎన్నో ఇక్కట్ల నెదుర్కున్నాడు.

మీర్ జాహెక్ అనే మంచికవి వుండేవాడు. అతని భాషా జ్ఞానం, పాండిత్యం సౌదా కంటె ఒకింత ఎక్కువే. కులాన సయ్యద్ కనుక సౌదాకు ఆదరణీయుడు. అతన్ని గౌరవిస్తూనే అతని మీద హిజోలు రాసేవాడు సౌదా. జాహెక్ కూడా హిజో రచనలో ఆరి తేరిన వాడే. జాహెక్ హిజోకు జవాబు హిజో రాసేవాడు. ఆ రెండు హిజోలు ప్రజలకు కొన్ని గంటల్లోనే కంఠస్థమై ప్రచారం పొందేవి.

లఖ్నోలో మిర్జా ఫాకిర్ మకీన్ అనే ఫారసీ కవి వుండేవాడు. అలవాటు ప్రకారం అతని మీద కూడ ఒక హిజో రాసినాడు సౌదా. హిజోకు జవాబు హిజో వస్తుందనుకున్నాడు. కాని అలా జరుగలేదు. ఐదారుగురు పహెల్వానులలాంటి వ్యక్తులు (ఫాకిర్ మకీన్ శిష్యులు) అతన్ని ఇంటి నుంచి బయటికి లాగి పదుగురు నడిచే రాచబాట వెంట లాక్కెళ్లి తమ గురువు ముందు పడవేసి క్షమాపణ వేడవలసిందిగా బలవంతం చేసినాడు. ప్రజలు గుమిగూడినారు. సౌదాకు చచ్చినంత పని జరిగింది. అతని అదృష్టం మంచి కనుక, అప్పుడే ఆ మార్గాన నవాబు సాదతలీఖాన్ సవారీ వచ్చింది. నవాబు సంగతి సందర్భాలు తెలుసుకొని, అతన్ని తన అంబారీలో కూర్చొబెట్టుకొని, రాజప్రసాదానికి వెళ్లి నవాబు ఆసఫుద్దౌలాకు అప్పగించి, "మనపితృపాదులు ప్రియ సోదరా! అని పిలిచిన ఈ మహాకవి నేడు నీ రాజ్యంలో నిరాశ్రయుడు. పరాభూతుడు" అని జరిగినదంతా చెప్పినాడు. సాదత్‌లీఖాన్ ఆసఫుద్దౌలా సోదరుడు. జరిగినదానికి నవాబు నొచ్చుకొని సౌదాను సాదరంగా ఆలింగనం చేసుకొని ఆస్థాన కవిగా నియమించి ఆరువేల రూపాయల వార్షిక భరణం ఏర్పాటు చేసినాడు. హిజో రచన మానుకొని సౌదా సుఖజీవనం గడుపుతూ లఖ్నోలోనే తుదిశ్వాస వదిలినాడు.

ఖసీదా రచనలో అతడు సాటిలేనివాడు. గజల్ రచనలోనూ సామాన్యుడు కాడు గాని సమకాలీనులైన మీర్ తఖీమీర్, ఖ్వాజా మీర్ దర్దలకు సరితూగడు. అతని షేర్లు కొన్ని;

జబ్ నజర్ ఉన్కి ఆన్ పడ్తీ హై
జిందగీ తబ్ ధ్యాన్ పడ్తీ హై
ఏక్ కే మూహ్‌సె జిస్ ఘడీ నిక్లే

ఫిర్‌తో సౌకీ జుబాన్ పడ్తీహై
లేకిన్ ఇత్నా కహేకొయీ ముఝ్‌సే
కభూ ఉస్కీ భీ కాన్ పడ్తీహై.

మొదటి షేర్‌లోని 'ధ్యాన్' అనే శబ్దం హిందీది. దీన్ని రెండు మాత్రల్లో గురువుగా ఉచ్చరిస్తే మాత్రలు సరిపోవు. మాత్రలు హెచ్చుతగ్గులైతే "తఖ్తీసే గిర్ జానా" అంటారు. దీన్ని మూడు మాత్రల్లో, అంటే ప్లుతంగా ఉచ్చరించాలె. 'ధయాన్' అనాలె. ప్యారీ, న్యారీ అనే హిందీ శబ్దాల్లో ప్యా, న్యాలు ప్లుతాలు. భావమేమంటే "ఆమె చూపు నామీద పడినప్పుడు నా జీవితం పట్ల ధ్యాస కలుగుతుంది. ఒకనోటి నుంచి వెలువడిన మాట నూరు నోళ్ల నుంచి వెలువడుతుంది. నా మాట ఆమె చెవిని పడుతుందో లేదో ఎవరైనా చెప్పండి."

సౌదా రచించిన ఒక ప్రసిద్ధమైన షేర్‌తో ఈ ప్రసక్తి ముగిస్తాను.

కైఫియ్యతె-చష్మ్ ఉస్కీ ముఝే యాద్‌హై సౌదా
సాగిర్‌కో మెరే హాథ్‌సే లేనా కె చలా మై

కించిదరుణాభ గల ద్రాక్షాసవ పానపాత్ర కవి చేతికి వచ్చింది. ఎఱ్ఱ జీరలు గల ప్రేయసి మాదకనేత్రాలు అతనికి గుర్తుకు వచ్చినవి. త్రాగకుండగనే కైపు కమ్ముకుంటున్నది. తన చేతిలోని చషకాన్ని "ఎవరైనా అందుకోండి" అని పారవశ్య స్థితికి జారుకుంటున్నాడు. ఇది ఉర్దూ సాహిత్యంలో చాల సుందరమైన షేర్

◆ ◆ ◆

వయసును బట్టి మహాకవి త్రయంలో రెండవ కవి ఖ్వాజా మీర్ దర్ద్ (1721-1785). అతడు దిల్లీలోని ఒక సుప్రతిష్ఠిత సూఫీ మఠాని కధిపతి. అతని తండ్రి ఖ్వాజా మొహమ్మద్ నాసిర్ అందలీబ్ పేరొందిన సూఫీకవి. చిన్నప్పటి నుంచి సూఫీ సంప్రదాయంలో పెరిగినందువలన, సూఫీయోగుల సహవాసం వలన దర్ద్ అరబీ, ఫారసీ భాషలో మంచి పాండిత్యం సంపాదించినాడు. సూఫీ వేదాంతాన్ని బాగా అధ్యయనం చేసి ఒంట బట్టించుకున్నాడు. కవిత రాయటం నేర్చుకున్నాడు. తప్పులు సవరించటానికి తండ్రి వున్నాడాయె. అతని ఖాన్ఖాహ్‌కు చక్రవర్తి మొదలుకొని సామాన్య జనులు హాజరయ్యే వాళ్లు. కవితా రచనతోపాటు అతడు సంగీత సాధన కూడా చేసినాడు.

సూఫీలకు సంగీతం నిషేధం కాదు. అదొక ఆరాధన (ఇబాదత్). దర్ద్ వీణావాదనలోను, గాత్ర సంగీతంలోను నైపుణ్యం సంపాదించినాడు. అతని ఖాన్ఖాహ్‌లో నెలకొక రాత్రి ముషాయిరా (కవి సమ్మేళనం), దానతోపాటు మహఫిలె-సమా (సంగీత సభ) ఏర్పాటు చేయబడేవి. మీర్ తఖీమీర్ దిల్లీలో వున్నంత కాలం నెలనెలా క్రమం తప్పకుండ ఆ సభల్లో పాల్గొనేవాడు. ఆ మాటనతడు తన ఆత్మకథ 'జిక్రె-మీర్' లో గర్వంగా చెప్పుకున్నాడు. అది ఫకీర్ల సన్నిధానం; సరస్వతీ సన్నిధానం కనుక అక్కడ ఆసీనులైనవాళ్లందరూ మోకాళ్లు మడచుకొని వినయంగా కూర్చుండవలసిందే. చక్రవర్తి కూడ కాళ్లను చాచి కూర్చున్నాడట. వెంటనే దర్ద్ మందలించినాడట. "నేడు నా మోకాళ్లు నొప్పి పెడుతున్నాయి." అని సంజాయిషీ యిచ్చుకున్నాడట చక్రవర్తి. 'అలా అయితే తమరీ రాత్రి రాజమహల్‌లోనే విశ్రాంతి తీసుకోవలసి వుంటిరి" అన్నాడట దర్ద్.

"అబె-హయాత్" అనే సాహిత్య చరిత్ర వచనంలో రాసిన మోలానా మొహమ్మద్ హుసేన్ ఆజాద్ చెప్పిన మాటలివి. "ఆబె-హయాత్" అద్భుతమైన రచన. మోలానా ఆజాద్ వచన శైలి సుందరమైంది. అతడు కథ చెప్పే తీరు కమనీయమైంది. అప్పట్లో అతనికి లభ్యమైన సామాగ్రి అంతంత మాత్రమే. అప్పటికీ చాల గ్రంథాలు అచ్చు పడలేదు. లిఖిత ప్రతులతనికి అంతగా లభించ లేదు. కాబట్టి దంత కథల మీద, వదంతుల మీద ఆధారపడ్డాడు. కవి కనుక తానూ కొన్ని ఊహలూ, కల్పనలూ చేసినాడు. ఆబె-హయాత్ అవశ్యపఠనీయమైన గ్రంథం. కాని ఆజాద్ చెప్పిన అన్ని మాటలూ నమ్మవలసిన పనిలేదు.

దర్ద్ ముచ్చటే చూడండి. అతిథిగా వచ్చిన చక్రవర్తిని అలా మందలించటం భావ్యమా? మృదు స్వభావిగా పేరుగాంచిన ఖ్వాజా మీర్ దర్ద్, సూఫీ సంప్రదాయంలో పెరిగినవాడు అలా మందలించి వుంటాడా? అనిపిస్తుందిగదా!

మీర్ తఖీమీర్ చాల గొప్పకవి. నిజానికి అతన్ని మెప్పించే కవులు ప్రాచీన కవుల్లో లేకుండిరి. సమకాలీనుల్లో లేకుండిరి. తిక్కన గురించి కేతన ఆమాటే అన్నాడు; 'కవిత చెప్పి ఉభయ కవి మిత్రుమెప్పింపనరిది బ్రహ్మకైన...' అని. మీర్ గర్విష్ఠి -దురభిమానం కలవాడు కాడుగాని స్వాభిమానం కలవాడు. ఎవరితో సరిగా మాట్లాడేవాడు కాడు." ఇవన్నీ ప్రచారంలో వున్న మాటలు- అటువంటి మీర్ ఫారసీలో 'నుకాతుష్షొఅరా' అనే కవుల చరిత్ర రాసినాడు. ఏమి రాసివుంటాడందులో? అతని స్వభావాన్ని బట్టి ఎవరూ కవులు కారు అని ఉమాకాంత విద్యాశేఖరుల వలెరాసి వుంటాడు. అందరినీ కించపరచి వుంటాడు.

ఇదిగో, మనమలా అనుకుంటున్నామే-మోలానా ఆజాద్ అలాగే ఆలోచించి నాడు. ఆ మాటలే రాసినాడు. అతని కాలంలో నుకాతుష్షాఅరా అచ్చుపడలేదు. ఇప్పుడు అచ్చయి అందరికి అందుబాటులోకి వచ్చింది. మీర్ చాలమంది కవులను పొగడినాడు. తన సమకాలికుడైన దర్ద్ నైతే మరీ వినయంగా ప్రశంసించినాడు. మోలానా ఆజాద్ చెప్పే కొన్ని ముచ్చట్లట్లా 'వుంటాయి.

దర్ద్ ఫారసీలోను, ఉర్దూలోను, గజల్లే రాసినాడు. అతని గజల్ల సంకలనం చాల చిన్నది. షేర్లు కూడా చాలవరకు చిన్నవే. అంటే కొన్ని మాత్రల్లో ముగిసేవి. అయినా అవి గుండెలోకి సూదుల్లాగా దూసుకపోయేవి. "దర్ద్ తన కవితలో తలవాడుల పీడను సూదుల్లోనింపి నట్లున్నాడు." అని మోలానా ఆజాద్ రాసినవాక్యం అసత్యం కాదు.

జగ్‌మే ఆకర్ ఇధర్ ఉధర్ దేఖా

తూహి ఆయా నజర్ జిధర్ దేఖా

'ప్రపంచరలో ఎటువైపు చూచినా నువ్వేకనిపించావు."

దీన్ని వ్యాఖ్యానించాలంటే సూఫీ వేదాంత సారాన్ని పిండాలె.

"హమ ఊస్త్", "అంతా అదే అయివున్నది"- ఉపనిషత్సారం అదే. 'సర్వం ఖల్విదం బ్రహ్మం".

సాఖియా! యాఁలగ్ రహాహై చల్ చలావ్

జబ్ తలక్ బస్ చల్ సకే సాగిర్ చలే

"సాఖీ! అంతా వెళ్లిపోతున్నారు. శ్వాస ఆడినంతవరకు పానపాత్ర (చషకం) ఆడవలసిందే" ఇక్కడెవరూ అధిక కాలం వుండరు. పోతూనే వుంటారు. ఉన్నంత వరకు అందరికీ పానపాత్ర అందిస్తూ వుండు" ఇక్కడ సాఖీ అంటే భగవంతుడు. మధ్యమంటే మైమరపించే భగవత్ ధ్యానం.

వాయె నాదానీకె వఖ్తె మర్గ్ యే సాబిత్ హువా

ఖ్వాబ్ థా జో కుఛ్‌కె దేఖా-జోసునా అఫ్సానా థా

"నా అజ్ఞానమెంతటి దంటే ఈ లోకం నుంచి వెళ్లిపోయేటప్పుడు ఈ లోకంలో చూచిన దంతా కల, విన్నదంతా కథ అని తెలుసుకున్నాను."

ఈ మాటే మీర్ తఖీమీర్ ఇంకా సరళ శైలిలో చెప్పినాడు;

యెహీ జానాకె కుఛ్‌న జానా హాయ్

వో భి ఎక్ ఉమ్రమే హువా మాలూమ్

"ఒక జీవితమంతా గడిపిన తర్వాత నాకేమీ తెలియదన్న సంగతి తెలుసుకున్నాను."

ఈ యిద్దరు సూఫీ కవులు జగద్విఖ్యాత సూఫీ కవి ఖ్వాజా ఫరీదుద్దీన్ అత్తార్ ఫారసీలో చెప్పిన మాటే చెప్పినారు; అత్తార్ ఏమన్నాడంటే;

తా బ ఆంజా రసీద్ దానిషె-మన్

కె బదానం హమీఁకె నాదానమ్

"నాజ్ఞానం ఏ మేరకు చేరిందంటే నాకేమీ తెలియదన్న సంగతి తెలుసుకున్నాను."

భారతీయ వేదాంతులు ఈ మాటే అన్నారు.

ముగ్గురు మహాకవుల్లో వయసును బట్టి మూడవ వాడు మీర్ తఖీమీర్ (1725-1810). ఉర్దూ గజల్ రచనలో ఇతడు అగ్ర గణ్యుడే కాక అసమానుడు. నాడు నేడు అతని స్థానం సమున్నతమే. అతన్ని "గజల్ కవి బ్రహ్మ" అంటారు. వ్యథా భరిత హృదయం కలవాడు, గాఢమైన ప్రేమానుభూతి పొందినవాడు గజల్ కవిగా రాణిస్తాడు. మీర్ తఖీమీర్ జీవితమంతా వేదనా పూరితము- అతని కాలంలో అందరి పరిస్థితి అలాటిదే. రాజకీయంగా దారుణాలు జరిగినాయి. సమాజంలో శాంతి భద్రతలు లేవు. అంతటా అస్థిరత-అశాంతి. అతని కెక్కడా ప్రేమ లభించలేదు. ప్రేమలో దెబ్బతిన్నాడు. అన్నిటిని సహించే స్థిత ప్రజ్ఞుడు కాడు. సున్నిత హృదయుడు. చిన్న పాటి తాకిడికి కూడ సహించుకోలేనంతటి చిరాకు పెంచుకున్నాడు. స్వాభిమాని. సంపన్నులను ప్రశంసించటం యాచించటం అతని స్వభావానికి విరుద్ధం. పుట్టింది సూఫీ ఫకీర్ల యింట- సామాన్య జీవితం గడపటానికే అలవాటు పడ్డాడు. అతని అవసరాలు పరిమితమైనవే. అవైనా తీర్చుకోలేకపోయినాడు. ఏకాకిగా బ్రతికేవాడు కనుక అందరతన్ని గర్విష్ఠిగా భావించినారు. నలుగురితోపాటు అతడూ కొంచెం తల వంచుకుంటే అతని జీవితం సుఖమయమైవుండేది. అలా చేయలేకపోయినాడు. అతనికి పదేళ్ల వయసు వచ్చినప్పుడు తండ్రి గతించినాడు. రెండు మాటలే నేర్పినాడు తండ్రి. ఒకటి ప్రేమ మార్గం- ఇంకొకటి స్వాభిమానం.

మీర్ తఖీమీర్ తండ్రి మరణించిన తర్వాత సవతి తల్లి, ఆమె కొడుకులు పెట్టే కష్టాలకు, చేసే అవమానాలను సహించుకోలేక ఆగ్రా వదిలి పెట్టి దిల్లీ చేరుకున్నాడు. అతని జన్మస్థలం ఆగ్రా నగరమే. దిల్లీలో ఖాన్ ఆర్జూ పేరుమోసిన విద్వత్కవి. అతని శిష్యులనేకులు. కొందరు కవులు- కొందరు విద్వాంసులు. షాహ్‌ముబారక్ ఆబ్రూ అంతటి మహాకవి అతని శిష్యుడు. దిల్లీ చేరిన మీర్ విద్యాభ్యాసం కోసం ఖాన్ ఆర్జూ యింటనే దిగినాడు. ఖాన్ ఆర్జూ అతని సవతి తల్లి సోదరుడే. అదీ శత్రువులిల్లే. ఆర్జూ కూతురే అతన్ని ప్రేమించివుండాలె. అతడూ అంతకు మించి ప్రేమించి వుండాలె. (ఇది ఎన్నాళ్ల నుంచో నా మదిలో మెదిలే ఊహ.) ఆయింట కూడా అతనికి అగచట్లూ అవమానాలే దొరికినవి. సహించు కున్నంత కాలం సహించుకున్నాడు. సహన శక్తి సన్నగిల్లిన తర్వాత ఇల్లు విడిచి వెళ్ళిపోయి వుంటాడు. మొదట్లో ఏడ్చి వుంటాడు. ఐహిక ప్రేమ ఈశ్వర ప్రేమకు తొలిమెట్టు. తొలిమెట్టులోనే తలబొప్పి కట్టింది. సూఫీల యింట పుట్టిన వాడు కనుక సౌందర్యారాధనను మనిషి నుంచి ఈశ్వరుని వైపు మళ్లించు కున్నాడు. ఈశ్వర ప్రేమ పొందటం ఇంకా కఠినంగదా. తన్నుతాను నశింపజేసుకోవాలె.

ఇబ్తె దాయె- ఇష్క్‌హై రోతాహై క్యా
ఆగె ఆగే దేఖియే హోతా హై క్యా

ప్రేమ మార్గగాముల హెచ్చరిక- "ప్రేమ ప్రారంభంలోనే ఏడుస్తున్నావేమి? ముందు మందు చూడు; ఏమవుతుందో."

మీర్ ఖాన్ ఆర్జూ శిష్యుడైనా అతని గజల్లలో ఫారసీ పదబంధాలకంటే దిల్లీ నుడికారమే అధికం- అది పండితుల వలన నేర్చుకున్నది కాదు. దిల్లీలోని జామె మస్జిద్ మెట్ల మీద నమాజు చదువటానికి వచ్చిన సామాన్య జనులు కాసేపు కూర్చుండే వాళ్లు. ఫకీర్లూ బిచ్చగాళ్లూ ఎప్పుడూ వుండేవాళ్లు. మీర్ గంటలు గంటలు వాళ్ల మాటలు వినేవాడు. వాళ్లతో మాట్లాడేవాడు. ఈ ముచ్చట అతడే చెప్పినాడు. ప్రజల పలుకుబడిని పట్టుకున్నాడు. గంభీరమైన భావాలు. అందమైన అలంకారాలు. సరళ శబ్దాలు. అలా కవిత చెప్పటం అతనికే సాధ్యమయింది.

అట్లని మీర్ ఫారసీ పదాలూ, పదబంధాలూ ప్రయోగించలేదని తాత్పర్యం కాదు. అతడు ఫారసీలో మహాపండితుడు. అప్పటి వాళ్లు కవిత ఉర్దూలో రాసినా వచనం ఫారసీలోనే రాసేవాళ్లు. ఫారసీలో అతడు మూడు రచనలు చేసినాడు. 'జిక్రె-మీర్' అతని ఆత్మకథ 'నుకాతు ష్షుఅరా' కవుల చరిత్ర. ఇదే మొట్టమొదటి

ఉర్దూ కవుల చరిత్ర. 'ఫైజె-మీర్' సూఫీల కథల పుస్తకం . దీన్నతడు తన కొడుకు కోసం రాసినాడు.

దిల్లీ పాడుపడిన తర్వాత అతడు కూడ లఖ్నో వెళ్లినాడు. నవాబు ఆసిఫొద్దౌలా అతన్ని సాదరంగా ఆహ్వానించి నెలకు మూడు వందల రూపాయల భరణం నిర్ణయించి తన ఆస్థానంలో నిలుపుకున్నాడు. కాని మీర్ దర్బార్ దారికి తగినవాడు కాడు. సంపన్నుల అహంభావాన్ని, దర్పాన్ని సహించేవాడు కాడు. ఏదో మాట మీద మీర్ ఆస్థానానికి రాకపోకలు మానుకున్నాడు. అయినా, అతడు బ్రతికి వున్నంత కాలం నెలకు మూడువందల రూపాయలు మీర్‌కు చెల్లించబడినవి. ఆస్థాన సంబంధం తెగిపోగానే మాసవేతనం బందయిందని ఆబె-హయాత్‌లో మౌలానా ఆజాద్ రాసినాడు. కాని రెండు వందల సంవత్సరాల తర్వాత అచ్చయిన 'గుల్షనె-హింద్' అనే కవుల చరిత్ర వలన రాక పోకలు బందయినా చివరి వరకు, అంటే 1810 వరకు మాసవేతనం బందు కాలేదని తెలుపబడింది. గుల్షనె -హింద్ రచయిత మిర్జా అలీలుత్ఫ్ మీర్ కంటే వయసులో చిన్న వాడయినా అతని కాలాన్ని చూచిన వాడే. కాబట్టి అతని మాట విశ్వసనీయ మైంది. గుల్షనె-హింద్ 'గుల్జారె ఇబ్రాహీమ్' అనే పేర పారసీలో రాయబడిన కవుల చరిత్రకు ఉర్దూ అనువాదం.

విషాద పూరితమైన మీర్ తన కవితలో తన విషాదాన్నే నింపినాడు. అతని షేర్లలో చాలా వరకు సూదుల్లా గుండె నాళాల్లో చొచ్చుకపోయి 'హాయ్' అనిపిస్తాయి. మౌలానా ఆజాద్ 72 సూదులు గుర్తించినాడు. అది అతని లెక్క. ఇతరుల లెక్క ఇంకొక రకంగా వుండవచ్చు.

మీర్ బీద జీవితమే గడిపినాడు. కాని అతని జీవిత కాలంలోనే అతని గజల్లను సంపన్నులు వరహాలకు ధరకట్టి అమ్ముకున్నారట. వెలగల బహుమానాలు పంపవలసిన చోట మీర్ గజల్లు పంపేవాళ్లట. మీర్‌కు తన కవిత విలువ తెలుసు;

చారోఁ ఆలం పర్ హుఁ మైఁ ఛాయాహువా
ముస్తనద్ హై మేర ఫర్మాయా హువా

"నాల్గులోకాల్లో నా కీర్తి వ్యాపించింది. నేను "సెలవిచ్చిన" మాట ప్రామాణికం." అన్నాడు. కవులిలాటి సాహిత్యాహంకారం ప్రదర్శించటం సంప్రదాయమే. అసమర్థులిలా అంటే అపహాస్యం పాలవుతారు. మీర్ లాంటి

వాళ్లకిది శోభిస్తుంది. మీర్ తర్వాతి తరానికి చెందిన కవుల్లో ముస్హఫీ మహాకవి. ఆతిష్ అంతటి ప్రఖ్యాత కవికతడు గురువు. అతని కవిత ఎనమిది సంకలనాల్లో సర్దుకున్నది. అంతటి మహాకవి తన గజల్లు వినిపిస్తున్నాడు. శ్రోతల్లో కూర్చున్న వృద్ధమహాకవి ఒక షేర్ విని స్పందించి "ఏదీ, మళ్లీ ఒకసారి ఆ షేర్ చదువండి" అన్నాడు. ముస్హఫీ మళ్లీ ఆ షేర్ వినిపించి (ముషాయిరాల్లో మళ్లీ చదువటాన్ని 'మొకర్రర్' అంటారు.) వేదిక దిగి వచ్చి మీర్‌కు వంగి మూడు సార్లు సలాం చేసి, "తమరు అనుమతిస్తే ఈ షేర్‌ను తాము రెండవసారి చదివించి విన్నారని రాసుకుంటాను" అన్నాడు. అనుమతి లభించింది. ఆగజల్లును తన దీవాన్‌లో చేర్చుకున్నప్పుడు మార్జిన్‌లో ఆ షేర్ దగ్గర ముస్హఫీ సగర్వంగా రాసుకున్నాడు; 'ఈ షేర్‌ను మహాకవి మీర్ రెండవసారి చదివించి విన్నారు" అని అంతటి గౌరవం అతని మాటకు.

కలామె మీర్ దేఖె ఔర్ జుబానే మీర్జా దేఖె
కహేఁ కిస్ మూహ్‌సె హమ్ అయ్ ముస్హఫీ ఉర్దూ హమారీహై.

అని ఒక షేర్‌లో అన్నాడు ముస్హఫీ.

"మీర్ తఖీమీర్ కవితను, మిర్జా రఫీ సౌదా భాషను చదివిన వాళ్లు ఏ నోటితో మాదీ ఉర్దూ భాషే అని అనగలరు?

"నాసిఖ్ మహాకవి అన్నట్లు మీర్ గొప్ప తనాన్ని గుర్తించనివాడు మూర్ఖుడు." అన్నాడు మిర్జా గాలిబు. గాలిబు అహంకారి. అయినా,

"రేఖ్తాకె తుమ్హీ ఉస్తాద్ నహీ హోగాలిబ్!
కహ్తే హైఁ అగ్లె జమానేమె కోయి మీర్ భి థా."

అన్నాడు. గాలిబ్! వెనుకటి తరంలో మీర్ అనే ఉస్తాద్ వుండేవాడంటారు. అని భావం. వెనుకటి తరమంటే మరీ వెనుకటి తరం కాదు. గాలిబు బాల్యం ఆగ్రాలో తనమాతా మహునింట గడిచింది. అప్పట్లో మీర్ ఆగ్రాలోనే వున్నాడు. గాలిబు బాలుడు-మీర్ వృద్ధుడు.

మీర్ కవితను ఉదాహరించటం కష్టమైన పని. అన్నీ గొప్పవే నాయె.

హస్తి అప్నీ హుబాబ్ కీసీహై
యే నుమాయిష్ సరాబ్‌కీసిహై
నాజుకీ ఉన్ లబోఁకి క్యాకహియే

పంఖుడీ ఇక్ గులాబ్ కీసీహై

మీర్ ఇన్ నీంబాజ్ ఆంఖోమ్మే

సారి మస్తీ షరాబ్ కీసీహై.

ఒకే గజల్ నుంచి గ్రహించిన ఈ మూడు షేర్ల కట్టు (బందిష్) ఎంత పకడ్బందీగా వున్నదో గమనించండి. ఖాఫియా రదీపులను చిత్తగించండి. శబ్ద సారళ్యాన్ని చూడండి. తాత్పర్య మేమంటే,

"మన అస్తిత్వం నీటి బుడగలా వున్నది."

ఈ దృశ్యమాన జగత్తు శోభఅంతా ఎండ మావిలా వున్నది.

ఆమె పెదవుల కోమలత్వాన్ని గురించి ఎలావర్ణించాలె?

గులాబి రేకుల్లా వున్నాయి.

మీర్! ఈమె అరమోడ్పు కన్నుల్లో మద్యానికి ఉండవలసిన నిషా వున్నది."

హమారె ఆగె తెరా జబ్ కిసీనె నామ్‌లియా

దిలే సితమ్ జదాకు హమ్‌నె థామ్ థామ్ లియా

"నా ముందర ఎవరైనా నీ పేరెత్తితే గాయపడిన గుండెను ఒడిసి వొడిసి పట్టుకున్నాను."

క్యాకరూఁ షరహ్ ఖస్త జానీకీ

మైనె మర్‌మర్‌కె జిందాగానీకీ

"నా శిథిల జీవితాన్ని గురించి ఎలా వివరించను? చస్తూ చస్తూ జీవితం గడిపినాను."

జాయె హై జీ నజాత్‌కే గమ్‌మే

ఐసి జన్నత్ గయీ జహన్నుమ్‌మే

"మోక్షం చింతతో ప్రాణం పోయేలా వుంది, అలాంటి స్వర్గం (ఎవరి కోసం) నరకంలో పడనీ."

ఈ మహాకవిత్రయం కాలంలోనే సయ్యద్ మొహమ్మద్ మీర్ అనే ఒక గొప్పకవి వుండేవాడు. అతడు ఖ్వాజా మీర్ దర్ద్ తమ్ముడు. శిష్యుడు. గుర్రపు స్వారిలో, వీణావాదనలో నిపుణుడు. అతని గజల్లు దర్ద్, మీర్ గజల్లలాంటి

సుందరమైనవే. అతడూ తొలుత మీర్ అనే ఉపనామంతోనే గజల్లు రాసినాడు. కాని మీర్ తఖీమీర్ ముందు లోకం తనకు తనను గుర్తించదని తన కలంపేరు 'సోజ్'గా మార్చుకున్నాడు. 'ఖ్వాబొ ఖ్యాల్' అనే మస్నవీ కూడ రాసి నాడు. అది ఉర్దూలో మొదటి మంచి మస్నవీ. దకనీ ఉర్దూలో చాల కాలం క్రిందటే రసబంధు రాలైన ప్రబంధాలు తయారైనాయి. మస్నవీ అంటే మన ప్రబంధం లాంటి కథా కావ్యం. మీర్‌కూడ ఒక మస్నవీ రాసినాడు. కాని దానికంటె సోజ్ మస్నవీ మంచిది.

◆ ◆ ◆

లఖ్నోలో ఉర్దూ కవిత

అవధ్ నవాబులకు వజీర్ నవాబులనేవాళ్లు. వాళ్లు దిల్లీ చక్రవర్తి సామంతులు. దిల్లీ చక్రవర్తులు ధనహీనులైనా అవధ్ నవాబులు మిక్కిలి ధనవంతులు. అయినా వాళ్లు దిల్లీ చక్రవర్తులను గౌరవించేవాళ్లు. షాహ ఆలం చక్రవర్తి కొడుకు మిర్జా సులేమాన్ షికోహ కొన్నాళ్లు అవధ్‌లో వున్నాడు. అప్పటికి అవధ్ రాజధాని ఫైజాబాద నుంచి లఖ్నోకు మారింది. లఖ్నో నవాబుతనికి నెలకు ఐదు వేల రూపాయల భరణమిచ్చేవాళ్లు. దానితో అతడు కవులను కళాకారులను పోషించటమేకాక విలాసమయ జీవితం గడిపేవాడు. నవాబు అతని ఆసనం దగ్గర గంటల తరబడి చేతులు కట్టుకొని నిల్చుండేవాడు. చక్రవర్తి కుమారుడతని కెప్పుడైనా ఒక లవంగమో, ఏలక్కాయో ఇస్తే దాన్ని మహాప్రసాదమని గ్రహించి ఏడుసార్లు వంగి సలామ్ చేసేవాడు. ఆ లవంగం ఆ నవాబిచ్చిన డబ్బుతో వచ్చిందే.

ఆసఫొద్దౌలా తర్వాత అతని తమ్ముడు సాదతలీ ఖాన్ నవాబయినాడు. అతని పరిపాలన పదహారేళ్లు. నవాబు గాజియొద్దీన్ కాలంలో బ్రిటీష్ కంపెనీ వాళ్ల సహాయంతో అవధ్ స్వతంత్ర సంస్థాన మయింది. నవాబులందరు కవులు. కవి పోషకులు. చివరి నవాబు వాజిదలీషా కవి. గాయకుడు. నటుడు. భోగలాలసుడు. అతన్ని కంపెనీవాళ్లు కల్కత్తాలోని మటియా బుర్జ్‌లో ఖైదు చేసి అవధ్ సామ్రాజ్యాన్ని స్వాధీన పరచుకున్నారు.

సౌదా, మీర్‌ల తర్వాత దిల్లీలో సారస్వతం చల్ల బడింది. కవిత చెప్పగలిగే వాళ్లందరు లఖ్నో చేరి మిర్జా సులేమాన్ షికోహ్‌ను, ఆ తర్వాత నవాబు సాదతలీ ఖాన్‌ను ఆశ్రయించేవాళ్లు. అలాంటి కవుల్లో జుర్-అత్, రంగీన్, ఇన్షా ముస్హఫీ అనే కవులు పేర్కొన దగినవాళ్లు. వాళ్ల కంటె ముందు లఖ్నో చేరిన జాహెక్‌ను, అతని కొడుకు మీర్ హసన్‌ను స్మరించు కోవాలె.

మీర్ జాహెక్ దిల్లీలోని సుప్రసిద్ధ కవుల్లో ఒకడు. దిల్లీ పాడుపడిన తర్వాత అతడు కూడ ఫైజాబాదకు వెళ్ళినాడు. అక్కడ సౌదాతో సాహిత్య సమరంలో తలపడ్డాడు. ఒకరి మీద ఒకరు హిజోలు రాసుకున్నారు. జాహెక్ కుటుంబంలో మర్సియాలు రాసే సంప్రదాయం వుండేది. దక్కన్ కవులు కూడా మర్సియాలు రాసినారు. మర్సియా విషాద కావ్యం. హజ్రత్ ఇమామ్ హుసేన్‌కు యజీద్‌కు కర్బలా మైదానంలో జరిగిన ధర్మయుద్ధం అందలి ఇతివృత్తం. జాహెక్ కొడుకు మీర్ హసన్ మంచి విద్వత్కవి. అతడు మర్సియాలు, మస్నవీలు, గజల్లు రాసినాడు. ఒక కవుల చరిత్ర కూడ ఫారసీలో తయారు చేసినాడు. అతని గజల్లు సుందరమైనవి. కొన్ని షేర్లు మీర్ షేర్లను తలపిస్తాయి. అయినా అతనికి ఉర్దూ సాహిత్యంలో చిరకీర్తిని సముపార్జించి పెట్టినది అతని మస్నవీ సహెరుల్ బయాన్. దాన్ని మస్నవీ మీర్ హసన్ అని కూడ అంటారు. ఇందులో రాజకుమారుడు బేనజీర్, రాజకుమార్తె బదర్‌మునీర్ ప్రేమ గాథ బహు సుందరంగా వర్ణింపబడినది. కథ పాతదే. కాని మీర్ హసన్ చెప్పిన తీరు చక్కగా వున్నది. దానివలన ఆనాటి ప్రజల జీవన విధానం, సామాజిక స్థితి, ఆచార వ్యవహారాలు అవగతమవుతాయి.

షేఖ్ ఖలందర్ బక్ష్ జుర్-అత్ దిల్లీ నుంచి లఖ్నో చేరిన కవి. అతడు గ్రుడ్డి వాడు. సంగీతంలోను, సితార్ వాదనలోను, జ్యోతిషంలోను నిపుణుడు. సాహిత్య విద్వాంసుడు కాడుగాని చక్కని గజల్ రాయగలవాడు. గజల్‌లో అశ్లీల శృంగారాన్ని మోతాదుకుమించి ప్రవేశపెట్టిన మొదటి కవి. అతని మిత్రులడు సాదత్‌యార్ ఖాన్ రంగీన్. విలాస పురుషుడు. అతడు స్త్రీల భావాలను స్త్రీల భాషలో తన గజల్లలో నింపినాడు. ఆ భాషను రేఖ్తీ అన్నాడు. ఇది ఉదాత్త భావంతో రాసిన కవిత కాదు. నవ్వించటానికి రాసిన కవిత.

ఇన్షావుల్లా ఖాన్ ఇన్షా దిల్లీ నుంచి లఖ్నో చేరిన మహాకవి. అతడు నిజంగా మహాకవి. బహు భాషల్లో పాండిత్యం కలవాడు. అసాధారణ ప్రజ్ఞావంతుడు. కాని పైన పేర్కొన బడిన ఇద్దరు చౌకబారు కవుల సహవాసంలో వున్నందువలన,

అప్పటి సంపన్నుల సాహిత్యాభిరుచి కూడ చౌకబారుదే అయినందువలన సామర్ధ్యం వుండి కూడా అతడు తన స్థాయికి తగిన కవిత రాయలేదు. అతని కొన్ని గజల్లు, కొన్ని రచనలు చాల గొప్పవి.

జుర్-అత్, రంగీన్‌లు తమ కవిత మీర్ తఖీమీర్‌కు వినిపించి నారట. "చూమాచాటీ" (ఆలింగన చుంబనాదులు) బాగానే చేసుకుంటారు కాని గజల్ చెప్పటం మీచేతకాదు" అన్నాడట. ఇన్షాను అలా అనటానికి వీలు కాదు. అతని గజల్లలో అంతటి అశ్లీలత లేదు. పరిహాస ప్రసంగాల వలన, చతుర సంభాషణ వలన ఆనాటి సాహిత్య పోషకులను అలరించినాడు. సులేమాన్ షికోహ్ దర్బారు లోనూ, నవాబు సాదతలీఖాన్ దర్బారులోనూ ఒక వెలుగు వెలిగి నాడు. సాటికవి గులామ్ హమ్దానీ ముస్హఫీని ఏడిపించటంలోను అతని మిత్రద్వయం అతనికి బాసటగా వుండేది. ముస్హఫీ ముసలి కవి. అతని భార్య పడుచుది. ఆయిద్దరి దిష్టి బొమ్మలు తయారుచేసి అశ్లీల, అసభ్య కవితలు చదువుతూ ఆకవులూ, వాళ్ల శిష్యులూ లఖ్నో వీధుల్లో తిరగటం, సాహిత్య పోషకులనబడే సంపన్నులా తమాషా చూచి సంతోషించటం, ఆనాటి లఖ్నో సంస్కృతి ఎంత పతన దశకు దిగజారిందో తెల్పుతుంది. ఉర్దూ సాహిత్య చరిత్రలో అది మాయని మచ్చ. శ్రుతి మించిన అతని పరిహాస ప్రసంగాలు, వెకిలి చేష్టలు సాదతలీఖాన్‌కు కూడ రోత పుట్టించినవి. దర్బారు ప్రవేశం నిషేధింపబడింది. గృహ నిర్బంధం విధించబడింది. అప్పట్లోనే ఎదిగి వచ్చిన కొడుకు మరణించినాడు. ఇన్షా కొన్నాళ్లు పిచ్చి వాడై చనిపోయినాడు. ఎంత ఆడంబరంగా లఖ్నో ప్రవేశించి ఎంత ఆర్భాటంగా గడిపినాడో అంత అజ్ఞాతంగా అనామకంగా ఈలోకం విడిచిపోయినాడు ఇన్షా.

ఇన్షా ఇతర రచనల గురించి ఇంకోచోట రాస్తాను. ఇక్కడ ఒక గజల్‌లోని ఐదు షేర్లు ఉదాహరిస్తాను. ఈ గజల్ చివరి నాళ్లలో రాసింది.

కమర్ బాంధేహువే చల్నేకు యాఁ సబ్ యార్ బైఠేహైఁ
బొహత్ ఆగే గయే బాఖీ జొహైఁ తయ్యార్ బైఠేహైఁ

"మిత్రులంతా ప్రయాణానికి నడుంకట్టుకొని వున్నారు. చాలామంది ఇప్పటికే వెళ్ళిపోయినారు. మిగిలిన వాళ్లు సిద్ధంగా వున్నారు." (ఈ ప్రయాణం పరలోకానికి).

న ఛేఢ్ అయ్ నిక్హతే-బాదే-బహారీ! రాహ్ లగ్ అప్నీ

తయ్యే అక్సేలియాఁ సూర్ఖెహైఁ హమ్ బేజార్ బైఠేహైఁ

"వసంత పవన సౌరభమా! మాజోలికి రాకు- నీ దారిన నువ్వు వెళ్లు. నువ్వు వయ్యారాలు పోతున్నావు. మేమేమో విరక్తుల మైవున్నాము."

తసవ్వుర్ అర్షపర్‌హై ఔర్ సర్‌హై పాయె సాఖీ పర్

గరజ్ కుఛ్ ఔర్ ధున్‌మే ఇస్ ఘడీ మై ఖ్వార్ బైఠేహైఁ

"ఊహలు స్వర్గాన- శిరస్సులు సాఖీపాదాల మీద- మద్యపాన రతులదో మాదిరిగా, ఏదో ధ్యాసలో వున్నారు."

యె అప్నీచాల్‌హై ఉఫ్తాద్గీ సే అబ్ తో పహెరోంతక్

నజర్ ఆయా జహాఁపర్ సాయయే దీవార్ బైఠేహైఁ

"బలహీనత కారణంగా ఇప్పుడు మా నడక ఎట్లున్నదంటే ఎక్కడ యేగోడ నీడ కనిపించినా గంటల తరబడి అక్కడే కూలబడి పోతున్నాము."

భలా గర్దిష్ ఫలక్ కీ చైన్ దేతీహై కిసే ఇన్షా

గనీమత్ హైకె హం సూరత్ యహాఁదోచార్ బైఠేహైఁ

"ఆకాశ భ్రమణం (గ్రహచారం) ఎవరిని సుఖంగా వుండనిస్తుంది ఇన్షా! ఒకే తరహా మనుషులం నలుగురైదుగురం కూర్చుండ గలిగి నాము- ఇదే గొప్ప."

ఈ ఐదు షేర్ల బందిష్ గమనించానారు గదా!

ఇన్షా 1817వ సంవత్సరాన మరణించినాడు.

◆ ◆ ◆

గులామ్ హమ్దానీ ముస్హఫీ యౌవనం దిల్లీలో గడిపి వయసు మళ్లిన తర్వాత లఖ్నో వెళ్లినాడు. మహాకవులందరిని విన్నాడు. తానూ కవిత రాయటం ప్రారంభించినాడు. అతని అధ్యయనం గొప్పది. పాండిత్యం అగాధమయింది. లఖ్నోలో సులేమాన్ షికోహ్‌ను ఆశ్రయించినాడు. నెలకు ఇరవైయైదు రూపాయలు. ఆ వేతనం చివరికి ఐదు రూపాయలయింది. ఇన్షా, జుర్-అత్, రంగీన్‌లతో సభ్యతకు దూరమైన సాహిత్య కలహం. అప్పటి లఖ్నో నవాబ్ జాదాలు, సంపన్నుల కొడుకులు ముషాయిరాల్లో పాల్గొని వాహ్వాలు పొందటం ప్రతిష్ఠగా భావించేవాళ్లు. అటువంటి వాళ్లు ముస్హఫీ గజల్లను మఖ్తా మార్పించి ఐదు పది రూపాయలు చేతబెట్టి కొనుక్కునేవాళ్లు. అదే అతని జీవనోపాధి. అలా అమ్ముకోగా మిగిలిన

గజల్లు ఎనమిది పెద్దపెద్ద దీవాన్లలో సర్దుకున్నవి. ఏదీ అచ్చయినట్లు లేదు. కొన్ని ఫారసీ గ్రంథాలు రాసినాడు. వాటిలో ఒకటి ఫారసీ కవుల చరిత్ర -ఇంకొకటి ఉర్దూ కవుల చరిత్ర. అవి రెండూ చాల విలువైనవి. ఆతిష్ అంతటి మహాకవి అతని శిష్యుడు.

ముస్హఫీ పేరుఎప్పుడూ మహాకవుల జాబితాలోనే వుంటుంది. అతని లోపమొక్కటే. అంతంత కవిత రాసినా మహాకవులను అనుకరించినాడే కాని సొంత శైలి నిర్మించుకోలేకపోయినాడు. ముస్హఫీ 1824వ సంవత్సరాన మరణించినాడు.

◆ ◆ ◆

ఇన్షా, ముస్హఫీలు ముసలివాళ్లయిన తర్వాత లఖ్నో సాహిత్య సామ్రాజ్యాన్ని మరి యిద్దరు కవులు పాలించినారు. వాళ్లు కూడా పోట్లాడుకున్నారు కాని హుందాగా పోట్లాడుకున్నారు. ఒకరి నొకరు గౌరవించేవాళ్లు. మాట్లాడుకునేవాళ్లుకారు. సభ్యతా సంస్కారాలు కలవాళ్లు. ఒకడు ఇమామ్ బఖ్ష్ నాసిఖ్. ఇంకొకడు ఖ్వాజా హైదరలీ ఆతిష్.

నాసిఖ్ ఎవరి శిష్యుడో తెలియదు. కొందరతడు ముస్హఫీ శిష్యుడన్నారు కాని ఆ మాటకు ఆధారాలు లేవు. ఆతిష్ మాత్రం ముస్హఫీ శిష్యుడు. నాసిఖ్ ఉర్దూ వాగనుశాసనుడు. లఖ్నో భాషను సంస్కరించినాడు. పులిమిన పదాలు తొలగించి నాడు. కటువైన ఉచ్చారణ గల అక్షరాలను కవిత్వభాషకు దూరం చేసినాడు. సుశబ్దాలను, సుందరశబ్దాలను కవిత్వ భాషలో కలిపినాడు. శబ్దాలపై అధికారం కలవాడు. భాషా శాస్త్రం బాగా అధ్యయనం చేసినవాడు. కనుక అతని నిర్ణయాలను లఖ్నో వాళ్లే కాక దిల్లీ వాళ్లు కూడ ఆమోదించినారు. అయితే, అతని గజల్లలో సహృదయులను స్పందింపజేసే గుణం అంతగా వుండదు. శబ్ద సౌందర్యం వుంటుంది. సామెతలు, లోకోక్తులు వుంటాయి.

నాసిఖ్ బ్రహ్మచారి. పహెల్వాన్. అతన్ని నవాబులు, అమీర్లు వేలు, లక్షలు సమర్పించి గౌరవించినారు. హైదరాబాద్ నుంచి రాజా చందూలాల్ రెండుసార్లు పదివేలు, పదమూడువేలు పంపి ఆహ్వానించినాడు. కాని అతడు హైదరాబాదుకు వెళ్ళలేదు. నాసిఖ్ 1838వ సంవత్సరాన మరణించినాడు.

ఆతిష్ ఫకీర్ల కుటుంబానికి చెందినవాడు. అతడు సంపన్నులకు దూరంగా వుండేవాడు. నగరం బయట ఒక కుటీరం. ఒక చిరిగిన చాప. అతని దగ్గరికి

వచ్చే అమీర్లయినా, గరీబులైనా ఆచిరిగిన చాపమీద కూర్చోవలసిందే. అతని అవసరాలు అతిపరిమితం. అతనిది యోద్ధల వేషం. మెలిదిరిగిన మీసాలు. అంగరఖా- జాజు రంగు లుంగీ-నడుముకు వేలాడే పట్కా కత్తి- అతని కవిత భావ గర్భితమయింది. సారవంతమయింది.

ఆతిష్ షేర్లు కొన్ని వినండి;

కుఫ్రొ ఇస్లామ్‌కి కుఛ్ ఖైద్ నహీహై ఆతిష్
షేఖ్ హో యా కె బిరహమన్ హో పె ఇన్సా(హోవే

"కుఫ్ర్, ఇస్లామ్ అనేది ముఖ్యం కాదు. షేఖ్ కానీయండి, బ్రహ్మణుడు కానీయండి- మానవతగలవాడైతే మాననీయుడే."

సఫర్‌హై షర్త్ ముసాఫిర్ నవాజ్ బొహతేరే
హజారహా-షజరే-సాయదార్ రాహ్‌మె హై(

"ఇల్లు విడిచి వెళ్లితే చాలు. పాంథులను ఆదరించే వాళ్లు అనేకులు. బాటకు రెండు వైపులా నీడనిచ్చే చెట్లు వేనవేలు."

హాసిల్ హువాన ఖాక్ భి ఆపస్‌కి నజ్-అసే
దిల్ మే గుబార్ కాఫిరో దీన్దార్ లే చలే

"పరస్పరం వైరం వలన మన్నుగూడా దొరకలేదు- కాఫిరులు, మత విశ్వాసులూ హృదయాల్లో కష్మలం బెట్టుకొని పోయినారు."

బుత్ ఖాన తోడ్ డాలియె మస్జిద్‌కు ఢాయియ్యే
దిల్‌కో న తోడియే యె ఖుదాకా ముఖామ్ హై

"మందిరాన్ని పడగొట్టినా మీ యిష్టం- మసీదును నేలమట్టం చేసినా మీ ఇష్టం. కాని మనసును విరగగొట్టకండి. అది భగవంతుని నెలవు."

రూయె-రోషన్ యార్ కా పేషే-నజర్ హై ఆజకల్
ఆంఖ్ కిస్కీ పడ్తీ హై షమ్సో-ఖమర్ పర్ ఇన్ దినో(

"ఇప్పుడు ప్రియతముని ప్రకాశవంతమైన ముఖమండలం మీద దృష్టి అవగ్నమై వున్నది. సూర్యుని మీదగాని చంద్రుని మీదగాని చూపునిలువదిప్పుడు."

ఆతిష్ 1846వ సంవత్సరాన మరణించినాడు.

◆ ◆ ◆

లఖ్నో మర్సియాలు

మర్సియాలు కర్బలాలో జరిగిన ధర్మ యుద్ధాన్ని గురించి వర్ణించే కావ్యాలు. దకనీ భాషలో మర్సియా రచన చాల ముందే జరిగింది. దిల్లీ కవులు గూడ మర్సియాలు రాసి ధర్మకార్యం నిర్వర్తించినామని సంతృప్తి చెందినారు. కాని అవి మొక్కుబడికి రాసిన రచనలే. వాటిలో కవితాంశ వుండేది కాదు. కవిత్వం రాయాలని ప్రయత్నించి రాయలేనివాళ్లు మర్సియాలు రాసి నారనే లోకోక్తి ప్రచారంలో వుండేది. "బిగ్డా షాయర్ మర్సియాగో". ఆమర్సియాల్లో ఐదారుబందు (Stanza) లుండేవి. మీర్ ఖలీఖ్ మిర్జా జమీర్లు పరస్పర స్పర్ధతో యాభై అరవై బందుల వరకు రాసి లఖ్నో ప్రజల మన్ననలందినారు.

లఖ్నో నవాబులు షియాలు. వాళ్లు మత సహనం కలవాళ్లు గూడా. షియాలకు మొహర్రం గొప్పది. కర్బలా యుద్ధాన్ని స్మరించుకోవటమే మొహర్రం జరుపుకోవటం. దాన్నే పీర్ల పండుగ అంటారు. నిజానికది పండుగ కాదు. పది రోజులు విషాదం పాటించటం. ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ దౌహిత్రాలు ఇమామ్ హుసేన్, అతని అనుయాయులు యజీద్‌తో కర్బలా మైదానంలో యుద్ధం చేసి వీరమణం పొందినారు. అది మొహర్రం నెలలో జరిగింది. లఖ్నోలో పదిరోజుల మొహర్రం ఘనంగా జరిగేది. అందులో ముసల్మానులకంటే హిందువులే అధికంగా పాల్గొనే వాళ్లు. ముస్లిముల ఈదులన్నిటిలో హిందువులు పాల్గొనేవాళ్లు. హిందువుల హోలీ, దీపావళి, గోకులష్టమి, రామనవమిలాంటి పర్వదినాల్లో ముసల్మానులనే కులు ఉత్సాహంగా పాల్గొనేవాళ్లు. మొహర్రం సందర్భాన మర్సియాలు వింటే పుణ్యం. ఏడ్వటం, గుండెలు బాదుకోవటం సంప్రదాయం.

మీర్ ఖలీఖ్ మీర్ హసన్ కొడుకు. అతని కొడుకు మీర్ బబరలీ అనీస్. ఖలీఖ్ తన కొడుకును జమీర్ శిష్యత్వంలోనే వుంచినాడు. మిర్జా సలామతలీ దబీర్ కూడా జమీర్ శిష్యుడు. మళ్లీ అనీస్ దబీర్‌ల మధ్య పోటీ ప్రారంభ మయింది. ఈ స్పర్ధ ద్వేషం కాదు. 'స్పర్ధయావర్ధతేవిద్యా' అన్నట్లు ఈ స్పర్ధ

కారణంగా ఒకరిని మించి ఒకరు మర్సియాలు రాసి వేదికల మీద వినిపిస్తూ మర్సియాకు కవిత్వస్థాయి కలిగించినారు. పాత్రా పోషణ, నవరస పోషణ, ప్రకృతి వర్ణన-అన్నీ అద్భుతమైనవే. మర్సియాలు వందలవేల బందులకు పెరిగి పోయినవి. అనీస్ కవిత ప్రసాద గుణభరితం. దబీర్ కవిత కఠిన పాకాన పడింది. ఇద్దరూ మహాకవులే. అనీస్ 1874లోను, దబీర్ 1875లోను మరణించినారు. అనీస్ కొన్నాళ్లు హైదరాబాద్‌లో వున్నాడు. ఈ ఇద్దరు మహాకవులు మర్సియాను సంపన్నం చేసినారు. మర్సియా రచనలో మళ్లీ అంతటి కవులు పుట్టలేదు.

◆ ◆ ◆

ఉర్దూలో మొదటి ప్రజాకవి

మనం ఇంత వరకు ఖసీదాలు, మస్నవీలు, గజళ్లు రచించిన కవుల గురించి మాట్లాడుకున్నాము. ఈ కావ్య ప్రక్రియలన్నీ ఫారసీలోంచి వచ్చినవి కనుక భారతీయ ఉర్దూ కవులు తమ కవితలో, ముఖ్యంగా గజల్ కవితలో, ఛందస్సు, అలంకారాలు, ప్రతీకలు, పౌరాణిక ఉదాహరణలు ఫారసీ కవులవే ప్రయోగించినారు. ఉర్దూ కవిత గజళ్ల కారణంగానే అశేష ప్రజాదరణకు పాత్ర మంయిందనటం నిర్వివాదాంశం. గజల్ ప్రేమ కవిత. ఈ ప్రేమ భారతీయ మనిపించదు. ప్రేయసి భారతీయ ప్రేయసి కానేకాదు. ప్రతీకలు భారతీయమైనవి కావు. గజళ్లలో భారతీయ వాతావరణం కనిపించదు. గజళ్లలో బుల్బుల్ -గుల్ ప్రస్తావన వుంటుంది. కోయిలలు, పపీహాలు వుండవు. గజల్ కవి ఎప్పుడూ విరహవేదనను వెళ్ళడిస్తుంటాడు. మౌలానా అల్తాఫ్ హుస్సేన్ హాలీ తన 'మొకద్దమ-షేరొషాయిరీ'లో చెప్పినట్లు ఇతర భాషల కవులు ఎంతో దూరం పురోగమించినా ఉర్దూ గజల్ కవి ఉరుల లాంటి ప్రేయసి కురులలో చిక్కుకున్న తన హృదయాన్ని విడిచిపించుకునే ప్రయత్నంలోనే వున్నాడు. ఆమె సౌందర్య వర్ణనలోనే సమస్తం మరచిపరవశిస్తున్నాడు. ప్రేమ తప్ప అతనికింకే విషయం అవసరం కాదు.

దక్కనీ భాషలో ఖులీఖుతుబ్షా తన కవితను కొంత వరకు భారతీయం చేసినాడని తెలుసుకున్నాము. కవిబ్రహ్మ మీర్ కంటే మొదటి వాళ్ళయిన ఫాయెజ్,

నాజీ అనే కవులు కూడ తమ గజళ్లలో భారతీయతను మేళవించినారు. గజల్ కవికి కొన్ని కట్టుబాట్లుంటాయి. ఏది చెప్పినా ఆ కట్టుబాట్లకు లోబడే చెప్పాలె. గజల్‌ను వదలి పెడితే గాని కవి తానుచెప్పదలచుకున్నది స్వేచ్ఛగా చెప్పలేడు. గజళ్లను ఉద్దేశపూర్వకంగ్గా వదలిపెట్టి ఇంగ్లీషు కవుల వలె ప్రకృతి వర్ణన కోసం నజములను ఎన్నుకున్న కవి అల్తాఫ్ హుస్సేన్ హాలీ. అతని సమకాలీనులు మొహమ్మద్ హుసేన్ ఆజాద్, ఇస్మాయిల్ మీరఠీలు కూడా నజములు రచించి ఉర్దూ కవితలో విప్లవం తెచ్చినారు. అయితే, పైన పేర్కొన్న ముగ్గురు కవుల కంటే ముందే వాళ్ళకంటే ఎన్నో రెట్లు అధికంగా భారతీయ ప్రకృతి వర్ణనే కాక భారతీయ సమాజాన్ని అన్ని కోణాల్లోంచి వర్ణించిన దొడ్డకవి ఒకడున్నాడు. అతడు ప్రజల్లో జీవించి ప్రజల సుఖదుఃఖాలను, ఖేదమోదాలను కళ్ళకు కట్టినట్లు వర్ణించిన నిజమైన ప్రజాకవి. అతని పేరు షేఖ్ వలీ మొహమ్మద్ నజీర్. అతడు ఆగ్రానగరంలో జీవితం గడిపినాడు. అక్బర్ చక్రవర్తి కొన్నాళ్ళు ఆగ్రాను తన రాజధానిగా చేసుకున్నాడు కనుక ఆ నగరాన్ని అక్బరాబాద్ అని కూడా అనేవాళ్ళు. ఆగ్రాలో జీవితం గడిపిన ఆ ప్రజాకవి నజీర్ అక్బరాబాదీగా ప్రఖ్యాతుడైనాడు.

మౌలానా మొహమ్మద్ హుసేన్ ఆజాద్‌ను 'నవ్యకవితా నిర్మాత' అన్నారు. ఆనాటి సాహిత్య విమర్శకులు. అతని సమకాలీనుడైన హాలీని అలాగే అన్నారు. ఆజాద్ లాహోర్‌లో 'అంజుమనె-పంజాబ్' అనే సంస్థను స్థాపించి, "మన కవిత కొన్ని విషయముల వరకే పరిమితమైవున్నది. మనపూర్వులు గొప్ప రచనలే చేసినారు. కాని మనం వాళ్ళు త్రొక్కిన త్రోవనే త్రొక్కుతూ వారి ఉచ్ఛిష్ట సేవనమే చేస్తున్నాము. మన ముందున్న క్రొత్త సమస్యలవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు" అని గంభీరోపన్యాసం చేసినాడు 1867లో. మళ్లీ 1874లో "మనం కోకిల, చంపకం, తీగమల్లె, అర్జునుడు, భీముడు, గంగ, యమున, హిమాలయం మొదలైన వాటిని బొత్తిగా విస్మరించినాము. ఇప్పుడు వాటి వైపు శ్రద్ధ చూపవలసి వున్నది" అన్నాడు. హాలీకూడా "అంజుమనె-పంజాబ్" లో సభ్యుడైనాడు. అతడూ అలాటి మాటలే అన్నాడు. అంతకంటే అరవై డెబ్బైయేళ్ల క్రిందటే నజీర్ అక్బరాబాదీ అదంతా విరివిగా, విశేషంగా కవితాబద్ధం చేసినాడు. ఆ సంగతి వాళ్ళకు తెలియదనుకుందామా? తెలుసు. కాని వాళ్ళతన్ని అంతగా చదువలేదు. చదివినా 'గ్రామ్య కవిత' అనే చులకన భావంతోనే చదివినారు కాని ఆదరంగా చదువలేదు. ఆనాటి విమర్శకులూ చదివి వుండరు. చదివి వుంటే ఆజాద్‌ను 'నవ్య కవితా నిర్మాత' అని ఎందుకంటారు?

జోఖ్, గాలిబులు సమకాలీనులుగదా. ఆజాద్ జోఖ్ శిష్యుడు. హాలీ గాలిబ్ శిష్యుడు. గాలిబ్ శిష్యుడు కాక ముందు హాలీ కొన్నాళ్లు తన కవిత షేఫ్తా చేత దిద్దించుకున్నాడు. షేఫ్తా కూడా గాలిబు శిష్యుడే. అయినా గాలిబతన్ని చాలా గౌరవించేవాడు. షేఫ్తా సాహిత్య మర్మజ్ఞుడని గాలిబు అభిప్రాయం. షేఫ్తా ఫారసీలో ఒక తజ్కిరా రాసినాడు. దాని పేరు "గుల్షనె-బేఖార్." తజ్కిరా అంటే కవుల చరిత్ర. కొన్ని పంక్తులు ఉదాహరించి కవుల సంక్షిప్త పరిచయం చేయబడు తుందందులో- షేఫ్తా తన తజ్కిరాలో నజీర్ అక్బరాబాదీని కూడా చేర్చినాడు. చేర్చక తప్పని పరిస్థితి. ఆ కాలంలో ఆగ్రాలోనేమి, దిల్లీలోనేమి సాధువులు, ఫకీర్లు, బిచ్చగాళ్లు నజీర్ కవితను రాగయుక్తంగా పాడుతూ వాడవాడల తిరుగుతుండేవాళ్లు. అంతటి ప్రజాభిమానం పొందిన కవిని ప్రస్తావించకుండా వుండలేడుగదా. "అలగా జనంలో తిరుగుతూ గ్రామ్య భాషలో కవిత చెప్పిన సామాన్యకవి." అని ప్రస్తావించినాడు. షేఫ్తా ఉన్నత వర్గానికి చెందిన నవాబు. అతని అభిప్రాయం సరికాదని ఎవరనగలరు? నజీర్‌ను కవిగా అంగీకరించటానికి ఆజాద్ మనస్సు అంగీకరించలేదు. హాలీ మనస్సు అంగీకరించలేదు.

ఆజాద్ ఉర్దూలో 'ఆబె-హయాత్' అనే కవుల చరిత్ర రాసినాడు. ఆబె-హయాత్ అంటే అమృతం. ఆజాద్ చాలా మంది కవులకు అమృతం పోసినాడు. కొందరిపట్ల ఉదాసీనంగా వున్నాడు. అనవసరంగా నజీర్ ప్రస్తావన తెచ్చి, "నజీర్ షేర్లు కొన్ని మీర్ షేర్ల వలె వుంటాయి. తెలియని వాళ్ళు అతన్నీ మహాకవి అనుకునే ప్రమాదం ఉన్నది" అని రాసినాడు. మీర్‌లాగా రాయటమేగొప్ప. అలా రాసిన వాణ్ణి మహాకవి అనుకుంటే ఆజాద్ సొమ్మేమి పోయింది? అలా వుంటాయి సాహిత్య ద్వేషాలు.

ఆజాద్, హాలీలు గొప్పవాళ్ళే. తమకు మార్గదర్శకుడు నజీర్ అక్బరాబాదీ అని నిజాయితీగా చెప్పి వుంటే ఇంకా గొప్పవాళ్ళయి వుండేవాళ్ళు.

శిష్ట కవులు కవిగా గుర్తించనందున అనామకంగా వుండిపోయిన నజీర్ అక్బరాబాదీ ప్రొఫెసర్ అబ్దుల్ గఫూర్ షహబాజ్ పుణ్యాన సాహిత్య లోకంలో ప్రజాకవిగా ప్రసిద్ధిగాంచినాడు.

ఔరంగాబాద్ కాలేజీలో పనిచేసిన ప్రొఫెసర్ అబ్దుల్ గఫూర్ షహబాజ్‌కు నజీర్ అక్బరాబాదీ వ్యక్తిత్వాన్ని గురించి, జీవిత విశేషాలను గురించి ఆసక్తి కలిగింది. అతడు నజీర్ కవిత విన్నాడు. లభ్యమైనంత చదివినాడు. ఇంకా సంపాదించాలనే అన్వేషణలో పడ్డాడు. హాలీ అంతటి వానికి నజీర్ పట్ల ఏర్పడిన తేలిక భావం

అతనికి ఆశ్చర్యం కలిగించింది. నవ్యకవితా నిర్మాతల కవిత కంటే నజీర్ కవిత తక్కువది కాదు. పైగా వాళ్ళకంటే విస్తృతమైన సహజ వర్ణన నజీర్ కవితలో కనిపించింది. ఉర్దూ సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానం పొందవలసిన కవిని ఛాందసులు, సంప్రదాయ వాదులు సరుకు చేయకపోతే ఆశ్చర్యం కాదు. అభ్యుదయ వాదులు అలక్ష్యం చేయటం ఆశ్చర్యం కలిగించింది. బాధ కూడా కలిగింది. నజీర్ జీవిత విశేషాలను సేకరించటానికి, అలభ్యమైన నజీర్ కవితను సంపాదించటానికి చాలా చోట్లకు వెళ్ళినాడు. ఉర్దూ సాహిత్య ప్రచురణలో ఖ్యాతి గాంచిన మున్షీ నవల్ కిశోర్‌ప్రెస్ లఖ్నోలో అతనికొక సన్నటి వెలుగు రేఖ కనిపించింది. ఆ ప్రెస్సులో పనిచేసే ఒక వృద్ధ వ్యక్తి వలన నజీర్ తరచుగా ఫరుఖాబాద్‌కు వెళ్తుండేవాడని తెలుసుకున్నాడు. ప్రొఫెసర్ ఫరూఖాబాద్‌కు వెళ్ళి ఎలాగో ప్రయాసపడి అక్కడ 1891లో నజీర్ మనుమరాలును కలుసుకోగలిగినాడు. ఆ వృద్ధురాలు తల్లి నజీర్ కూతురు. ఆమె పేరు విలాయతీబేగం. ఆమె తన తాతగారి గురించి తానెరిగిన చాలా విషయాలు చెప్పింది. అంతేగాక తాతగారి అముద్రిత రచనలు ఎవరెవరి దగ్గర వుండే అవకాశం ఉన్నదో ఆ సమాచారం కూడా అందించింది. ప్రొఫెసర్ షహబాజ్ అందరినీ ఆశ్రయించి దొరికినంత కవిత సేకరించుకున్నాడు. 425 పుటల పీఠికతో 1100 పుటల కవిత చేర్చి 1900 లో 'జిందగానీ బేనజీర్' అనే పేర ప్రచురించినాడు. నజీర్ అక్బరాబాదీని మళ్లీ బ్రతికించినాడు. నజీర్ కవితలోని అందాలను తన పీఠికలో ఎత్తి చూపినాడు. అంతేకాక నజీర్ కవే కాడనే వాళ్ళ వాదనను తనవాద పటిమతో ఖండించినాడు. తర్వాత 22 ఏళ్ళకు, అంటే 1922లో మఖ్మూర్ అక్బరా బాదీ "రూహె-నజీర్" అనే పేర నజీర్ కవితను ప్రచురించి ఉపోద్ఘాతంలో క్రొత్త విమర్శ పద్ధతిలో అతని కవితలోని విశిష్టతను వల్లడించినాడు.

ఆ తర్వాత ఎందరో సాహిత్య విమర్శకులు నజీర్ కవిత గురించి రాసినారు. ఎవరు ఏది రాసినా అదంతా ప్రొఫెసర్ షహబాజ్ సంకలనం లోంచి గ్రహించిందే. ప్రొఫెసర్ షహబాజ్ సేకరించిన అంశాలను క్రమంగా పాఠకుల ముందుంచుతాను.

ప్రొఫెసర్ షహబాజ్, విలాయతీబేగం నోట విన్న మాటలను, ఆగ్రాలోని వృద్ధులు చెప్పిన విశేషాంశాలను, ఆగ్రా, మధురా, బృందావన్‌లలో తిరుగాడే వృద్ధులైన ఫకీర్ల, బిచ్చగాళ్ల, సాధుల ముచ్చట్లను, నజీర్ కవితల్లో వర్ణితాలయిన విషయాలను కలగలిపి, తన ఊహలను, కల్పనలను చేర్చి నజీర్ జీవితాన్ని

ఆనాటి సాలంకారిక భాషలో కథలాగా చిత్రించినాడు. అది చదువదగింది. దాని సారాంశం మనవి చేస్తాను.

దిల్లీ నగరాన, 1735వ సంవత్సరంలో మొహమ్మద్ ఫారూఖ్ దంపతులకు పదమూడవ సంతానంగా జన్మించినాడు వలీ మొహమ్మద్. అతని కంటే ముందు జన్మించిన పంద్రెండుగురు పిల్లలు చనిపోయినారు. సంతానం దక్కని ఆనాటి తల్లిదండ్రులేమేమి చేసేవాళ్లో ఫారూఖ్ దంపతులవన్నీ చేసినారు. సాధు సంతులను, పీర్ ఫకీర్లను ఆశ్రయించినారు. మజార్ షరీఫుల్లో మన్నతులు కట్టినారు. దుష్టశక్తులనుతొలగించుకోవటానికి గండాలు, తావీజులు, మంత్రాలు, తంత్రాలు-అన్నీ చేసినారు. ఒక ఫకీరు ఆశీర్వాదం వలన జన్మించిన వలీ మొహమ్మద్‌కు ముక్కు చెవులు కుట్టించి పోగులు వేలాడ దీసినారు. ఆ ఫకీరు "అల్లాను నమ్మండి. మీ యీ పుత్రుడు నూరేళ్లు జీవిస్తాడు. పుష్పంలాగా వికసించి తన సువాసనలను నలువైపుల వెదజల్లుతాడు. కీర్తివంతుడవుతాడు. ఇతని వలన మీకూ మీ వంశానికీ చిరకీర్తి లభిస్తుంది." అని చెప్పి ఆశీర్వదించి పంపినాడు.

ఫారూఖ్ దంపతులు మరీ ధనవంతులు కాకున్నా కలవాళ్లే. పుత్రోత్సవం వేడుకలన్నిటిని ప్రొఫెసర్ షహబాజ్ నజీర్ కవితల్లోంచే వెదికి పట్టుకున్నాడు. పోగాపోగా దక్కిన సంతానం కనుక తల్లిదండ్రులువలీ మొహమ్మద్‌ను అల్లారు ముద్దుగా పెంచినారు. ఆడింది ఆట. పాడింది పాట. అన్ని ఆటల్లోనూ అతనికి గల అభిరుచి అతని కవితల్లో పలుచోట్ల కనిపిస్తుంది. యమునా నదిలో ఈత, గాలి పడగలాట, పావురాల పోటీ, గుర్రపు స్వారి, కర్రసాము, కత్తిసాము- అన్నిటిలో నిష్ణాతుడైనాడు వలీ మొహమ్మద్. చదువులోనూ వెనకబడలేదు. ఆనాడు అవసరమైన చదువులన్నీ నేర్చినాడు. సంగీతం అబ్బింది. కవిత అల్లటం నేర్చుకున్నాడు. కలం పేరు నజీర్. కవితలో గురువులెవరో తెలియదు.

వలీ మొహమ్మద్ నజీర్ ఇరవైరెండేళ్ళ జీవితం దిల్లీలోనే గడిపినాడు. అతని నాలుగవ యేట నాదిర్షా దిల్లీని కొల్లగొట్టి నరమేధం జరిపినాడు. 1748-56 మధ్య అహ్మద్ షా మూడు దండయాత్రలు జరిపినాడు. మొగలాయి సామ్రాజ్యం పూర్తిగా జవసత్వాలు లేనిదైంది. దిల్లీ శ్రీహీనమైపోయి -దిల్లీ ప్రజలు తలోవైపు వలసపోయారు. నజీర్ తన తల్లితో, అమ్మమ్మలతో కలిసి ఆగ్రాకు వలస వెళ్ళినాడు. అతని జీవితమంతా ఆగ్రాలోనే గడిచింది. ఆగ్రాలో నజీర్ ఉపాధ్యాయ వృత్తిని అవలంబించినాడు. ఖానీ పాఠశాలలు - ఆ కాలాన ఆగ్రాలో ఇద్దరే సుప్రసిద్ధులైన ఉపాధ్యాయులు -ఒకడు ఖలీఫా మొఅజ్జమ్; రెండవ వాడు మియానజీర్. నజీర్

ఉపాధ్యాయుడే కాక కవి గూడానాయె. అప్పటి కవుల లాగా మొదట్లో గజల్లే చెప్పేవాడతడు. అతని గజల్లు సరళ సుందరమైనవి. అతనికి మహాకవి మీర్ తఖీమీర్ సారళ్యమూ, ప్రసన్నతా అలవడ్డవి. కొన్ని షేర్లు మీర్ షేర్ల వలెనే వుంటాయి. ఆ మాటే అన్నాడు 'ఆబె- హయాత్' రచయిత మౌలానా మొహమ్మద్ హుసేన్ ఆజాద్. ఆ మాట అని గూడా నజీర్‌ను కవిగా అంగీకరంచలేడతడు. మీర్ మహాకవే కాక కవితా మర్మజ్ఞుడు. నజీర్ పడుచువాడు. మీర్ వృద్ధుడు. ఆగ్రాలో జరిగిన ఒక ముషాయిరాలో మీర్ మహాకవి సమక్షంలోనే నజీర్‌ను చెంతకు పిలిచి, వెన్నుచరచి, 'ఉమ్రత్ దరాజ్‌బాద్' (దీర్ఘాయుష్మాన్ భవ) అని ఆశీర్వదించినాడు. మీర్ మెప్పుపొందటం మాములు విషయం కాదు. ఆనాటి మహాకవులు అతని మెప్పు పొందాలని ఆరాటపడేవాళ్ళు. ఆగ్రా నగరంలోని సాహితీపరులకు, సంపన్నులకు ఆ వార్త అందింది. నజీర్ యువకుడు. శరీర దారుఢ్యంగల అందగాడు. పైగా కవి. కవి అంటేసామాన్య కవి కాడు. మీర్ మెప్పు పొందిన కవి. అబ్దుర్రహమాన్ ఖాన్ చొగ్తాయి అల్లుడు మొహమ్మద్ రహ్మాన్ ఖాన్ తన కుమార్తె తహవరున్నిసా బేగంతో నజీర్ వివాహం జరిపించినాడు. మామా అల్లుల్లయిన ఆ ఖానులిద్దరు సంపన్నులే కాక సారస్వత రసికులు. నజీర్ కొక కొడుకు. పేరు గుల్జారల్ అసీర్. ఒక కూతురు. పేరు ఇమామీ బేగం. ఇమామీ బేగం కూతురే విలాయతీ బేగం. ప్రొఫెసర్ షహబాజ్‌కు నజీర్ జీవిత విశేషాలు ఆమే చెప్పింది. అతని నౌకర్లను, దాసీలను, గుర్రపు సాయిస్‌ను గురించి కూడా చెప్పింది. నజీర్ చాలా సామాన్య జీవితం గడిపినాడు. చిన్న యిల్లు. పెద్ద వాకిలి. వాకిట్లో ఒకచోట పెద్ద రేగు చెట్టు, వేపచెట్టు దగ్గర దగ్గరే వుండేవి. వాటి క్రింద జనపనార తివాసీ. దాని మీద కూర్చుండే అతడు పిల్లలకు పాఠాలు చెప్పేవాడు. కవిత్వం సాహితీ మిత్రులతో, అభిమానులతో, శిష్యులతో అక్కడే సాహిత్య గోష్టి జరిపేవాడు. సాంఘిక పరిస్థితులను చర్చించేవాడు. అతన్ని కవిగానే గుర్తించని వాళ్ళు అతని పాండిత్యాన్ని శంకించినారు. కాని అతని కవిత చదివిన వాళ్ళకు అతనికి ఫారసీలో మంచి పాండిత్యం వుండేదని, సంస్కృతం, బ్రజభాష, మర్వాడీ, పంజాబీ భాషలలో మంచి పరిచయం కలవాడని తెలుస్తుంది. తన రూపురేఖలను గురించి తానే రాసుకున్న ఒక కవితలో తనకు అరబీ అంతగా రాదని చెప్పుకున్నాడు. కనుక విమర్శకులతనికి, అరబీ అంతగా రాదని తేల్చి చెప్పినారు. అతని సమస్త కవితలను, (దొరికినంతవరకు) అతని ఫారసీ వచన రచనలను పరిశీలించిన ప్రొఫెసర్ షహబాజ్ అతని పాండిత్యం అసామాన్యమయిందని, అతని ప్రకృతి పరిశీలన సునిశితమయిందని, అతని లోకానుభవం అపారమయిందన, అతని

కవితా ప్రవాహం అప్రతిహతమయిందని, అతని అరబీ భాషా పరిజ్ఞానం సంపన్నమయిందని, అతడు ప్రయోగించిన కొన్ని పద బంధాలూ పదాలూ తర్వాత పరిహరింపబడినవి కాని అతని కాలంలో వ్యవహారంలో వుండేవని, అతని పడుచునాళ్ళ కవితలో కనిపించే అసభ్యత అతని కాలాన సామాన్య జన ప్రయోగంలో వుండేదని రాసినాడు. ఏ కవిత ఎవరి అభిరుచికి అనుగుణంగా రాసేవాడో వాళ్ళ భాషనే ప్రయోగించటం నజీర్ ప్రత్యేకత.

నజీర్‌కు నజముల రచనలోనే కాని గజల్ రచనలో ప్రావీణ్యం లేకుండెననే విమర్శకులకు ప్రఖ్యాత సాహిత్య విమర్శకుడు మిర్జా ఫర్హతుల్లాబేగ్ సరైన సమాధానాలిచ్చినాడు. ప్రొఫెసర్ ఎంత ప్రయత్నించినా సంపాదించలేని గజల్లను మిర్జా ఫర్హతుల్లా బేగ్ సంపాదించి ప్రచురించినాడు. నజీర్‌కు పూర్వకవుల (ఫారసీ, ఉర్దూ కవుల) కవితల మీద తజ్మీన్లు రాయటం, వర్ణనాత్మకమైన కవిత ఖమ్సాల్లో (పంచపది) ముసద్దస్‌లలో (షట్పది) ముసమ్మన్‌లలో (అష్టపదులు) చెప్పటం ఇష్టం- ఖమ్సాలయితే చివరి చరణం, ముసద్దస్ ముసమ్మన్‌లయితే చివరి రెండు చరణాలు పాటకు పల్లవి లాగా పునరావృతాలవుతవి. కాబట్టి వాటిని పాడుకోవటం సులభం.

ఆగ్రా నగరంలో అతనికి చాలా గౌరవాభిమానాలు లభించినవి. పిల్లలు, పెద్దలు, స్త్రీలు, బీదవాళ్ళు, సంపన్నులు, ముసల్మానులు, హిందువులు, అన్య మతస్థులు అంతా అతన్ని ప్రేమించేవాళ్లు. అతడూ ఆగ్రాను, ఆగ్రా ప్రజలను అంతగానే ప్రేమించినాడు. ఆగ్రా విడిచి ఎక్కడికి వెళ్ళేవాడు కాడు. కొన్ని రోజులు మధురలో కొందరికి పాఠాలు చెప్పి వచ్చేవాడు. కొన్ని రోజులు ఒక ఖిలేదార్ కొడుకులకు, కొన్ని రోజులు ఒక నవాబు కొడుకులకు, చాలా నాళ్లు రాజా బిలాస్ రాయ్ కొడుకులకు చదువు చెప్పినాడు. బిలాస్ రాయ్ కొడుకులు ఆరుగురు. వారన్ హేస్టింగ్స్‌కు శత్రువైన కాశీరాజు కొడుకు కూడా నజీర్ శిష్యుడే. మిర్జా గాలిబ్ బాల్యం ఆగ్రాలో మాతా మహునింట గడిచింది. కనుక అతడు కూడా మియా నజీర్ దగ్గర చదివినాడని, తన తొలినాళ్ల కవిత దిద్దుంచుకునే వాడని బాతిన్ తన "గుల్షనె-బేఖిజాఁ" లో రాసినాడు. అందులో చాలా అతిశయోక్తులున్నందున అతని వాదాన్ని అప్పటి సాహితీపరులు ఖండించినారు. మౌలానా హాలీ తీవ్రంగా ఖండించినాడు. ప్రొఫెసర్ షహబాజ్ మాత్రం గాలిబ్ కొన్ని రోజులయినా మియా నజీర్ శిష్యుడై వుంటాడనే అభిప్రాయపడ్డాడు. మిర్జా గాలిబు కొన్ని గజల్లలో

మియా నజీర్ గజల్ల ఛాయలు కనిపిస్తాయి. అయితే మిర్జా గాలిబు కఠిన శైలిని అభిమానించే వాడు. మియా నజీర్ సారళ్యాన్ని ప్రేమించే వాడు. కనుక వాళ్ళ గురుశిష్య సంబంధం చాలా కాలం నిలువ లేదని షహబాజ్ అభిప్రాయం.

మియా నజీర్ జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించినాడు. అదంతా అతని కవితల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అతని కవితలు చాలా వరకు అతని జీవితానుభవాలే. అతని కవితల్లాగే అతని జీవితమొక ప్రవాహం. అయినా అతని సౌశీల్యాన్ని, సంస్కారితను అతని శత్రువులు కూడా శంకించలేదు. అతడు ఆజాత శత్రువే. అతనికి శత్రువులు లేరు. అతని కవితను కటువుగా విమర్శించిన సాహిత్య విమర్శకులనే శత్రువులన్నాను. అతని కవితను 'అలగా జనం నోళ్ళలో మెదిలే గ్రామ్య కవిత' అని నిరసించిన నవాబు ముస్తఫాఖాన్ షేఫ్తా కూడా తన 'గుల్షన-బేఖార్' అనే తజ్కిరాలో నజీర్ స్వభావ శీలాలను చాలా ప్రశంసించినాడు.

హజ్రత్ అలీని పలు చోట్ల ప్రస్తుతించి నందువలన అతడు షియా అనుకోవలసి వస్తుంది. అతని తండ్రి సున్నీ ముసల్మాను. హజ్రత్ సలీమ్ చిష్తీ ప్రశంసలో రాసిన కవితలు సున్నీ యోగుల పట్ల అతనికి గల భక్తిని షియా సున్నీల అభేద భావాన్ని వ్యక్తం చేస్తాయి. షబే బరాత్, ఈదుల్ఫితర్ వంటి ముస్లిముల పర్వదినాల నెంత ఉల్లాసంగా వర్ణించినాడో బసంత్, హోలీ, దీవాలీ లను, కృష్ణజననాన్ని, కృష్ణ వివాహాన్ని, బలరాముని మేళాను, మహాదేవిని పెళ్ళిని, భైరవున్ని, దుర్గాను, నర్సీ మెహతాను, గురునానక్‌ను అంతే ఉల్లాసంగా వర్ణించి నాడు. సర్వమత సమానత్వం అతని మతం. మానవ ప్రేమ అతని ధర్మం. అతని కవితలో సూఫీ భావాలున్నా అతడు సూఫీయోగికాడు. దార్శనికుడు కాడు. ఉపదేశకుడు కాడు. సమాజ సంస్కర్తకాడు. అతడు కవి మాత్రుడే.

నజీర్ కీర్తి కాంక్ష కలవాడు కాడు, ధనాపేక్షకలవాడు కాడు. బడి పంతులుగా దొరికే డబ్బుతో తృప్తిగా, సంతోషంగా జీవితం గడిపినాడు. భరత్‌పూర్ రాజా తన ఆస్థాన కవిగా వుండవలసిందని ఆహ్వానిస్తే "నేను ప్రజల నడుమ వుండి ఏదో కలం గిలిపేవాణ్ణి. ఆస్థానంలో వుండవలసిన కవిని కాను" అని చెప్పి పంపినాడు. లఖ్నో నవాబు వాజిదలీషా మూడు వేల రూపాయలు పంపి ఆహ్వానిస్తే ఆ డబ్బు త్రిప్పి పంపినాడు. అత్రిప్పి పంపటాన్ని గురించి కొన్ని కథలు చెప్తారు. అవి మనకిప్పుడు అవసరం కావు. తొంభైయేళ్ళ వయసులో అతనికి పక్షవాతం వచ్చింది.

మూడేళ్ళు పక్షవాతంతో మంచం పట్టి 1830వ సంవత్సరంలో మరణించినాడు. అతని శవం మీద సున్నీ శిష్యులు వాళ్ళ పద్ధతిలో, షియా శిష్యులు వాళ్ళ పద్ధతిలో నమాజె-జనాజా చేసినారు. అతని శవాన్ని ఆ రేగు చెట్టు, వేప చెట్టు క్రిందనే సమాధి చేసినారు. ప్రతి సంవత్సరం సర్వమతాల వాళ్ళు ఉర్సు జరుపుకుంటారు. అతని హిందూ శిష్యులు శవం మీద గుడ్డను దహనం చేసినారట. ఆగ్రా ప్రజలు అతని సమాధిని రెండవ తాజ్‌మహల్ అనే వాళ్లు. అతని సమాధి తాజ్‌మహల్ సమీపాన మొహల్లా- తాజ్‌గంజ్‌లోనే వున్నది.

ఆగ్రా నగరం పట్ల ఆ మహాకవికి గల అనుబంధాన్ని వివరించే నాల్గు పంక్తులు ఉట్టంకించి, తర్వాత అతని వివిధ కవితల్లోని కొన్ని కొన్ని భాగాలు ఉదాహరిస్తాను.

ఆషిఖ్ కహో, అసీర్ కహో ఆగ్రేకా హూఁ
ముల్లా కహో, దబీర్ కహో ఆగ్రేకా హూఁ
ముఫ్లిస్‌కహో, ఫకీర్ కహో ఆగ్రేకా హూఁ
షాయర్ కహో, నజీర్ కహో ఆగ్రేకా హూఁ

"ప్రేమికుడనండి. ప్రేమపాశబద్ధుడనండి. ఏమన్నా ఆగ్రావాన్ని
పండితుడనండి. విద్వాంసుడనండి. ఏమన్నా ఆగ్రావాన్ని.
పేదవాడనండి. ఫకీరనండి. ఏమన్నా ఆగ్రావాన్ని.
కవి అనండి నజీర్ అనండి. ఏమన్నా ఆగ్రావాన్ని."

◆ ◆ ◆

మీర్ తఖీమీర్ మెప్పుపొందినప్పటికీ మియానజీర్ ఏ ఆస్థానంలోనూ కవిగా వైభవోపేతమైన జీవితం గడపటానికి ఇష్టపడలేదు. కొన్ని గజల్లు చెప్పినందువలన కొందరయినా అతన్ని కవిగా గుర్తించి అతని పేరు తమ తజ్కిరాల్లో చేర్చుకున్నారు. అతని కుల్లియాత్‌లో చేర్చబడిన కవితలు ఆ కాలపు కవుల దృష్టిలోను, సాహిత్య విమర్శకుల దృష్టిలోను, కవితలే కావు. ఈ కాలంలో అవి శ్రేష్ఠ కవితలు. నజీర్‌కు గజల్ రచనకంటే వర్ణనాత్మకాలైన నజములు రాయటంలోనే ఆసక్తి మెండు. అతని ఆసక్తికి తగిన కవితలను ఆదరించేవాళ్లు ప్రజలేకాని ప్రభువులు కారు. కాబట్టి అతడు ప్రజల్లోనే వుండిపోయినాడు.

నజీర్ బండిపంతులు- అతని కవితా రచన సంప్రదాయబద్ధంగా జరుగనట్లే అతని విద్యాబోధన కూడా సంప్రదాయబద్ధంగా సాగలేదు. ఆటపాటలతో, ప్రకృతి పరిశీలనతో, సమాజ దర్శనంతో చదువు చెప్పటం అతని పద్ధతి. ఉడుతపిల్ల, ఎలుగుబంటి పిల్ల, కొండచిలువ పిల్ల, దోసకాయ, తర్బూజా, నారింజ, విసనకర్ర, నూల లడ్డూ, వర్షాకాలపు వర్ణన, బురదలో జారిపడటం, చలికాలం, తుఫాను, చీకటి రాత్రి- ఈలాంటి విషయాల గురించి కవిత చెప్పటం పిల్లలకోసమే. 'కాదేదీ కవితకనర్హం' అని శ్రీశ్రీ అన్నమాటను అంతకు వందేళ్ల ముందే నజీర్ ఆచరణలో పెట్టినాడు. చిత్రమేమంటే ఆనాడు సంప్రదాయ నిష్ఠగలవాళ్లకు నచ్చని అతని విద్యాబోధన పద్ధతి నేడు సరైనదిగా భావించబడుతున్నది. ఆనాటి సాహిత్య విమర్శకులకు నచ్చని అతని కవిత నేడు అవసరమైనదిగా భావించబడుతున్నది. అంటే, మియా నజీర్ క్రాంతి దర్శనుడైన కవి. (మియా అనే శబ్దం శ్రేష్ఠ వాచకం)

మియా నజీర్ అనుభవ వేదాంతి. తన కవితలలో తన అనుభవాల సారాంశాన్నే చెప్పినాడు కాని తాత్త్విక, ధార్మిక గ్రంథాల సారాంశాన్ని చెప్పలేదు. చాలా చోట్ల ప్రజల సామెతలను, లోకోక్తులను ప్రయోగించి వాళ్లకు తెలిసిన విషయాలనే కవిత్వంలో చెప్పినాడు. దక్షిణాది ప్రజలు అన్నం తింటారు. ఉత్తరాది ప్రజలు రొట్టెలు తింటారు. ఖానాఖాయా (అన్నం తిన్నాను) అని దక్షిణాది వాళ్లంటే, రోటీఖాయా అని ఉత్తరాది వాళ్లంటారు. -పప్పు బియ్యం కోసం దక్షిణాది వాళ్లు ప్రయాసపడితే ఉత్తరాది వాళ్లు దాల్-ఆటా (పప్పు-పిండి) కోసం ప్రయాసపడతారు.

ఆటా- దాల్‌కీ ఫిలాసఫీ అనే అతని సుదీర్ఘ పంచపదుల్లోని ఒక బంద్ (స్టాంజా)వినండి:

క్యాకహూఁ నఖ్షామైయారో ఖల్క్‌కే అహ్వాల్‌కా
అహలె-దౌలత్ కాచలన్ యా ముఫ్లిసో కంగాల్ కా
యే బయాఁతో వాఖయీహై హర్‌కిసీకే హాల్‌కా
క్యాతవంగర్, క్యాగనీ, క్యాపీర్ ఔర్ క్యాబాల్‌కా
సబ్‌కె దిల్‌కో ఫిక్ర్ హై దిన్‌రాత్ ఆటే- దాల్‌కా

ప్రతిబంద్ చివర "సబ్‌కెదిల్‌కో" అనే చివరి చరణం ఆవృతమవుతుంది. భావార్థం ఇలా చెప్పవచ్చు;

"మిత్రులారా! ప్రజల పరిస్థితినెలా వర్ణించను? డబ్బున్న వాళ్ల ప్రవర్తనను, దీన దరిద్రుల ప్రవర్తనను ఎలా వర్ణించను? ధనవంతుడైనా, సంతుష్టుడైనా,

గురువైనా, శిష్యుడైనా- అందరి పరిస్థితి ఒకేలాంటిది. అందరి మనస్సుల్లోనూ రాత్రింబవళ్లు పప్పు పిండి ఎలా సంపాదించాలన్న చింతే."

పీర్ అంటే వృద్ధుడు- బాలక్ అంటే బాలుడు. కాని నజీర్ కవితలో పీర్ బాలక్ అనే పదాలు గురుశిష్యుల కోసమే ప్రయోగింపబడినవి.

రోటీకీ ఫిలాసఫీ అనే పంచపదుల మాలలోని కొన్ని బందులు వినండి. నజీర్ దృష్టి చాలా విశాలమైంది. కాబట్టి వర్ణ్య విషయాల పట్టిక ఏ కవితలోనూ సుదీర్ఘమయిందే. ధనవంతులు, బీదలు, పండితులు, పామరులు, జ్ఞానులు, అజ్ఞానులు, వృత్తి పనివాళ్లు, రాజులు, అమీర్లు, సైనికులు, వ్యాపారం చేసేవాళ్ళు, కర్షకులు, కార్మికులు- అంతా వస్తారు. అతడు వర్ణించేది మనిషిని. ఆ మనిషి ఎన్నో రకాలుగా వుంటాడాయె. 'ఆద్మీ నామా' అనే దీర్ఘ కవితలో మనిషి రకాలన్నీ వివరంగా చెప్తాడు. ఇప్పుడు రొట్టెల గురించి విందాం;

జబ్ ఆద్మీకె పేట్‌మె ఆతీహైఁరోటియాఁ
పూలే నహీ బదన్‌మె సమాతీహైఁ రోటియాఁ
ఆంఖేఁ పరీరుఖోంసే లడాతీహైఁ రోటియాఁ
సీనే ఉపర్ భి హాథ్ చలాతీహైఁ రోటియాఁ
జిత్నే మజే హైఁ సబ్‌యెదిఖాతీహైఁ రోటియాఁ

నోటు: ఈ పంచపదిలో చివరి చరణం పల్లవికాదు. అంటే, అదే పునరావృతం కాదు.

"మనిషి కడుపులో రొట్టెలు చేరగానే నిలువరించుకోని సంతోషం కలిగిస్తాయి. సుందరీమణులతో చూపులు కలుపుతాయి. శృంగార చేష్టలు చేయిస్తాయి. ఎన్నో ఆనందాలు కలిగిస్తాయి."

రోటీ న పేట్‌మే హొతా ఫిర్‌కుఛ్ జతన్‌నహో
మేలేకి సైర్ ఖ్వాహిషె-బాగో చమన్ నహో
భూకే గరీబ్ దిల్‌కి ఖుదాసే లగన్ నహో
సచ్‌హై కహా కిసీనె కె భూకే భజన్ నహో
అల్లాహ్ కీ భి యాద్ దిలాతీహైఁ రోటియాఁ

"కడుపులో రొట్టెలు లేకపోతే ఏదీ చేయరాదు- మేళాలు చూడా

లనిపించదు- తోటల్లో తిరుగాలనిపించదు. ఆకలి వలన భగవంతునిపై మనసులగ్నం కాదు- ఆకలితో భజన చేయలేమని ఎవరో నిజమే అన్నారు. భగవంతున్ని స్మరింపజేసేవి రొట్టెలే."

కప్డే కిసీకె లాల్ హైఁ రోటీ కె వాస్తే
లంబే కిసీకె బాల్హైఁ రోటీ కె వాస్తే
బాంధేకోయీ రుమాల్హైఁ రోటీ కెవాస్తే
సబ్కష్ఫ్ ఔర్ కమాల్ హైఁ రోటీకెవాస్తే
జిత్నేహైఁ రూప్ సబ్ యె దిఖాతీ హైఁ రోటియాఁ

"రొట్టెల కోసమే కాషాయ వస్త్రాలు కట్టుకున్నాడొకడు. రొట్టెల కోసమే తలవెంట్రుకలు పెంచుకున్నాడొకడు. రొట్టెల కొసమే రుమాళ్లు చుట్టుకున్నాడొకడు. మాయలూ, మహిమలూ ప్రదర్శించటం రొట్టెల కోసమే. ఎన్నో వేషాలు వేయిస్తాయి రొట్టెలు."

నేతితో చేసే గోధుమ రొట్టెను చపాతీ అంటారు. రొట్టె పొరలు బోర్లించిన పళ్లెం వలె వుంటాయి. ఆకాశం గుడా బోర్లించిన పళ్లెం వలెనే వుంటుంది. పళ్లెరాన్ని అరబీ భాషలో తబఖ్ అంటారు. ఈ ప్రాంతంలో తెలుగులోనూ తబుకు అంటారు. చపాతీ గురించిన రెండు షట్పదులు వినండి.

జబ్మిలీరోటీ హమే సబ్నూరెహఖ్ రోషన్ హువే
రాత్ దిన్ షంషో ఖమర్ షామో షఫఖ్ రోషన్హువే
జిందగీ కె థే జోకుచ్ నజ్మో నసఖ్ రోషన్ హువే
అప్నె బేగానోంకె లాజిం థే జో హఖ్ రోషన్హువే
దోచపాతీకే వరక్మే సబ్ వరఖ్ రోషన్ హువే
ఎక్ రకాబీ మె హమెఁ చౌదా తబఖ్ రోషన్ హువే.

"రోషన్ హువే అంటే తెలిసివచ్చినవి అనే అర్థం తీసుకోవాలి. రొట్టె లభించగానే భగవంతుని ప్రకాశం తెలిసి వచ్చింది. రాత్రిపగలు, ఉభయసంధ్యలు, సూర్యచంద్రులు- అన్నీ తెలిసివచ్చినవి. జీవితానికి సంబంధించిన సమస్త నియమాలు తెలిసివచ్చినవి. స్వజనుల, పరజనుల పట్ల గల బాధ్యతలు తెలిసివచ్చినవి. చపాతీ రెండు పొరల్లో అన్ని పొరలు తెలిసివచ్చినవి. (ఇక్కడ పొరలంటే ఆకాశాలని అర్థం. ఆకాశాలంటే లోకాలు) ఒక రకాబీలో మాకు

పధ్నాలుగు లోకాలు తెలిసివచ్చినవి.

జబ్‌తలక్ రోటీ క టుక్‌డా హోన దస్తర్‌ఖాన్ పర్
నై నమాజోమేఁ లగే దిల్ ఔర్‌నకుఛ్ ఖుర్‌ఆన్ పర్
రాత్ దిన్ రోటీ చఢీరహతీహై సబ్‌కె ధ్యాన్ పర్
క్యా ఖుదాకా నూర్ బర్సేహై పడా హర్ నాన్ పర్

దో చపాతీకె.... (ఈ షట్పదిలో చివరి రెండు పంక్తులు మాటిమాటికీ ఆవృతాలవుతవి).

దస్తర్‌ఖాన్ మీద రొట్టె కనపడకపోతే నమాజు మీద మనసులగ్నం కాదు, ఖురాను మీద కాదు. అందరి మనుసులు రొట్టెల మీదనే లగ్నమైవుంటాయి. రొట్టె మీద భగవంతుని కాంతి ప్రకాశిస్తూ వుంటుంది.

ముఫ్లిసీకి ఫిలాసఫిలో నాలుగు బందులు వినండి. ముఫ్లిసి అంటే దారిద్ర్యం.

జబ్ ఆద్మీకె హాల్‌పె ఆతీహై ముఫ్లిసీ
కిస్‌కిస్ తరహ్‌సె ఉస్కు సతాతీహై ముఫ్లిసీ
ప్యాసా తమామ్ రోజ్ బిఠాతీహై ముఫ్లిసి
భూకా తమామ్ రాత్ సులాతీహై ముఫ్లిసీ
ఏ దుఃఖ్ వొ జానె జిస్‌పె కె ఆతీహై ముఫ్లిసి.

(ఈ పంచపదిలోని చివరి పంక్తి మారుతుంది. అదే పునరావృతం కాదు).

మనిషిని దారిద్ర్యం వరించినప్పుడు రకరకాలుగా బాధపెడుతుంది. పగలంతా దప్పికతో కూర్చోబెడుతుంది. రాత్రంతా ఆకలితో పడుకోబెడుతుంది. దారిద్ర్యాన్ననుభవించిననాడే ఈ దుఃఖాన్ని గుర్తించగలడు.

జొ అహెలె ఫజల్ ఆలిమోఫాజిల్ హోతే హైఁ
ముఫ్లిస్ హువేతో కలిమ తలక్ భూల్‌జాతెహైఁ
పూఛే కోయి అలిఫ్‌తో ఉసే బే బతాతె హైఁ
వో జో గరీబొ గుర్బాకె లడ్‌కె పఢాతే హైఁ
ఉన్కీతో ఉమ్రభర్ నహీ జాతీహై ముఫ్లిసీ

పండితులు, విద్వాంసులైన వాళ్లకు దారిద్ర్యం వచ్చెనా అన్ని విద్యలతో పాటు కల్మాను కూడా మరిచిపోతారు. అలిఫ్‌ను గురించి అడిగితే దాన్ని బే అంటారు. (అలిఫ్, బే అనేవి ఉర్దూ అక్షర మాలలో మొదటి రెండక్షరాలు) బీదవాళ్ల పిల్లలకు పాఠాలు చెప్పుకొని బతికే పంతుళ్లు జీవితమంతా దరిద్రులుగానే వుంటారు.

ముఫ్లిస్ కి కుఛ్ నజర్ నహీ రహతీ హై ఆన్ పర్
దేతాహై అప్నిజాన్ వొ ఏకేక్ నాన్ పర్
హర్ ఆన్ టూట్, పడ్తాహై రోటీకె ఖాన్ పర్
జిస్ తరహ్ కుత్తె లడ్‌తె హైం ఏక్ ఉస్తుఖ్వాన్ పర్
వైసా హి ముఫ్లిసొంకు లడాతీ హై ముఫ్లిసీ

నోటు: ఈ పంచపదిలో ఆన్ అనే శబ్దం రెండు చోట్ల వాడబడింది. ఒకచోట గౌరవమని అర్థం. ఇంకొక చోట క్షణమని అర్థం.

"దరిద్రునికి ఆత్మగౌరవం పట్ల దృష్టి వుండదు. ఒక్కొక్క రొట్టె కోసం ప్రాణాలైన అర్పించడానికి సిద్ధంగా వుంటాడు. ప్రతిక్షణం రొట్టెల గంపమీద పడతాడు. ఒక ఎముక మీద పడి కుక్కలు కాట్లాడినట్లుగా దారిద్ర్యం దరిద్రులను పరస్పరం పోట్లాడిస్తుంది."

జబ్ ముఫ్లిసీ సె హోవె కళావంత్ క దిల్ ఉదాస్
ఫిర్‌తాహై లే తంబూరెకొ హర్ ఘర్ కె ఆస్‌పాస్
ఇక్ పావుసేర్ ఆటెకి దిల్ మే లగాకె ఆస్
గౌరీక వఖ్త్ హోవెతో గాతాహై వో బిభాస్
యాంతక్ హవాస్ ఉస్‌కె ఉడాతీ హై ముఫ్లిసీ

"దారిద్ర్యం వల్ల గాయకుని మనస్సు ఉత్సాహరహితవుతుంది. తాన్‌పూర పట్టుకొని అందరి ఇండ్ల చుట్టు తిరుగుతాడు. పావుశేరు గోధుమపిండి దొరుకుతుందని ఆశతో గౌరీరాగం పాడవలసిన సమయంలో బిభాస్ రాగం పాడతాడు. అంతగా మతిభ్రంశ కలిగిస్తుంది దారిద్రయం."

నోటు: గౌరీ, బిభాస్ అనే రెండు రాగాలు హిందుస్తానీ సంగీతంలో భైరవ్ థాట్‌కు చెందినవి. రెండూ ప్రభాతరాగాలే. కానీ పాడే సమయంలో భేదమున్నది.

ఒక సమయంలో పాడాల్సిన రాగాన్ని ఇంకో సమయంలో పాడితే బేవక్త్‌కీరాగిణి అంటారు. మౌలానా హాలీ గజల్లను గురించి ఆమాటే అన్నాడు.

నజీర్ అక్బరాబాదీ కవితలను, ముఖ్యంగా బంజారానామా వంటి కవితలను ఏభాషలోనైనా అనువదించటం కష్టమని ప్రొ. షహబాజ్ మొదలుకొని నజీర్‌ను గురించి రాసిన వాళ్ళంతా ఒప్పుకున్నారు. అందుకు కారణం లేకపోలేదు. నజీర్ కవిత ప్రవాహవేగ సదృశమైంది. నజీర్ భాష ఆనాటి ప్రజల భాష ఆ భాషలోని అనేక శబ్దాలు నేడు ప్రయోగంలో లేవు. వాటి అర్థాలు ఏ నిఘంటువు లోనూ దొరకవు. శబ్ద ప్రయోగంలో నజీర్ సర్వతంత్ర స్వతంత్రుడు. తన సౌకర్యాన్ని బట్టి శబ్దాన్ని కుదించగలడు. పొడిగించగలడు. కొంత మార్చగలడు. అట్లని అతడు ధాతు రూపాన్ని, శబ్ద స్వరూపాన్ని తెలిసికోలేని అపండితుడు కాడు. అతని ఫారసీ రచనలు, గజల్లు అతన్ని పాండిత్యాన్ని పట్టి చూపుతాయి. "అనీస్ కంటే అధిక శబ్దాలను ప్రయోగించినాడు నజీర్. అయినా అనీస్ ప్రయోగం ప్రామాణిక మయింది. నజీర్ ప్రయోగం కాదు." అని మౌలానా హాలీ విమర్శించినాడు. అనీస్ తన మర్సియాలు ఎవరికోసం రాసినాడో, నజీర్ తన నజములను ఎవరికోసం రాసినాడో ఆలోచించకచేసిన విమర్శ అది. నజీర్ సామాన్య ప్రజలకోసం రాసినాడు. శిష్టజనులకు రుచించే ప్రామాణిక శబ్ద రూపాలను, రోజ్ మర్రా, ముహావిరాలను ప్రయోగించే అవసరం లేదు నజీర్‌కు. సామాన్యులకు చప్పున అర్థమయ్యే సామెతలను, లోకోక్తులు ప్రయోగించటం అతని ఉద్దేశ్యం. దారిద్ర్యాన్ని వర్ణిస్తూ, "గరీబ్ కి బీవీ సబ్‌కీ భాభీ" అనే లోకోక్తిని కూడా నజీర్ ప్రయోగించినాడు. అది శిష్ట జన సమ్మతమైన ప్రయోగం కాదు మరి. నజీర్ ఎన్నో రకాల పక్షులను ప్రస్తావించినాడు "పరిందోంకీ తస్బీహ్" "హంస్‌నామా" అనే కవితల్లో యాభైకి మించి పక్షిజాతుల ప్రసక్తి వున్నది. వాటిలో చాలా పక్షుల పేర్లు ఇప్పటి వాళ్ళకు తెలియవు. ఎన్నో రకాల జంతువులను, రకరకాల సరకులను, ధాన్యాలను, ఆట వస్తువులను, తినుబండారాలను వర్ణించినాడు. మేళాలను, ఉర్సులను వర్ణించేటప్పుడు అతని దృష్టి అన్నిటి మీద ప్రసరించి వుంటుంది. అన్నిటిని కవితాబద్ధం చేసినాడు. అప్పటి ఆచార వ్యవహారాలను సాకల్యంగా వర్ణించినాడు. తాను చూచిన అన్నివర్ణాల, అన్ని వయసుల ప్రజలను వర్ణించినాడు. అలంకారాల కోసం ప్రయత్నించలేదు. పొందికగా చెప్పాలని ప్రయత్నించలేదు. పునరుక్తులను పరిహరించే ప్రయత్నం చేయలేదు. తన కవితలను సంకలన రూపంగా ప్రచురించాలన్న దృష్టి లేదనికి. ఏది తోస్తే అది కమ్మల మీద రాసి పారవేసే వాడు. ఆ కమ్మలను అతని శిష్యులు, ముఖ్యంగా రాజా బిలాస్ రాయ్ కొడుకులు

భద్రపరిచేవాళ్ళు. ఫకీర్లూ, బిచ్చగాళ్లూ అప్పటికప్పుడే కంఠస్థంచేసి వీధుల వెంట పాడుతూ తిరిగేవాళ్ళు.

అలాటి ప్రజాకవి కవితలను అన్యభాషల్లో అనువదించటం సాధ్యమయ్యే పనికాదు. ఆ మాటే అన్నారు షహబాజ్ మొదలైన సాహిత్య విమర్శకులు. ఉర్దూలో చదువుతూ ఆనందించవలసిందే. కోటి విద్యలు కూటి కొరకే. జానెడు పొట్ట-దీన్నినింపుకోవటానికి ప్రయాస పడక ఎవరికి తప్పుతుంది? ఏమేమి చేయవలసి వస్తుంది? ఈ పంచపదులు వినండి:

కర్తాహై కోయి జోరౌ జఫా పేట్ కే లియె
సహ్తా హై కోయి రంజొబలా పేట్ కేలియే
సీఖా హై కోయి మక్రొదగా పేట్ కేలియే
ఫిర్‌తా హై కోయి బేసరోపా పేట్ కేలియే
జో హై సో హో రహాహై ఫిదా పేట్ కేలియే.

"ఒకడు పొట్ట కోసం హింసా మార్గాన్ని అవలంబిస్తాడు. ఒకడు పొట్టకోసం బాధలను సహిస్తాడు. ఒకడు పొట్ట కోసం కపటం, మోసం అలవర్చుకుంటాడు. ఒకడు పొట్ట కోసం అగమై తిరుగుతాడు. సారాంశమేమంటే అంతా పొట్ట కోసమే ఏదైనా చేస్తున్నారు."

ఈ వరుసలో నజీర్ బీదలు, బిచ్చగాళ్ళు, సంపన్నులు, రాజులు, వృత్తి పనివాళ్ళు, కళాకారులు, కవులు, గాయకులు, నర్తకులు, భక్తులు, సాధుసంతులు సయితం పొట్టకోసమే పాట్లు పడుతున్నారని వైనం వారీగా చెప్తాడు.

పొట్ట నిండాలంటే గవ్వకావలె. ఆ కాలంలో గవ్వలు కూడా పైసల్లాంటివే. పైసలు కావాలె. రూపాయలు కావాలె. ధనం కావాలె. ఎవరికి కావాలె? అందరికి కావాలె. బీదకు కావాలె. పాదుషాకు కావాలె. భ్రష్టునికి కావాలె. భక్తునికి కావాలె. గవ్వల మహత్వం- షట్పదులు వినండి.

కౌడీ హై జిస్ కె పాస్ వొ అహెలే- యఖీన్ హైఁ
ఖానేకు ఉస్కె నేమతేఁ సొ బెహతరీన్ హైఁ
కప్డే భి ఉస్కె తన్ మె నిహాయత్ మొహీన్ హైఁ
సమ్ఝేహై ఉస్కొ వొ జొ బడే నుక్త చీన్ హైఁ

కొడీకె సబ్ జహాన్ మె నక్షో నిగార్ హైం
కొడీ న హోతో కొడీకె ఫిర్ తీన్ తీన్ హైం

నోటు: చివరి రెండు పాదాలు మాటిమాటికి అవృతాలవుతాయి.

కొడీ నహోతో ఫిర్ ఎ ఝుమేల కహాసె హో
రథ్ ఖానాఫిల్ ఖాన తవేలా కహాసెహో
ముండ్వాకె సర్ ఫకీర్ క చేలా కహాసె హో
కొడీ నహోతో సాయిక మేళా కహాసె హో

కొడీ కె సబ్ జహాన్‌మె...

బిన్ కొడీ ఖుర్దియె కె బరాబర్ భి పత్‌నథీ
కొడీ జబాయి పాస్‌తో బన్‌బైఠే సేట్‌జీ
ఆకే గుమాస్తోంకి ఖులీ హర్ తరఫ్ బహీ
ఫిర్ ఓ జోకుచ్ కోహేతో ఒహీ బాత్ హీ సహీ

కొడీ కె సబ్...

లే ముఫ్లి సౌర్ ఫకీర్ సె తాషాహ ఔర్ వజీర్
కొడీ ఒ దిల్ రుబా హైకె హై సబ్‌కి దిల్ పిజీర్
దేతేహైం జాన్ కొడీపె తిఫ్లో జవానోపీర్
కొడీ అజబ్ హి చీజ్ హై మై క్యా కహూం‹నజీర్

కొడీ కె సబ్...

గవ్వగలవాడే నమ్మకస్తుడు. వాళ్లకే రకరకాల భోజ్య పదార్థాలు లభిస్తాయి. వాళ్ళకే విలువైన బట్టలు. సారం గ్రహించే వాళ్ళు ఈ సంగతి తెలుసుకుంటారు. గవ్వతోనే ప్రపంచంలో అందాలు అలంకారాలు. గవ్వలేని వాళ్లు గవ్వకు ముగ్గురు.

గవ్వలేకపోతే ఈ ఆడంబరాలెక్కడి నుంచి వుంటాయి? రథశాల, గజశాల, అశ్వశాల లెక్కడి నుండి వుంటాయి. తల గొరిగించుకొని ఫకీరు శిష్యులెందుకు అవుతారు? గవ్వలేని వారు సాయి మేళాలెట్ల జరుపుతారు? గవ్వతోనే ప్రపంచంలో అందాలు అలంకారాలు...

బీదలు, ఫకీర్లు మొదలు పాదుషాలు, వజీర్ల వరకు గవ్వ అందరికి ప్రియమయినది. పిల్లలు, పడుచువాళ్ళు, పెద్దలు గవ్వకు ప్రాణాన్ని అర్పిస్తారు. గవ్వ మహాత్మ్యం ఏమని చెప్పను నజీర్ గవ్వతోనే...

ఇక పైసా గురించి వినండి:

నక్ష్‌యాఁ జిస్‌కే మియాఁ హాత్ లగా పైసేకా
ఉస్‌నె తయ్యార్ హర్ ఇక్‌రార్ కియా పైసేకా
షుర్ భి పాకీజ ఇమారత్ హై బనా పైసేకా
ఖాన ఆరామ్‌సె ఖానేకు మిఁలా పైసేకా
కప్డాతన్ కోభి మిలా జేబ్ ఫిజా పైసేకా

"పైసా చేతికి దొరికిన వాడు సర్వ విధ సౌకర్యాలు సమకూర్చుకున్నాడు. ఇల్లు పరిశుభ్రమైంది. అందమైన బంగ్లా- సంతృప్తిగా తిండి, వొంటిమీద సుందరమైన దుస్తులు.

రూపాయ గురించి:

ఝుమ్కా నజర్ ఆతాహై హర్ ఇక్ ఐష్‌కి షైకా
దున్యామె అజబ్ రూప్ ఝలక్తా హై రుపైకా

"విలాస వస్తువులన్నిటిలో ఒక వింత మెరుపు- ప్రపంచంలో రూపాయ రూపమే వింత మెరుపు."

ధనం గురించి:

జో హై సొ హోరహాహై సదా ముబ్తలాయెజర్
హర్ ఇక్ యెహీ పుకారె హై దిన్ రాత్ హాయెజర్

"ప్రతి వ్యక్తి ధన సంపాదనలోనే వ్యగ్రుడై వున్నాడు.
పగలూ రాత్రీ ప్రతి వ్యక్తీ ధనాన్నే తల పొస్తున్నాడు."

ఈ పై మూడు పల్లవులు మాత్రమే. అంటే ముఖ్డాలు. ఈ నజములు చాలా దీర్ఘమైనవి.

నజీర్ అక్బరాబాదీ డబ్బు అవసరాన్ని, విలువను గురించి చెప్పినాడు కాని తానెన్నడూ డబ్బును ఆశించిన వాడు కాదు. లఖ్నో నవాబు వాజిదలీషా మూడు వేల రూపాయల మూట పంపి తన అస్థానానికి ఆహ్వానిస్తే, డబ్బు తెచ్చిన వ్యక్తికి మరునాడు తన అభిప్రాయం తెలియజేస్తానని చెప్పి, తలుపులూ, ద్వార బంధాలు గట్టిగా లేని తన ఇంట్లో మూడు వేల రూపాయల మూటను

తలగడ క్రింద పెట్టుకొని రాత్రి తెల్లవార్లూ జాగరణ చేసినాడు. మరునాడు రాజదూతకు ఆ మూటను అప్పగించి "హుజూర్! ఒక్క రాత్రి ఈ మూట నా యింట్లో వున్నందుకే నా నిద్ర చెడింది. ఇంకా వుంటే నా నా మనస్సు చెడుతుంది. ఆరోగ్యం చెడుతుంది. ఈ డబ్బు కోసం నేను లఖ్నోకు రాను." అని చేతులు దులుపుకున్నాడు. అతడు డబ్బు పట్ల ఆసక్తి లేని దరిబేసి.

'సదాయ్ దుర్వేష్' అనే కవితలోని ఈ పంక్తులు వినండి.

జర్‌కీ జో మొహబ్బత్ తుఝే పడ్ జాయెగీ బాబా!
దుఃఖ్ ఉస్మే తెరీ రూహ్ బొహత్ పాయేగీ బాబా!
హర్ ఖానేకు హర్ పీనేకు తర్సాయెగీ బాబా!
దౌలత్ జొ తెరీ యాఁ హై న కామ్ ఆయెగీ బాబా!

ఫిర్ క్యా తుఝే అల్లాహ్ సె మిల్వాయెగి బాబా!
దౌలత్ జొ తెరేపాస్ హై రఖ్‌యాద్ తుయే బాత్
ఖా తూభి ఔర్ అల్లాహ్‌కి కర్ రాహ్‌మె ఖైరాత్
దేనేసె రహే ఉస్కే తెరా ఊంచా సదా హాత్
ఔర్ యాఁభి తెరీ గజ్‌రేగీ సౌఇష్‌సే ఔఖాత్
ఔర్ వాఁభి తుఝే సైర్ యె దిఖ్లాయెగి బాబా!

"బాబా! ధనం పట్ల నీ మనస్సులో మోహం ఏర్పడెనా నీ ఆత్మకు చాలా దుఃఖం కలుగుతుంది. అన్నీ తినాలనిపిస్తుంది. అన్నీ తాగాలనిపిస్తుంది. భగవంతుని వైపు మరల్చదు నిన్ను."

నీ దగ్గర ధనం వున్నందుకు నాయీ మాట గుర్తుంచుకో. నువ్వూ తృప్తిగా తిను. దేవుని పేరు మీద ఇతరులకు తినిపించు. ఇతరులకు ఇయ్యటం వలన నీ చేయి పైన వుంటుంది. ఈ లోకంలో సుఖంగా గడుస్తుంది. పై లోక సుఖాలూ పొందగలవు."

నజీర్ అనుభవ యోగి అని ముందే మనవి చేసినాను. ఈ ప్రాపంచిక సుఖాలు అశాశ్వతాలని చెప్పినా ప్రకృతి వలన కలిగే సంతోషాలను సంపూర్ణంగా అనుభవించినాడతడు. అతడు నిరాశావాది కాడు. అతని కవితలో కనిపించే నిరాశావాదానికి కారణం ఆనాటి చారిత్రక రాజకీయ పరిస్థితులు. అదంతా ఇంకో వ్యాసంలో!

దున్యామె బాదుషాహై సో హై వోభి ఆద్మీ
ఔర్ ముఫ్లిసో గదాహై సో హై వోభి ఆద్మీ
జర్దార్ బేనవాహై సో హై వోభి ఆద్మీ
నేమత్ జో ఖారహాహై సో హై వోభి ఆద్మీ
టుక్డే జో మాంగ్తా హై సోహై వోభి ఆద్మీ

మస్జిద్ భి ఆద్మీనె బనాయీ హై యాఁమియాఁ
బన్తేహైఁ ఆద్మీహి ఇమామ్ ఔర్ ఖుత్బాఖాఁ
పఢ్తేహైఁ ఆద్మీహి ఖుర్అన్ ఔర్ నమాజ్యాఁ
ఔర్ ఆద్మీహి ఉన్కీ చురాతాహై జూతియాఁ
జో ఉన్కు తాడ్తాహై సో వోభిహై ఆద్మీ

యాఁ ఆద్మీపె జాన్కొ వారేహై ఆద్మీ
ఔర్ ఆద్మీపె తేగ్ కొమారే హై ఆద్మీ
పగ్డీభి ఆద్మీకి ఉతారే హై ఆద్మీ
చిల్లాకె ఆద్మీకొ పుకారే హై ఆద్మీ
ఔర్ సున్కె దౌడ్తాహై సోహై వోభి ఆద్మీ

"ఈ లోకంలో రాజు మనిషే- పేద మనిషే- కలవాడు మనిషే- లేనివాడు మనిషే- మృష్టాన్నం తినేవాడు మనిషే- రొట్టె ముక్కలు అడుక్కునేవాడూ మనిషే.

మసీదు కట్టించిన వాడుమనిషే. ఇమామ్ మనిషే- ఖుత్బా చదివేవాడు మనిషే. ఖుర్అన్ చదివేవాడు మనిషే. నమాజ్ చేసేవాడు మనిషే. మసీదు బయట విడిచిన చెప్పులను దొంగిలించేవాడు మనిషే. అదంతా గమనించేవాడు మనిషే.

మనిషి కోసం ప్రాణాలర్పించేవాడు మనిషే. మనిషి మీద కత్తి విసిరేవాడు మనిషే. మనిషిని అవమానించేవాడు మనిషే. కేక పెట్టి మనిషిని పిలిచేవాడు మనిషే. ఆ కేక విని పరుగెత్తుకు వచ్చేవాడు మనిషే."

నజీర్ రచనల్లో ఆదీ్మనామా, బంజారానామా, హంస్‌నామా ప్రసిద్ధమైన దీర్ఘ కవితలు. అతని యీ కవితలను ఏ భాషలోనూ అనువదించటం సాధ్యం కాదని ప్రొ. షహబాజ్ లాంటి విద్వాంసులే ఒప్పుకున్నారు. ఆదీ్మనామాలోని మూడు బందులకు పైన భావార్థం రాసినాను. నజీర్ కవిత ధారాళమయింది. నాద మధురమైంది. కనుక అర్థం తెలిసినా తెలియకున్నా ఉర్దూలో చదువుకుంటూ పోతే కలిగే ఆనందం అనుభవైక వేద్యమే.

మనిషి ఎన్ని పనులైనా చేస్తాడు. మంచి పనులు చేస్తాడు. చెడు పనులు చేస్తాడు. వైభవంగా జీవిస్తాడు. దరిద్రుడు బ్రతుకుతాడు. చివరికి అందరి గతి ఒక్కటే. అందరూ ఈ లోకం విడిచి వెళ్లవలసిన వాళ్లే. ఎవరూ ఉండే వాళ్ళు కాదు.

దున్యామె అప్నాజీ కొయీ బహ్‌లాకె మర్‌గయా
దిల్ తంగియోంసె ఔర్ కొయి ఉక్తాకె మర్‌గయా
అఖిల్ థా వోతా ఆప్‌కో సమ్‌ఝాకేమర్‌గయా
బే అఖ్ల్ ఛాతీ పీట్‌కె ఘబ్రాకె మర్‌గయా
దుఃఖ్‌పాకె మర్‌గయా కోయి సుఖ్‌పాకె మర్‌గయా
జీతా రహాన కోయి హర్ ఎక్ ఆకె మర్‌గయా

కోయి మోతి చబాతా థా, కొయీ మోర్ ఔర్ మటర్
జిస్‌దమ్ ఖజా నె హాథ్‌మెలీ తేగ్ ఔర్ సపర్
కామ్ ఆయి నా ఫకీరి, నకుఛ్ తక్త్ ఔర్ ఛతర్
యే ఖాక్‌పే మువా, వొ మువా తక్త్‌కే ఊపర్
థీ జైసి జిస్కి ఖద్ర్ వొ బత్లాకె మర్‌గయా
జీతా రహాన కోయి హర్‌ఎక్ ఆకె మర్‌గయా

"ఒకడు మానసిక సంతోషం పొంది చచ్చినాడు. ఒకడు బాధలతో, ఒకడు విరక్తితో వచ్చినాడు. జ్ఞానం కలవాడు చావు తప్పదనే ఎరుకతో చచ్చినాడు. అజ్ఞాని అయ్యో చస్తున్నానే అని గుండె బాదుకొని భయం భయంగా చచ్చినాడు.

దుఃఖం పొంది చచ్చినాడొకడు. సుఖం పొంది చచ్చినాడొకడు.
చావకుండా ఎవడూ వుండలేడు. ఇక్కడికి వచ్చిన ప్రతివాడూ చచ్చినాడు.

ఒకడు ముత్యాలు బుక్కినాడు. ఒకడు మోట్లూ, బఠానీలు నమిలినాడు. (మోట్లు పెసర గింజలలాంటి గింజలు) మృత్యుదూత చేతిలో ఖడ్గం పట్టుకొని రాగానే ఫకీరీ పనికి రాలేదు, సింహాసనమూ ఛత్రమూ పనికిరాలేదు. వాడు నేల మీద చచ్చినాడు. వీడు సింహాసనం మీద చచ్చినాడు. ఎవని స్తోమతకు తగ్గట్లు వాడు చచ్చినాడు. చావకుండా ఎవడూ ఉండలేదు. ఇక్కడికి వచ్చిన ప్రతి వాడూ చచ్చినాడు."

ఈ షట్పదుల్లో నజీర్ అన్ని రకాల మనుషుల చావును వర్ణిస్తాడు.

ఇంకో దీర్ఘ కవితలో లోకంలో ఏదీ వుండదు. భగవంతుని నామమొకటే మిగిలేది అని చెప్తాడు. దాని పల్లవి మాత్రం రాస్తాను. అది అన్ని బందులకు పునరావృతమయ్యేది.

"నై ఐష్, న దుఃఖ్‌దర్ద్, న ఆరామ్ రహేగా. ఆఖిర్ వొహీ అల్లాహ్ కా ఇక్ నామ్ రహేగా." దీని భావం స్పష్టమే. వైభవమూ, సుఖ దుఃఖాలూ ఏవీ మిగలవు. మిగిలేది అల్లాహ్ నామమొకటే.

ఎంతటి జీవితం మనది? ఒక రాత్రి- ఒకపగలు, ఈ వ్యవధిలోనే ఎన్నెన్ని అవస్థలు పొందుతామో, ఎన్ని అనుబంధాలు పెంచుకుంటామో, ఎన్ని చేయదగిన, చేయగూడని పనులు చేస్తామో వివరంగా వర్ణిస్తాడు. పల్లవి వినండి.

ఇత్నె అర్సే మేహి క్యాక్యా హమ్‌పె గుజరీ వారిదాత్
రహచలే దున్యామె హమ్‌భీ ఏక్‌దిన్ ఔర్ ఏక్ రాత్.

"ప్రపంచంలో వున్న స్వల్ప వ్యవధిలోనే మామీద ఏమేమి జరిగింది." బ్రతికినంత కాలం ఎన్నెన్ని సౌకర్యాలు! ఎన్నెన్ని వాహనాలు! (ఆకాలంలో రథాలు, గుర్రాలు , ఏనుగులు, ఎడ్ల బండ్లు, ఎడ్లు , కంచర గాడిదలు, పల్లకీలు మొదలైన వాహనాలే. నజీర్ వాటినే వర్ణిస్తాడు)

క్యాక్యా జహాఁమె అబ్‌హైఁ హమారీ సవారియాఁ
దిల్‌చస్ప్, దిల్ ఫరేబ్ ప్యారీ సవారియాఁ
కిస్‌కిస్ తరహ్ సె హమ్‌నె సంవారీ సవారియాఁ
పర్‌కుఛ్‌న హమ్‌సె కర్‌గయాఁ యారీ సవారియాఁ
జబ్ చార్ కాంధే పర్ హువీ భారీ సవారియాఁ
ఝుక్ మార్తీ యె రహ్ గయిఁ సారీ సవారియాఁ

"ఎన్నెన్ని అందమైన, సుఖప్రదమైన సవారీలు! వాటిని ఎన్ని రకాల అలంకరించుకుంటాము! చివరికి యే సవారీ అక్కరకు రాదు. నాలుగు భుజాల బరువైన సవారీ మీద (పాడె) ఎక్కగానే మన సవారీలన్నీ కొరగానివై పోయినవి. (ఝుక్ అంటే చేప. ఝుష శబ్ద భవము. గాలం వేసి చేపలు పట్టటం ప్రొద్దంతా వ్యర్థం చేసే పని.)"

ఈ మాత్రపు జీవితానికి మనిషి ఎన్నెన్ని చేస్తాడో! ఎంత ప్రయాస పడతాడో! ఎన్నెన్ని వేషాలు వేస్తాడో! వెనుకటి బంజారాలు ఉప్పు మొదులుకొని సమస్త ధాన్యాలను దినుసులను గోతాల్లో, గోనెల్లో నింపుకొని వాటిని ఎడ్ల మీద, కోడెల మీద, ఒంటెల మీద వేసుకొని ఊరూరు వర్తకం చేస్తూ తిరిగేవాళ్ళు. వారి కంటే పెద్ద బంజారా (మృత్యుదూత) దారి దొంగవలె ఎక్కడో దొరికించుకొని అంతం చేస్తాడు. ఎందుకీ లాలస? ఎందుకీ వ్యామోహం? బంజారా నామాలో ప్రతి బంద్‌లోనూ నజీర్ చేసే హెచ్చరిక ఇదే. ఇది చాలా ప్రసిద్ధమైన రచన కనుక తాత్పర్యం చెప్పను. కాని మొదటి బంద్ వినిపిస్తాను.

టుక్ హిరస్, హవాకో ఛోడ్ మియాం మత్ దేస్ బిదేస్ ఫిరే మారా
ఖజ్జాక్ అజల్‌కా లూటేహై దిన్‌రాత్ బజాకర్ నఖ్ఖారా
క్యా బధియా, భైంసా, బైల్, షుతర్, సొగోయీ పిల్లా సర్‌భారా
క్యా గ్యెంహూ , చావల్ , మోఠ్, మటర్ క్యా ఆగ్, ధుంవా ఔర్ అంగారా
సబ్ ఠార్ పడా రహ జాయేగా జబ్ లాద్ చెలేగా బంజారా (క్రమశః)

శైశవం ఎంత మధురమైంది? శైశవం, బాల్యం, యౌవనం, వార్ధక్యం-ఈ జీవితావస్థలన్నిటినీ స్వానుభవంతో వర్ణించినాడు నజీర్. దాదాపు నూరేళ్ల జీవంచినవాడాయె. శైశవాన్ని గురించి కొన్ని బందులు వినండి.

క్యాదిన్‌థే యార్! వోభీ థే జబ్‌కె భోలెభాలే
నిక్లేథే దాయి లేకర్, ఫిర్తీ కభీ దదాలే
చోటీ కోయీ రఖాలే, బద్ధీకొయి బంధాలే
హంస్లీ గలేమెడాలే, మన్నత్ కొయీ బఢాలే
మోటేహోఁయాకె దుబ్లే, గోరే హోయాకె కాలే
క్యాఐష్ లూట్తే హైఁ మాసూమ్ భోలేభాలే.

దిల్‌మే కిసీకె హర్‌గిజ్ నైషర్మ్ నైహయాహై
ఆగాభీ ఖుల్ రహాహై పీఛాభిఖుల్ రహాహై
పెహనే ఫిరేతో క్యాహై, నంగే ఫిరేతో క్యాహై
యా యూఁభీ వాహ్వాహై ఔర్ వూఁభీవాహ్వాహై
కుఛ్ ఖాలే ఇస్ తరహ్‌సే, కుఛ్‌ఖాలే ఉస్ తరహసే
క్యాఐష్ లూట్తే హైఁ మాసూమ్ భోలె భాలే.

యే బాల్ పన్‌కా యారో! ఆలమ్ అజబ్ బనాహై.
యే ఉమ్రవోహై జిస్మే జోహైసొ బాద్‌షాహై
ఔర్ సచ్ అగర్ యె పూఛో తో బాద్‌షాభి క్యాహై
అబ్‌తో నజీర్ మేరీ సబ్‌కో యెహీదువా హై
జీతేరహేఁ సభోంకే ఆసోమురాద్ వాలే
క్యాఐష్ లూట్తేహై మాసూమ్ భోలేఖాలే.

"మిత్రులారా! అమాయక శిశువులుగా వున్నకాలం ఎంతగొప్పది. దాయి ఎత్తుకొని తిరిగేది. ఆయా ఆడించేది. ఒకరికి పిలక- ఒకరికి తోలు తావేజు- ఒకరి మెడలో కంటె- ఒకరికి నౌసు (దేవుని మొక్కుచెల్లించటానికి పెంచే తల వెంట్రుకలు), లావుగావున్నా, పీలగా వున్నా, తెల్లగా వున్నా, నల్లగావున్నా అమాయిక శిశువుల ఆనందాలే వేరు.

ఎవరికీ సిగ్గులేదు. షరమూ లేదు. ముందు భాగాన గుడ్డలుండవు. వెనుక భాగాన వుండవు. నగ్నంగా తిరిగితే యేమి? దుస్తుల్లో తిరిగితే యేమి? అలా అందమే. ఇలా అందమే. ఒకరొకలాగా తింటారు. ఇంకొకరింకొకలాగా తింటారు. అమాయక శిశువుల ఆనందాలే వేరు. బాల్యమనేదే సొగసయింది. ఈ వయసులో వున్న వాళ్ళంతా పాదుషాలే . నిజానికి వీళ్ల ముందు పాదుషాలెంతటి వాళ్లు? నజీర్! అందరి ఆశలకు, ఆకాంక్షలకు అలవాలమైన, ఈ శిశువులు దీర్ఘాయుష్కులై జీవించాలె-అమాయక శిశువుల...."

ఈలాగే యవ్వనం, వార్ధక్యం గురించిన కవితలున్నాయి.
కృష్ణుని బాల్యం ఎంత మధురమైందో!
ఐసాథా బాన్సురీకె బజయ్యాకా బాలపన్

క్యాక్యా కహూఁహై కృష్ణ కన్హయ్యాకా బాలపన్

ఇలా సాగుతుంది కృష్ణుని బాల్యవర్ణన.

కృష్ణుని మురళీ వాదనం, కృష్ణుని పెళ్లి, కాళియ మర్దనం, భైరవుడు, మహాదేవుని పెళ్లి, దుర్గాదేవి-ఇలా హిందూ పురాణ పురుషులను, దేవతలను, గాథలను, చక్కగా వర్ణించినాడు నజీర్. ప్రవక్తను, కల్మా మహిమను, ముస్లిముల ఈదులను (షబె-బరాత్, ఈదుల్ఫితర్) ముస్లిమ్ కవి వర్ణించవలసిన విధంగానే వర్ణించినాడు. అతడు షియా కనుక హజ్రత్ అలీ స్తుతిలో చాల కవితలు రచించినాడు. అట్లని సున్నీ మతానికి చెందిన మహనీయులను వదిలి పెట్టలేదు. హజ్రత్ సలీమ్ చిష్తీ స్తోత్రం అందుకు సాక్ష్యం. గురు నానక్ను వర్ణించినాడు. సర్వమతాల పట్ల ఆదరం గల ఉదార హృదయుడతను.

హువీజబ్ ఆకె యెక్తాయీ దుయీకా ఉఠ్గయా పర్దా
జొకుఛ్ వహమో దగాథే ఉఠ్గయే ఎక్దమ్మె హో పారా
నజీర్! ఉస్ దిన్గసె హమ్నే ఫిర్జో దేఖా ఖూబ్ హర్ ఇక్జా.
వొహీదేఖా, వోహీజానా, వొహీ సమ్ఝా, వొహీపాయా
బరాబర్ హోగయే హిందూ ముసల్మాఁ గుబ్ర్ నుస్తానీ.

"ద్వైతం నశించి ఏకత్వం అనుభవానికి వచ్చిన తర్వాత భ్రాంతులు విడిపోయినవి. అప్పటి నుంచి ఎక్కడ చూచినా ఒక్కటే. (దీన్నే సూఫీలు 'హమావూస్త్' అంటారు) హిందువులు, ముసల్మానులు, పారసీలు, క్రైస్తవులు అంతా ఒకటే అనే ఎరుక కలిగింది."

హజ్రత్ సలీమ్ చిష్తీ సున్నీ సంప్రదాయానికి చెందిన మహాయోగి. అక్బర్ చక్రవర్తికి అతని పట్ల విశేష భక్తి వుండేది. అతని ఆశీస్సుల వలన కలిగిన పుత్రుడే నూరొద్దీన్ సలీం (జహాంగీర్).

హైఁ దోజహాఁకె సుల్తాన్ హజ్రత్ సలీమ్ చిష్తీ
ఆలమ్కె దీన్ వ ఈమాఁ హజ్రత్ సలీమ్ చిష్తీ
సర్దఫ్తరె ముసల్మాఁ హజ్రత్ సలీమ్ చిష్తీ
మఖ్బూలెఖాస్ యజ్దాఁ హజ్రత్ సలీమ్ చిష్తీ
సర్దారె ముల్కె ఇర్ఫాఁ హజ్రత్ సలీమ్ చిష్తీ

అలాగే గురునానక్ గురించి,

కహ్తే నానక్ షాహ్ జిన్హే వో పూరేహైఁ ఆగాహ్ గురూ
వో కామిల్ రహబర్ జగ్‌మేహైఁ యూఁరోషన్ జైసే మాహ్-గురూ
మఖ్సూద్ మురాద్ ఉమీద్ సభీ బర్‌లాతేహై దిల్ ఖ్వాహ్ గురూ
నిత్ లుత్ఫ్‌వకరమ్ సే కర్తే హైఁ హమ్ లోగోంకా నిర్వాహ్ గురూ
ఇస్ బఖ్షిస్‌కే ఇస్ అజ్మత్‌కే హైఁ బాబానానక్ షాహ్ గురూ
సబ్ సీస్‌నవా అర్‌దాస్తే కరో ఔర్ హర్‌దమ్ బోలో వాహ్ గురూ

ఇందులో పంజాబీ శబ్దాలున్నవి. అర్‌దాస్తే అనేది 'అర్జ్ దాస్తే' అనే ఫారసీ పద బంధానికి వికృతి. నివేదన అని అర్థం. (అంతా తలవంచి నివేదించుకోండి)

క్యాఆజ్ రాత్ ఫర్హతా ఇష్రాత్ అసాస్‌హై
హర్ గుల్బదన్‌కా రంగీఁవ జర్రీఁ లిబాస్‌హై
మహబూబ్ దిల్బరోంకా హుజూమ్ ఆస్‌పాస్‌హై
బజ్మే తరబ్‌హై ఐష్‌హై ఫూలోంకి బాస్‌హై
హర్ ఆన్ గోపియోంకా యెహీ ముఖ్ బిలాస్‌హై
దేఖో బహరేఁ ఆజ్ కన్హయ్యాక రాస్ హై

ఇది గోపికా కృష్ణుల రాసలీలా వర్ణన. పై మూడు కవితలు వర్ణనాత్మక మైనవి. తాత్పర్యం చెప్పనవసరం లేదనుకుంటున్నాను. ధారారమ్యమైన కవిత. సరిగా ఉచ్చరిస్తూ చదువ గలిగితే చాలు.

దిల్ ఖుషామద్‌సె హర్‌ఇక్ షఖ్స్ క క్యారాజీహై
ఆద్మీ జిన్ వ పరీ భూత్ బలా రాజీహై
భాయి ఫర్జంద్ భి ఖుస్ బాప్ చిచా రాజీహై
షాహ్ మస్రూర్, ఘనీషాద్, గదా రాజీహై
జోఖుషామద్ కరె ఖల్ఖ్ ఉస్‌సె సదారాజీహై
సచ్‌తో యే హైకె ఖుషామద్‌సె ఖుదా రాజీహై

ఖుషామద్ చేస్తే అంతా సంతోషిస్తారు. దేవుడు కూడా ఖుషామద్ ప్రియుడే- ఇన్ని భజనలు, స్తోత్రాలు ఎందుకు మరి?

తన్‌దురుస్తీ అంటే శరీరం సరిగా వుండటం- అంటే ఆరోగ్యంగా వుండటం. దురస్త్ అంటే మంచి. ఇకవినండి.

హైమర్ద్ అబ్ వోహీకె జినోంకాహై ఫన్ దురుస్త్
హుర్మత్ ఉన్హోంకె వాస్తే జిన్‌కాచలన్ దురుస్త్
రహ్తానహీ కిసీక సదా మాల్ ధన్ దురుస్త్
దౌలత్ రహీ కిసీకి న బాగో చమన్ దురుస్త్
జిత్నే సుఖున్‌హైం సబ్‌మె యోహీహై సుఖున్ దురుస్త్
అల్లాహ్ ఆబ్రూసె రఖే ఔర్ తన్‌దురస్త్

అన్ని మాటల్లో మంచి మాటయిదే. భగవంతుడు గౌరవంగా, ఆరోగ్యంగా వుంచాలె.

నజీర్ హోలీని గురించి ఐదారు, వర్ష కాలాన్ని గురించి నాలుగైదు, చలి కాలాన్ని, వసంతాన్ని గురించి ఒక్కొక్క కవిత రాసినానాడు. అవన్నీ చదివి ఆనందించదగినవే. అన్నీ రాయటం సాధ్యం కాదు. ఇప్పటికే నజీర్ గురించిన వ్యాసం చాల దీర్ఘమయిపోయింది. ఇంకా చాలా మంది కవుల, రచయితల పరిచయం చేయవలసి వున్నది. ఇంకొక రెండు బందులతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

తాత్పర్యం రాయకుండా కొన్ని బందులు వినిపించాలనిపిస్తున్నది.

జబ్‌ఫాగున్ రంగ్ ఝుమక్తా హో తబ్ దేఖ్ బహారేఁ హోలీకి
ఔర్ దఫ్‌కే షోర్ ఖడక్తే హోఁ ఫిర్ దేఖ్ బహారేఁ హోలీకి
పరియోంకే రంగ్ దమక్తే హోఁ ఫిర్ దేఖ్ బహారేఁ హోలీకి
ఖుమ్, షీషే, జామ్ ఛలక్తే హోఁ తబ్ దేఖ్ బహారేఁ హోలీకి
మహబూబ్ నషేమే చహక్తే హోఁ తబ్ దేఖ్ బహారేఁ హోలీకి.

ఫాగున్ అంటే ఫాల్గుణ మాసం- బహార్ అంటే శోభ- దఫ్ అంటే డప్పు.

హర్ ఘర్ మె జలా ఫిర్ దియా దివాలీకా
హరేక్ తరఫ్ ఉజాలా హువాది వాలీకా
సభీకె దిల్‌మె సమాభాగయా దివాలీకా
కిసీకె దిల్‌కు మజా ఖుష్‌లగా దివాలీకా
ఆజబ్ బహార్ క హై దిన్‌బనా దివాలీకా
ఇది దీపావళి వర్ణన. దియా అంటే దీపం.

దున్యా ఆజబ్ బాజార్ హై-కుఛ్ జిన్స్ యాఁకీ సాత్ లే
నేకీక బద్లానేక్ హై- బద్ సే బదీకీ బాత్ లే
మేవా ఖిలా మేవామిలే -ఫల్ ఫూల్‌దే ఫల్‌పాత్ లే
ఆరామ్ దే ఆరామ్ లే- దుఃఖ్ దర్ద్‌దే ఆఫాత్ లే
కల్జుగ్ నహీ కర్జుగ్ హైయే- యాఁదిన్‌కొదే ఔర్ రాత్‌లే
క్యాఖూబ్ సౌదా నక్ద్ హై- ఇస్‌హాత్‌దే ఉస్‌హాత్‌లే

ఇది కలియుగం కాదు -కర్మయుగం. 'ఎలాంటి కర్మచేస్తే ఆలాటి ఫలం అనుభవిస్తావు. ఉద్దెర లేదు. నగదే. ఈ చేత ఇయ్యి- అ చేత పుచ్చుకో.' అని సారాంశం.

నజీర్ గజల్ల గురించి నేనేమీ రాయలేదు. అతని గజల్లను విమర్శించిన వాళ్లున్నారు. ప్రశంసించిన వాళ్లున్నారు. లోపాలు ఎవరి కవితలో వుండవు గనుక!

"కాళిదాసస్య త్రిశుతి. భారవే శతద్వయం" అన్నారు ఆ కాలపు సాహిత్య విమర్శకులు.

కాళిదాసు కవితలో మూడు వందల దోషాలున్నా, భారవి కవితలో రెండు వందల దోషాలున్నా ఆ మహా కవుల కవితలు చదివి రసానందాన్ని పొందని వాళ్లున్నారా?

నజీర్ గజల్లు సహృదయులకు రసానందం కలిగించేవే. నజీర్ కవిత చదివి ఆనందించండి. ఉర్దూలో చదవండి.

◆ ◆ ◆

దిల్లీలో ఉర్దూ కవిత చివరి వెలుగు

ఎన్నో శతాబ్దాలుగా భారత దేశానికి దిల్లీ నగరం రజధానిగా వుంటున్నది. మహా భారతంలో వర్ణించబడిన హస్తినాపురం దిల్లీ నగరమే. ఎన్నో రాజవంశాలు దిల్లీ రాజధానిగా మన దేశంలోని పెద్ద ప్రాంతాన్ని పాలించినవి. ఎందరో దిల్లీని కొల్లగొట్టినారు. ఆక్రమించినారు. ఎన్నో సార్లు మళ్లీ ఈ నగరం కోలుకోలేదు అనే విధంగా శిథిలమైంది. మళ్లీ కోలుకున్నది. మీర్ తఖీమీర్ దిల్‌ను, అంటే, హృదయాన్ని గురించి చెప్పిన ఈ షేర్ దిల్లీని గురించి చెప్పిందేనని సాహిత్యవేత్తల అభిప్రాయం. అతని కళ్లముందే దిల్లీ నగరాన్ని నాదిర్షా కొల్లగొట్టినాడు. అతని కళ్ళ ముందే అహ్మద్‌షా అబ్దాలీ దండయాత్రలు మూడు జరిగినవి. అతని కళ్లముందే దిల్లీ పాడుబడింది. పాడుబడిన దిల్లీలో ఉండలేక అతడూ అందరిలాగా దిల్లీని విడిచి వెళ్ళినవాడే. కనుక, దిల్‌ను గురించి అతడు చెప్పిన ఈ షేర్ దిల్లీని గురించి చెప్పిందే అనటం సత్యదూరం కాదు. మీర్ ఏమన్నాడంటే,

దిల్‌కి వీరానీ క, క్యా మజ్కూర్ హై
యే నగర్ సౌ మర్తబా లూటా గయా.

"హృదయం బర్బాద్ అయిన వృత్తాంతం ఏమని చెప్పను? ఈ నగరం వందసార్లు కొల్లగొట్టబడింది."

సౌదా, మీర్, దర్ద్, లాంటి మహాకవుల కాలంలో ఉర్దూ సరస్వతికి నిలయమైన దిల్లీ నగరం వాళ్ల కాలంలోనే సరస్వతిని పర సీమలకు పంపివేసింది. కొన్నాళ్ళు లఖ్నో నగరం సారస్వత కేంద్రమయింది. చివరి మొగల్ చక్రవర్తి రెండవ బహాదుర్‌షా సారస్వత ప్రియుడే కాక కవిత చెప్పే సామర్థ్యం కూడా కలవాడు. ఆనాటి మహాకవి షాహ నసీర్ చేత యువరాజుగా వుండగానే తన కవితలు దిద్దించుకుంటూ 'జఫర్' అనే కలం పేరు నెన్నుకున్నాడు. షాహ నసీర్ దిల్లీలో స్థిరంగా వుండే వాడు కాడు. వస్తూ పోతూ వుండేవాడు. హైదరాబాద్ (దక్కన్)లో అతనికి విశేషాదరం లభించింది. దీవాన్ చందూలాల్ 'షాదాఁ' కవి పోషకుడే కాక మంచి కవి కూడా. షాహ నసీర్ హైదరాబాద్‌లోనే స్థిరపడి అక్కడే మరణించినాడు.

బహాదుర్‌షా నిలకడలేని షాహ్‌నసీర్‌ను వదిలిపెట్టి షేఖ్ మొహమ్మద్ ఇబ్రాహీం జోఖ్ చేత తన కవితలు దిద్దించుకోవటం మొదలు పెట్టినాడు. జోఖ్ కూడా షాహ్ నసీర్ శిష్యుడే. బహాదుర్‌షా చక్రవర్తి అయిన తర్వత జోఖ్ రాజ గురువయినాడు. అప్పుడతని వయస్సు ఇరవై ఐదేళ్ళే. వంద రూపాయలు మాస వేతనం. చక్రవర్తి స్తుతిలో ఒక చక్కని ఖసీదా రచించి, సమర్పించి, "ఖాఖానీ-యె-హింద్" అనే బిరుదుతో సన్మానితుడైనాడు. ఫారసీ ఖసీదా రచనలో అన్వరీ, ఖాఖానీ అనే ఇద్దరు కవులు అగ్రగణ్యులు. జోఖ్ భారతదేశపు ఖాఖానీ అని ఆ బిరుదుకు అర్థం. వేదం వేంకటరాయ శాస్త్రిని ఆంధ్ర మల్లినాథసూరి అంటారే! ఇదీ అలాంటిదే.

జోఖ్ మరణించిన తర్వాత బహాదుర్‌షా జఫర్ తన గజల్లను మిర్జా గాలిబు చేత దిద్దించుకున్నాడు.

'దిద్దించుకోవటం' అనే మాట తెలుగు వాళ్ళకు వింతగా వినిపించవచ్చు. హిందుస్తానీ సంగీతంలో, (కర్ణాటక సంగీతంలో కూడా) గురుశిష్యపరంపర వున్నట్లే ఉర్దూలోను గురుశిష్య పరంపరవున్నది. గరువులేని విద్య కూసు విద్య. ఎవరో ఒక ఉస్తాదుకు తన కవిత చూపించి దిద్దించుకోనిదే ఆ కవితను ముషాయిరాల్లో వినిపించటం కాని పత్రికలకు పంపటం కాని ఉర్దూ కవుల సంప్రదాయం కాదు. డా. ఎక్బాల్ అంతటి కవి తన ఆ కవితను మహాకవి దాగ్ చేత దిద్దించుకునేవాడు. మూడు నాలుగు కవితల్లో స్వల్పమైన మార్పులు చేసి "ఇక మీ కవితకు దిద్దుబాటు అవసరం లేదు' అని రాసినాడు దాగ్. ఉస్తాద్ లేని గాయకుణ్ణి, ఉస్తాద్ లేని కవిని "బే - ఉస్తాదియా" అని పరిహసించేవాళ్ళు నిన్నమొన్నటి వరకు. ఉస్తాదుల చేత దిద్దించుకోవటం ఉర్దూలో గర్వకారణం. ఈ సంప్రదాయం ఉర్దూలో వున్నట్లుగా ఇతర భాషల్లో వున్నట్లు కనిపించదు. తెలుగులో నయితే మార్పులు సూచించే వాళ్ళను రంధ్రాన్వేషులని నిందిస్తారు. ఎవరేది రాసి వినిపించినా చాలా బాగున్నదనగలవాడే సత్పురుషుడు. సాహిత్య మర్మజ్ఞుడు. దిద్దుబాట్లు గురించి అప్రస్తుత ప్రసంగం చాలా చేసినాను. ఇక ప్రస్తుతానికి వస్తాను.

బహాదుర్ షా జఫర్ ప్రసక్తిలో జోఖ్‌ను గాలిబును పేర్కొన్నాను. ఆ యిద్దరి సమకాలీనుడే మోమిన్ ఖాన్ మోమిన్. సౌదా, మీర్, దర్దల వలెనే జోఖ్, గాలిబు, మోమిన్‌లు దిల్లీలో ఉర్దూ కవితా జ్యోతిని ఉజ్జ్వలంగా వెలిగించి ఎందరో కవులను, రచయితలను తీర్చిదిద్దినారు. వీళ్ల తర్వాత దిల్లీలో మళ్లీ అంతటి

కవులు పుట్టలేదు. అందుకే చివరి వెలుగు అన్నాను. ఈ చివరి వెలుగుకు కారణం నిస్సంశయంగా మొగల్ చక్రవర్తి బహాదుర్‌షా జఫరే. మొగల్ వంశానికి అతడూ చివరి వెలుగే. బ్రిటీష్ వాళ్లు అతన్ని రంగూన్‌లో నిర్బంధించినారు. అతడక్కడే మరణించినాడు.

ఢిల్లీలోని ఉర్దూ కవిత్వపు చివరి వెలుగైన ఆ చివరి చక్రవర్తి గురించే మొదట మాట్లాడుకుందాం. షాహ్ నసీర్, జోఖ్, గాలిబు, ముఫ్తీ సదరుద్దీన్ ఆజుర్దా, నవాబు ముస్తఫా ఖాన్ షేఫ్తా మొదలైన కొందరు కవులతో బహాదుర్‌షా ఆధ్వర్యాన లాల్ ఖిలాలో తరచుకు ముషాయిరాలు జరిగేవి. మోమిన్ ఖాన్ మోమిన్ కూడా అప్పుడప్పుడు ఆ ముషాయిరాల్లో పాల్గొనేవాడు.

బహాదుర్‌షా జాఫర్ కావ్య సంకలనాలు (దీవాన్లు) నాలుగు ప్రకాశితుము లైనవి. ఐదవది సిపాయీ విప్లవంలో నష్టమైంది. అతన్ని కవిగా అందరూ గుర్తించినారు. కాని అతని కవిత అతనిది కాదని కొందరన్నారు. మౌలానా మొహమ్మద్ హుసేన్ ఆజాద్ సరళసుందరమైన ఉర్దూ వచనంలో 'ఆబెహయాత్' అనే కవుల చరిత్ర రాసినాడు. అతడు జోఖ్ శిష్యుడు. అతని గురుభక్తి అపారమయింది. (ఆమాట అతడే చెప్పుకున్నాడు.) సిపాయీ విప్లవం తర్వాత ఢిల్లీలో జరిగిన అల్లర్లకు భయపడి అందరితోపాటు అతడు కూడా తన కుటుంబంతో రాత్రికి రాత్రి ఢిల్లీని విడిచి పంజాబుకు పారిపోయినాడు. తన యింట్లోంచి యే వస్తువూ వెంట తీసుకెళ్ళలేదు. గురువుగారి కవితల చిత్తు ప్రతిని మాత్రం తీసుకెళ్ళి తర్వాత ప్రచురింపజేసినాడు. "నా సర్వస్వం పోతే పోయింది. అన్నిటి కంటే విలువైన గురువుగారి కవితల వ్రాతప్రతిని దక్కించు కున్నాను" అని గర్వంగా చెప్పుకున్నాడు. అతని దృష్టిలో అతని గురువుగారి కవిత గాలిబు కవిత కంటే ఉత్తమమయింది. మోమిన్‌నయితే అతడు ఆబె-హయాత్ మొదటి ముద్రణలో ముట్టుకోనే లేదు. పత్రికల్లో పలువురు విద్వాంసులు నిరసన తెలిపినందువలన రెండవ ముద్రణలో మోమిన్‌ను చేర్చుకున్నాడు. అంటే మోమిన్ కూడా తన గురువైన జోఖ్ ముందు నిలువదగిన కవి కాడనే అతని అభిప్రాయం. అతని గురుభక్తి అంతటితో ఆగలేదు. "చక్రవర్తి తన గజల్ల ఎముకల గూళ్లు పంపేవాడు. గురువుగారు వాటికి రక్తమాంసాలు నింపి, ప్రాణం పోసి పంపేవారు." అని రాసినాడు. అంటే, బహాదుర్‌షా పేర ప్రచారంలో వున్న గజల్లు అతడు రాసినవి కావు. అతడు కొన్నిపదాలు, కొన్ని మిస్రాలు అరకొరగా రాసి పంపితే వాటిని ఉపయోగించుకొని జోఖ్‌గజల్లు రాసి పంపేవాడని ఆజాద్ ఉవాచ.

ఎంతటి అసత్య ప్రచారమో చూడండి. ఉస్తాద్ కనుక జఫర్ కవితలో జోఖ్ కొన్ని సవరణలు తప్పక చేసి వుంటాడు. అంత మాత్రాన జఫర్ కవిత్వమంతా జోఖ్ రాసిందే అనటం అన్యాయం కదా! ఇంత అన్యాయంగా కాకున్నా ఇంక కొందరు జఫర్ గజళ్లు. కొన్ని చాలా వరకు గాలిబు రాసినవే అన్నారు. నేడు అందరి కవిత్వాలు మన ముందున్నవి. జఫర్ కవిత మీద షాహ్ నసీర్ రంగు కాని, జోఖ్ రంగు కాని, గాలిబు రంగు కాని ఏ మాత్రం కనిపించదు. ఎవరి రంగు వాళ్లదే. ఎవరి శైలి వాళ్ళదే. జఫర్ భాష జోఖ్ భాషలాగే పరిశుద్ధమైన దిల్లీ శిష్ట వ్యవహారంలో వున్న భాష. అంత వరకే పోలిక. జఫర్ కవిత అతని స్వీయానుభవాల వ్యక్తీకరణ. అతని జీవితమే ఒక విషాదం. పేరుకు మొగల్ చక్రవర్తి. సామ్రాజ్యం లేదు. సంపద లేదు. అధికారం లేదు. ఆ బాధ ఎంత దుస్సహమైంది! అతని కళ్ళ ముందే బ్రిటిష్ వాళ్ళు అతని బంధువులను నానా హింసల పాలుచేసినారు. ఎదిగిన కొడుకును కాల్చి చంపినారు. చివరికి సింహాసనం మీంచి క్రిందికి లాగి రంగూన్‌లో బంధించినారు. ఇదంతా అతని కవితలో కనిపిస్తుంది. అతని దుఃఖం వినిపిస్తుంది. జోఖ్‌గాని గాలిబు గాని జఫర్ కవితలాంటి కవిత రాయలేదు. వాళ్ళు జఫర్ కంటే గొప్ప కవులే. కాని జఫర్ అనుభవాలు వాళ్ళకు లేవు గదా!

సాహిత్య చరిత్రకారులిలాటి సాహసాలు చేస్తారు. ఆముక్త మాల్యద శ్రీ కృష్ణ దేవరాయల రచన కాదని, అల్లసాని పెద్దన రచన అని మన సాహిత్య చరిత్రకారులు కొందరు వాదించినారు గదా! దేశ చరిత్రలో జఫర్‌కు చక్రవర్తిగా ఎలాగూ గుర్తింపు లేదు. సాహిత్య చరిత్రలోనూ అతనికి గుర్తింపు లేకుండా చేసే ప్రయత్నం చేసినారు కొందరు. అది వ్యర్థ ప్రయత్నమే అయింది.

జఫర్ కూడా కొంతకాలం చక్రవర్తిగా సింహాసనం మీద కూర్చున్నవాడే. అక్బర్ కూర్చున్న సింహాసనమది. సంపద లేకున్నా, సామ్రాజ్యం లేకున్నా అతనికొకింత మాన్యత వుండేది. బ్రిటిష్ వాళ్ళు ఏ ప్రభుత్వాదేశం వెలువరించినా బహాదుర్‌షా జఫర్ రాజముద్రికతోనే వెలువరించేవాళ్ళు. సంపన్నులైన అవధ్ నవాబులు అతని సామంతులే. అతని ముందు ఏడుసార్లు వంగి సలామ్ చేసేవాళ్ళే. కొన్నాళ్ళ తర్వాత అవధ్ నవాబులు బ్రిటిష్ వాళ్ళ సహాయంతో స్వతంత్రులైనారు. బహాదుర్‌షా అధికారాలు లాక్కోబడినవి. కంపెనీ వాళ్ళు చెప్పినట్లు వినాలె. తాతల నాటి లాల్ ఖిలాలోనూ అతడు పరాధీనుడే. స్వతంత్రించి ఏమాట అంటే ఏ ముప్పు ముంచుకువస్తుందో అని భయం.

బాత్ కర్నీ ముఝే ముష్కిల్ కభీ ఐసీతో నథీ
జైసి అబ్‌హై తెరీ మహఫిల్ కభీ ఐసీతో నథీ
లేగయా లూట్‌కె కోన్ ఆజ్ తెరా సబ్రొఖరార్
బేఖరారీ తుఝే ఐదిల్ కభీ ఐసీతో నథీ.

గజల్ సంప్రదాయంలో ప్రేయసినీ, హృదయాన్నీ సంబోధించి అన్నమాటలివి. ఇవి ఆ పరిస్థితుల్లో వున్న జఫర్ మాత్రమే అనగలడు. జోఖ్ అనలేడు. గాలిబ్ అనలేడు.

మత్లా ప్రేయసిని ఉద్దేశించి అన్న మాట- షేర్ హృదయాన్ని గురించి అన్నమాట.

"నీ మహ్‌ఫిల్ ఈ నాడెలా వున్నదో ఇంతకు ముందు అలా వుండేది కాదు. మాట్లాడటం ఇంత కష్టమయ్యేది కదెన్నడూ."

"హృదయమా! నేడు నీ సహనాన్నీ శాంతినీ ఎవరు దోచుకున్నారు? ఇంతటి ఉద్విగ్నత నీకెన్నడూ ఉండేది కాదు."

జఫర్‌కు తన నిరర్థకమైన, నిస్సారమైన జీవితం తెలుసు. తన చివరి రోజులెలా గడుస్తాయో తెలుసు. అందుకే.

న కిసీకి ఆంఖ్‌క నూర్ హూఁ- న కిసీకె దిల్‌క కరార్ హూఁ
జో కిసీకె కామ్ న ఆసక- వొ యేక్ ముష్తె- గుబార్ హూఁ

"ఎవరి కంటి వెలుగును కాను నేను. ఎవరి హృదయ స్థిమితం కాను. ఎవరికీ పనికిరాని పిడికెడె ధూళిని నేను."

పయె ఫాతిహా కోయి ఆయె క్యూఁ- కోయి చార్‌ఫూల్ చఢాయె క్యూఁ
కొయి షమ్మలా కె జలాయె క్యూఁ- మైతో బేకసీ కా మజార్‌హూఁ

"నేనొక నిస్సహాయుని సమాధిని. ఈ సమాధి మీద ఎవరైనా ఎందుకు ఫాతిహా చదువరావాలె? ఎవరైనా నాలుగు పూలెందుకు చల్లాలె? ఎవరైనా దీప మెందుకు వెలిగించాలె."

జీవచ్ఛవానికి శవానికి జరిగే సన్మానం కూడా జరుగదని కవి భావం.

న జఫర్ కిసీక హబీబ్ హూఁ- న జఫర్ కిసీక రఖీబ్ హూఁ
జో బిగడ్‌గయా వొ నసీబ్ హూఁ- జో ఉజడ్ గయా వొ దయార్‌హూఁ

"జఫర్! నేనెవరికీ మిత్రున్ని కాను. ఎవరికీ శత్రువును కాను. చెదిరిపోయిన భాగ్యరేఖను- పాడుపడిన ప్రాంతాన్ని" అన్నాడు.

ఇవి జోఖ్ మాటలా? గాలిబ్ మాటలా? గాయపడిన జఫర్ గుండె సవ్వడి కాదా యిది?

రంగూన్‌లో బందీగా వున్నప్పుడు రాసిన గజల్ చాలా ప్రచారం చెందిందే. అది అచ్చమైన అతని ఆవేదనే.

లగ్తా నహీహై జీమెరా- ఉజ్‌డే దయార్‌మే

కిస్కీ బనీ హై ఆలమె- నా పాయదార్ మే.

"ఈ పాడుబడిన ప్రాంతాన నా మనస్సు నెమ్మది పొందదు. అశాశ్వతమైన ఈ ప్రపంచంలో ఎవరి కోరిక తీరింది గనుక?"

ఇన్ హస్రతోఁసె కహదో కహీఁ ఔర్ జా బసేఁ

ఇత్నీ జగహ్ కహాఁ హై దిలె- దాగ్దార్ మే

"ఈ కోరికలను ఇంకో చోటు చూచుకొమ్మని చెప్పండి. గాయాలతో నిండిన నాగుండెలో వాటికి చోటేది?"

ఉమ్రే దరాజ్ మాంగ్ కె లాయా థా చార్ దిన్

దో హస్రతోఁమె కట్‌గయె దో ఇంతెజార్ మే

"నాల్గు రోజుల దీర్ఘ జీవితాన్ని అడిగి తెచ్చుకున్నాను. రెండు ఆశల్లో గడిచిపోయె. రెండు నిరీక్షణలో గడిచిపోయె."

కిత్నాహై బద్ నసీబ్ దఫ్నకేలియే జఫర్

దో గజ్ జమీన్ భీ న మిలీ కూయె యార్ మే.

"జఫర్! ఎంత దురదృష్టవంతునివి నువ్వు! ప్రేయసి వీధిలో (దిల్లీలో) సమాధి కోసం ఆరడుగుల స్థలం దొరకదాయె నీకు.

జోఖ్, గాలిబు స్థాయికి చెందిన మహాకవి కాకున్నా జఫర్ మంచి కవి - అతనికి బ్రజ భాష కూడా బాగా వచ్చు. కొన్ని ఫమ్రీలు, దాద్రాలు రాసినాడతడు. హిందీ కవిత రాసినాడు.

◆ ◆ ◆

జోఖ్

షేఖ్ మొహమ్మద్ ఇబ్రాహీం జోఖ్ ఒక సామాన్య సిపాయీ కొడుకు. చిన్ననాడు ఆనాటి అవసరమైన చదువులన్నీ చదివి తండ్రిలాగా కత్తి పట్టటానికి బదులు కలం పట్టటానికి నిర్ణయించుకున్నాడు. ఉర్దూ, ఫారసీ, అరబీ భాషలు చక్కగా నేర్చుకున్నాడు. ఉర్దూ, ఫారసీ మహాకవుల కావ్యాలను శ్రద్ధగా చదివి తానూ కవితలల్లటం ప్రారంభించినాడు. షాహ్ నసీర్ అప్పుడు దిల్లీలో మహాకవి. అందరి కవితలు అతడే దిద్దేవాడు. కవిత్వాన్ని దిద్దటాన్ని 'ఇస్లాహ్' అంటారు. జోఖ్ కూడ తన కవితను షాహ్ నసీర్‌కే సమర్పించేవాడు. కాని వాళ్ల గురుశిష్య సంబంధం చాల నాళ్లు సాగలేదు. షాహ్ నసీర్ దిల్లీలో నిలుకడగా వుండక పోవటమొక కారణమైతే ప్రసాదగుణాన్ని అభిమానించే జోఖ్‌కు షాహ్‌నసీర్ కఠినశైలి నచ్చక పోవటం రెండవ కారణం. జోఖ్ స్వయం కృషితోనే చక్కని కవిత రాస్తూ ఉస్తాద్ స్థానాన్ని అందుకోగలిగినాడు. యువరాజు బహాదుర్‌షా జఫర్ గురువైనందున అప్పటి అనేకులు అతని చేతనే తమ కవిత దిద్దించుకునేవాళ్లు. ఆ స్థానాన్ని అంటిపెట్టుకొని వున్న కారణంగా జోఖ్‌కు ఖసీదాలు రచించటం తప్పనిసరి అయింది. ఖసీదాలు రచించే కవికి భాషలో పాండిత్యమే కాక కావ్యాలంకార శాస్త్రాల్లోనూ మంచి పాండిత్యం అవసరం. ఉర్దూలో ఖసీదా కవులుగా ఖ్యాతిగాంచిన వాళ్ళు ఇద్దరే. సౌదా,జోఖ్. అయితే సౌదా స్థానం జోఖ్ కంటె ఉన్నతం. ఆ యిద్దరు కవులు స్తుతించిన పాదుషాలు కత్తిపట్టని వీరులు. సంపదలేని సామ్రాట్టులు- అధికారంలేని ఆలంపనాహ్‌లు. కాబట్టి వాళ్ళను గురించి రాయబడిన ఖసీదాలు అతిశయోక్తులతో అవాస్తవికమైన కవితలు. ఖసీదా రాసే కవికి భావుకతతో పనిలేదు. భావుకత గజల్ కవికి అవసరం. జోఖ్ గజల్లు కూడ చెప్పినాడు. ఆ గజల్లు గాలిబు కంటె ఉత్తమమైనవని జోఖ్ శిష్యులు కొందరు ప్రచారం చేసినారు. కాని అది సత్యదూరమైన ప్రచారం. జోఖ్ గజల్లు కొన్ని ఉత్తమమైనవే. కాని గాలిబు గజల్ల కంటే ఉత్తమమైనవనటం సరికాదు. జోఖ్ భాష పరిశుద్ధమైన దిల్లీ నుడికార శోభితమైంది. రోజ్‌మర్రాలు, మొహావిరాలు అతని కవితలో సుందరంగా ప్రయోగించబడినవి. కాని గజల్‌కు ప్రాణమైన భావుకత

చాల స్వల్పం. శతక కవులలాగా అతడు సాధారణ నీతులను, లోకోక్తులను చక్కగా చెప్పగలడు. కాని హృదయ భావాల అభివ్యక్తీకరణ అంతగా కనిపించదు.

వ్యక్తిగా జోఖ్ ఉత్తముడు. సరళ స్వభావుడు. ధనాపేక్షగాని, కీర్తికాముకత కాని అతనిలో లేవు. కాబట్టి ఉన్నంతలో తృప్తిపడుతూ, ఎవరితోనూ స్పర్ధకు దిగక సంతోషంగా జీవితం గడిపినాడు. అతని గురువు షాహనసీర్ "మియాఁ ఇబ్రాహీం! దిల్లీలో ఏమున్నది? నా వెంట హైదరాబాద్‌కురా. నీ మీద కనక వర్షం కురుస్తుందక్కడ." అని చాలసార్లు ప్రలోభపెట్టినా దిల్లీని వదిలి పెట్టలేదతడు. దిల్లీ గల్లీలు గాలిబు కెంత ప్రియమైనవో జోఖ్‌కూ అంత ప్రియమైనవే.

గర్చెహై ముల్కే దకన్‌మే ఇన్ దినోఁ ఖదరే-సుఖున్
కోన్ జావే జోఖ్! పర్ దిల్లీకి గలియాఁ ఛోడ్‌కర్

"దక్కన్ (హైదరాబాద్)లో ఇప్పుడు కవితకు చాల గౌరవం వున్నది. కాని దిల్లీ వీధులను వదిలిపెట్టి ఎవరు వెళ్తారు?"

అని ఒక గజల్ మఖ్తాలో చెప్పుకున్నాడు.

జోఖ్ గజల్లలోని కొన్ని షేర్లు ఉదాహరించి ఈ ప్రసక్తి ముగిస్తాను.

అబ్‌తో ఘబ్రాకె యెకహ్తే హైఁకె మర్‌జాయేంగే
మర్ కెభీ చైన్ న పాయాతో కిధర్ జాయేంగే

"ఇప్పుడు జీవితంలో భయపడి చచ్చిపోతామంటాము. చచ్చిపోయిన తర్వాత కూడ మనశ్శాంతి లభించకపోతే ఇంకెక్కడికి పోతాము?"

బజా కహే జిసే ఆలం ఉసే బజాసమ్‌ఝొ
జబానె ఖల్ఖ్‌కు న ఖ్కారయే ఖుదా సమ్‌ఝొ

"లోకులంతా ఏది మంచిదంటున్నారో అదే మంచిదనుకో. లోకుల వాక్కును భగవంతుని నగారాగా భావించు."

లాయీ హయాత్ ఆయె ఖజా లేచెలీచలే
అప్నీ ఖుషీ న ఆయె న అప్నీ ఖుషీ చలే

"ఈ ప్రపంచంలోనికి మన యిష్టంతోరాలేదు. మన ఇష్టంతో పోలేము. జీవితం తెచ్చింది. వచ్చినాము. మృత్యువు తీసుకెళ్తుంది. పోతాము."

ఆద్మియ్యత్ ఔర్‌షైహై ఇల్మ్‌హై కుఛ్ ఔర్‌షై

కిత్న తోతేకో పఢాయా పగ్‌వొ హైవాఁ హీ రహా

"మానవత వేరు చదువు వేరు. చిలుకను ఎంత చదివించినా చివరికి అది పక్షే.(దానిలో మానవత రాదు).

కియా హమ్నే సలామ్ ఐ ఇష్క్ తుఝ్‌కో

కె అప్నా హోస్లా ఇత్నా న పాయా

"ఓ ప్రణయమా! నీకు దూరం నుంచే సలాం చేస్తున్నాను. నిన్ను చేరదీసే సాహసం నాలో లేదు."

ఉల్ఫత్ కా నిషా జబ్ కోయి మర జాయెతో జాయే

యే దర్దె సర్ ఐసా హైకె సర్ జాయెతో జాయే

"ప్రేమనిషా చనిపోతేనే పోయేది ఈ తలనొప్పి తల పోతేనే పోయేది."

తుమ్ భూల్‌కర్ భీ యాద్ నహీ కర్తేహో గోయా

హమ్‌తో తుమ్హారీ యాద్‌మె సబ్ కుఛ్ భులా దియా

"నువ్వు మరిచి గూడా నన్ను జ్ఞాపకం చేయవు. నేనేమో నీ జ్ఞాపకాల్లో సమస్తం మరిచి పోయినాను."

◆ ◆ ◆

మోమిన్ ఖాన్ మోమిన్

మోమిన్ ఖాన్ తండ్రి తాతలు వాసికెక్కిన వైద్యులు. వైద్యం (హకీమీ) వాళ్ల వంశంలో గౌరవప్రదమైన వృత్తి. మోమిన్ వైద్యవృత్తిలో చాల కీర్తి గడించి నాడు. వాళ్లది సంపన్నకుటుంబం. పైగా వైద్యవృత్తిలో అనల్పమైన ఆదాయం. కాబట్టి ఎవరినీ ఆశ్రయించవలసిన అవసరం రాలేదతనికి. అత్యంత ప్రతిభా వంతుడు కనుక అందమైన గజల్ రచన అతనికి సులభ సాధ్యమైంది. జ్యోతిషం, గణితం, సంగీతంలో ప్రశంసనీయమైన ప్రజ్ఞ అతనిది. అతని గజల్లు నాదమధుర మైనవి. సంగీత విద్య నెరిగిన వాడు గదా. అతని గజల్లు గాలిబ్ గజల్లకంటె రమ్యంగా వుంటాయని కొందరు అభిప్రాయపడ్డారు. మోమిన్ గజల్లకు రమ్యత వుండవచ్చు. గాలిబ్ గజల్ల గాంభీర్యం లేదు. సమకాలీనులయినందు వలన

ఆనాటి విద్వాంసులు జోఖ్, మోమిన్, గాలిబుల కవితల తారతమ్యం నిర్ణయం చేసే ప్రయత్నం చేసి ఎవరికితోచిన అభిప్రాయం వాళ్లు వెల్లడించినారు. ఆ అభిప్రాయాలు సరైనవి కావు. గాలిబు ప్రతిభను సమకాలీనులు గుర్తించలేదు. మీర్ తర్వాత గాలిబుతో పోల్చదగిన కవి ఉర్దూ సాహిత్యంలో లేడు.

నజీర్ అక్బరాబాదీ ఒక నర్తకిని ప్రేమించినాడట. ఆమె పేరు మోతీ. వేశ్యలను, నర్తకులను వర్ణించే సందర్భంలో మోతీని కాస్త అతిగా వర్ణించినాడు. కాబట్టి ఆమెను ప్రేమించినాడని సాహిత్య విమర్శకులు అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ షహబాజ్ కూడ నమ్మినాడు. అయితే, ఆ ప్రేమ నజీర్ కవిత మీద ఏలాంటి ప్రభావం చూపలేదు.

మిర్జా గాలిబ్ దీవాన్‌లో ఒక ప్రేయసి గురించి రాసిన విషాద కవిత వున్నది. "నేను మొగల్ బిడ్డను. మొగలాయీలకు ప్రేమించటం వెన్నతో పెట్టిన విద్య. పడుచు నాళ్లలో నేనూ ఒక డోమ్నీని (నాట్యకత్తె) ప్రేమించినాను. ఆమె నా ప్రేమలో చనిపోయింది." అని మిర్జా గాలిబు ఒకరికి గర్వంగా జాబు రాసినాడు. ఆ ప్రేమ వృత్తాంతాన్ని పురస్కరించుకొని ఒక సినిమా (మిర్జాగాలిబ్) కూడ వచ్చింది. ఆ ప్రేమ ఎంతవరకు నిజమో చెప్పలేదు. ఈలాటి కల్పనలు చేయటం గాలిబుకు అలవాటే. అయితే, ఆ ప్రేమ నిజమైనా దాని ప్రభావం గాలిబు కవిత మీద పడలేదు. మోమిన్ ఖాన్ మోమిన్ కూడ ఒకవేశ్య ప్రేమ పాశబద్ధుడైనాడట. ఆ కాలంలో సంపన్నుల కొడుకులకు వ్యసనాలు అలంకారాలే. మోమిన్ ఖాన్ వేశ్య ప్రేమలో పడటం తప్పుకాదు. కాని అతని అందమైన శృంగార కవిత ఆ వేశ్య ప్రేమలోనే అల్లినదయినందున ఆ కవిత చాల చోట్ల అశ్లీలతా స్పర్శ కలిగి ఉన్నది. సూఫీ కవుల గాంభీర్యం కూడ అతని కవితలో లేదు. అట్లని మోమిన్ సామాన్య కవి అనలేము.

తుమ్ మెరే పాస్ హోతేహోగోయా
జబ్ కొయీ దుస్రా నహీ హోతా

"నా దగ్గర ఇంకెవరూ లేనప్పుడు నువ్వేవుంటావు." అనే మోమిన్ షేర్‌కు బదులుగా తన మొత్తం దీవాన్‌నే ఇస్తానన్నాడట గాలిబు. ఇందులో సూఫీ భావమున్నది. మోమిన్ కవితలో ఇష్కె హఖీఖీ వెదికే వాళ్ళకు నిరాశే కలుగవచ్చు. కాని ఇష్కె- మజాజీ శృంగారంతో ఆనందించే వాళ్లకు నిజంగా ఆనందం కలుగుతుంది. అక్కడక్కడ కనిపించే అశ్లీలతను భరించుకో గలిగితే అతని గజల్ కవిత పఠితలకు, శ్రోతలకు సంతోషప్రదమైందే. కొన్ని షేర్లు ఉదాహరిస్తాను.

అతడు తన 51వ యేట కోఠీ మీది నుంచి పడి మరణించినాడు. ఎర్రకోటలో జరిగే ముషాయిరాల్లో ఎప్పుడూ గాని పాల్గొనేవాడు కాడు. ఏ పాదుషాను, నవాబును గురించి ఖసీదాలు రాయవలసిన పని పడలేదతనికి. పట్యాలా మహారాజు ఏనుగును బహూకరించినప్పుడు మాత్రం ఒక ఖసీదా రాసి సమర్పించుకున్నాడు.

యె హాలత్ హైతో క్యాహాసిల్ బయాఁసే
కహూఁ కుఛ్ ఔర్ కుఛ్ నిక్లే జబాఁసే

"ఇలా నా పరిస్థితిని ప్రేయసికి విన్నవించుకోవటం వలన లాభమేమిటి? ఏదో అంటాను. నోటి నుంచి ఏదో వెళ్తుంది." అంటే, ప్రేయసి సౌందర్యం ముందు మాట్లాడేశక్తి ఉండదు. ఒకమాట అనబోయి ఇంకో మాట అంటాను. అని భావం. సౌందర్య సన్నిధానంలో ఈ తడబాటు సహజమే. దీన్నే "రొఅబె-హుస్న్" అంటారు.

వొ ఆయే హైఁ పషీమాఁ లాష్పర్ అబ్
తుఝే అయ్ జిందగీ లావూఁ కహాఁసే

"ఆమె నా శవం దగ్గరికి పశ్చాత్తాప పడుతూ వచ్చింది. ఓ జీవితమా! నిన్నిప్పుడెక్కడి నుంచి తేను?"

"వొ హమ్‌మె తుమ్‌మె ఖరార్‌థా- తుమ్హె యాద్ హోకె న యాద్‌హో" అనే శృంగార రస ప్రధానమైన నజం చాల ప్రసిద్ధమయినది.

◆ ◆ ◆

మిర్జా గాలిబ్

మీర్ తఖీ మీర్ తర్వాత ఉర్దూ కవుల్లో మిర్జా గాలిబు స్థానమే ఉన్నతమయింది. మిర్జా గాలిబు పొందిన కీర్తి ప్రతిష్ఠలు ఇంకే ఉర్దూ కవులు పొందలేదనటం అతిశయోక్తికాదు. చిత్రమేమంటే కొందరు తప్ప సమకాలీనుల్లో చాల మంది మిర్జా గాలిబు గొప్పదనాన్ని గుర్తించలేక పోయినారు. అతడూ తన ఉర్దూ కవిత గురించితప్పుడు అంచనా వేసుకున్నాడు. తన ఫారసీ కవిత కారణంగానే తనకు కవి యశస్సు లభిస్తుందనుకున్నాడు. ఉర్దూ కవిత ఉబుసుపోకకు రాసిందే అనుకున్నాడు. "మిర్జా! మీ ఉర్దూ గజల్‌లో యేమున్నది? నాకే సిగ్గుగా వుంటుంది. నా ఫారసీ గజల్లు చదువండి" అనేవాడు. అతని అంచనా తప్పింది. ఫారసీ గజల్లు మూలకు పడిపోయినవి. ఉర్దూ గజల్ల దీవాన్, చాల చిన్నదయినా, ఉర్దూ సాహిత్యంలో మణిదీపమై వెలుగుతున్నది. క్రీ.శ. 1797లో జన్మించిన గాలిబు క్రీ.శ. 1869లో మరణించినాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అతని కవిత్వాన్ని గురించి, అతని జాబుల గురించి సాహిత్య సమీక్షకులు, విమర్శకులు రాస్తూనే వున్నారు. గాలిబుకు జాబులు రాయటం జవాబులు తెప్పించుకోవటం సరదా. దూరాన వుండే శిష్యులకు అభిమానులకు జాబులు రాస్తూ వెంటనే జవాబు రాయవలసిందిగా ఆదేశించేవాడు. సమయానికి డబ్బులేకుంటే బేరంగ్ (Unpaid) జాబులయినా పంపవలసిందని రాసేవాడు. అతని కవిత ఎంత కఠినమో, అతని జాబులలోని ఉర్దూ భాష అంత సరళం. ముఖాముఖి మాట్లాడుకున్నట్లుగా వుంటాయతని జాబులు. హాస్యప్రియుడు గనుక అతని జాబుల్లో తొణికిసలాడే హాస్యం, అతని బహుముఖ పాండిత్యం వలన అతని జాబులు నేటికీ పఠితలను అలరిస్తాయి. ఎన్నో విషయాలు తెల్పుతాయి. అతని శిష్యులు కొందరు అతని జాబులు సేకరించి ప్రచురించాలనే కోరికను తెల్పినారు. "మనం మనం మాట్లాడుకున్న మాటలు మందిలో పడటమెందుకు? నాకు సమ్మతం కాదు" అని మందలించినాడు. అయినా అతని శిష్యులొక సంకలనం అచ్చువేయనే వేసినారు. దానికి అనుకోనంత ఆదరణ లభించింది. తర్వాత గాలిబే తనజాబులు తెప్పించి సంకలన కర్తల కిచ్చేనాడు. అతని జీవిత కాలంలోనే అతని జాబుల సంకలనాలు మూడు ప్రచురణ పొంది ప్రజాదరణ పొందినవి. తర్వాత కూడా

అచ్చుయినవి. ఇప్పటికీ అతని చిన్న చిన్న రచనలు, వెలుగు చూడని జాబులు ప్రచురిస్తున్నారు. జాబుల విషయంలోనూ గాలిబు అంచనా తప్పింది. నేడు గాలిబు కీర్తిప్రతిష్ఠలకు కారణం అతని ఉర్దూ కవితా సంగ్రహం. అతని ఉర్దూ జాబులు. అతని ఫారసీ కవితకు గాని, ఫారసీ వచన రచనలకుగాని అతడాశించిన కీర్తి లభించలేదు. మొగలుల సామ్రాజ్యమంతరించింది. ఫారసీ ప్రాముఖ్యం కూడా అంతరించింది. ప్రొఫెసర్ రషీద్ అహమద్ సిద్దీఖీ మాటల్లో మొగలులు మన దేశానికి అమూల్యమైన మూడు కానుకలిచ్చిపోయినారు. తాజ్‌మహెల్, ఉర్దూ, గాలిబు. కట్టడాల్లో తాజ్‌మహెల్- కవుల్లో గాలిబు'

సమకాలీనులతని ఉర్దూ గజల్లను అంతగా ఆదరించలేదని పైన రాసినాను. దానికి కారణం తొలుత కొంతకాలం అతడు సామాన్యులకు అర్థంకాని కవిత చెప్పినాడు. అతని ఫారసీ భాషా జ్ఞానం అపారమయింది. ఫారసీపట్ల అతని వ్యామోహమూ అధికమే. అతడు గొప్ప మేధావి. ఫారసీలో బేదిల్ అనే కవి కఠిన శైలిలో, దీర్ఘ సమాసాలతో, అన్వయం కుదురని కవిత చెప్పేవాడు. గాలిబు కతడు నచ్చినాడు. కనుక గాలిబు కూడా బేదిల్ శైలిలోనే కవిత చెప్పేవాడు. ప్రసాద గుణభరితమైన మీర్, సౌదా, ముస్హఫీ, ఆతిష్ లాంటి ఉర్దూ మహాకవుల కవితలు చదివి ఆనందించే సాహితీ ప్రియులకు మిర్జా గాలిబు కవిత కొరుకుడు పడేది కాదు. "మీ కవిత మీకే తెలియాలె- లేదా, పైవానికి తెలియాలె. మాకయితే అర్థం కాదు." అని పరిహసించే వాళ్లు ఆనాటి విద్వాంసులు. తనకు ఆప్తులైన మిత్రుల చేతిలో తన దీవాన్ పెట్టి "సామాన్యులకు అర్థంకాని కవితలు తొలగించండి" అని కోరినాడు. అలా తొలగించగా మిగిలిన కవితలే ఇప్పుడు "దీవానె గాలిబ్" లో చోటు చేసుకున్నవి. అయినా గాలిబు దీవానుకు ఐదారు వ్యాఖ్యానాలు వెలసినవి. వ్యాఖ్యాన రచయితలు కూడా సామాన్యులు కారు. సాధారణంగా ఉర్దూ దీవానులకు వ్యాఖ్యానాలుండవు. గాలిబుదీవాను వ్యాఖ్యానం లేకుండా చదివి అర్థం చేసుకోవటం సులభం కాదు.

మిర్జా గాలిబు బాల్యం ఆగ్రాలో మాతామహునింట గడిచింది. పన్నెండు సంవత్సరాల వయసులోనే అతడు కవితా రచన ప్రారంభించినాడు. అప్పటి అతని గజలును ఆగ్రాలోనే వుండే వృద్ధ మహాకవి మీర్ కు ఎవరో వినిపిస్తే "ఈ కుర్రవాడు మహామేధావి. మంచి గురువు దొరికెనా అద్భుతమైనకవిత చెప్పి మహాకవి కాగలడు. లేకపోతే ఎవరికీ అర్థం కాని కవిత చెప్తాడు." అని తన అభిప్రాయం తెల్పినాడట. గాలిబు గురువెవరో మనకు తెలియదు. కొన్నాళ్లేమో

అబ్దుస్సమ్మదనే ఫారసీ దేశం నుంచి వచ్చిన విద్వాంసుడు తనగురువని చెప్పుకున్నాడు. ఆ తరువాత, అబ్దుస్సమద్ నా కల్పన. మహా కవులకు దేవుడే గురువు" అని చెప్పుకున్నాడు.

మిర్జాగాలిబు తుర్కిస్థానంలోని సల్జూఖీ రాజవంశానికి చెందినవాడు. అతని తాత ఖోఖాన్ బేగ్ భారతదేశం వలస వచ్చినాడు. కొంతకాలం లాహోర్‌లో వున్నాడు. తర్వాత దిల్లీలో చక్రవర్తి సైన్యంలో చేరినాడు. గాలిబు పూర్వీకులు కత్తిపట్టే యుద్ధ వీరులు. కలం పట్టిన వాళ్లుకారు. కవిత చెప్పిన వాళ్లూ కారు. ఆ విషయం గర్వంగా చెప్పుకున్నాడతడు.

సౌపుష్త్ సే హై పేషయే- ఆబా సిపహ్‌గిరీ
కుఛ్ షాయిరీ హి జరీయయే ఇజ్జత్ నహీఁ ముఝే

"నూరు తరాలనుంచి మా పూర్వీకులు సిపాయీలు. కవిత చెప్పటం గౌరవప్రదమైన వృత్తి కాదు నాకు." అని ఒక కవితలో చెప్పినాడు. రాజ గురువు జోఖ్‌కు తనకు మనస్పర్థలు కలిగించే ప్రయత్నం జరిగినప్పుడు చెప్పిన కవిత యిది.

ఖోఖాన్‌బేగ్‌కు నలుగురు కొడుకులు. పెద్ద కొడుకు అబ్దుల్లా బేగ్ ఖాన్. రెండవ వాడు నసరుల్లా బేగ్ ఖాన్. కడమ యిద్దరి ప్రసక్తి ఎక్కడా లేదు. అబ్దుల్లా బేగ్ ఖాన్ ఎందరో సంస్థానాధీశుల సేనలో పని చేసినాడు. చివరికి అల్వార్ మహారాజు సేనలో పని చేస్తూ యుద్ధంలో మరణించినాడు. అతని కొడుకే మిర్జా అసదుల్లా బేగ్ ఖాన్. తండ్రి మరణించేనాటికి అతని వయస్సు ఐదేండ్లు. అతని పోషణ భారాన్ని పినతండ్రి నసరుల్లా బేగ్ ఖాన్ వహించినాడు. అతడు లాహోరు జాగీర్దారుల అల్లుడు. లాహోరూ అల్వార్ సంస్థానంలోనిదే. అన్న మరణించిన తర్వాత నాలుగేళ్లకే అతడు ఏనుగు మీదినుంచి పడి మరణించినాడు. మళ్లీ అసదుల్లా బేగ్ ఖాన్, అతని తమ్ముడు యూసుఫ్ బేగ్ ఖాన్ దిక్కులేని వాళ్లయినారు. యూసుఫ్ చిన్నప్పటినుంచే మనస్తిమితం లేనివాడు. వాళ్లిద్దరు ఆగ్రాలో మతామహునింట పెరిగినారు. మాతామహుడూ జాగీర్దారే. పైగా సాహిత్యప్రియుడు. ఆనాటి ప్రసిద్ధ కవులు, విద్వాంసులు అతనింటికి వచ్చేవాళ్ళు. సాహిత్య గోష్ఠులు, కవితా చర్చలు జరిగేవి. జాగీర్దార్ల పిల్లల వలె గారాబంగా, దర్జాగా పెరిగిన అసదుల్లాబేగ్ ఖాన్ ఆ యింటి వాతావరణంలో సాహిత్యాభిరుచి పెంచుకున్నాడు. కవిత చెప్పటం కూడ ప్రారంభించినాడు. తొలుత 'అసద్' అనే

కలం పేరు ఎన్నుకున్నాడు. తర్వాత గాలిబ్ అని మార్చుకున్నాడు. అతని దీవాన్‌లో రెండు కలం పేర్లతో రచించిన గజల్లున్నాయి.

నవాబు మిర్జా అసదుల్లా బేగ్ ఖాన్ (ఇంట్లో పిలిచేపేరు మిర్జా నౌషా) వివాహం అతని పదమూడవయేట లాహోరు జాగిర్దారులింటి ఆడపడుచు ఉమ్రావు బేగంతో జరిగింది. వివాహమైన తర్వాత అతడు ఆగ్రా నుంచి దిల్లీకి మకాం మార్చినాడు. కంపెనీ ప్రభుత్వం నసరుల్లాబేగ్ కుటుంబానికి పదివేల పెన్షన్ మంజూరు చేసింది. దాని ప్రకారం గాలిబుకు ఐదువేలు రావాలె. కాని పదివేలకు బదులు ఐదువేలే మంజూరు చేయించానాడు అతని పెదమామ. గాలిబుకు పదిహేను వందలు,యూసుఫ్‌కు ఐదు వందలు మాత్రమే అందేవి. అవి అతని నవాబీ దర్జాకు ఎటూ సరిపోయేవి కావు. మిగతా మూడు వేల కోసం ప్రయత్నించ టంలోనే అతని జీవితం గడిచింది. పెన్షన్ ఎన్నటికైనా బకాయాతో దొరుకుతుందన్న ఆశతో జీవితమంతా అప్పులు చేస్తూ గడిపినాడు గాలిబ్. అతడు జీవితంలో సుఖంగా, నిశ్చింతగా గడిపిన కాలం బాల్యంలో మాతామహునింట గడిచిందే. నవాబ్ జాదాల అలవాట్లు అతనికి అలవడ్డాయి. జూదం, పానం, అతనిమద్యపాన వ్యసనం అతన్ని జీవితమంతా కష్టాల పాలు చేసింది. త్రాగటం కష్టాలు మరిచిపోవటానికే అని సమర్థించుకున్నాడొక షేర్‌లో;

మైసే గరజ్ నిషాత్‌హై కిస్ రూ సియాహ్‌కూ
ఇక్ గోన బేఖుదీ ముఝే దిన్ రాత్ చాహియ్యే.

"మద్యపానం వలన ఆనందం ఏ దౌర్భాగ్యునికి కావాలె? ఎల్లవేళలా నాకొకింత మనశ్శాంతి కావాలె."

మిర్జా గాలిబు కవిత్వాన్ని గురించి, అతని స్వభావ శీలాల గురించి రెండు వ్యతిరేక భావాలేర్పడినవి. కొందరి దృష్టిలో గాలిబు కవితలో అన్వయ కాఠిన్యం, శబ్దాడంబరం, శబ్ద చమత్కృతి తప్ప ఏమీ లేదు. అతడు త్రాగుబోతు, జూదగాడు, మత విషయిమైన పరిజ్ఞానం లేనివాడు. కొందరి దృష్టిలో అతని కవిత అత్యద్భుతం. సూఫీ భావాలు జీర్ణించుకున్న మహా మానవుడు. స్వాభిమాని. ఉర్దూలోను, ఇంగ్లీషులోను గాలిబు గురించి రాయబడినన్ని గ్రంథాలు ఇంకెవరిని గురించి రాయబడలేదు. వ్యాసాలకు లెక్కే లేదు. వాటిల్లో గాలిబు కవిత్వాన్నీ వ్యక్తిత్వాన్నీ విమర్శించినవి కొన్ని. ప్రశంసించినవి లెక్కలేనన్ని. అతడు మహామేధావి. సంస్కార వంతుడు. వజాదారీని పాటించే శిష్టాచార పరాయణుడు.ప్రేమపాత్రుడు, స్నేహశీలి.

కులమతాల కంటె మానవతను ఆదరించిన మహా మానవుడు. డా. అబ్దుర్రహమాన్ బిజ్‌నోరీ (మహాసినె- కలామె గాలిబ్) దృష్టిలో వేదాల తర్వాత భారత దేశంలో అవశ్యపఠనీయ గ్రంథం దీవానె-గాలిబ్. "వంద కమ్మల ఈ గ్రంథంలో లేనిదేది?" అని ప్రశ్నిస్తాడు డాక్టర్ బిజనోరి. గాలిబు జీవిత చరిత్ర ఉర్దూలో మొట్టమొదట రాసినవాడు ఖ్వాజా అల్తాఫ్ హుసేన్ హాలీ. అతడు గాలిబు శిష్యుడు. 'యాద్‌గారె-గాలిబ్' అనే జీవిత చరిత్ర రాసినాడతడు.

జాగీర్దారు కనుక కంపెనీ ప్రభుత్వమతన్ని గౌరవించేది. బహాదుర్‌షా జఫర్ దగ్గర అతన్ని గౌరవంగా చూచేవాళ్లు. రాంపూర్ నవాబు అతని శిష్యుడే కనుక అతని గౌరవానికి అక్కడా లోటుండేది కాదు. ఆనాటి సూఫీ యోగులు అతన్ని గౌరవించేవాళ్లు. అతని స్వాభిమానాన్ని, సాహిత్యాహంకారాన్ని గురించి ఎన్నెన్ని సన్నివేశాలు చెప్పవచ్చు. కాని ఈ చిన్న వ్యాసంలో అదంతా సాధ్యం కాదు. తరువాతి వ్యాసంలో అతని షేర్లు కొన్ని ఉదాహరిస్తాను. అతని జాబుల గురించి రాస్తాను.

మిర్జాగాలిబుకు తన ఉర్దూ గజల్ల పట్ల తేలిక భావమే అయినా తన ఉర్దూ గజల్లు సాటి కవుల కంటె మెరుగ్గావుంటాయనే నమ్మకం లేకపోలేదు. తన ఫారసీ గజల్లతో పోల్చుకుంటేనే ఉర్దూ గజల్ల పట్ల తేలిక భావం-

హైఁఔర్‌భి దున్యామె సఖున్‌వర్ బొహత్ అచ్ఛే

కహ్తె హైఁకె గాలిబ్ కహై అందాజె బయాఁ ఔర్

"ప్రపంచంలో మంచి కవులు, చాల మంచి కవులు ఎందరో వున్నారు. కాని గాలిబు శైలి విశిష్టమైందంటారు (రసజ్ఞులు)" అని చెప్పుకున్నాడు.

రేఖ్తాకె తుమ్హీ ఉస్తాద్ నహీహో గాలిబ్

కహ్తె హైఁ అగ్లే జమానేమె కోయి మీర్‌భిథా.

"ఉర్దూ కవితకు నువొక్కనివేఉస్తాద్‌వు కావు గాలిబు! వెనుకటికి మీర్ అనే మహాకవి కూడ వుండే వాడంటారు" అని కూడ చెప్పుకున్నాడు.

ఉర్దూలో మీర్ తర్వాత తానే ఉస్తాదనే భావం గాలిబుకు బలంగా వుండేది. సమకాలికులేమో మోమిన్ కవిత గొప్పదని, జోఖ్ కవిత గొప్పదని, గాలిబు కవిత అర్థం కాదని అంటుండే వాళ్లు.

"న సితాయిష్‌కి తమన్నాహై న సిలేకీ పర్వా
గర్ నహీహైఁ మెరె అష్అర్‌మేఁ మానే న సహీ" అని చెప్పి వూర్కున్నాడు:

"నాకు ప్రశంసలతో పనిలేదు. ప్రతిఫలాపేక్షలేదు- నా షేర్లలో అర్థం లేకపోతే లేకపోనీ."

అతనికి స్వాభిమానం మెండు- సాహిత్యాహంకారమూ మెండే. అవి అతనికి శోభించేవే కాని వాటివలన చాల అవమానాలు పొందినాడు. కష్టాలు పొందినాడు. తన పెన్షన్ కేసు గురించి కల్కత్తా వెళ్తూ మార్గమధ్యంలో మూడేళ్లు మజిలీలు చేసస్తా గడిపినాడు. మజిలీ చేసిన చోటల్లా సాహిత్య రసికులు, కవులు, విద్వాంసులు అతన్ని నెలల తరబడి కదలనిచ్చే వాళ్లు కాదు. లఖ్నోలోనూ కొన్ని నాళ్లున్నాడు. వృద్ధ మహాకవి నాసిఖ్ బ్రతికి వున్నాడప్పుడు. గాలిబు కొన్నాళ్ళు నాసిఖును అనుకరించినవాడే. ఇద్దరూ కఠినశైలిని అవలంబించేవాళ్లే కాని ఇద్దరూ మీర్ మహాకవికి పరమభక్తులు. మీర్ శైలి చాల సరళం. లఖ్నో నవాబు సంపన్నుడు. కనుక అతన్ని దర్శించుకుంటే దారి ఖర్చులకు సరిపడ పారితోషకం దొరుకుతుందని మిత్రులు గాలిబుకు సలహా యిచ్చినారు. రెండు షరతులు పెట్టినాడు గాలిబు. దర్బారులో నజరానా సమర్పించడు తాను. ప్రధాన మంత్రి ఆగా మీర్ ఎదురువచ్చి స్వాగతం తెలుపాలె. అవి రెండూ తిరస్కరించబడినవి. దిల్లీలో చక్రవర్తిని వందరూపాయల కోసం దేబరించేవాడు మరి. ఎంత బీదవాడైనా తైమూరు వంశపు చక్రవర్తి. గాలిబు ప్రవర్తనలోని ఈ ద్వంద్వ వైఖరే అతన్ని గురించి రాసే వాళ్లను తికమక పెట్టింది. దిల్లీ కాలేజీలో మంచి ఉద్యోగం. ఇంటర్వ్యూకు పిలిచిన విద్యాశాఖ కార్యదర్శి టామ్‌సన్ నవాబైన తనకు స్వాగతం పలుకటానికి రాలేదని అలిగి పల్లకీ త్రిప్పుకొని ఇంటికి వెళ్ళిపోయినాడు. చక్రవర్తి ఆస్థానంలో తైమూర్ వంశచరిత్ర రాసే చిన్నపాటి ఉద్యోగం కోసం చాల మంది చేత పైరవీలు చేయించినాడు. సేవించటం అతని స్వభావం కాదు. చక్రవర్తి బహాదుర్ జఫర్ ఉద్యోగంలో చేరిన నాడు సమర్పించుకున్న గజల్ మఖ్తా ఇలా వున్నది:

గాలిబ్ వజీఫఖార్ హో దో షాహ్‌కో దువా
వోదిన్ గయేకె కహ్తేథే నౌకర్ నహీహూఁమై

"గాలిబ్! రాజభరణం అనుభవిస్తున్నావు. పాదుషాగారి కోసం ప్రార్థించు. నేనెవరి నౌకరును కాను అనే కాలం పోయింది." ఇందులో వినయం లేదుగదా. అతనికి ఉద్యోగం అవసరమే. అల్పవేతనమైనా తైమూరు వంశీయుల సేవలోనే

వుంటాడతడు. తానూ మొగల్ వంశీయుడేనాయె. వేలకు వేలిచ్చిన సామాన్య సంస్థానాధిపతులను సేవించడు. అతన్ని హైదరాబాదుకు ఆహ్వానించినాడు. కవుల మీద కనక వర్షం కురుస్తున్న కాలమది. "ఫారసీలో ఖతీలును, ఉర్దూలో షాహ నసీర్‌ను మహా కవులని భావించే సాహిత్యాభిరుచి గల హైదరాబాద్ వాళ్లకు నాసిఖ్ కవితగాని గాలిబ్ కవితగాని చెవికెక్కదు. నేను రాను." అని నిరాకరించి నాడు. రాంపూర్ నవాబు గాలిబు శిష్యుడు. కనుక అప్పుడప్పుడక్కడికి వెళ్ళేవాడు. అప్పటికి పరిస్థితులు తారుమారయినవి.

గాలిబు గౌరవం పొందినాడు. అవమానాలు పొందినాడు. వ్యసనాల కారణంగా చెరసాలలో గూడ వుండవలసి వచ్చింది. చివరి నాళ్లలో ఉత్తరాల చివర "గాలిబ్-మర్హూమ్" అని రాసుకునేవాడు. అంటే కీర్తి శేషుడైన గాలిబు. ఇంకా దీనంగానూ రాసుకునేవాడు.

బందగీమేభి వొ ఆజాద వ ఖుద్‌బీఁ హైఁ కె హమ్

ఉల్టే ఫిర్ ఆయెఁ దరే కాబసె అగర్ వా నహువా

అన్నాడొక చోట. "భక్తిలోనూ మాకు ఎంతటి నిరంకుశత, ఎంతటి ఆత్మాభిమానమంటే మా కోసం కాబా ద్వారం తెరువబడి వుండకపోతే తిరిగి వస్తాము."

గమ్మత్తేమంటే కాబా ద్వారం ఎప్పుడూ తెరువబడే వుంటుంది. గాలిబు త్రాగుబోతుగా ప్రసిద్ధుడు గదా. త్రాగుబోతు వస్తున్నాడని ఎవరైనా తలుపు తిమ్మన్నాడట. తనకు కొంత డబ్బిస్తే (త్రాగటానికి) తనయాత్ర ఫలం కూడ బహాదుర్‌షాకే సమర్పిస్తానన్నాడట గాలిబు. ఆ సందర్భంలో చెప్పిన ఒక మక్తా వినండి;

కాబ కిస్ మూహ్‌సె జావోగే గాలిబ్!

షరమ్ తుమ్‌కో మగర్ నహీ ఆతీ-

"గాలిబ్! ఏముఖం పెట్టుకొని కాబాకు వెళ్తావు? నీకు సిగ్గులేదు." చాల ప్రసిద్ధమైన ఈ మత్లా ఈ గజల్‌దే:

కోయి ఉమ్మీద్ బర్ నహీ ఆతీ- కోయి సూరత్ నజర్ నహీ అతీ.

"ఏ ఆశా నెరవేరదు. ఏమార్గమూ కనిపించదు."

ఇంకో రెండు షేర్లు ప్రసిద్ధమైనవే.

"మోత్‌కా ఏక్‌దిన్ మొఅయ్యన్‌హై- నింద్ క్యోం రాత్ భర్ నహీ అతీ."

'మృత్యువు నిర్ణీత సమయంలోనే వస్తుంది. రాత్రల్లా నిద్ర యెందుకు రాదు?'' చావయినా రావాలె. నిద్రయినా రావాలె. ఏదీ రాకపోతే విరహనిశి దుర్భరం.

జాన్తాహూఁ సవాబె- తాఅతొ జోహ్దొ-పర్ తబీయత్ ఇధర్ నహీ అతీ.

"పవిత్ర జీవితం వలన ఫలితమేమో నాకు తెలుసు. కాని ఏమి చేయను? నాచిత్తమటు మొగ్గదు."

ఈ గజల్ మొత్తం మీర్ తఖీ మీర్ శైలిలో వున్నది. గాలిబు వ్యాఖ్యాతల్లో ఒకడైన నజమ్ తబత్తబాయియీ సాధారణంగా గాలిబు తప్పులను ఎత్తిచూపుతాడు. అతడు కూడ ఈ గజల్‌లోని ఒక షేర్‌కు వ్యాఖ్య రాస్తూ

"దీన్ని ఎంత ప్రశంసించినా తక్కువే. మీర్ ఈ షేర్‌ను వినివుంటే ఈర్ష్య పడేవాడు." అని రాసినాడు.

పైనఒకచోట "నౌకర్ నహీ హూఁమై" అనే ఖాఫియా రదీఫుల మఖ్తా ఒకటి ఉదాహరించినాను. దానిమత్లా అందమైనదే.

దాయమ్ పడాహువా తెరే దర్‌పర్ నహీహూఁమై
ఖాక్ ఐసి జిందగీ పెకె పత్థర్ నహీహూఁమై
ఇది ప్రియురాలి నుద్దేశించి చెప్పినమాట;

"నీయింటి గడప దగ్గర తొక్కుడు బండవై పడివుండకపోతిని. బండనైనా కాని ఈ జీవితం మీద మన్నుపోయనా!"

ఇది భగవంతుని ఉద్దేశించి తన అవస్థలను నివేదించుకుంటూ అడిగిన ప్రశ్న:

యా రబ్! జమాన ముఝ్‌కొ మిటాతాహై కిస్‌లియే
లూహే-జహాఁపె హుర్ఫె- మకర్రర్ నహీహుఁ మై

"భగవంతుడా! కాలమెందుకిలా నన్ను తుడిచివేస్తున్నది? ప్రపంచపటం మీద రెండుసార్లు రాయబడిన అక్షరాన్ని కానుగదా నేను?"

ఒకే అక్షరం రాయలసిన చోట పొరపాటున ఆ అక్షరాన్నే రెండుసార్లు రాస్తే రెండవ అక్షరాన్ని తుడిచివేస్తారు గదా.

అతని ప్రఖ్యాత గజల్లలోని కొన్ని షేర్లు ఉర్దూ తెలిసిన వాళ్లందరికి కంఠస్థమైనవే.

యెనథీ హమారి ఖిస్మత్ కె విసాలె- యార్ హోతా

అగర్ ఔర్ జీతె రహ్తే యెహి ఇంతెజార్ హోతా

"ప్రియురాలి సంయోగం మా భాగ్యంలోనే లేదు. ఇంకా బ్రతికివుంటే ఈ నిరీక్షణమే వుండేది."

ఈ గజల్‌లో కొన్ని సూఫీ భావాలున్నవి. కనుక చక్రవర్తి అన్నట్లుగా ఈ మఖ్తా చెప్పినాడు;

యె మసాయిలే, తసవ్వుఫ్, యె తెరా బయాన్ గాలిబ్!

తుఝె హమ్ వలీ సమఝ్తె జో న బాదఖార్ హోతా.

నీ యీ సూఫీ భావాలు! వాటి శైలి! గాలిబ్ ! నువ్వు త్రాగే వానివి కాకుండా వుంటే నిన్ను వలీగా భావించేవాళ్లం."

త్రాగటాన్ని గురించి గాలిబు చాల చోట్ల రాసినాడు. ఒక షేర్ చాల గొప్పది. వినండి:

గో హాథ్‌మె జుంబిష్ నహి, ఆంఖోఁమెతో దమ్‌హై

రహ్నెదో అభీ సాగిరొ మీనా మెరె ఆగే

"వృద్ధాప్యం వలనచేతికి కదలిక లేదు. అందుకోలేను. అయినా కళ్లలో జీవమున్నది గదా! మధు కలశాన్ని, పానపాత్రను ఇంకా నాయెదుట వుంచండి." (వాటిని చూస్తూ చనిపోతాను).

జీవితం మన చేతిలో లేదు;

రౌమే హై రఖ్షె ఉమ్ర్ కహాఁ దేఖియే థమే

నైహాథ్ బాగ్ పర్‌హై న పాహై రికాబ్ మే

"జీవితమనే గుర్రం వడిగా పరుగెత్తుతున్నది. (మనం నిస్సహాయులం) చేతిలో కళ్లెం లేదు. రికాబ్‌లో కాలులేదు."

ఇలా ఎన్నయినా రాయవచ్చు. జీవితాన్ని గురించి చెప్పిన ఒక పరమ సత్యాన్ని ఉదాహరించి ఈ వ్యాసం ముగిస్తాను. గాజు కుప్పెలో మైనపువత్తిని వుంచి వెలిగించే వాళ్లు. అది తెల్లవారే వరకు వెలిగేది.

గమె హస్తీక అసద్! కిస్‌సె హో జుజ్ మర్గ్ ఇలాజ్

షమ హర్ రంగ్‌మె జల్తీహై సహర్ హోనే తక్

"జీవిత దుఃఖాలకు మృత్యువు తప్ప ఇంకే నివారణోపాయం లేదు- షమ ఎలాగూ తెల్లవార్లూ కాలుతుంది."

ఇందులో 'అసద్' అనే కలం పేరు వాడుకున్నాడు.

ప్రేమనుగురించిన ఒక పరమ సత్యం గల షేర్‌ను కూడా వినండి.

ఇష్క్‌పర్ జోర్ నహీ, హైయెవో ఆతిష్ గాలిబ్

జో లగాయే న లగే, ఔర్ బుఝూ యే న బనే

"గాలిబ్! ప్రేమ మీద మన అధికారమేమీ లేదు. అది ఎలాంటి అగ్ని అంటే అంటిస్తే అంటుకోదు, ఆర్పటం సాధ్యం కాదు."

నజముద్దౌలా, దబీరుల్ముల్క్, నిజామ్ జంగ్ అనే బిరుదులు గల నవాబు మిర్జా అసదుల్ల బేగ్ ఖాన్ గాలిబును గురించి ఎంత రాసినా తక్కువే. అతని జాబులు అవశ్య పఠనీయమైనవి.

◆ ◆ ◆

మోమిన్, జోఖ్, గాలిబుల తర్వాత...

మిర్జా గాలిబు మహామేధావి. అతని ఊహాశక్తి అపురూపమైనది. భావములు ఉన్నతమైనవే కాక ఉదాత్తమైనవి. అలంకార ప్రయోగం అద్భుతావహమైనది. వయసు గడిచిన కొద్ది, అనుభవం పెరిగిన కొద్ది (అతని మాటల్లోనే ఒక్కో చెప్పుదెబ్బ పడినకొద్దీ) అతని కవితలో సహజత్వం, సారళ్యం చోటుచేసుకున్నవి. సూఫీ తాత్త్విక భావములున్నూ చోటు చేసుకున్నవి. అతని ప్రయోగ కాఠిన్యాన్ని సారస్వత సమీక్షకులు విమర్శించిన కొద్ది, అతనికి అనుకోని అవమానాలు జరిగిన కొద్ది, అర్థహీనత వలన కష్టాలు అధికమైన కొద్ది అతనిలోని సహనశక్తి, హాస్య ధోరణి పెరిగినవి. ఎవరైనా కటువుగా విమర్శిస్తే, ఏదేని అనుకోని ఆపద వచ్చిపడితే, "భేష్, బాగయింది. దబీరుల్ముల్క్! నిజామ్ జంగ్! నజముద్దౌలా! మిర్జా గాలిబ్! ఏమయింది నీ గర్వం? కంపెనీ ప్రభుత్వం నవాబుగా గౌరవించేదని విర్రవీగే వానివి గదా! మళ్ళీ ఒక జూతా దెబ్బతిన్నావా? బాగయింది. భలే బాగయింది" అని శిష్యుల ముందు తనను తాను పరిహసించుకునేవాడు. అతని శిష్యులూ, అభిమానులూ అతన్ని అన్ని విధాలా ఆదుకొంటూ అతని గౌరవానికి భంగం కలుగకుండా చూచుకొనేవాళ్లు. ఆ విషయంలో అతడు చాలా భాగ్యశాలి. అందరు శిష్యులు, అందరు అభిమానులు ఇంకే మహాకవికి దొరకలేదు. అతడూ తన శిష్యులనూ, అభిమానులనూ చాలా ప్రేమించేవాడు. అతని శిష్యుల్లో, అభిమానుల్లో హిందువుల సంఖ్య అధికమే. మత వివక్ష లేని మహా మానవుడని ముందే అనుకున్నాము గదా.

జోఖ్, మోమిన్‌ల ఉర్దూ గజల్లు కూడా సామాన్యమైవి కావు. వాళ్ల భాషా పాండిత్యం, శాస్త్ర పరిజ్ఞానం సామాన్యమైంది కాదు. ఈ ముగ్గురు మహాకవుల కారణంగా దిల్లీలో గజల్లు రాసే కవుల సంఖ్య పెరిగిపోయింది. వందల్లో కాదు, వేలలో. అయితే, కాల పరీక్షకు అందరూ నిలువరు గదా. నిలిచన వాళ్లు కొందరే. ఆ కొందరయినా, దిల్లీని వదిలి పెట్టి అన్య సంస్థానాల నాశ్రయించినారు. చిన్న చిన్న సంస్థానాలేకాక అప్పుడు కళా సాహిత్యాలను ఘనంగా పోషించిన పెద్ద సంస్థానాలు, రాంపూరు, హైదరాబాద్.

తొలుత స్మరించదగిన కవి నవాబు ముస్తఫా ఖాన్ షేఫ్తా. అతడు జాగీర్దారు. కంపెనీ ప్రభుత్వంలో పలుకుబడి కలవాడు. సారస్వత రసికుడు. ఫారసీ ఉర్దూ భాషల్లో పండితుడు. కవి. మిర్జా గాలిబు మోమినులు అతని సాహిత్య విమర్శను గౌరవించే వాళ్లు. కానయితే అతడు వాళ్లిద్దరి శిష్యుడే. షేఫ్తా తన ఉర్దూ కవిత మోమిన్ చేత, ఫారసీ కవిత గాలిబ్‌చేత దిద్దించుకోన్నాడు. పలు సందర్భాల్లో గాలిబుకు బాసటగా నిలిచినాడతడు. జూదమాడినందుకు గాలిబు చెరసాల పాలయినప్పుడు, అప్పుల వాళ్ళు కోర్టుకు ఈడుస్తామని బెదిరించే సందర్భాల్లో షేఫ్తా అతన్ని ఆదుకున్నాడు. "గాలిబు జూదమాడి జైలుకు వెళ్ళినాడట అలాంటి వానితో మీలాంటి పెద్ద మనిషికి సంబంధమేమిటి?" అని ప్రశ్నించే వాళ్లు ఒకప్పుడు గాలిబును ఆశ్రయించి తిరిగే సాహితీపరులూ, సంపన్నులూ. "అతనికి జూద మొకటే కాదు. ఇంకా కొన్ని వ్యసనాలున్నవి. అయినా అతడు మహనీయుడు. మానవీయుడు." అని సమాధానం చెప్పేవాడు షేఫ్తా.

షేఫ్తా గజల్లు ఉత్తమమైనవే. కాని అతని కీర్తికి కారణం అతడు ఫారసీలో రాసిన "గుల్షనె-బేఖార్" అనే కవుల చరిత్ర. అంటే ముల్లు లేని పూదోట అని అర్థం. షేఫ్తా సాహిత్య విమర్శ సరసమైందని దానికి గుల్షనె-బేఖార్ అనే పేరు సార్థకమైందని ఆనాటి విద్వాంసులు అభిప్రాయపడ్డారు. కాని నజీర్ అక్బరా బాదీని గురించి షేఫ్తా చేసిన విమర్శ ఆ పూదోటలో వుండగూడని ముల్లే.

షేఫ్తా ఉర్దూలో ఒక దీవాను, ఫారసీలో ఒక దీవాను సిద్ధం చేసుకున్నాడు. అతని షేర్లు కొన్ని వినండి:

షాయెద్ ఇసీక నామ్ మొహబ్బత్ హై షేఫ్తా!
ఇక్ ఆగ్‌సీ హై సీనెకె అందర్ లగీ హోవీ.

'ఎడదలో ఏదో అగ్ని రగులుతున్నట్లున్నది. దీన్నే ప్రేమ అంటారేమో!"

కిస్‌లియే లుత్ఫ్‌కి బాతేఁ హైఁ ఫిర్
క్యాకోయీ ఔర్ సితమ్ యాద్ ఆయా.

"ఈ ప్రేమ సంభాషణ యెందుకు? మళ్ళీ ఏదేని బాధించే పద్ధతి స్ఫురించెనా?" గాలిబు శిష్యుల్లో మీర్ మహెదీ అలీ మజ్రూ, మున్షీ హరగోపాల్ తఫ్తా, రాంపూర్ నవాబు యూసుఫలీ ఖాన్ నాజిమ్ లాంటి మహాకవులున్నారు. వీళ్లంతా గాలిబు శైలినే అనుకరించినారు. యుసువలీ ఖానయితే ఆ మాట గవర్వంగా చెప్పుకున్నాడు.

మోమిన్ శిష్యుల్లో నసీమ్, జౌఖ్ శిష్యుల్లో జహీర్, దాగ్, ఆజాద్ ముఖ్యులు. ఈ శిష్యులకు మళ్లీ ఎందరెందరో శిష్యులు. వాళ్ళందరి గురించి ఇంకో వ్యాసంలో తెలుసుకుందాం. దిల్లీలోని ఉర్దూ సాహిత్యపు చివరి వెలుగు మోమిన్, జౌఖ్, గాలిబుల తర్వాత చెల్లా చెదరై దేశం నలుమూలల ప్రజ్వరిల్లింది.

◆ ◆ ◆

సాంప్రదాయిక కవితలో చివరి మహాకవులు కొందరు

ఇంతకు ముందు రాసిన వ్యాసంలో మోమిన్, జౌఖ్, గాలిబుల శిష్యులు కొందరి పేర్లు ప్రస్తావించినాను. మహాకవుల శిష్యులు సాధారణంగా తమ గురువులను అనుకరించే ప్రయత్నమే చేస్తారు. అందరి పేర్లు కవుల చరిత్రల్లో చోటు చేసుకుంటాయి గాని అందరి కవితలు ప్రజాదరణకు పాత్రం కాజాలవు. క్రొత్త భావాలు, క్రొత్త కల్పనలు, క్రొత్త శైలి సాధించిన వాళ్లే సారస్వతంలో శాశ్వత కీర్తిని సముపార్జించుకుంటారు. అలాటి వాళ్లలో అగ్రగణ్యుడు దాగ్ దహెల్వీ. అతని పూర్తి పేరు నవాబు మిర్జా ఖాన్ దాగ్. అతడు ఫిరోజ్‌పూర్ జాగీర్దార్ నవాబు షమ్సుద్దీన్ ఖాన్ కొడుకు. కంపెనీ ప్రభుత్వం హత్యానేరం మీద షమ్సుద్దీన్ ఖాన్‌కు ఉరిశిక్ష విధించి అమలు జరిపింది. అప్పుడు మిర్జా ఖాన్ ఆరేళ్ల బాలుడు. అతని తల్లి బహాదుర్‌షా జఫర్ కుమారుడు మిర్జా ఫఖ్రూనునికాహ్ చేసుకొని తన ఆరేళ్ల కొడుకుతో లాల్ ఖిలాలో ప్రవేశించింది. మిర్జా ఖాన్ స్వతహాగా మేధావి. రాజ కుమారులందరి వలె అతడూ లాల్ ఖిలాలో విద్యాభ్యాసం చేసినాడు. కవిత చెప్పగల ప్రతిచోట అతనికి కవిగా గొప్ప గౌరవం లభించింది. రాంపూర్ సంస్థానంలోనే ఇరవైనాలుగేళ్లున్నాడు. అక్కడ లఖ్నో కవులను ఒక చోట చేర్చి రెండు భిన్నమైన కవితా రీతులను సమన్వయపరచిన ఘనత రాంపూర్ దర్బార్‌కు దక్కింది. దాగ్ మళ్లీ కొన్ని చిన్న నగరాల్లో కొన్ని నాళ్లుండి చివరికి హైదరాబాద్ సంస్థానంలో అపూర్వమైన ఆదరణ పొందినాడు. ఆరవ నిజాము మీర్ మహబూబలీ

పాషా అతన్ని తన గురువుగా నియుక్తున్ని చేసి నెలకు వేయి రూపాయల వేతనం, అనేకమైన బిరుదులు ప్రసాదించినాడు. అంతకు కొన్నాళ్లు ముందు మిర్జా గాలిబంతటి కవి మాసవేతనం నెలకు వంద రూపాయలు. దాగ్ గురువు జోఖ్ మాసవేతనం వంద రూపాయలే. ఆ కాలంలో యే ఉర్దూ కవి పొందని వైభవాన్ని దాగ్ పొందినాడు. మిర్జా గాలిబు ప్రసక్తి వచ్చింది కనుక ఇక్కడొక మాట చెప్పటం అవసరం. దాగ్ తండ్రి నవాబు షమ్సుద్దీన్ ఖాన్‌మిర్జా గాలిబు పెద మామగారి కుమారుడు. అంటే గాలిబుకు దాగ్ బావమరిది కొడుకే.

దాగ్ నవాబుల యింట పుట్టినాడు. ఎఱ్రకోటలో రాజకుమారుల దర్జాతో పెరిగినాడు. జీవితమంతా సంస్థానాధిపతుల సహవాసంలో గడిపినాడు. హైదరాబాద్ "ఉస్తాదె-షాహ్" (రాజగురువు)గా గౌరవం పొందినాడు. కనుక అతడు సభ్యతా సంస్కారాలు తెలిసినవాడు. హాస్యప్రియుడు, ఉపకారగుణం కలవాడు. ప్రజాసమస్యలతో పనిలేని వాడు. అతని కవితలో సూఫీ తాత్త్విక గంభీరత వుండదు. శృంగార రసప్రధాన కవిత రచించటంలో అద్వితీయుడు. భాషా శాస్త్రవేత్త. దిల్లీ నుడికారంపై అధికారం కలవాడు.

దాగ్ శిష్యుల్లో చాలమంది ఉస్తాదులై ఎందరో శిష్యులను తయారు చేసుకున్నారు. హైదరాబాద్ నిజామ్ శిష్యుడేనాయె. ఎక్బాల్ కొన్నాళ్లు తన కవిత దిద్దించుకున్నవాడేనాయె. సాయెల్ దహెల్వీ (ఇతడు అల్లుడు కూడ) బేఖుద్ దహెల్వీ, నూహ్ నార్వీ, సీమాబ్ అక్బరాబాదీ, పండిత్ లుబ్భూరామ్ జోష్ మలిస్యానీ (ఇతడు గాలిబు వ్యాఖ్యాతల్లో వొకడు), ఆగాషాయెర్ మొదలయిన వాళ్లు అతని శిష్యుల్లో ముఖ్యులు. అతని షేర్లు కొన్ని ఉదాహరిస్తాను:

గజబ్ కియా తెరే వాదేపె ఎఅత్‌బార్ కియా
తమామ్ రాత్ ఖియామత్ కా ఇంతెజార్ కియా

"వస్తానని వాయిదా చేసినావే దాన్ని నమ్మి భయంకరమైన పొరపాటు చేసినాను. తెల్లవార్లూ ఖియామత్ (ప్రళయకాలం) కోసం నిరీక్షించినాను. ఖియామత్ వచ్చేటప్పుడే వస్తుంది. దీర్ఘకాలాన్ని ఖయామత్‌తో పోల్చటం కవి సమయం.

ఫిరే రాహ్‌సే వో యహా‹ ఆతె ఆతే
అజల్ మర్‌గయా తూ కహా‹ ఆతె ఆతే

"ఆమె నా దగ్గరికి వస్తూ మనసు మార్చుకొని వెనక్కి తిరిగి పోయింది. ఓ మృత్యువా! నువ్వెక్కడ చచ్చినావు?"

ఆమె రాకపోతే చావయినా రావాలె గదా!

నజానాకె దున్యాసే జాతాహై కోయీ

బడీ దేర్‌కీ మెహర్బా౯ అతె అతే

"అనురాగవతీ! వస్తూ వస్తూ చాల ఆలస్యం చేసినావు. ఒకరు ప్రపంచం విడిచిపోతారన్నది గుర్తించవైతివి."

ప్రియుడు మరణోన్ముఖుడై వున్నాడని తెలిసీ నెమ్మదిగా వచ్చింది. అనురాగవతీ! అనే సంబోధన ఎత్తిపొడుపు. ఆమె వచ్చేప్పటికే ప్రియుడు పరలోకం పయనమై పోయె.

ఈ గజల్‌లోని మఖ్తా హైదరాబాదీయులకు ఉర్దూ సరిగా రాదని చేసిన ఆక్షేపణ. హైదరాబాద్ ఉర్దూ కవుల్లో ఈ మఖ్తా సంచలనం రేపింది. కొందరు గజల్లలో జవాబు కూడ రాసినారు. ఈలాటి చిన్నచిన్న అవమానాల కారణంగా ఆనాడు ఉత్తరాది కవులూ, విద్వాంసులూ హైదరాబాద్ విడిచిపోవాలనే "నాన్ ముల్కీ" ఉద్యమం బలపడింది.

నహీ ఖేల్ అయ్ దాగ్ యారోం సె కహెదో

కె అతీహై ఉర్దూ జుబాన్ అతేఅతే.

"ఉర్దూ వస్తూ వస్తూ వచ్చే భాష. అది పిల్లలాట కాదు. ఈ సంగతి మిత్రులకు చెప్పాలె." అంటే ఉర్దూ వాతావరణంలో పుట్టిపెరిగి బాగా పరిశ్రమిస్తే వచ్చే భాష. అప్పుడు ఉర్దూ వాతావరణం గల ప్రాంతాలు, ఉర్దూ సాహిత్య కేంద్రాలు రెండే. దిల్లీ-లఖ్నో. దక్కనులోని హైదరాబాద్ వాసులకు అసలైన ఉర్దూ రాదనే ఎగతాళి వున్నదీ షేర్‌లో.

దాగ్ విలాసవంతమైన జీవితం గడిపినవాడు. అతని ప్రేయసి మానవ కాంతే. ఇష్క్ హఖీఖీకి తావు లేదతని కవితలో.

ఖూబ్ పర్దాహై కె చిల్మన్ సెలగే బైఠేహై౯

సాఫ్ ఛుప్తేభి నహీ సామ్నె అతేభి నహీ

"చిల్మన్‌కు తగిల కూర్చున్నది ప్రేయసి. ఇదేమి పర్దా? దాగీ ఉండదు. ఎదుటికీ రాదు." చిల్మన్ అంటే సన్నని వెదురు బద్దలతో అల్లిన పర్దా. మర్దానా, జనానాలకు మధ్య చిల్మన్ వేలాడుతుంది. దానికి తగిలి కూర్చుంటే స్పష్టంగా కనిపిస్తూనే వుంటారు. అలా కనిపించటం చూడాలనే కోరికను ఇంకా అధికం చేస్తుంది.

రుఖె రోషన్ కె ఆగే షమ్మ రఖ్ కర్ వోయె కహ్తే హైఀ

ఉధర్ జాతాహై దేఖేఀ యా ఇధర్ ఆతాహై పర్వాన

"ప్రకాశవంతమైన ముఖానికి సముఖానషమ్మా పెట్టి ప్రేయసి అంటుంది; పర్వానా (మిడుత) అటు వెళ్తుందో ఇటు వస్తుందో చూడాలె." అంటే ప్రేయసి ముఖ వికాసం షమా వలె వున్నదని భావం.

దాగ్ కవితా సంకలనాలు నాలుగు అచ్చయినవి.

◆ ◆ ◆

దాగ్ రాంపూర్ దర్బారులో వుండేవాడని రాసినాను గదా. అక్కడ అతని వెంట ఇంకా ముగ్గురు మహాకవులుండిరి. కవులయితే వందల సంఖ్యలోనే వుండిరి. నలుగురు మహా కవుల్లో అమీర్ మీనాయీ వొకడు. అతడు లఖ్నో స్కూలుకు చెందిన కవి. దాగ్ కోరికపై హైదరాబాద్ నిజామ్ అతన్ని తన అస్థానానికి ఆహ్వానించినాడు. హైదరాబాద్‌లో ఆ మహాకవి మంచి గౌరవాన్నే పొందినాడు కాని కొన్ని నెలల్లోనే మరణించినాడు. అతని రెండు కవితా సంకలనాలు ప్రకాశితాలయినవి. అతని గజల్లు దాగ్ గజల్ల లాంటివే. అంటేవిలాస జీవితానికి సంబంధించి శృంగార భావపూరితాలు. అతడు మహా విద్వాంసుడు. అతని కీర్తికి కారణమయింది అతడు తయారు చేసిన "అమీరుల్ లొగాత్" అన్న బృహన్నిఘంటువు. రెండు భాగములు మాత్రమే అచ్చయినవి. ఆ రెండు భాగాల్లో ఉర్దూ అక్షరమాలలోని మొదటి అక్షరం 'అలిఫ్'కు చెందిన శబ్దాల అర్థాలే వున్నవి.

అమీర్ మీనాయీ వినయ సంపన్నుడు. సత్పురుషుడు. అతన ఈ షేర్ చాల ప్రసిద్ధమైనది.

"ఖంజర్ చెలే కిసీకె తడప్తే హైఀ హమ్ అమీర్!

సారే జహాఀ కా దర్ద్ హమారే జిగర్‌మె హై"

"ఎవరి మీద కత్తివేటు పడినా నేనే విలవిల్లాడుతాను. మొత్తం ప్రపంచం బాధంతా నా ఎదరలోనే వున్నది."

అమీర్ శిష్యులు వందకు పైగా వుండిరి. వారిలో ప్రసిద్ధులు రాంపూర్ నవాబు కలబలీ ఖాన్, జలీల్, రియాజ్,హాఫిజ్, వసీమ్, ఖమర్ మొదలైనవాళ్లు. అమీర్ మీనాయీ శిష్యుల్లో ప్రముఖుడైన జలీల్ మానిక్‌పూరీ ఏడవ నిజామ్ మీర్ ఉస్మానలీఖాన్‌కు గురువైనాడు "ఉస్తాదె షాహ్". అతని లఖ్నో శైలి అందమైనది. కొన్ని నాజుక్ భావాలు చూడండి.

తబుస్సుమ్ థా ఇస్ రంగ్‌సే ఉస్కే లబ్‌పర్
మై సమ్‌ఝా కోయీ జామ్ ఛల్కా రహాహై

"ఆమె పెదవుల మీది మందస్మితాన్ని చూసి ఎవరో పానపాత్రను తొణకిస్తున్నారనుకున్నాను."

మజా లేంగె హమ్ దేఖ్‌కర్ తేరీ ఆంఖేం
ఉస్నే ఖూబ్ తూ నామబర్ దేఖ్‌లేనా

"నీ కళ్లల్లో చూచి ఆనందిస్తాను. పత్రవాహకుడా! నువ్వు ఆమె కళ్లను చక్కగా చూడు."

నామబర్ అంటే ప్రేయసికి ప్రియుని జాబు అందించేవాడు. ఖాసిద్ అంటే నోటివార్త అందించేవాడు. ఇక్కడ కవి ప్రేయసికి జాబు పంపుతూ 'నామబర్'తో అంటున్నమాట భావమేమంటే తానెలాగూ ప్రేయసి కళ్లలో చూడ లేడు కనుక నామబర్ చూచి వస్తే అతని కళ్లలో ఆమె కళ్ల ప్రతిబింబం చూడ వచ్చుననే ఆశ.

వాదెకా ఏతెబార్‌తో అయ్ యార్ హై మగర్
క్యా ఏతెబార్ జిందగియే ముస్త ఆర్‌కా

"నీ వాయిదా మీద నమ్మకం లేక పోలేదు. కాని అడిగి తెచ్చుకున్న ఈ జీవితాన్ని నమ్మేదెలా?"

నా జీవిత కాలంలో నా దగ్గరికి వస్తానన్న నీ వాయిదా పూర్తి అవుతుందా? అని భావం.

◆ ◆ ◆

ఉస్తాదె జలీల్ శిష్యుడైన నవాబు మీర్ ఉస్మానలీ ఖాన్ మంచికవే. ఉస్మాన్ అతని కలం పేరు.

హమాతన్ గోష్‌హైఁ గుల్ నగ్మయె బుల్బుల్‌కె లియే

సున్‌నెవాలా కోయి ఆహే దిలె నాషాద్ భిహైఁ

"బుల్బుల్ మధురగానం వినటానికి తోటలోని పూలు ఒళ్లంతా చెవులు చేసుకొని వున్నాయి. వ్యధితహృదయునని నిట్టూర్పు వినేవాళ్లెవరైనా వున్నారా?" ఇదొక సంస్థానాధీశుని ప్రశ్న. దీని వలన పీడిత ప్రజలపట్ల అతని హృదయం ఎలాంటిదో తెలుస్తుంది కదా!

హైదరాబాద్‌లో ఉస్తాద్ జలీల్ పొందిన గౌరవం గొప్పది. ఇప్పుడు అతని కొడుకులూ, శిష్యులూ ఉస్తాదుల కోవకు చెందిన కవులే.

◆ ◆ ◆

నవ జాగృతి- ఉర్దూ కవులూ, రచయితలూ

క్రీ.శ. 1857 సంవత్సరాన జరిగిన సిపాయీ విప్లవం (దాన్ని బ్రిటీష్ చరిత్రకారులు 'తిరుగుబాటు' అన్నారు) తర్వాత భారతదేశం బ్రిటిష్ పాలన క్రిందికి వచ్చింది. బ్రిటిష్ రాణి విక్టోరియా భారతీయులకు ఎన్నో ఆరక్షణలతో పాటు మత స్వాతంత్ర్యాన్ని కూడా కలుగజేసింది. కంపెనీ ప్రభుత్వం భారత దేశాన్ని అన్ని విధాలా దోచుకున్నది. హిందువులూ నష్టపడ్డారు, ముస్లిములూ నష్టపడ్డారు. మన దేశం బ్రిటిష్ పాలనక్రిందికి వచ్చిన తర్వాత అన్ని రంగాల్లోనూ మార్పు రావటం సహజం. అలాగే మేధావుల ఆలోచనల్లోనూ మార్పు రావటం సహజం. అప్పటి మేధావులు పరిస్థితులను అర్థం చేసుకోలేకపోయినారు. అదీ సహజమే. మధ్యమ ధనిక వర్గమొకటి ఏర్పడింది. వాళ్లు ప్రజల రక్తాన్ని పీలుస్తూ క్షేమంగా వుండాలంటే ఆంగ్ల విధేయులై వుండాలె. యూరోపు దేశాల్లో శాస్త్ర విజ్ఞాన ప్రగతి వలన పారిశ్రామిక రంగంలో గొప్ప పరివర్తన కలిగింది. దాని కారణంగా మన

దేశంలోని గ్రామీణ వృత్తులు మూలనపడ్డాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతిన్నది. పరాయి పరిపాలన. దాన్ని పారదోలే శక్తి అప్పట్లో మన దేశానికి లేదని సిపాయీ విప్లవంలోనే తేలిపోయింది. మత స్వాతంత్ర్యం మంచి కంటె చెడునే కలిగించింది. అప్పటి వరకు తమ తమ మతాచారాలను స్వేచ్ఛగా, సామరస్యంగా పాటిస్తూ వుండిన భారతీయులు, హిందువులు, ముసల్మానులుగా ఆలోచించటం మొదలు పెట్టినారు. ముస్లిములు తమ భద్రతకోసం, తమ ఉన్నతికోసం ఆలోచిస్తే హిందువులు తమ భద్రతకోసం తమ ఉన్నతి కోసం ఆలోచించటం ప్రారంభించినారు. తమ దేశం పరాధీనమయి పోయిందన్న ఎరుక మాత్రం అందరికీ వుండింది. మధ్యమ ధనిక వర్గానికి చెందిన వాళ్లేమో ఆంగ్ల మానసపుత్రులై ఆంగ్ల భాషను, ఆంగ్లేయ సంస్కృతిని అభిమానిస్తూ తమ దేశ సంస్కృతిని, ఆచార వ్యవహారాలను అసహ్యించుకోవటం గొప్పగా భావించినారు. ఛాందస వాదులు ప్రజల ఆలోచనలను తమ మత విశ్వాసాలవైపు, ఆచార వ్యవహారాలవైపు మరలించే ప్రయత్నం సాగించినారు. మేధావి వర్గంలో కొందరు ప్రజల్లో దేశ భక్తి భావాన్ని, ఆంగ్లులను గ్రుడ్డిగా అనుసరించగూడదనే భావాన్ని, మత మౌఢ్యానికి గురి కాగూడదనే భావాన్ని కలిగించి జాగృతపరిచే ప్రయత్నంలో పడ్డారు. దేశభక్తితో పాటు ప్రభుభక్తి కలిగి వుంటేనే తమ వారికేదయినా సాధించి పెట్టవచ్చునని కొందరు మేధావులు నమ్మినారు. మరికొందరేమో ఆంగ్లులను, ఆంగ్ల సంస్కృతిని నిరసించటమే దేశభక్తి అని నమ్మినారు. పందొమ్మిదవ శతాబ్దం చివర్లో ఈ అస్పష్టత తొలగిపోయింది.

అయితే మనమిప్పుడు అంతదూరం రాలేదు. సిపాయీ విప్లవం తర్వాతి అయోమయ స్థితిలోనే వున్నాము. అప్పుడు ముస్లిములకొక గొప్ప నాయకుడు లభించినాడు. ఆంగ్ల భాషను, ఆంగ్ల సంస్కృతిని అర్థం చేసుకొని, తమ మత విశ్వాసాలు గట్టిగా వుంచుకొని ఆంగ్ల ప్రభువుల అండతోనే తన ప్రజలను పూర్వస్థితికి తేవచ్చునని నమ్మిన ఆ పెద్ద మనిషి పేరు సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్. అలీగఢ్ ముస్లిమ్ యూనివర్సిటీ స్థాపకుడతడే. అతడు భయ మెరుగని వాడు. ఆలసట యెరుగని కార్యశూరుడు. అన్ని విధాలా మహా పురుషుడు. అయితే, అతని ఆంగ్ల మైత్రి అనేకులైన ముస్లిమ్ మేధావులకే రుచించలేదు. అది వేరే విషయం. అతడు తాను సముచిత మనుకున్నది చేసి ముస్లిముల కోసం చాల సాధించినాడు. అతనికి ఇంగ్లీషు భాష అంతగా రాదు. కొడుకును ఇంగ్లాండుకు పంపి అతని వెంట యూరోపు రాష్ట్రాల పర్యటన చేసినాడు. ప్రజల జీవితాన్ని తన కళ్లతో చూచి వచ్చినాడు. తన అనుభవాలన్నిటిని వ్యాసాల రూపంలో

రాసినాడు. "తహజీబుల్ అఖ్లాఖ్" అనేది అతడు స్థాపించిన పత్రిక. అతడు ఉర్దూలో వ్యాస రచనకు ఆద్యుడు. అతని రచనల్లో ప్రముఖమైనవి "ఆసారుస్యనాదీద్", "లాయల్ మొహమ్మడన్స్ ఆఫ్ ఇండియా", "ఖుత్బాతె-అహమదియా" అనే మూడు గ్రంథాలు. ఉర్దూలో బైబిల్ అనువాదం, ఖుర్ఆన్ మజీద్ వ్యాఖ్య కూడ అతని ప్రముఖ రచనలే. అతని రచనలు ఇంగ్లీషులో ఆ కాలముననే అనూదితాలయినవి. చివరన పేర్కొనిన రెండు రచనలు మన దేశంలో ముస్లిములూ, క్రైస్తవులూ సామరస్య భావం కలిగి వుండాలన్న ఉద్దేశంతో చేసినవే. ముస్లిములు కాంగ్రెసులో చేరటం అతనికి సమ్మతం కాకుండేది. ప్రభుభక్తి పరాయణులైన వాళ్లనే అతడు ఆదరించేవాడు.

సర్ సయ్యద్ ప్రభావానికి ఆనాటి మేధావులు, కవులు, రచయితలు చాలమంది లోనైనారు. అటువంటి వాళ్లలో కవిగా లబ్ధప్రతిష్ఠుడైన ఖ్వాజా అల్తాఫ్ హుస్సేన్ హాలీ ముఖ్యుడు.

ఖ్వాజా అల్తాఫ్ హుస్సేన్ హాలీ క్రీ.శ. 1837వ సంవత్సరాన పానిపత్‌లో జన్మించినాడు. కుటుంబ పరిస్థితులూ, ఆర్థిక పరిస్థితులూ అనుకూలంగా లేకున్నా విద్యార్జన కోసం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా అనేక నగరాలు తిరిగి అరబీ, ఫారసీ, ఉర్దూ భాషల్లో మంచి పాండిత్యం సంపాదించినాడు. దిల్లీలో కొంతకాలం గాలిబు సాహచర్యం లభించింది. తన గజల్లు ఆ మహాకవికి చూపిస్తూ అతనికి శిష్యుడైనాడు. అతని గజల్ రచనకు ముగ్ధుడై "నేనెవరికైనా గజల్లు రాస్తూ సమయం వృధా చేయవద్దనే చెప్తాను. కాని, నువ్వు మాత్రం గజల్లు రాస్తూ వుండాలె. లేకపోతే ఉర్దూ సాహిత్యానికి అపకారం చేసిన వానివవుతావు." అని ఆదేశించినాడు గాలిబు. అయితే, హాలీ ఆ మహాకవి ఆదేశాన్ని పూర్తిగా పాటించలేక పోయినాడు. దిల్లీలోనే నవాబు ముస్తఫా ఖాన్ షేఫ్తా సాహచర్యం కూడ లభించింది హాలికి. అతని వలన సాహిత్యపరంగా చాల లాభం పొందినాడు. లాహోరులో అప్పటికే మొహమ్మద్ హుస్సేన్ ఆజాద్, విప్లవానికి ముందే, లాహోర్‌లో "అంజుమనె పంజాబ్" అనే సాహిత్య సంస్థ స్థాపించినాడు. అతడు దిల్లీ కాలేజీలో చదివినాడు. హాలీకి ఆ అవకాశం లభించలలేదు. ఆజాద్‌కూ, హాలీకి ఇంగ్లీషు భాషా జ్ఞానం అంతం మాత్రమే. కాని ఆ యిద్దరు మారుతున్న పరిస్థితులను కొంతవరకు అర్థం చేసుకున్నారు. ఇంగ్లీషు కవిత్వం ముందు, ఇంగ్లీషు సాహిత్యం ముందు ఘనమైన చరిత్రగల ఉర్దూ కవిత ఎంత అసందర్భంగా వున్నదో గ్రహించినారు. "ఉర్దూ కవి ఊహాప్రేయసి ఉరులవంటి కురుల్లో చిక్కుకొని

విలవిల్లాడుతూ మారుతున్న దేశ పరిస్థితులను అర్థం చేసుకోలేక పోతున్నాడు. అకాల రాగాన్ని (బేవక్త్‌కీ రాగిణీ) ఆలపిస్తూ అనవసరమైన గజల్లను రాస్తున్నారు. ఇంకా పారసీక వాతావరణాన్నే పట్టుకొని వేళాడుతున్నాడు. ఈ పరిస్థితి మారాలె. ఈ కవిత ప్రయోజనకారి కావాలె" అని యిద్దరూ సంకల్పించినారు. ఇంగ్లీషులో వున్నట్టు ప్రకృతిని, మానవుల పరిస్థితులను గురించి నజములు రాయటం ప్రారంభించినారు. సరళ సుందరమైన వచనంలో ప్రజందరికి తమ భావాలను చేరవేయవచ్చునని అనుభవపూర్వకంగా గ్రహించి శ్రేష్ఠమైన వచన గ్రంథాలు రాసినారు. 'ఆబె హయాత్' అనే ఉర్దూ కవుల చరిత్ర 'సఖున్‌దానె-ఫారసీ', అనే ఫారసీ కవుల చరిత్ర 'దర్బారె అక్బరీ' 'నైరంగె ఖ్యాల్' అనేవి ఆజాద్ ఉర్దూ వచనంలో చేసిన అమూల్య రచనలు. 'నైరంగె-ఖ్యాల్'లో ఇంగ్లీషులోని Allegori ని ఉర్దూలో ప్రవేశపెట్టే ప్రయత్నం జరిగింది.

ఆజాద్ కవితా రచనలో ఉస్తాద్ జోఖ్ శిష్యుడు. అతని గజల్ల సంకలనం కూడ అచ్చయింది. ఇక్కడ అతని క్రొత్త రకపు కవిత్వాన్ని కొంత ఉదాహరిస్తాను.

హైసామ్నే ఖులాహువా మైదాఁ చలేచలో
బాగే మురాద్‌హై సమరఫ్షా చలేచలో
దర్యాహో బీచ్‌మే కె బయాబాఁ చలేచలో
హిమ్మత్ యె కహ్‌రహీహై ఖడీ, హాఁ చలేచలో
చల్నాహి మస్లహత్‌హై మెరీజాఁ చలేచలో
హిమ్మత్‌కె షహ్ సవార్ జో ఘోడే ఉడాయేంగే
దుష్మన్ ఫలక్‌భి హోంగెతో సర్‌కో ఝుకా యేంగే
తూఫాన్ బుల్బులోంకి తరహ్ బైఠ్ జాయేంగే
నేకీకె జోర్ ఉఠ్‌కె బదీకో దబాయేంగే
బైఠోన తుమ్, మగర్, కిసీ ఉన్వాఁ చలేచలో
"ఎదుట విశాలమైన మైదానం-నడవండి
కోరికల తోట ఫలభరితమైంది- నడవండి
దాని నడుమ నదులు ఎదురైనా, అడవులు అడ్డమైనా నడవండి
సాహసం సమక్షాన నిలిచి చెప్తున్నది , నడవండి
ప్రియతమా! నడవటమే కర్తవ్యం - నడవండి

సాహసవంతులైన రౌతులు అశ్వాలనధిరోహిస్తే
ఆకాశాలే శత్రువులైనా తలవంచక తప్పదు
తుఫానులు నీటిబుగ్గల్లాగా అణగిపోతాయి
మంచి విజృంభించి చెడును అణచివేస్తుంది
కూర్చోవద్దు- ఏదో విధంగా నడవండి

ఈ పంచపదుల తర్వాత హాలీ రచించిన షట్పదులు రెండు వినిపించాలని వున్నది. సర్ సయ్యద్ ఆదేశం ప్రకారం ముస్లిముల ఉత్థాన పతనాలను వివరిస్తూ హాలీ రచించిన 'ముసద్దసె-హాలీ'లోని రెండు షట్పదులివి. ముసద్దస్ అంటే షట్పది. ఆరు చరణాల కవిత. 'ముసద్దసె హాలీ'ని "మద్దొజజరె ఇస్లామ్" అని కూడ అంటారు. మద్దొజజర్ అంటే అటు పోటులు. ఆ కావ్యానికి హాలీ సుదీర్ఘమైన పీఠిక రాసినాడు. అందులో పూర్వకవితలో చాల వరకు ఎంతటి వ్యర్థ కవిత వున్నదో, సార్ధకమైన కవిత ఎలా ఉండాలో ప్రబోధించినాడు. ఆ పీఠిక 'మొఖద్దమా-షేరొషాయిరీ" అనే పేర ప్రత్యేక గ్రంథంగా పలు తడవలు ప్రచురితమైంది. రెండు షట్పదులు వినండి:

బస్ అయ్ నా ఉమ్మీదీ! న యూఁ దిల్ బుఝాతూ
ఝలక్ అయ్ ఉమ్మీద్! అప్ని ఆఖిర్ దిఖాతూ
జరా నా ఉమ్మీదోంకో ఢారస్ బంధాతూ
ఫసుర్దాదిలోంకే దిల్ ఆఖిర్ బఢాతూ
తెరే దమ్‌సె ముర్దోమ్మె జానేఁ పడీఁహైఁ
జలీ ఖేతియాఁ తూనె సర్ సబ్జ్‌కీ హైఁ
బొహత్ డూబ్తోంకో తిరాయాహై తూనే
బిగడ్తోంకా అక్సర్ బనాయా హై తూనే
ఉజడ్తే దిలోంకో జమాయా హై తూనే
ఉజడ్తే ఘరోంకో బసాయా హై తూనే
బొహత్ తూనె పస్తోంకో బాలాకియా హై
అంధేరేమె అక్సర్ ఉజాలా కియా హై

"ఇక చాలు నిరాశా! ఇలా మనస్సులను క్రుంగదీయకు. ఓ ఆశా! ఒక్కసారి నీ ప్రకాశాన్ని చూపించు. నిరాశోపహతుల గుండెలకు సాహసం కలిగించు.

క్రుంగిపోయిన మనస్సులను గట్టిగా నిలబెట్టు. నీ కారణంగా ఎన్నో శవాల్లో ప్రాణాలు పడ్డాయి. ఎన్నో దగ్ధమయిన చేలను నవనవలాడించినావు నువ్వు.

మునిగిపోయే వాళ్లెందరినో తరింపజేసినావు
కూలిపోయే వాళ్ల నెన్నిసార్లో కోలుకునేట్లు చేసినావు
పడిపోయే యిళ్లెన్నింటినో నిలబెట్టినావు
ఎందరో పడిపోయే వాళ్లను పైకెత్తినావు
చీకట్లో చాలసార్లు వెలుగులు కలిగించినావు

ఈ ముసద్దసే కాక "మునాజాతె బేవా", "చుప్‌కీ దాద్", "బర్ఖారుత్", 'హుబ్బె వతన్" అనేవి హాలీ రచించిన ఉత్తమ రచనలు.

గాలిబ్ మెప్పుపొందిన అతని గజల్లు అందమైనవి. వాటిలోంచి కొన్ని షేర్లయినా ఉదారణించవలసిందే కాని వ్యాసం ఇప్పటికే చాల పెద్దదయి పోయింది.

హాలీ రుబాయీలు కూడ రాసినాడు. అవి నీతి బోధకాలయినవి. అప్పటి పరిస్థితుల్లో అవసరమైనవి. ఇప్పటికీ ఎప్పటికీ అవి అవసరమైనవే. హాలీ వచన రచనల్లో ముఖ్యమైన మూడు జీవిత చరిత్రలను ప్రస్తావించాలె. ఒకటి ఫారసీ మహాకవి షేఖ్ సాదీ జీవిత చరిత్ర. దాని పేరె 'హయాతె సాదీ', ఇంకొకటి 'యాద్‌గారె గాలిబ్' ఈ గాలిబ్ జీవిత చరిత్ర ప్రామాణికమైనది. హాలీ గాలిబ్ శిష్యుడు. అతని జీవితాన్ని, కవితను, స్వభావాన్ని అర్థం చేసుకున్నవాడు. పైగా ఏది రాసినా నిజాయితీగా రాసేవాడు. గాలిబును గురించి తర్వాత ఎవరెన్ని గ్రంథాలు రాసినా యాద్‌గారె గాలిబ్‌ను సంప్రతించకుండా రాసిన వాళ్లు కాదు. సర్ సయ్యద్ జీవిత చరిత్రను 'హయాతె జావీద్' అనే పేర రచించినాడు హాలీ. అవికాక వ్యాసాలూ జాబులూ పలు తడవలు అచ్చయినవి. ఆజాద్, హాలీల సమకాలీనుడు గాలిబు శిష్యుడు నవ్య కవిత రాసినాడు ఇస్మాయిల్ మీరఠీ. అతన్ని ఈ అధ్యాయనంలోనే స్మరించుకోవాలె.

◆ ◆ ◆

షిబ్లీ నోమాని

దేశ స్వాతంత్ర్యం కోసం హిందువులు ముస్లిములు అనే భేద భావం లేకుండా చాలమంది భారతీయ మేధావులు క్రీ.శ. 1885లో జాతీయ కాంగ్రెస్ అనే సంస్థను స్థాపించినారు. అందుల్లో హిందువులు, ముసల్మానులు, సిక్కులు, క్రైస్తవులు, ఫారసీలు తమతమ మత ధర్మాలను పాటిస్తూ జాతీయ భావాలతో కాంగ్రెసును సమర్థించిననారు. సర్ సయ్యద్ మాత్రం కాంగ్రెసును సమర్థించలేదు. 19వ శతాబ్దం చివరి వరకు ఇంగ్లీషు వాళ్ల పుణ్యమా అని సాంప్రదాయిక వాదులైన ముసల్మానులు ముస్లింలీగ్‌ను, అలాంటి వాళ్లే ఐన హిందువులు హిందూ మహాసభను స్థాపించుకున్నారు. ఇది ఇంగ్లీషు వాళ్ల విజయం. ఒకే దేశానికి చెందిన ఒకే జాతి ప్రజలను మతం పేర, కులం పేర విడదీసి ఐక్య సంఘటనకు అంతరాయం కలిగించినారు. హాలీ ఏ రాజకీయ పార్టీతో సంబంధం పెట్టుకోలేదు. కాని షిబ్లీ నోమాని జాతీయ కాంగ్రెస్ పార్టీని సమర్థించటమే కాక ముస్లింలీగ్‌ను తీవ్రంగా విమర్శించినాడు.

షిబ్లీ నోమాని ఆజాద్, హాలీల కంటేవయస్సులో చిన్నవాడు. ఆజంగఢ్‌లో జన్మించిన షిబ్లీ కుటుంబ పరిస్థితులు అనుకూలంగా లేనందున అలీఘడ్ చేరుకుని అరబీ, ఫారసీ, ఉర్దూ భాషల్లో మంచి పాండిత్యం సంపాదించినాడు. అలీఘడ్‌లో కొంతకాలం ఫారసీ భాషాధ్యక్షుడుగా పనిచేసినాడు. అక్కడే అతనికి సర్ సయ్యద్, మౌలానా హాలీ, ప్రొఫెసర్ ఆర్నాల్డ్ లాంటి గొప్ప వాళ్ల పరిచయం లభించింది. ప్రొఫెసర్ ఆర్నాల్డ్‌తో కలిసి ఈజిప్టు మొదలైన దేశాలు కొన్ని తిరిగి వచ్చినాడు. తనసమకాలీనులలో చాలా మంది కంటే అతని ప్రపంచ జ్ఞానం విస్తృతమయినది. ఇంగ్లీషు వాళ్ల పట్ల అతనికి గల ద్వేషభావాన్ని దాచుకునే ప్రయత్నం చేయలేదు. వ్యంగాత్మకమైన కవితల్లో తీవ్రంగా విమర్శించినాడు. అతడుచెప్పిన కవితలు కొన్నే కాని అన్నీ ఉత్తమమైనవే. అతడు రాసిన 'సుబహే-ఉమ్మీద్' అనే మస్నవీ, 'అదలే జహాంగీరి', 'షహరె -ఆషోబె-ఇస్లాం' అనే దీర్ఘ కవితలు చాలా ప్రసిద్ధమైనవి. ఐనా మౌలానా షిబ్లీకి కవిగా కంటేరచయితగానే గొప్పకీర్తి లభించింది. అలీఘడ్‌లో 'దారుల్ ముసన్నిఫీన్' అనే సంస్థ స్థాపించి చాలామంది రచయితలకు మార్గ

దర్శకుడైనాడు. అతని వచన రచనల్లో సుప్రసిద్ధమైనవి 'అల్ మామూన్', అల్ ఫారూఖ్, ఇల్ముల్కలాం, 'సీరతున్నబీ', 'షేరుల్ ఆజం', 'మువాజినయే- అనీస్ వదబీర్'. చివరి గ్రంథం మర్శియా రచనల్లో సర్వశ్రేష్ఠులైన, అనీస్ దబీర్ల తులనాత్మక పరిశీలన. 'షేరుల్ అజం' ఎఫారసీ కవుల చరిత్ర. 'సీరతున్నబీ' దైవప్రవక్త జీవిత విశేషాలు. అన్నీ చదువతగ్గ గ్రంథాలే. అతని వచనం చక్కగా చదివించగలది. చివరికి అతని కవితలోని కొన్ని పంక్తులతో ఈ వ్యాసం ముగిస్తాను.

కోయీ పూఛేకి అయె తహజీబె- ఇన్సానీ కె ఉస్తాదో
యె జుల్మారాయియాఁ తాకై యె హస్ర అంగే జియాఁ కబ్ తక్
యె మానా తుమ్‌కో తల్వారోంకి తేజీ ఆజ్ మానీ హై
హమారీ గర్దనోం పర్ హోగ ఇస్కా ఇమ్‌తెహాఁ కబ్ తక్
యె మానా ఖిస్సయే-గమ్‌సే తుమారా జీ బహెల్‌తా హై
సునాయేఁ తుమ్‌కో అప్నే దర్దె-దిల్‌కి దాస్తాఁ కబ్ తక్
సమఝ్ కర్ యేకె ధుంద్ లేసే నిషానే- రఫ్తగాఁహైమ్ హైఁ
మిటా వోగే హమారా ఇస్ తరహా నామో నిషాఁకబ్ తక్

ఇది ఇంగ్లీషుపాలకులను ఉద్దేశించి చెప్పిన కవిత. 'మానవ సంస్కృతికి గురువులైన వాళ్లను ఎవరైనా ఇలా ప్రశ్నించాలె. మమ్మల్నిలా బాధ పెట్టటం ఎంత కాలం? ఈ అన్యాయాలెంత కాలం? మీ కత్తులు పదును పరీక్షించటం అవసరమే. కాని దాని కోసం మా మెడలననే పరీక్షించటం ఎంత కాలం? ఒకరి దుఃఖగాథలు వింటే మీమనస్సుకు సంతోషం కలుగుతుందని ఒప్పుకున్నాం, కాని మా దుఃఖగాధల్ని ఎంత కాలం విన్పించటమంటారు? మిమ్మల్ని మీరు అస్పష్టంగా వున్న కాలి గుర్తులుగా భావించి మా గుర్తులైనా లేకుండా తుడిచివేయటం ఎంత కాలం?

◆ ◆ ◆

అక్బర్ ఇలాహాబాదీ

మౌలానా షిబ్లీ నోమానీ గురించి తెలుసుకున్నాము. అక్బర్, షిబ్లీ కంటే కొన్నేళ్లు పెద్ద వాడయినా సమకాలికుడే. ఇద్దరిలో భావసామ్యత కూడా వున్నది. ఇద్దరూ అంగ్లేయుల పాలన వలన భారత దేశం ఇంకా నష్టపోతుందని, తనసభ్యతా సంస్కారాలను కోల్పోతోందని భావించిన వాళ్లే. ఈ యిద్దరూ అంగ్ల భాష ప్రయోజనాన్ని గుర్తించని వాళ్లు కారు. అంగ్ల సంస్కృతికి విరోధులు కారు. కాని అంగ్ల భాష పట్ల, అంగ్ల సభ్యత, సంస్కృతి పట్ల వ్యామోహం పెంచుకున్న భారతీయులను నిశితంగా విమర్శించినారు. వెక్కిరించినారు. ఇద్దరూ జాతీయ కాంగ్రెస్ పట్ల అభిమానం కలవాళ్లే. ఇద్దరిలో తేడా యేమిటంటే షిబ్లీ స్వతంత్రుడు కనుక తన భావాలను సూటిగా, ఘాటుగా వెల్లడించినాడు. అతని వ్యంగ్యం తీక్షణమైనది. అక్బర్ అంగ్ల ప్రభుత్వోద్యోగి కనుక, అంచెలంచెలుగా ఎదిగి జిల్లా జడ్జి పదవిని పొందినవాడు కనుక, ఖాన్ బహదుర్ అనే ఉపాధిని కూడా పొందిన వాడు కనుక, తన భావాలను హాస్య మిళిత వ్యంగ్య ధోరణిలో వెల్లడించి నాడు. పూర్తిగా కాంగ్రెస్ అభిమాని కాలేకపోయినాడు. పూర్తిగా అంగ్లేయ విరోధి కాలేక పోయినాడు అందుకే,

మఖ్దూలయే గవర్నమెంట్ అక్బర్ అగర్ న హోతా

ఉస్కోభి ఆప్ పాతే గాంధీకి గోపియోమ్మే. అన్నాడు.

"అక్బర్ ప్రభుత్వోద్యోగి కాకుంటే గాంధీ అభిమానుల్లో కనిపించే వాడు" అని తాత్పర్యం.

అక్బర్ తన కొడుకును ఉన్నత విద్యకోసం విదేశాలకు పంపినాడు. ఆ కొడుకు తండ్రి భావాలకు పూర్తిగా వ్యతిరేకి. కొడుకును చూచే అక్బర్ ఈ షేర్ చెప్పి వుంటాడు.

హమ్ ఐసీ సబ్ కితాబేఁ ఖాబిలే-జప్తీ సమఝ్తే హైఁ

జిన్హే పఢ్కెసె బేటే బాప్‌కో ఖబ్తీ సమఝ్తే హైఁ

"ఏ పుస్తకాలను చదివి కొడుకు తమ తండ్రులను వెర్రివాళ్ళని భావిస్తారో ఆ పుస్తకాలన్నీ నిషేధించదగినవని మా అభిప్రాయం."

ఈ మాట కోర్టు తీర్పులాగా వున్నది కదా! జిల్లా జడ్జి మాట మరి!

అక్బర్ జన్మతః కవి. ప్రేమభావాల గజల్లు చెప్పినా, సూఫీ భావ శోభితాలైన గంభీర కవితలు చెప్పినా, హాస్య వ్యంగ్య కవితలు చెప్పినా "కవిత్వమిలా వుండాలె" అనే విధంగా చెప్పగలడు. ఖాఫియాలు దొరకటం ఉర్దూ కవికి కష్టం. గాలిబంతటి వారు 'తంగ్ ఖాఫియా' అని బాధపడ్డాడు. అక్బర్ ముందు మాత్రం ఖాఫియాలు వరుసగట్టుకొని నిల్చుండేవనిపిస్తుంది. ఇంగ్లీషు పదాలను సయితం అతడు ఖాఫియాలుగా ప్రయోగించుకున్నాడు. అవి బంగారంలో పొదిగిన రత్నాల వలె శోభిస్తాయి. డాక్టర్ ఎక్బాల్ అంతటి మహాకవి అక్బర్ హాస్య కవితలను కొన్నిచోట్ల అనుకరించినాడు. ఖ్వాజా హసన్ నిజామి-1 ఎక్బాల్ హాస్య కవితలను 'అక్బరీ -ఎక్బాల్' అనే పుస్తకంలో ఏరికూర్చి ప్రచురించినాడు. వయస్సులో భేదమున్నా అక్బర్ ఎక్బాలులు మంచి మిత్రులు. ఎక్బాల్ కంటేఅక్బర్ ముప్ఫయ్యేళ్లు పెద్ద.

కొన్ని హాస్య వ్యంగ్యాత్మకాలైన షేర్లు;

క్యాకహూ ఇస్కూ మై బద్ బఖ్తియె- నేషన్ కె సివా

ఇస్కో ఆతా నహీ కుఛ్ భీ ఇమిటేషన్ కె సివా

"దీన్ని జాతి దౌర్భాగ్యం కాక ఇంకేమనాలె? దీనికి అనుకరణ తప్ప ఇంకేదీ రాదు."

రెండు ఖాఫియాలూ ఇంగ్లీషు పదాలే. 'బద్ బఖ్తియె-నేషన్' అనేది ఫారసీ ఇంగ్లీషు పదాల సమానం. దుష్ట సమానం కదా. అయినా బందిష్ బిగువు చూడండి.

ఖోమ్‌కె గమ్ మె డినర్ ఖాతేహైఁ హుక్కామ్ కె సాథ్

రంజ్ లీడర్‌కొ బొహత్ హై మగర్ ఆరామ్‌కె సాథ్

'నాయకులకు తమ జాతి పట్ల గల బాధ గొప్పది. కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ అధికార్లతో కలిసి డిన్నర్లు తింటారు."

క్యా కహేఁ అహ్‌బాబ్ క్యా కారే నుమాయాఁ కర్‌గయే

బి.ఎ. హువే, నౌకర్ హువే, పెన్షన్ మిలీ ఫిర్ మర్‌గయే

'మిత్రులెంతెంత కార్యాలు చేసినారో ఏమి చెప్పను? బి.ఎ. చదివినారు. ఉద్యోగం పొందినారు. పెన్షన్ తీసుకున్నారు. తర్వాత చచ్చిపోయినారు.'

నూరె-ఇస్లామ్‌నె సమ్‌ఝా థా మునాసిబ్ పర్దా

షమ్మ-ఖామోష్ కొ ఫానూస్ కి హాజత్ క్యాహై

"ఇస్లామీయ ప్రకాశం ఉన్నప్పుడు పర్దా అవసరమునుకున్నారు. ఆరి పోయిన షమ్మా కోసం గాజుకుప్పె యెందుకు?"

బే పర్ద కల్‌జో ఆయిఁ నజర్ చంద్ బీబియాఁ

అక్బర్ జమీఁమె గీరతె- ఖోమిసె గడ్ గయా

పూఛా జొ ఉన్సె ఆప్కా పర్దావొ క్యాహువా

కహ్నె లగీఁకె అఖ్లొపె మర్దోంకి పడ్ గయా

'పర్దాలేని స్త్రీలు కొందరు కనిపిస్తే అక్బర్ సిగ్గుతో భూమిలో కుంచించుకు పోయినాడు. 'అమ్మా! మీ పర్దా యేమయింది?" అంటే 'మగవాళ్ల బుర్రల మీద పడింది." అన్నారు.

బతావుఁ ఆప్కొ మర్నేకె బాద్ క్యాహోగా

"చనిపోయిన తర్వాత ఏమవుతుందో చెప్పనా?"

ఈ ప్రశ్న అడుగగానే ఏమనిపిస్తుంది? ఆత్మకు సంబంధించిన ఏదో గంభీర విషయం చెప్తాడనుకుంటాము గదా! రెండవ మిస్రా ఇలా చెప్తాడు.

పాలావ్ ఖాయేఁగె అహ్‌బాబ్, ఫాతెహా హోగా

'మిత్రులూ బంధువులూ ఫాతిహా చదువుతారు. పలావ్ తింటారు" నిజమే కదా!

సూఫీ భావ విలసితమైన అతని కవిత అందమైందే. ఒక గజల్‌లోని కొన్ని షేర్లు వినండి;

దున్యామె హూఁ దున్యాకా తలబ్‌గార్ నహీహూఁ

బాజార్ సె గుజ్‌రాహూఁ ఖరీదార్ నహీ హూఁ

"ప్రపంచంలో వున్నాను కాని ఇక్కడిదేదీ నా కవసరం లేదు. బాజార్ లోంచి నడుస్తున్నాను. కాని ఏదీ కొనుక్కునే వాన్ని కాను."

దీన్నే తామరాకు మీద నీటి బొట్టు వలె వుండటమంటారు.

ఇస్ ఖానయె హస్తీసె గుజర్ జావుంగా బే లోస్

సాయా హూం మగర్ నఖ్ష్ బదీవార్ నహీ హూం

'ఈ జీవితమనే గూటిలోంచి ఏలాటి తగులమి లేకుండా వెళ్ళి పోతాను. గోడమీది నీడనే కాని గోడమీది చిత్తరువును కాను."

భారతీయులైన హిందూ ముస్లిముల చేత వేరు కుంపట్లు పెట్టించి విభజించి పాలించే నీతిని ప్రదర్శించిన బ్రిటిష్ ప్రభుత్వంతో అప్రమత్తంగా వుండాలని జాతినిలా ఉద్బోధిస్తున్నాడు అక్బర్:

కెహెతాహూంమై హిందూ-వ-ముసల్మాం సె యెహీ

అప్నీ అప్నీ రవిష్ పె తుమ్ నేక్ రహో

లాఠీహై హవాయె దహెర్, పానీ బన్ జావో

మోజోంకి తరహ్ లడో మగర్ ఏక్ రహో

హిందువులతో, ముస్లిములతో నేననేదేమంటే మీమీ సంప్రదాయాల ప్రకారం మంచిగా వుండండి. కాలం బడితెలాంటిది. (నీటి మీద బడితెతో కొడితే ఉవ్వెత్తుగా అలలు లేచి మళ్లీ కలిసిపోతాయి) అలల లాగా తలపడినా మళ్లీ కలసి పొండి.

◆ ◆ ◆

పండిత్ బ్రిజ్‌నారాయణ్ చక్బస్త్

గజల్ ప్రణయ భావాలకు, సూఫీ భావాలకు, కొన్ని యెడల శాశ్వత విలువలు గల సుభాషితాలకు మాత్రమే పరిమితమైన కవిత. గజల్ షేర్లు ఖాఫియా రదీఫుల పాబందీ వలన చెప్పవలసిన విషయాన్ని చాల పొందికగా కుదించి చెప్పవలసి వుంటుంది. ఈకుదింపు చాల సందర్భాల్లో కవి సామర్థ్యాన్ని వెల్లడించి పఠితలకు, శ్రోతలకు ఆనందాన్ని కలిగిస్తుంది. కొన్ని సందర్భాల్లో కవి చెప్పవలసిన విషయాన్ని అల్పాక్షరాల్లో చెప్పలేక పోయినందున భావం స్పష్టం కాక పఠితలకు,

శ్రోతలకు చికాకు కలిగిస్తుంది. మిర్జాగాలిబంతటి మహాకవి తన గంభీర భావాలను ఉర్దూలో చెప్పటానికి ఖాఫియా ఆటంకమయిందని వాపోయినాడు. అతని షేర్లలలో చాల చోట్ల స్పష్టత లోపించింది. అందుకే తన భావప్రకటనకు ఉర్దూ కంటె ఫారసీ అనుకూలమైన భాష అని పలుతడవలు చెప్పుకున్నాడు. అంతేకాక గజల్లలో ప్రయోగించే ప్రతీకలు ప్రత్యేకమైనవి. అయితే, మేధావుల్లో సాహితీవేత్తల్లో రాజకీయ, సామాజిక పరిస్థితుల అవగాహన కలిగిన తర్వాత గజల్ రచనలో సిద్ధహస్తులైన కవులు అవేప్రతీకల సహాయంతో దేశభక్తిని ప్రబోధించే గజల్లు చెప్పినారు. అలాంటి వాళ్లనేకులు. దుర్గా సహాయ్ సరూర్, జ్వాలా ప్రసాద్ బర్ఖ్ ముఖ్యంగా పేర్కొనదగిన వాళ్లు. గజల్లనేకాక భావప్రకటనకు అనువైన నజములు కూడ చెప్పిన వాళ్లున్నారు. పండిత్ బ్రిజ్ నారాయణ్ చక్బస్త్, డా. సర్ మొహమ్మద్ ఎక్బాల్ ఆ కాలంలో అట్లాంటి మహాకవులు. కాశ్మీరీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన చక్బస్త్ బి.ఎ. వరకు చదివి, వకాలత్ పరీక్షలో ఉత్తీర్ణుడై, న్యాయవాద వృత్తిని అవలంబించినాడు. అతడు అనేక భాషల్లో పాండిత్యం సంపాదించి ఉర్దూలో కవిత రాయటం ప్రారంభించినాడు. అప్పటికింకా బ్రిటిష్ వాళ్లను తరిమివేసి మన దేశానికి స్వాతంత్ర్యం సంపాదించే సాహసం కలుగలేదు భారతీయులకు, చక్బస్త్ భావనలు ప్రభుత్వం ప్రాపున హోమ్‌రూల్ ప్రాప్తి వరకే సాగినవి. అప్పటికవి విప్లవ భావాలే. బ్రిటిష్ వాళ్ల దమన నీతిని తన కవితల్లోనూ, వచనల్లోనూ నిరసించినాడు చక్బస్త్. రాయటానికి, మాట్లాడటానికి స్వాతంత్ర్యం వుండాలని వాదించినాడు. అతని వచన రచనలు సర్వవిధాలా శ్రేష్టమైనవి. తన రచనల్లో అనేక విషయాలను స్పృశించినాడతడు. దేశభక్తి, హిందూ-ముస్లిములల్లో సుహృద్భావం, జాతీయ సమైక్యత, మన దేశపు పూర్వ వైభవం, మన సంస్కృతి విశిష్టత- ఇవన్నీ అతని రచనల్లో ముఖ్యాంశాలు. డా. ఎక్బాల్ చాలకాలం ఈ అంశాలనే గ్రహించినాడు. తరువాత అతని భావాల్లో మార్పు వచ్చింది. అదంతా ఎక్బాల్ గురించి రాసేటప్పుడు మాట్లాడుకుందాం. ఆకాలపు కవుల్లో చక్బస్త్ , ఎక్బాలులు గొప్పకవులు. ఈ వ్యాసాన్ని చక్బస్త్ రాసిన ఒక దేశభక్తి కవితతో ముగిస్తాను. అతడు తన కావ్య సంకలనానికి "సుబహె-వతన్" అని పేరు పెట్టి అచ్చుకిచ్చినాడు. కాని అది అతని మరణానంతరమే అచ్చయింది. నలభైనాలుగేళ్ల చిన్న వయసులోనే మరణించినాడు చక్బస్త్. ఇంకా కొన్నాళ్లు బ్రతికి వుంటే ఉర్దూ కవితను ఇంకా అలంకరించి వుండేవాడు. రామాయణంలోని కొంత భాగాన్ని ఉర్దూ కవితలో రమ్యంగా అనువదించినాడు. మొత్తం అనువదించే అవకాశం అతనికి లభించి వుంటే బాగుండేది. చక్బస్త్ రాసిన ఒక దేశభక్తి కవిత:

ఐఖాకె-హింద్! తేరీ అజ్మత్ మె క్యాగుమాఁహై
దర్యామె-ఫైజె ఖుద్రరత్ తేరేలియే రవాఁహై
తేరీ జబీఁ సె నూరే-హుస్నే-అజల్ అయాఁహై
అల్లాహ్ రె జేబొ జీనత్ క్యా ఔజె-ఇజ్జో-షాఁహై
హర్ సుబ్హ హై యె ఖిద్మతె ఖుర్షీదె-పుర్ జియాకి
కిరణోంసె గూంథ్తా హై చోటీ హిమాలయాకీ
గౌతమ్‌నె ఆబ్రూదీ ఇస్ మాబదే- కొహన్ కో
సర్మద్‌నె ఇస జమీఁపర్ సద్కాకియా వతన్ కో
అక్బరె నె జామె-ఉల్ఫత్ బఖ్షా ఇస్ అంజుమన్ కో
సీంచా లహూసె అప్నే రాణానె ఇస్ చమన్ కో
సబ్ సూర్ వీర్ అప్నే ఇస్ ఖాక్ మే నిహాఁహైఁ
టూటే హువే ఖండ్హర్ హైఁయాఉన్కి హడ్డియాఁహైఁ
బర్సోంసె హోరహాహై బరహమ్ సమాఁహమారా
దున్యాసె మిట్ రహాహై నామొ-నిషాఁహమారా
కుఛ్ కమ్ నహీ అజల్ సే ఖ్వాబే-గిరాఁహమారా
ఇక్ లాషె-బేకఫన్ హై హిందూస్తాఁ హమారా
ఇస్కే భరే ఖజానే బర్బాద్ హోరహేహైఁ
జిల్లత్ నసీబ్ ఖ్వాబె-గఫ్లత్ మె సోరహేహైఁ
"ఓ భారతావనీ! నీ శ్రేష్టత పట్ల సంశయమెక్కడిది?
నీ కోసం భగవదనుగ్రహమనే నది ప్రవహిస్తున్నది.
నీనొసట అనాది కాలపు కాంతి కనిపిస్తున్నది.
నీ విలాసం ఎంతో గౌరవాస్పదమై అతిశయిస్తున్నది.
సూర్యుడు ప్రతి ఉదయం హిమాలయమనే నీ జడను తన కిరాణాలతో
అల్లే సేవలో నియుక్తుడైవున్నాడు.
ఈ ప్రాచీన క్షేత్రానికి గౌతముడు గౌరవం కలిగించినాడు.
సూఫీ సర్మద్ తన స్వదేశాన్నే త్యజించినాడు.

ఈ 'మహెఫిల్'కు అక్బర్, ప్రేమ మదిర త్రాగించినాడు.

రాణా ప్రతాప్ ఈ తోటను తన రక్తంతో తడిపినాడు.

మనశూరులూ, వీరులూ ఈ మట్టిలో అణగివున్నారు.

శిధిలాలయి-ఎముకలయి.

చాల కాలం నుంచి మన మహఫిల్ చెదిరి పోతున్నది.

మన పేరు ప్రఖ్యాతులే కాదు మన గుర్తులు కూడా ప్రపంచంలోంచి తుడిచివేయబడుతున్నవి.

మన మొద్దు నిద్రా మృత్యువు కంటే తక్కువేమీ కాదు-నేడు మన దేశం కఫన్ లేనని శవం.

సిరి సంపదలతో నిండి వుండే మన దేశపు నిధులు కొల్లగొట్టబడు తున్నాయి.

దౌర్భాగ్యులయిన మన వాళ్లు గాఢ నిద్రలో మునిగివున్నారు.

◆ ◆ ◆

డా. సర్ మహమ్మద్ ఎక్బాల్

ఎక్బాల్ క్రీ.శ. 1874వ సం.న సియాల్ కోటలో జన్మించినాడు. లాహోర్ యూనివర్శిటీ నుంచి ఫిలాసఫీలో ఎం.ఏ. పట్టాపొందినాడు. తర్వాత పై చదువు లకు ఐరోపా వెళ్లి, ఇంగ్లాండు నుంచి బారిస్టరీ పట్టా పొంది, జర్మనీ ఫిలాసఫీలో డాక్టరేటు చేసినాడు.

స్వదేశం తిరిగివచ్చిన తరువాత లాహోర్ హైకోర్టులో ప్రాక్టీసు మొదలు పెట్టినాడు. కొంతకాలం ఒకస్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసినాడు. కొంతకాలం పంజాబ్ రాజకీయాలలో పాల్గొన్నాడు. క్రీ.శ. 1931లో ముస్లింల ప్రతినిధిగా రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనటానికి లండన్ వెళ్ళినాడు. అతని ఆరోగ్యం క్షీణించటం ప్రారంభించింది. 1938లలో అస్తమించినాడు.

ఎక్బాల్‌కు ఉర్దూ, ఫారసీ, కవిగా గొప్ప పేరున్నది. అతని కవిత "హిమాలయ" 1899వ సం.లోనే ప్రకాశితమై కవిగా అతనికి మంచి గుర్తింపు తెచ్చినది. అప్పటి కవితలన్నీ దేశభక్తికి, మానవతా విలువలకు, ప్రకృతిలోని అందాల పరిశీలనకు, భారతీయ సభ్యతా సంస్కారాలు పట్ల గల ఆదరభావాలకు సంబంధించినవి. ఆ తర్వాతి కవితల్లో అతని భావాలు, అతని ఆలోచనా సరళిలో గొప్ప మార్పు కనిపిస్తుంది. ఈ మార్పు కారణంగా ఎక్బాల్‌ను పలువురు పలురకాలుగా భావించినారు. కొందరు అతన్ని మతతత్త్వవాది అన్నారు. కొందరు అభ్యుదయ భావాలుగల కవి అన్నారు. కొందరతడు దార్శనికుడు మాత్రమే అన్నారు.

ఉర్దూ కవుల్లో మహాకవి మీర్ తఖీమీర్ స్థానం సర్వథా ఉన్నతమైనది. అతడు కనిష్ఠికాధిష్ఠితుడు. ఆ తర్వాత మిర్జాగాలిబ్ మేధావులను రంజింపజేసే, ఆలోచింపజేసే కఠినమైన కవిత చెప్పినాడు. ఎక్బాల్ కూడా మిర్జాగాలిబ్ లాంటి కవే. నా మాటల సారాంశమేమంటే మీర్ తర్వాత ఉర్దూలో ఇద్దరే మహాకవులు. ఒకడు మిర్జాగాలిబ్, ఇంకొకడు మహమ్మద్ ఎక్బాల్. ఇద్దరూ గంభీర భావాలు గలవాళ్లు. ఉన్నత భావాలు కలవాళ్లు. కఠినశైలిలో కవిత చెప్పేవాళ్లు. వాళ్లభావ ప్రకటనకు ఆ శైలే అనువైనది.

ఎక్బాల్ మహామేధావి. చింతనశీలి. విస్తారమైన అధ్యయనం కలవాడు. అతడు భారతీయ వేదాంతాన్నేగాక పాశ్చాత్య వేదాంతాన్ని కూలంకషంగా అధ్యయనం చేసినాడు. ఐరోపా ఖండంలో చాలకాలం నివసించి బ్రిటిషు వాళ్ల కూటనీతిని, రాజ్యవిస్తరణ కాంక్షను గ్రహించినాడు. అతని కవితను అర్థం చేసుకోవాలంటే కేవలం భాషా పాండిత్యం సరిపోదు. అప్పటి భారత దేశ, ఐరోపా పరిస్థితులను అర్థం చేసుకోవాలె. భారతీయ వేదంతాన్నేకాక ప్లేటో, నిట్‌షే, బర్గ్‌సాఁ, ఐన్‌స్టయిన్ మొదలగు దార్శనికులను చదివి వుండాలె. అరవిందుని ఫిలాసఫీలోలాగా కొన్ని కొత్త మాటలు, కొత్త భావాలు ఎక్బాల్ కవితలో కనిపిస్తాయి. అతని 'ఖుదీ' అనే ఫల్సఫా బహు చర్చితమయింది. అతని 'మర్దెమోమిన్' 'తాయిరే లాహుతీ' అనే ప్రయోగాలు కూడా కొత్తవే. మానవుడు తన ఆత్మశక్తితో ఆకాశాన చుక్కలవలె ప్రకాశించ గలడని ఆశించినాడు. ప్రబోధించినాడు కూడా. అటువంటి సందర్భాలలో ఆదర్శవాదిగా కనిపిస్తాడు.

సారే జహాఁసె అచ్ఛా హిందూ సితాఁహమారా

హమ్ బుల్ బులేఁ హైఁ ఇస్కీ యే గుల్ సితాఁహమారా

అనే దేశభక్తి గీతం ఎక్బాల్ రచించినదే. దీనిలో అతనికి మాతృదేశం పట్ల గల అభిమానం వ్యక్తమవుతుంది. ఈ గీతంలోని అన్ని షేర్లు గొప్పవే.

యూనానొ మిస్రొరూమా సబ్ మిట్ గయే జహాఁసె

లేకిన్ అభీ హై బాకీ నామోనిషాఁఫమారా

"ఒకప్పటి సభ్యదేశాలయిన గ్రీసు, ఈజిప్ట్, రోము మొదలైనవి తమ పూర్వవైభావాన్ని కోల్పోయినవి. కానీ భారతదేశము పేరుప్రఖ్యాతులింకా నిలిచి వున్నవి." అంటాడు ఎక్బాల్. ఎక్బాల్ సమకాలికుడు, భావసౌమ్యం కలవాడైన చక్‌బస్త్‌ను గురించి ఇంతకు ముందు చదివినాము. అతడేమో భారతదేశం పేరు ప్రఖ్యాతులు కూడా నశించిపోతున్నాయన్నాడు. ఎక్బాలేమో ఇంకా మిగిలివున్నా యని, మిగిలివుంటాయని ఆశాభావాన్ని వ్యక్తం చేసినాడు.

కానీ భారతీయులు బ్రిటీషు వాళ్ల కూటనీతిని గ్రహించలేక పోతేమాత్రం నశించి పోతారని హెచ్చరించినాడు.

నసమ్ఝోగేతో మిట్ జావోగె అయ్ హిందూస్తాఁవాలో

తుమ్హారీ దాస్తాఁతక్ భీ నహోగీ దాస్తానోమ్మె

"భారతీయులారా నా మాటలు గ్రహించక పోతే నశించిపోతారు. ప్రపంచ గాథల్లో మీ గాథకూడా మిగలదు."

ఎక్బాల్ మొదటి కావ్య సంకలనం 'బాంగే-దరా' అందులో భారతీయత పట్ల అభిమానం కనిపిస్తుంది. రామున్ని గురించి బుద్ధున్ని గురించి ప్రత్యేక కవితల్ని రాసినాడు అందులో. 'బాంగే-దరా' కాక ఉర్దూలోని అతని కావ్య సంకలనాలు 'బాలె-జిబ్రీల్', 'జర్బె-కలీమ్', 'అర్మగనె-హిజాజ్' అనేవి ప్రసిద్ధమైనవి. అతని ఫారసీ రచనలు అనేకం. అవి ఉర్దూ రచనల కంటే శ్రేష్టమైనవి.

ఎక్బాల్ కవితను మొదట్లో ఉస్తాద్ 'దాగ్' దహేల్వీ చేత దిద్దించుకున్నాడు. కొన్ని కవితలు దిద్దిన తరువాత దాగ్ అతనికి 'మీ కవితలు శ్రేష్టమైనవి. దిద్దించుకోవలసిన అవసరం లేదిక' అని రాసి పంపినాడు. ప్రపంచ పరిస్థితులను అవగాహన చేసుకున్న తరువాత అతనికి ప్రపంచ దేశాల ముసల్మానుల భవిష్యత్తు పట్ల ఆందోళన కల్గింది. అతడుప్రపంచంలోని ముసల్మానుల అభ్యున్నతిని ప్రబోధిస్తూ కవిత్వం రాసినట్లు కనిపిస్తుంది. అతడు ఏది చెప్పినా ముసల్మానులకే చెప్పినట్లున్నా అతని సందేశం సర్వమానవాళికి సంబంధించినది. ప్రాచ్య పాశ్చాత్య

వేదాంతులను బాగా అధ్యయనం చేసినాడని పైన రాసినాను. అయితే అతడు అందరి భావాలను అనుకరించలేదు. తనకు నచ్చనిది విసర్జించినాడు. తనకు అనుకూలమైన వాటిని ప్రబోధించినాడు. ఆత్మసమర్పణ, శరణాగతి వంటి భారతీయ వేదాంతభావాలు 'ఫనాఫిల్లా' వంటి సూఫీ భావాలు అతనికి నచ్చలేదు. కానయితే అతడు సూఫీ భావాలు కలవాడే. కానీ అప్పటి పరిస్థితుల్లో అవి అనువైనవి కావనుకొన్నాడు. భగవంతుని సృష్టిలో మానవుడు సర్వశ్రేష్ఠుడు. మానవుడు తన ఆత్మశక్తిని పెంచుకుంటేనే భగవంతునికి చేరువవుతాడు. ఈ ఆత్మశక్తినే అతను 'ఖుదీ' అన్నాడు.

ఖుదీ కో కర్ బులంద్ ఇత్నా కె హర్ తక్‌దీర్ సె పహెలే
ఖుదా బందేసె ఖుద్ పూఛే బతా తేరీ రజా క్యాహై

"మా నుదిటి రాత ఇంతే వున్నది కనుక మేమిలా బాధలు పడుతున్నాము" అని భావించేవాళ్లకు ఇది చక్కని ఉద్బోధ. 'నీ ఆత్మశక్తిని పటిష్టం చేసుకో నీ నుదుటి మీద అదృష్టరేఖ గీసేటప్పుడు నీ కోరిక ఏమిటి అని భగవంతుడే నిన్నడగాలి."

ఉరూజే ఆదమే ఖాకీసె అంజుమ్ సహమె జాతేహై
కె ఏ టూటా హువా తారా మహే-కామిల్ న బన్‌జాయే.

"మట్టితో తయారు చేయబడిన మానవునిలోని ఆత్మశక్తిని చూచి ఆకాశంలోని చుక్కలు, ఆకాశంలోంచి రాలిపడిన ఈ చుక్క పూర్ణచంద్రుడు కాడు గదా" అని భయపడుతున్నాయి అంటాడు ఎక్బాల్. మానవుడు (ఆదం) కూడా ఒకప్పుడు ఆకాశంలో వున్నవాడే. సైతాను ప్రేరణ వలన నిషిద్ధఫలాన్ని భక్షించి అందుకు శిక్షగా భూమి మీదికి త్రోసివేయబడ్డాడు. భగవంతుడు మళ్లీ మానవున్ని తన సమీపానికి రప్పించుకోవాలని తహతహ లాడుతున్నాడు. మానవుని పట్ల అంతప్రేమ భగవంతునికి!

బాగే-బహిష్త్ సే ముఝే హుకుమె- సఫర్ దియాథా క్యోం
కారే జహాఁదరాజ్‌హై అబ్‌మేరా ఇంతెజార్ కర్

'స్వర్గంలోని తోట లోంచి వెళ్ళిపొమ్మని నన్నెందుకు ఆజ్ఞాపించినావు? ఈ లోకంలో నేను చేయవలసిన పనులు చాలావున్నాయి. నాకోసం ఎదిరిచూడు."

ఈ షేర్‌లో ఎక్బాల్ కర్మప్రాధాన్యాన్ని చెప్తున్నాడు. 'మర్దెమోమిన్' అంటే భగవంతుని పట్ల ప్రగాఢ విశ్వాసం గలవాడు, స్థితప్రజ్ఞుడు. 'మర్దె మోమిన్'

లక్షణాల గురించి చాలా కవితల్లో చెప్పినాడు ఎక్బాల్. 'తాయిరె లాహూతీ' అంటే స్వర్గానికెగిరే మన రాజహంసలాంటటి పక్షి. హంస అనేది 'సో2హం' అనే మాట అన్న సంగతి భారతీయ వేదాంతం తెలిసిన వాళ్లకి చెప్పవలసిన పనిలేదు. షాహీన్ అనేది గరుడ పక్షి.

హరెక్ మొఖామ్‌సె ఆగే మొఖామ్ హై తేరా
హయాత్ జోఖె సఫర్‌కె సివా కుచ్ ఔర్ నహీ

ఇది తాయిరె-లాహూతీ ఉన్నతోన్నత గమ్యాల వైపు పయనించే కోరిక కలిగి వుండాలని చెప్పిన మాట. జీవితమంటే నిత్యగమనమే.

నతూజమీ కె లియే హై న ఆస్మాఁకెలియే
జహాఁహై తెరెలియే తూనహీ జహాఁకెలియే

"నువ్వు భూమి కోసం కాదు. ఆకాశం కోసం కాదు. నువ్వు సృష్టి కోసం కాదు. ఈ సమస్త సృష్టి నీ కోసమే." అని మానవున్ని ప్రబోధిస్తాడు ఏక్బాల్.

ఇలా ఎక్బాల్ కవితల్లో ఎన్నో విలువైన రత్నాలను ఉదాహరించవచ్చు. విదేశాల్లో చదువుతున్న తన కొడుకు జావీద్ ఎక్బాల్‌కు రాసిన కవితామయ లేఖలు చాలగొప్పవి. రెండు పంక్తులు రాసి ఈ వ్యాసాన్ని విరమిస్తాను.

ఉఠాన శీష గరానే ఫరంగ్ క ఎహసాన్
సిఫాలె హింద్‌సె మినావొ జామ్‌పైదాకర్.

"కాచ పాత్రలు తయారుచేసే బ్రిటిషు వాళ్ల ఉపకారం పొందకు. నీకు అవసరమైన మధు కలశాన్ని, పాత్రను భారత దేశపు మట్టితో తయారు చేసుకో."

ఇక్కడ మధు కలశం, పాన పాత్ర ప్రతీకలు మాత్రమే.

మెరా తరీఖ్ అమీరీ నహీ ఫకీరీహై
ఖుదీ నబేచ్ గరీబీ మె నామ్ పైదాకర్

'నా జీవిత విధానం సంపన్నులది కాదు. ఫకీరులది.ఖుదీని అమ్ముకోకు పేదరికంలో, పేరు తెచ్చుకో."

ఇక్కడ ఖుదీ అన్నపదం ఎక్బాల్ స్వాభిమానం అనే అర్థంలో ప్రయోగించినాడు.

డా. ఎక్బాల్ కొన్ని కవితలు అక్బర్ ఇల్హాబాదీ లాగా వ్యంగ్య ధోరణిలో రాసినాడు. అక్బర్ పెద్దవాడైనా ఎక్బాల్‌కు మిత్రుడు. అక్బర్ ధోరణిలో రాసిన ఎక్బాల్, కవితలను సేకరించి ఖ్వాజా హసన్ నిజామి-1 'అక్బరీ ఎక్బాల్' అనే పేర పుస్తక రూపంలో ప్రచురించినాడు. ఖ్వాజా హసన్ నిజామి ఉర్దూ వచన రచన సరళ సుందరమైనది. అతడు శతాధిక గ్రంథ కర్త. అతడు దిల్లీలోని హజ్రత్ ఖ్వాజా నిజాముద్దీన్ 'ఖాన్ఖాహ్' పీఠాధిపతి. ఇప్పుడున్నతడు ఖాజా హసన్ నిజామి-2.

◆ ◆ ◆

మరి కొందరు సుప్రసిద్ధ కవులు

ఎక్బాల్ సమకాలికులు, కొంత ఇటీవలి వాళ్లయిన కొందరు గజల్ కవుల గురించి మాట్లాడుకున్నాము. ఆ వరుసలోనే ఇంకా కొందరు కవుల గురించి క్లుప్తంగా మాట్లాడుకొని గజల్‌ను చాల Popular చేసిన నలుగురు కవుల గురించి ప్రత్యేకంగా ముచ్చటించుకుందాం. "ఆ వరుసలోనే ఇంకా కొందరు కవులు" అన్నాను పైన. అంటే, వాళ్లు సామాన్య కవులని నా తాత్పర్యం కాదు.

పండిత్ బ్రజ్ మోహన్ దత్తాత్రేయకైఫీ ఏ సాహిత్య చరిత్రలోనూ విస్మరించ దగిన వ్యక్తి కాడు. అతడు ఇంతవరకు ప్రస్తావించిన కవుల కంటే వయసులో పెద్దవాడు. అతని ఫారసీ, ఉర్దూ భాషల్లోని పాండిత్యం అపార మయింది. ఇంగ్లీషు సాహిత్యం కూడా బాగా చదివినవాడు. ఐరోపా యాత్రచేసి వచ్చినవాడు. అతని గద్య రచనల్లో అపారమైన అతని భాషాపాండిత్యం వ్యక్తమవుతుంది. అతడు కవిగా ప్రసిద్ధుడే కాని అతని కవితలో రసం లేదు. లాలా శ్రీరామ్ దహెల్వీ అనే సంపన్న విద్వాంసుడు కొన్నివేల గ్రంథాలు సేకరించి ఉర్దూ కవుల సమగ్ర చరిత్రలో వ్రాయటానికి సంకల్పించుకున్నాడు. 'ఖుమ్ ఖాన-యె-జావీద్' అనే పేర నాలుగు భాగాల చరిత్ర రాసి మరణించినాడు. మిగిలిన ఐదవ భాగాన్ని పండిత్ కైఫీ పూర్తి చేసినాడు. అతనికి హాలీ, ఆజాదుల పరిచయం వున్నది. అతని ఫారసీ ఉర్దూ భాషాతత్త్వ పరిజ్ఞానం కారణంగా ఆనాటి కవులూ విద్వాంసులూ అతన్ని మోలానా కైఫీ అనేవాళ్లు.

పండిత్ లబ్బూరామ్ జోష్ మలిస్యానీ కూడ మహాకవుల్లో లెక్కించదగిన వాడే. కవితా రచనలో అతడు ఉస్తాద్ దాగ్ శిష్యుడు. అతని భాషా పాండిత్యం కూడా అంతులేనిదే. గాలిబ్ దీవాన్‌కు వ్యాఖ్యానం రాసిన కొందరు సుప్రసిద్ధ

విద్వాంసుల్లో అతడొకడు. అతని కొడుకు బాలముకుంద్ అర్ష్ మలిస్యానీ కూడా మంచి కవే.

పండిత్ తిలోక్ చంద్ మహరూమ్ బి.ఏ. వరకు చదివి విద్యాశాఖలో పనిచేసిన వ్యక్తి. చాల మంచికవి. పంజాబ్ కవి కనుక అతని మీద, ముఖ్యంగా అతని కొడుకు మీద ఎక్బాల్ ప్రభావం అధికంగా కనిపిస్తుంది. అతని కొడుకు జగన్నాధ్ ఆజాద్ సుప్రసిద్ధ కవేకాక 'మాహిరె-ఎక్బాలియాత్'గా గుర్తించబడినాడు. అతన్ని గురించి తర్వాత మాట్లాడుకుందాం-మాలిక్ రామ్‌ను మాహిరె-గాలిబ్యాత్‌గా జగన్నాథ్ ఆజాద్‌ను మాహిరె-ఎక్బాలియాత్‌గా ఉర్దూ విద్వల్లోకం గుర్తించింది.

గాలిబ్ ప్రసక్తి రానే వచ్చింది కనుక మనం మాట్లాడుతున్న కాలం వాడే అయిన యగానా చంగీజీని ప్రస్తావించటం సందర్భోచితం. అతనిపేరు మిర్జావాజిద్ హుస్సేన్. తొలుత 'యాస్' అనే కలం పేరుతో కవిత రాసే వాడు. తర్వాత యగానాగా మార్చుకున్నాడు. పారసీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో మంచి పాండిత్యం కలవాడు. చక్కని కవిత చెప్పగలిగిన వాడు!

హర్ షామ్ హుఈ సుబహ్‌కొ ఇక్ ఖ్వాబె-ఫరామోష్

దున్యా యెహీ దున్యా హైతో క్యాయాద్ రహేగి

"ప్రతి రాత్రి తెల్లవారే సరికి ఒక విస్మృత స్వప్నమై పోతున్నది. ప్రపంచం ఇదే అయితే ఏమి జ్ఞాపకం వుంటుంది?"

ఇంత చక్కని కవిత చెప్పిన యగానాకు ఉర్దూ సాహిత్య జగత్తులో దాదాపు అందరూ శత్రువులే. అందుకు కారణం అతడు మిర్జాగాలిబ్ పట్ల అకారణవైరం పెంచుకున్నాడు. ఏది రాసినా గాలిబును విమర్శిస్తూ నిందిస్తూనే రాసినాడు. గాలిబు నిందను ఉర్దూ సాహిత్య జగత్తు సహించలేకపోయింది. యగానా జన్మించటానికి పదిహేనేళ్ల ముందే గాలిబు మరణించినాడు. మరణించిన వాళ్లను పని గట్టుకొని నిందించటం సంస్కారం కాదు.

మిర్జా జాకిర్ హుసేన్ సాఖిబ్ లఖ్నవీ గొప్పకవి. అతడు గాలిబు మరణించిన సంవత్సరమే జన్మించినాడు. ఆర్జూలఖ్నవీ గొప్పకవే కాక భాషావ్యాకరణ శాస్త్రాల్లో పండితుడు. అతడు వ్యాకరణ శాస్త్రానికి సంబంధించిన కొన్ని ప్రామాణిక గ్రంథాలు రచించినాడు. సినిమాలకు చాల గజల్లు, గీత్‌లు రాసినాడు. అతని పూర్తి పేరు సయ్యద్ అన్వర్ హుసేన్.

ఇంకొక మహా కవి షేఖ్ ఆషిఖ్ హుస్సేన్ సీమాబ్ అక్బరాబాదీ. సాగిర్ నిజామీ అంతటి ప్రసిద్ధ కవి అతని శిష్యుడు. సీమాబ్, ఉస్తాద్ దాగ్ శిష్యుడు.

రియాజ్ అహ్మద్ రియాజ్ ఖైరాబాదీ కూడా ఉస్తాద్ దాగ్ శిష్యుడే. అతని కవిత్వంలో మద్యపాన ప్రసక్తి అధికంగా వుంటుంది. అందుకే అతన్ని 'షహింషాహె-ఖుమిరియాత్' అనేవాళ్లు. అంటే మద్యపాన కవిసార్వభౌముడు, కానైతే అతడు జీవితంలో మద్యం తాకినవాడు కాదట.

◆ ◆ ◆

హస్రత్ మోహానీ

గజల్ కవులు గజల్‌ను సౌందర్యానికి ఉపమానంగా గ్రహిస్తారు. అంటే గజల్ సుందర కవిత. సర్వాంగ సుందరమైన గజల్లు అందరూ చెప్పలేరు. 'ఇంతెఖాబ్' చేసుకుంటారు కవులు. ఇంతెఖాబ్ అంటే ఎంపిక. కవి తొలుత దొరికినన్ని ఖాఫియాలతో సమాన మాత్రల షేర్లు అల్లుకుంటాడు. వాటిలోంచి నీరసమైన షేర్లను తొలగించి అందమైన షేర్లను మాత్రం ఎంపిక చేసుకుంటాడు. 'ముంతఖిబ్ గజల్'. ఆ గజల్‌లోనూ అన్ని షేర్లూ ఒకేలావుండవు. కొన్ని అతి సుందరంగా వుంటాయి. కొన్ని సుందరంగా వుంటాయి. కొన్ని సామాన్యంగా వుంటాయి. ఐదో, పదో షేర్లు గల గజల్‌లో రెండు మూడు అతి సుందరమైన షేర్లున్నా అది గొప్ప గజలే.

ఏ కవివైనా అన్ని గజల్లు గొప్పగా వుండవు. గజల్లలోనూ ఇంతెఖాబ్ జరుగుతుంది. అలా అన్ని గజల్లే ఏరి కూర్చిన సంకలనాన్ని ఇంతెఖాబ్ కలామ్ అంటారు.

గజల్‌లో అన్నీ పరిమితమైనవే. వస్తువు పరిమితమయిందే. భావం పరిమితమయిందే- ఖాఫియాలు పరిమితమైనవే. ప్రతీకలు పరిమితమైనవే. గజల్ భాషకూడ ప్రత్యేకమైంది. చర్విత చర్వణం చేయక తప్పని పరిస్థితి. ఈలాంటి పరిస్థితిలోనూ చదివించే గజల్లు చెప్పిన కవులు సమర్థులు. సమర్థులైన కొందరు కవుల గురించి మాట్లాడుకున్నాము.

గజల్ కొక తాజాతనాన్ని, ఒక విశిష్ఠతను కలిగించిన నలుగురు మహా కవుల గురించి ఇప్పుడు మాట్లాడుకుందాం. అయితే వీళ్ళు ఎక్కడినుంచో

ఊడిపడ్డవాళ్లు కారు. మీర్, ఆతిష్, గాలిబుల మార్గాన నడిచిన వాళ్లే. ఇతర భాషల కవితలతో ఇంతో అంతో పరిచయం వున్నవాళ్లు కనుక, కవిత్వ ప్రయోజనాన్ని గుర్తించిన వాళ్లు కనుక వీళ్ల గజళ్లలో ఒక ప్రత్యేకత గోచరిస్తుంది.

సయ్యద్ ఫజలుల్ హసన్ హస్రత్ మోహానీ క్రీ.శ.1875లో ఉన్నావ్ జిల్లాలోని మోహాన్ అనే కస్బాలో జన్మించినాడు. అలీగఢ్ యూనివర్సిటీ నుంచి బి.ఎ. చేసిన తర్వాత స్వాతంత్ర్య సంగ్రామంలో చేరినాడు. జీవితంలో చాల కాలం కారాగారం లోనే గడిపినాడు. అతని గజల్లు చాలవరకు జైళ్లలో రచించినవే. జైలు నుండి విడివడి బయట వున్నంత కాలం పత్రికలు నడపటంలోను, పూర్వకవుల కావ్య సంగ్రహాలు పరిష్కరించి అచ్చువేయటంలోను, సాహిత్య విమర్శలోనూ, భాషా శాస్త్ర రచనలోను గడిపేవాడు. మళ్లీ జైలుకు వేళ్తే గజల్లు రాస్తూ సమయాన్ని సద్వినియోగ పరచుకునేవాడు.

హై మష్కె- సుఖున్ జారీ చక్కీ కీ మషక్కత్ భీ
ఇక్ తుర్ఫ తమాషా హై హస్రత్‌కి తబీయత్ భీ

"ఒక వైపు కవిత రాయటం- ఇంకోవైపు తిరుగలి విసరటం. హస్రత్ స్వభావం చిత్రమైన తమాషా గదా."

అంటాడు హస్రత్, బహు భాషావేత్త. కవితామర్మజ్ఞుడు. కనుక అతని కవిత ఆ కాలంలోనే సర్వశ్రేష్ఠమయిందని విద్వల్లోకం గౌరవించింది. మిర్జా గాలిబ్ వ్యాఖ్యాతల్లో హస్రత్ ప్రామాణికుడు. గాలిబుది కఠినశైలి. హస్రత్‌ది సహజమైన సరళశైలి. అతని ప్రేయసినే పెళ్లి చేసుకున్నాడు కనుకనే అతని ప్రేమ కవిత అంతమనోహరంగా వున్నదంటారు అభిజ్ఞులు.

బేజుబానీ తర్జుమానే- షౌఖ్ బేహద్ హోతో హో
వర్న పేషే- యార్ కామాయేంగీ తక్రీరేం కహీం

"మౌనమే హృదయ గతమైన ప్రేమాతిశయాన్ని తెలియజేస్తే తెలియ జేయాలె కాని ప్రేయసి ముందు ప్రేమ ప్రసంగాలు పనిచేస్తాయా?" అంటాడు హస్రత్. ఈ గజల్‌లోని ఖాఫియా రదీఫులు అందమైనవి.

తెరే జల్వోంకె ఆగే ఖువ్వతే - షరహో బయాం రఖ్‌దీ
జుబానే -బేనిగహ్ రఖ్‌దీ, నిగాహే-బేజుబాం రఖ్‌దీ

ఇది భగవంతుని సౌందర్యాన్ని గురించి అన్వయించుకోదగిన షేర్;

"చూపులేని నాలుక, నాలుకలేని చూపు గలిగిన నేను నీ సౌందర్య లీలలను వర్ణించే ప్రయత్నం మానుకున్నాను." ఇది రామ్ చరిత్ మానస్‌లో తులసీ దాస్ ఒక చౌపాయిలోచెప్పిన మాట. తులసీదాస్ ఇలా అంటాడు.

దేఖన్ బాగ్ కుంవర్ దోహ్ ఆయే
భయ్ కిశోర్ సబ్ భాంతి సుహాయే

శ్యామ్ గౌర్ కిమికహెఁ బఖానీ
గిర అనయస్ నయన్ బిను బాణీ

మిథిలా నగరం ఉపవనంలో విహరిస్తున్న రామ లక్ష్మణులను చూచిన చెలికత్తెలు సీతాదేవితో అంటున్నారు;

'తోట చూడటానికి ఇద్దరు రాజకుమారులు వచ్చినారు- ఆ కుమారులు సర్వాంగ సుందరులు- ఒకనిది శ్యామల వర్ణం- ఇంకొకనిది గౌరవర్ణం. అంతకు మించి ఇంకేమి మాట్లాడగలం? మాట్లాడేది నాలుక. దానికి కళ్లులేవు కనుక అది కళ్లు చూచింది చెప్పాలె. చూచినవి కళ్లు- వాటికి వాణి లేదు. నాలుకతో చెప్పించాలె. అలా చెప్పింది సంపూర్ణ సత్యం కాదు." కృష్ణున్ని గురించి హస్రత్ రాసిన గజల్ లోని మఖ్తా వినండి;

మామూరె-నూర్‌హై దిలె- హస్రత్ జహే నసీబ్
ఇక్ హుస్నె -ముష్క్‌ఫామ్ కె షౌఖే తమామ్ సే

"కస్తూరి వర్ణంగల సౌందర్యరాశి పట్ల గల సంపూర్ణ ప్రేమ వలన హస్రత్ హృదయం ప్రకాశిస్తున్నది. ఇదెంతటి సౌభాగ్యమో!"

హస్రత్ మోహానీ అచ్చమైన ముసల్మాను.

"మజ్హబ్ నహీసిఖాతా ఆపస్‌మె బైర్ రఖ్నా" అని అల్లామా ఎక్బాల్ చెప్పినాడు గదా? ఒక మతాన్ని ఒకరు గౌరవించటమే మత సామరస్యం-

అలీ సోదరులు, మోలానా ఆజాద్, జవహర్‌లాల్ నెహ్రూ మొదలైన ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుల సహచరుడు హస్రత్. మోలానా ఆజాద్ వచన రచన సుందరమైన దనటంలో ఎవరికీ అభిప్రాయం భేదం లేదు.

జబ్ సే దేఖీ అబుల్కలామ్ కి నస్ర్
షేరె- హస్రత మె కుఛ్ మజా నరహా

"అబుల్కలామ్ వచనం చూచినప్పటి నుంచి హస్రత్ షేర్లు చవిలేనివైనవి." మహాకవి హస్రత్ మోహానీ మోలానా అబుల్కలామ్ ఆజాద్ వచనరచన కిచ్చిన యోగ్యతా పత్రమిది.

ప్రేయసి సౌందర్య వర్ణన చేయలేని తన అసమర్థతనింకొక చోట హస్రత్ ఇలా వ్యక్త పరుస్తాడు.

జమాలె దోస్తికి రంగీనియాఁ అదానహువీఁ
హజార్ కామ్‌లియా హమ్‌నె ఖుష్ బయానీసే

"ప్రేయసి సౌందర్య వర్ణన చేయలేక పోయినాను. వేవిధాల సుందర సుశబ్దాల ప్రయోగం చేసి చూచినాను."

ఇక్ బర్ఖ్ తపాఁ హైకె తకల్లుమ్ హైతుమ్హారా
ఇక్ సహెర్‌హై లర్జాఁ కె తబస్సుమ్ హై తుమ్హారా

"ఒక వేడి మెరుపా? కాక నీ పలుకా?- ఒక కంపిత ఉషస్సా? కాక నీ దరహాసమా?"

ఆగథే ఇబ్తిదాయె ఇష్కమె హమ్
హోగయే ఖాక్ ఇన్తిహాయేహై

"ప్రేమ ప్రారంభంలో నేనొక నిప్పు కణాన్ని- ఇప్పుడు బూడిదను మాత్రమే."

తన వ్యక్తిత్వాన్ని ప్రేయసిలో లీనం చేయటమే ప్రేమకు పరమావధి.

◆ ◆ ◆

ఫానీ బదాయూనీ

క్రీ.శ. 1879లో జన్మించిన షౌకత్ హుసేన్ ఖాన్ హస్రత్ మోహానీ అంతటి మహాకవి. అతడుబదాయూన్ నివాసి. ఫానీ అతని కలం పేరు- అతని జీవితమంతా విషాదమయం కనుక ఆ కలం పేరు అతనికి సరిపోయింది- అతని కవిత మీర్ కవితకు దగ్గరయింది. విషాద కవిగా ప్రసిద్ధుడైనాడు ఫానీ- అతని విషాదానికి, నిరాశావాదానికి కారణం అతని భగ్నప్రేమే అంటారు. అతడు బి.ఎ., ఎల్.ఎల్.బి. చదివి వచ్చే వరకు అతడు అతిగా ప్రేమించిన అమ్మాయి పరకాంత అయి పోయింది. మనస్సు విరిగి పోయింది. జీవితం దుర్భరమయింది. కొన్నాళ్లు లఖ్నో,

ఆగ్రా, అటావాలలో ప్లీడరీ చేసి హైదరాబాద్ సంస్థానానికి చేరుకున్నాడు. హైస్కూల్ హెడ్మాష్టరుగా ఉద్యోగం పొందినాడు. జిల్లాలలో ఉద్యోగం చేసి హైదరాబాద్ నగరం చేరుకున్న తర్వాత అతనికి సాహిత్య వాతావరణం దొరికింది. నిజాం నవాబు రెండవ కొడుకు మొఅజ్జం జాహ్ కవిత్వం చెప్పేవాడు. అతని దర్బారులో ఎందరో కవులుండేవాళ్లు- ఆ దర్బార్ ప్రవేశం దొరికింది ఫానీకి. ఒక చిన్న పొరపాటు కారణంగా రాజకోపానికి గురి అయినాడు. రాజకోపాన్ని "ఇతాబె షాహీ" అంటారు. పన్నెండు గంటల్లోగా ఫానీ దూర ప్రాంతానికి పంపబడినాడు. నగరం నుంచి వెళ్లగొట్టబడినాడు. దాన్ని షహరె బదర్ అంటారు.

ఫానీ స్వాభిమానం గొప్పది. ఎవరి ముందు తల వంచని స్వభావం-ఎవరి ముందు చేయిసాచని అభిమానం. సారస్వత పోషణకు పేరుగాంచినహైద్రాబాద్ సంస్థానంలో ఫానీకి దొరకవలసిన గౌరవం దొరకలేదు. పేదరికంలో గడిపినాడు జీవితమంతా. రాజా కిషన్‌ప్రసాద్ షాద్ ఒక్కడే ఫానీ కవితాశక్తిని గుర్తించి గౌరవించిన వాడు అతడు ఫానీ కంటె ముందే పరలోక గతుడైనాడు. నిర్లక్ష్యం చేయబడిన మహాకవి ఫానీ. అన్ని విధాలా తక్కువస్థాయికి చెందిన కవులు వాళ్ల అర్హతకు మించిన గౌరవాన్ని పొందినారు-ఐశ్వర్యంతో అలరారినారు. ప్రేమలో ఓడిపోయి నాడు ఫానీ- జీవితంలోనూ ఓడిపోయినాడు. అతని జీవితం అతనికే అర్థం కానిదైపోయింది.

ఇక్ మొఅమ్మాహై సమఝ్నేకా న సమఝానేకా
జిందగీ కాహెకూహై ఖ్వాబ్ హై దీవానేకా

"జీవితం ఒకపజిల్. దాన్ని అర్థం చేసుకోలేము. అర్థం చేయించలేము. అదొక పిచ్చివాని కల."

హర్ నఫస్ ఉమ్రె గుజిష్తా కి హై మయ్యత్ ఫానీ
జిందగీ నామ్‌హై మర్ మర్ కె జియే జానేకా

"ప్రతి శ్వాస గడచిన జీవితపు శవమే- జీవిత మంటే చస్తూ చస్తూ బ్రతకటం."

న ఆయేంగే వొ తబ్ భీ దమ్ నికల్ హీ జాయెగా ఫానీ
మగర్ ముష్కిల్‌సె నిక్లేగా బడీ ముష్కిల్ సె నిక్లేగా

"ఆమె వాయిదా పాటించి రాకున్నా ప్రాణం వెళ్లి పోతుంది. కాని కష్టంగా వెళ్లిపోతుంది. చాల కష్టంగా వెళ్ళిపోతుంది."

పైన ఉదాహరించిన మూడు షేర్లతో ఫానీ ప్రసక్తి ముగిస్తాను.

◆ ◆ ◆

అస్గర్ గోండ్వీ - జిగర్ మురాదాబాదీ

ఉర్దూ గజల్ ముఖాన్ని పన్నీట కడిగి ప్రజాదరణ పాత్రం చేసిన నలుగురు మహాకవుల్లో హస్రత్ మోహానీ, ఫానీ బదాయూనీలనే ఇద్దరు కవుల గురించి ముచ్చటించుకున్నాం. ఇప్పుడు మిగతా యిద్దరిని గురించి మాట్లాడు కుందాం. ఈ నలుగురికి 'షహెన్షా యె తగజ్జుల్ అనే కీర్తి లభించింది. నలుగురూ గజల్ చక్రవర్తులే. అంటే తమ సమకాలీనులైన గజల్ కవుల్లోనే ఈ నలుగురికి ఈ కీర్తి. మొత్తం ఉర్దూ గజల్ సాహిత్యానికే వీళ్లు చక్రవర్తులని భావించరాదు. ఇంతకు ముందు కూడా కొన్ని ప్రసంగాల్లో రాసినాను; మీర్ తఖీమీర్ స్థానం సర్వథా ఉన్నతమయింది. అతడు కవిలోకానికి బ్రహ్మ. 'ఖుదా వందె గజల్' అన్నారతన్ని. అతని తర్వాత దర్ద్, ఆతిష్, గాలిబులు గజల్‌ను ఉన్నత శిఖరాలకు చేర్చిన వాళ్ళు.షాద్ అజీమాబాదీ, సఫీలఖ్నవీలు కూడ సామాన్యులు కారు. పైన పేర్కొనబడిన కవులందరూ మనమిప్పుడు మాట్లాడుకుంటున్న నలుగురు కవులకు ఆదర్శప్రాయులు. ఆరాధనీయులు.ముఖ్యంగా ఉర్దూ గజల్ కవులు మీర్‌ను గాలిబును ఎక్కడో ఒకచోట అనుకరించని వాళ్లు కారు. యాస్ యగానా చంగీజీ గురించి ఇంతకు ముందు రాసినాను. అతడు జీవితాంతం గాలిబ్‌ను విమర్శించి నాడు. కాని అతని గజల్లు గాలిబు ప్రభావానికి లోనుకాలేదని అనలేము. యగానాకు తనకంటే వంద సంవత్సరాల క్రిందటి గాలిబుతో వైరం వుండాల్సిన అవసరం లేదు. గాలిబును అతిగా అభిమానించిన తన సమకాలీనులైన లఖ్నో కవుల పట్ల అతనికి సాహిత్యస్పర్థ. ఆ స్పర్థే గాలిబుతో వైరానికి దారితీసింది. అదంతా మనకిప్పుడు అవసరంలేని కథ.

మన మిప్పుడు మాట్లాడ బోతున్న కవులు అస్గర్ గోండ్వీ-జిగర్ మురాదా బాదీ. ఈ యిద్దరిని కలిపి ఎందుకు మాట్లాడుతున్నానంటే వీళ్ల జీవితాలు విడదీయ రానంతగా కలిసి వున్నాయి.

క్రీ.శ. 1884వ సంవత్సరాన జన్మించిన అస్గర్ హుస్సేన్ అస్గర్‌గోండ్వీ క్రీ.శ. 1890వ సంవత్సరంలో జన్మించిన అలీ సికందర్ జిగర్ మురాదాబాదీ కంటే ఆరేళ్లు పెద్ద. వాళ్లిద్దరిలో గురుశిష్య సంబంధమే కాక కౌటుంబిక సంబంధం కూడ వుండేది. అస్గర్ వమొదటి నుంచి సూఫీ కవి. అతని కవితలో ఫారసీ

శబ్దాలధికమైనా కవిత సరసమైనది. అతని వచన రచన కూడ సుందరమైనదే. పండిత్ దయాశంకర్ నసీమ్ (ఆతిష్ శిష్యుడు) రచించిన సుప్రసిద్ధ మస్నవీ, "మస్నవీ-గుల్జారె-నసీమ్"కు అస్గర్ టీకా సహిత వ్యాఖ్యానం రాసినాడు. అతని రెండు కవితా సంకలనాలు "నిషాతె-రూహ్", 'సరోదె-జిందగీ" అనేవి ప్రకాశిత మైనవి. రెండూ చిన్న సంకలనాలే. అయినా రెండూ అమూల్యమైనవే. అతడు కళ్లద్దాల వ్యాపారి. ఆ వ్యాపారంలో చాల చోట్లు తిరిగేవాడు. జిగర్ వ్యాపారమదే. కాబట్టి వాళ్లు చాల సార్లు చాల చోట్ల కలుసుకున్నారు. బంధుత్వమూ ఏర్పడింది. కాని జిగర్ జీవితం విశృంఖలమైనది కనుక (మద్యపానం విషయంలోనే) అస్గర్ ప్రభావం అతని మీద పడలేదు. మొదట్లో జిగర్ తన కవితను ఉస్తాద్ దాగ్ దెహెల్వీతో దిద్దించుకునేవాడు. అప్పుడతని కవిత షబాబ్, షరాబుల సుందర కవిత. జిగర్ అతిగా త్రాగేవాడు. అతిగా త్రాగించబడేవాడు. జీవితంలో తొలుత అతడేదో పోగొట్టుకున్నానని భావించినాడు. 'గమ్‌గలత్ కర్నే' అంటే విషాదాన్ని మరిచి పోవటానికి మద్యపానానికి అలవాటు పడ్డాడు. ఉర్దూ కవులు చాలమంది, మిర్జా గాలిబుతో సహా, విషాదాన్ని మరిచిపోవటానికి పాన వ్యసనులైనట్లు చెప్పుకుంటారు. మద్యపానం విషాదాన్ని అన్ని విధాల పెంచుతుంది కాని తగ్గించదు. కొందరేమో త్రాగితే గొప్ప భావాలు వస్తాయి గనక, బలంగా భావ వ్యక్తీకరణ చేయవచ్చు కనుక త్రాగుతున్నామంటారు. ఎవరి భ్రాంతివాళ్లది. మిర్జాగాలిబు ఒక మాటన్నాడు. అది అతని పట్ల సార్థకమైన మాట.

ఫిర్ దేఖ్నా అందాజె- గులఫ్షాని-యె-గుఫ్తార్

రఖ్‌దే కోయి పైమానవ సహెబా మెరే ఆగే (గాలిబు)

"నా ముందర ఎవరైనా పానపాత్రను, మధు కలశాన్ని ఉంచండి. పూల వానలా నా నోట జాలు వారే మాటలు వినండి."

జిగర్ గజల్లు వినటానికి అన్ని నగరాల సాహిత్య సంస్థలు ఆహ్వానించేవి. అన్ని ముషాయిరాల్లోనూ అతని ఉనికి తప్పనిసరి. యూనివర్శిటీల్లో చదువుకునే సాహిత్యాభిరుచి గల యువకులు తమ హాస్టల్ గదుల్లో అతన్ని ఆహ్వానించి అతనికి కడుపు నిండా తాగించి తాము మనసునిండా ఆనందాన్ని నింపుకొని స్పృహ తప్పిన అతన్ని పడుకోబెట్టి వెళ్ళిపోయేవాళ్లు. పిలిచినా, పిలువకున్నా అతని వెంట నీడలా వెంటాడే అస్గర్ గోండ్వీ జిగర్‌ను స్పృహలోకి తెచ్చి, "నేను చెప్పలేదా? వీళ్లకు కావలసింది నీ కవిత. నువ్వు కాదు. మద్యానికి నీ కవితను కొనుక్కొని నిన్ను పారవేసి వెళ్లిపోతారు. నీ కవితలో ఇంకా గంభీరత వచ్చేదాక ఈలాగే

చౌకగా అమ్ముడుపోతుంది" అని బోధించేవాడు. కొన్నాళ్లకు జిగర్ తన కవితను అస్గర్ చేత దిద్దించుకున్నాడు. జీవిత సత్యాలను అర్థం చేసుకున్నాడు. మద్యపానం మానుకున్నాడు. అంటే'తోబా' చేసినాడు. మహాపురుషులు మాటకు కట్టుబడి వుంటారు. జిగర్ మహాకవే కాక మహా పురుషుడు కూడా. అస్గర్ మరణించిన తర్వాత అతని పట్ల తనకుగల గౌరవాన్ని పలుచోట్ల వెల్లడించినాడు జిగర్. అస్గర్ అతనికి గజల్ రచనలో గురువే కాక జీవిత పరమార్థాన్ని తెల్పిన 'పీరొ-ముర్షద్' కూడా నాయె.

బదన్ సే జాన్‌భీ హో జాయెగీ రుక్సత్ జిగర్ లేకిన్

నజాయేగా ఖయాలే - హజ్రతే-అస్గర్ మెరే దిల్ సే

"శంరీరంలోంచి ప్రాణం వెళ్లి పోతుంది కాని నా మనస్సులోంచి అస్గర్ మహాశయుని చింతన వెళ్లిపోదు."

ఎంతటి ఆత్మీయత! ఆ మహనీయుని సన్నిధిలో ఎంతటి ప్రాపంచిక జ్ఞానమే కాక ఆధ్యాత్మిక జ్ఞానం పొందినాడో!

హరీమె-హుస్నె-మానేహై జిగర్ కాషానయే-అస్గర్

జొబైఠో బా అదబ్ హోకర్ జో ఉఠ్ఠో బా ఖబర్ హోకర్

"జిగర్! అస్గర్ కుటీరం అర్థ సౌందర్యాలకు ఆలవాలం. అక్కడ వినయంగా కూర్చుండి విజ్ఞులమై లేవవచ్చు."

జిగర్ మురాదాబాదీ కావ్య సంకలనాలు మూడు ప్రసిద్ధమైనవి. "దాగె-జిగర్", 'షోలయేతూర్", "ఆతిషె-గుల్"

ఇతని కవితలో ప్రణయ శృంగారాలు, మధుపాన ప్రసక్తి, సూఫీ భావాలు చాల సుందరంగా కూర్చబడినవి. కొన్ని షేర్లు ఉదాహరించగలను కాని అన్నీ చదువ దగినవి. ఫానీ విషయంలోనూ రెండు మూడు షేర్లతో సంతృప్తి పడవలసి వచ్చింది. ఇక్కడా ఆ సంక్షిప్తత తప్పదు.

"సాగిర్ బదస్తె హుస్న్ పియే జారహా హుఁమై

కిత్నా హసీఁ గునాహ కియే జారహాహుఁమై"

"సుందరి చేతి చషకం లోంచి మదిరా పానం చేస్తున్నాను- ఎంతటి సుందరమైన పాపం చేస్తున్నాను!" (పాపమంటే మద్యపానమే అని చాలసార్లు మనవి చేసినాను)

ఇదే భావాన్ని ఇంకో తీరు చెప్పినాడు; అదే ఖాఫియా

జబ్ థీ షరాబ్ జీస్త్ ఔర్ అబ్ జీస్త్ హై షరాబ్

కోయీ పిలా రహాహై పియే- జారహాహూఁమైఁ

"అప్పుడు మద్యమే జీవితం- ఇప్పుడు జీవితమే మద్యం- ఎవరో త్రాగిస్తున్నారు. త్రాగుతున్నాను." త్రాగిస్తున్న వాడు అస్గర్- జీవితమే మద్యమంటే ఈశ్వరుని ధ్యాసలో తన్మయత చెందిన జీవితమని తాత్పర్యం.

తసవ్వుర్ మేయె కిస్కా జల్వాయే మస్తాన ఆతాహై

కె హర్ ఆన్సూలియే హమ్రాహ్ ఇక్ పైమాన ఆతాహై

"వియోగ వ్యథలో ఎవరి మాదకాకృతి స్మృతి పథంలో మెదలుతున్నదో? ప్రతి అశ్రుకణం ఒకపాన పాత్రతో కలిసి వస్తున్నది."

మై ఖత్రాహూఁ లేకిన్ బ ఆగోషె- దర్యా

అజల్ సే అబద్‌తక్ బహా జారహా హూఁ

"నేను జల కణాన్నే- అయినా నదిలో కలిసిపోయి అనాది కాలం నుంచి అనంతం వైపు ప్రవహిస్తున్నాను."

గాలిబు భావాలను జిగర్ తనదైన శైలిలో కొన్నిచోట్ల వెల్లడించినాడు. అవన్నీ ఉదాహరించాలన్న ఉత్సుకతను అణచుకుంటున్నాను- ఒక షేర్‌తో జిగర్ ప్రసక్తి ముగిస్తాను;

ఉన్కి క్యాబాత్ హై వో అహ్లె సియాసత్ జానేఁ

మేరా పైగామె మొహబ్బత్ హై జహాఁతక్ పహుంచే

"రాజకీయాలు నడిపే వాళ్ల సంగతి వాళ్లకే తెలుసు- ఎంత దూరం వెళ్లగల్గితే అంత దూరం నేను పంపేది ప్రేమ సందేశమే.

సూఫీ కవి అస్గరవి రెండు షేర్లు ఉదాహరించి ఈ వ్యాసం ముగిస్తాను. మీర్ శైలిలోచెప్పిన షేర్;

జో నఖ్ష్ హై దున్యాకా ధోకా నజరాతా హై

పర్దేపె ముసవ్వర్ హీ తన్హా నజరాతా హై

"ఈ ప్రపంచ చిత్రం భ్రాంతిగా కనిపిస్తున్నది. తెర వమీద చిత్రాకారుడొక్కడే కనిపిస్తున్నాడు."

తెరా జమాల్‌హై, తేరా ఖయాల్‌హై, తూహై

ముఝే యె పుర్సతె- దానిష్ కహాఁ కె క్యా హూఁమై

"నీ సౌందర్యం, నీ భావన, నువ్వు-ఇవే నేను చింతించేవి, 'నేను', ఏమిటో తెలుసుకునే తీరిక యెక్కడిది?"

ఇంకొక సుందరమైన షేర్ వినండి;

రుఖే రోషన్ పె మోజేఁ హై తబస్సుమ్ హాయె-పిన్హాఁకీ

షువాయేఁ క్యా పడీఁ రంగత్ నిఖర్ ఆయీ గులిస్తాఁకీ

"ప్రకాశవంతమైన ప్రేయసి వదనంపై దరహాస రేఖలు అలల్లా తొణికిస లాడుతున్నాయి. ప్రాభాత సూర్యుడి తొలి కిరణాలు సోకగానే పుష్పవాటిక శోభాయ మానమయింది."

◆ ◆ ◆

జోష్ మలీహాబాదీ

షబ్బీర్ హుసేన్ ఖాన్ జోష్ మలీహాబాదీ ఇంతవరకు మాట్లాడుకున్న కవులకు ఇంచుమించు సమకాలీనుడే. అతన్ని గురించి ప్రత్యేకంగా మాట్లాడు కోవటానికి కారణాలు ఈ వ్యాసంలోనే మనవి చేస్తాను. షాద్ అజీమాబాదీ (అలీ మొహమ్మద్) చాల గొప్పకవి. అతన్ని బీహార్ ప్రాంతానికి చెందిన మీర్ అనేవాళ్ళు. ఫానీ బదాయూనీ అంతటి మహాకవి కవితలో షాద్ అజీమాబాదీ ఛాయలు కనిపిస్తాయి. అట్లాగే సఫీలఖ్నవీ, అజీజ్ లఖ్నవీ, అసర్ లఖ్నవీ, సాఖిబ్ లఖ్నవీ, జగత్ మోహన్ లాల్ రవాఁ, జ్వాలా ప్రసాద్ బర్క్, నోబత్ రాయ్ నజర్, సాయెల్ దాహెల్వీ, నూహ్ నార్వీ, బేఖుద్ దహెల్వీ, వహషత్ కల్కత్తవీ, అఫ్సర్ మీరఠీ మొదలైన మహాకవులు గూడ ఉర్దూ సాహిత్య చరిత్రలో శాశ్వత స్థానం పొందినవాళ్లే. ఈ లఘు చరిత్రలో అందరిని గురించి రాయటం, వాళ్ల షేర్లు ఉదాహరించటం సాధ్యం కాదు. వాళ్ల పేర్లు స్మరించి బాధ్యత తీర్చుకున్నాను.

గజల్ ఉసనే ఛేడీ ముఝే సాజ్ దేనా
జరా ఉమ్రె రఫ్తాకు ఆవాజ్ దేనా

అనే ఒక్క షేర్‌ను ఉదాహరించి సఫీ లఖ్నవీ ఎంతటి మహాకవో పఠితలను ఊహించు కొండనవచ్చు. ఈ షేర్ భావం, బందిష్, సముచిత శబ్దప్రయోగం అనితర సాధ్యం. ఈ భావం ఒక ఫారసీ షేర్ లోంచి గ్రహించబడింది. అయితే అనువాదమనిపించదు. ఫారసీలోంచి చాల భావాలు ఉర్దూలోకి వచ్చినవి. సంస్కృత కవుల భావాలననే కదా తెలుగు ప్రబంధకవులు మళ్లీ మళ్లీ చెప్పినారు! ఈ మహాకవులకు ఇంచుమించు సమకాలీనుడైన జోష్ మలీహా బాదీని గురించి ప్రత్యేకంగా ఎందుకు మాట్లాడుతున్నానంటే ఇతని కవిత ప్రత్యేకమయింది కనుక.

షబ్బీర్ హుస్సేన్ ఖాన్ పఠాన్, అతనిది జాగీర్దార్ల కుటుంబం. అంతేకాక సాహిత్య కుటుంబం కూడ. అతని తండ్రి కవే. తాత కవే. షబ్బీర్ హుస్సేన్ ఖాన్ జోష్ లఖ్నవీ కవి అయినా అతని సమకాలీనులైన ఇతర లఖ్నవీ కవులలాగే కృతకత్వం, అలంకార ప్రియత్వం అతని కవితలో కనిపించవు. జాగీర్దారైన పఠాన్. స్ఫురద్రూపి-కాబట్టి యౌవనంలో విలాస జీవితం గడిపివుంటాడు. సహజంగానే సౌందర్యోపాసకుడు- ప్రకృతి సౌందర్యం పట్ల ఆకర్షితుడై గజల్ల కంటే ప్రకృతి శోభ నభివర్ణిస్తూ నజములే అధికంగా రాసినాడు. యౌవనంలో ప్రణయ కవిత్వం రాసినాడు. తర్వాత తిరుగుబాటు కవిత్వం రాసినాడు. ఇతన్ని తొలుత షాయరె ఫిత్రత్ (ప్రకృతి కవి) అనన్నారు. తర్వాత షాయరె షబాబ్ (శృంగార కవి)అనన్నారు. ఆ తర్వాత షాయరె ఇన్ఖిలాబ్ (విప్లవ కవి) అన్నారు. అంజుమనె తరక్కీ పసంద్ మునన్నిఫీన్ (అభ్యుదయ రచయితల సంఘం) స్థాపన (క్రీ.శ. 1935) జరుగక ముందే ఇతడు విప్లవ కవిగా పేరుగాంచినాడు.

జోష్ అధ్యయనం అగాధ మయింది. అరబీ, ఫారసీ, ఉర్దూల్లో పండితుడు. ఇంగ్లీషు కూడా బాగా చదువుకున్నవాడు. దర్శన శాస్త్రాల పట్ల ఆసక్తికలవాడు. శబ్ద ప్రయోగంపై అతని అధికారం సాటిలేనిది. అపశబ్దాలు కాని అపప్రయోగాలు కాని చేసేవాళ్లనతడు సహించేవాడు కాదు. అతని కవితలో దేశాభిమానం, మానవప్రేమ, వేర్పాటు భావాల నిరసన, సంపన్నుల దురహంకారం పట్ల, దోపిడీ వ్యవస్థ పట్ల ఆగ్రహం ప్రస్ఫుటంగా కనిపించే లక్షణాలు. అతని కవితా సంకలనాలు పదిహేనుకుపైగా అచ్చయినవి. గజల్ పట్ల అతనికి ఆదరం లేదు. మతం పట్ల విశ్వాసం లేని నాస్తికుడతడు. మద్యపానంలో ప్రసిద్ధుడు- అతడు చాలనాళ్లు హైదరాబాద్‌లో వున్నాడు. దారుత్తర్జుమాకు అతని సేవలు లభించినవి. కాని

ఆంగ్ల ప్రభుత్వం పట్ల వ్యతిరేక భావాలు కలవాడు కనుక హైదరాబాద్ సంస్థానం నుంచి వెళ్లగొట్టబడినాడు. దిల్లీలో 'అజ్‌కల్' ఉర్దూ పత్రికకు సంపాదకుడుగా కొన్నాళ్లు పని చేసినాడు. పండిత్ నెహ్రూకు సన్నిహితుడు. అయినా ఎందుకో నెహ్రూ మీద అలిగి పాకిస్తాన్‌కు వెళ్లిపోయాడు. అక్కడ అతనికి భావస్వాతంత్ర్యం లభించలేదు. "యాదోంకీ బారాత్" అనే పేర అతడు రాసుకున్న ఆత్మకథ పాకిస్తాన్‌లో నిషేధించబడింది. భారతదేశంలో ప్రచురణ పొందింది. అందులో అతడు చెప్పిన మాటలన్నీ సత్యాలు కావు. అతని ఒక కవిత ఉదాహరించి ఈ వ్యాసం ముగిస్తాను.

క్యా హింద్ కా జిందాఁ కాంప్‌రహాహై గూంజ్ రహీహైఁతక్బీరేఁ
ఉక్తాయె హువే హైఁకుఛ్ ఖైదీ ఔర్ తోడ్ రహేహైఁ జంజీరేఁ
దీవారోంకె నీచే ఆఆకర్ యూఁ జమ-అ హువేహైఁ జందానీ
సీనోమ్మే తలాతుమ్ బిజ్లీకా, ఆంఖోమ్మే ఝలక్తీ షంషీరేఁ
భూకోంకి నజర్‌మే బిజ్లీహై, తోపోంకె దహానే ఠండేహై
తక్దీర్ కె లబ్‌కో జుంబిష్‌హై; దమ్‌తోడ్ రహేహై తద్బీరేఁ
ఆంఖోమ్మే గదాకీ సుర్ఖీహై, బేనూర్‌హై ఆంఖేఁ సుల్తాఁ కీ
తక్రీబ్ నే పరచమ్ ఖోలాహై, సిజ్దేమె పడీహైఁ తామీరేఁ
క్యాఉన్కూ ఖబర్ థీ జోర్-జబర్ రఖ్తేథే జో రూహె మిల్లత్‌కూ
ఉబ్లేంగే జమీఁ సే మారె-సియాహ్, బర్సేంగీ ఫలక్ సే షమ్షీరేఁ
క్యా ఉన్కూ ఖబర్ థీ సీనోంసే జో ఖూన్ చురాయా కర్తేథే
ఇక్ రోజ్ ఇసీ బేరంగీసే ఝల్ కేంగీ హజారోఁతస్వీరేఁ
క్యా ఉన్కే ఖబర్ థీ హోంటోంపర్ జో ఖుఫ్ల్ లగాయా కర్తేథే
ఇక్ రోజ్ ఇసీ ఖామోషీసే టప్కేంగీ దహక్తీ తక్రీరేఁ
సంభోకె వో జిందాఁ టూట్ గయా, ఝుప్టోకీ వో ఖైదీ ఛూట్‌గయే
ఉర్దోకి వొ బైఠేఁ దీవారేఁ దౌడోకి వో టూటీఁ జంజీరేఁ

"తక్బీర్- నాలయె తక్బీర్- అంటే అల్లాహో అక్బర్ అనే నినాదాలు. అల్లాహో అక్బర్, జైహింద్ అనే నినాదాలు మోగుతున్నాయి. భారత దేశపు చెరసాల కంపిస్తున్నదా-యేమి? కొందరు ఖైదీలు విసిగి, వేసారి సంకెళ్లు త్రెంచుకుంటున్నారు.

గోడల నీడలో ఖైదీలు గుమిగూడుతున్నారు. వాళ్ల గుండెల్లో మెరుపు తీగల కల్లోలం- వాళ్ల కళ్లలో ఖడ్గాల తళుకు. ఆకలి గొన్నవాళ్ల కళ్లలో మెరుపులు- శతఘ్నుల నోళ్లు చల్లబడ్డవి. అదృష్టవంతుల పెదవులు కదులుతున్నాయి. పన్నాగాలు, కుతంత్రాలు నశిస్తున్నాయి. బిచ్చగాని కళ్లలో అరుణకాంతి. ప్రభువుల కళ్లు కళా విహీనాలు- అణచివేయబడినవాళ్లు పతాకలెత్తుతున్నారు. అణచివేసిన వాళ్లు నేలపై తల మోపుతున్నారు.

జాతి మొత్తాన్ని దమననీతితో అదిమి పెట్టిన నాళ్లు ఈ నేలలోంచి నల్లత్రాచులు ఉబికి వస్తాయనుకున్నారా? ఈ ఆకాశం మీంచి కత్తుల వాన కరుస్తుందనుకున్నారా?

గుండెల్లోంచి రక్తాన్ని దోచుకున్నవాళ్లు రక్తహీనమైన గుండెల్లో వర్ణ చిత్రాలు వేలకొలది విలపిస్తాయనుకున్నారా?

ప్రజల నోళ్లకు తాళాలు బిగించిన వాళ్లు ఈ మౌనం లోంచి కణకణమండే ఉపన్యాసాలు రాల్తాయనుకున్నారా?

చెరసాల విరిగి పోతున్నది. జాగ్రత్త- దుముకండి; ఖైదీలు విడివడి పోతున్నారు. లేవండి-గోడలు కూలిపోతున్నాయి- ఉరుకండి. సంకెళలు తెగిపోతున్నవి.

◆ ◆ ◆

ఫిరాఖ్ మొదలయిన కొందరు కవులు

'అంజుమన్ తరక్కీ పసంద్ ముసన్నిఫీన్' (అభ్యుదయ రచయిచతల సంఘం) ప్రస్తావన జోష్ మలీహాబాదీ గురించి ముచ్చటించుకునేటప్పుడే వచ్చింది. దాన్ని గురించి ఇంకా మాట్లాడుకోవలసే ఉన్నది. ప్రస్తుతం కొందరు మహాకవులను స్మరించుకుందాం. వీళ్లు అంజుమన్ ఏర్పడకముందే దేశభక్తిని, పరాయి ప్రభుత్వ నిరసనను కవితా వస్తువుగా గ్రహించి కవిత్వాన్ని సంప్రదాయ మార్గం నుంచి తప్పించి నూతన దిశల వైపు నడిపించినారు. 'సంప్రదాయ మార్గం నుంచి తప్పించి' అనే మాట పూర్తి సత్యం కాదు. ఉర్దూ గజల్‌ను సంప్రదాయ మార్గం నుంచి తప్పించటం కష్టమే. పోతే, వీళ్లు క్రొత్త నడక నడచినారని, క్రొత్త శైలిని ఎన్నుకున్నారని చెప్పటం సబబు. ఈ కవులు అంజుమన్ ఏర్పడిన తర్వాత దానికి

సంపూర్ణ సహకారం అందించినారు. తామూ ఆ మార్గాన్నే అనుసరించినారు. ఈలాంటి కవుల్లో అగ్రగణ్యుడైన జోష్ మలీహాబాదీని గురించి ఇంతకు ముందే మాట్లాడుకున్నాము. అతని తర్వాత పేర్కొన దగిన కవులు ఫిరాఖ్, హఫీజ్ జాలంధరీ, సాగిర్ నిజామీ, రవిష్‌సిద్దీఖీ, ఎహసాన్ దానిష్, వజ్ద్, ఆనందనారాయణ్ ముల్లా మొదలైనవాళ్ళు. అంజుమన్ స్థాపన జరుగకముందే వీళ్లు మహాకవులుగా గుర్తించబడినారు.

రఘుపతి సహాయ్ ఫిరాఖ్ గోరఖ్‌పూరీ చాలా పెద్దకవి. ఉర్దూ కవుల్లో మొట్టమొదట జ్ఞానపీఠ బహుమతి పొందినవాడితడే. ఇంత వరకు ఉర్దూ సాహిత్యం కైవసం చేసుకున్న జ్ఞానపీఠ బహుమతులు మూడే. మొదటి బహుమతి పొందిన కవి ఫిరాఖ్. అతని తండ్రి కవే. అంటే అతనిది పండిత వంశం. సంస్కృతం లోనూ, బ్రజభాషలోనూ అతని పాండిత్యం ఎన్నదగింది. ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా పనిచేసినాడు కనుక ఇంగ్లీషులోనూ ఇతర పాశ్చాత్య భాషలు కొన్నిటిలోనూ అతని అధ్యయనం గణనీయమయింది. కొంతకాలం డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసినాడు. స్వాతంత్ర్యోద్యమంలో చేరి, అన్ని ఉద్యోగాలు వదలిపెట్టి పండిత్ నెహ్రూ దగ్గర కొన్నాళ్లు అండర్ సెక్రటరీగా వున్నాడు. అతని గజల్ల సంకలనాలన్నీ గొప్పవే. 'రూప్' అనే పేర అతని రుబాయీలు అచ్చయినవి. ఆ సంకలనం చాలా గొప్పది. రుబాయీ తెలుగు తేటగీతి వంటి నాల్గు చరణాల కవిత. మొదటి, రెండవ, నాలుగవ చరణాలకు ఖాఫియా నియమం. మూడవ చరణానికి లేదు- శృంగార రసాత్మకమైన రుబాయీలవి. వాటిల్లో సంస్కృత శబ్దాలు, సంస్కృత అలంకారాలు, ఫారసీ అలంకారాలు మణిప్రవాళ రీతిలో కలిసిపోయినవి.

ఇన్సాన్‌కె పైకర్ మె ఉతర్ ఆయా హై మాహ్
ఖద్‌హై యా చఢ్తీ అమృత్‌కి నదీహై అతాహ్
లర్‌జాతె హువే జిసమ్ పె జబ్ పడ్తీహై ఆంఖ్
రస్‌కె సాగర్ మే డూబ్ జాతీహై నిగాహ్

ఇందులో ఫారసీ పదాలు, సంస్కృత పదాలెలా కలిసిపోయినాయో చూడండి. దీన్ని తెలుగులో ఇలా అనువదించవచ్చు.

మానవాకృతి దిగియెనో మహికి శశియె!
తనువా ఉప్పొంగు అమృతవాహినియె తలప

సంచలద్దేహ మక్షి గోచరముగాగ
మునిగిపోవు రసార్ణవమ్మునను చూపు
ఒక అందమైన గజల్ మత్లా వినండి;
ముత్రిబ్ సెకహో ఆజ్ ఇస్ అందాజ్ సె గాయె
హర్ దిల్‌కొ లగే చోట్‌సె, హర్ ఆంఖ్ భరాయె

"శ్రోతలందరి గుండెలకేదో తగిలినట్లు, అందరి కళ్లు అశ్రువులతో నిండేటట్లు నేడు పాడవలసిందిగా గాయకునికి చెప్పండి."

ఫిరాఖ్ కవితా రచన ప్రారంభించిన రోజుల్లో దాగ్ దహెల్వీ, అమీర్ మీనాయీల గజల్లు ప్రజాదరణ పొందినవి. ఫిరాఖ్ తొలినాళ్ల కవితలో అమీర్ మీనాయి అనుకరణ కనిపిస్తుంది. అంటే లఖ్నో స్కూల్‌కు చెందిన సుందర శబ్దాల శృంగార కవిత. అనేక భాషా సాహిత్యాల అధ్యయనం వలన అతని కవిత క్రొత్త రంగులు పులుముకొని సమకాలీన కవుల్లో అతన్ని విశిష్ట కవిగా చేసింది. గ్రంథాధ్యయనమే కాక అతడు రాజకీయాలను, సమాజాన్ని దగ్గరి నుంచి పరిశీలించినాడు కనుక శ్రేష్టమైన కవిత రాయగలిగినాడు. అభ్యుదయ రచయిత లను ప్రోత్సహించినాడు. అతడు మంచి రచయిత. విమర్శకుడు. అంజుమన్‌ను గురించి విలువైన వ్యాసాలనేకం రాసినాడు. కాని అతని కవితలో అభ్యుదయ భావాలంతగా కనిపించవు.

హఫీజ్ జాలంధరీ కూడా సామాజిక స్పృహ కలిగిన పెద్ద కవే. అతడు హిందీలోని సుందర శబ్దాలతో కవితలల్లినాడు. ఉర్దూలో షాహనామ ఇస్లామ్ రచించి గొప్ప కీర్తిని సముపార్జించినాడు. అతడూ అంజుమన్ కవులను ప్రోత్సహించిన వాడే కాని అతని కవితలోనూ అభ్యుదయ భావాలు అంతగా కనిపించవు.

అతని ఒక రచన వినండి: ఇది హిందీ శబ్దాలతో కూడిన గీత్.
"అప్నె మన్‌మే ప్రీత్ బసాలే- అప్నె మన్‌మే ప్రీత్
భారత్ మాతా హై దుఖియారీ-దుఖీయారేం హైం సబ్‌నర్ నారీ
తూహి ఉఠాలే సుందర్ మురళీ- తూహీ బన్ జా శ్యామ్ మురారీ
తూ జాగేతో దున్యా జాగే- జాగ్ ఉఠే సబ్ ప్రేమ్ పూజారీ
గాయే తేరే గీత్. బసాలే అప్నెమన్‌మే ప్రీత్."

ఈ కవిత రాసిన కవే "షాహనామ ఇస్లామ్" రాసిన కవి అన్న సంగతి గుంర్తించండి.

సాగిర్ నిజామీ ప్రఖ్యాత కవి. సీమాబ్ అక్బరాబాదీ శిష్యుడు. కొన్ని పత్రికలు నడిపినాడు. వచన రచనలూ విరివిగా చేసినాడు. దేశభక్తి, హిందూ ముస్లిముల సుహృద్భావం, రాజకీయ పరిస్థితులు, సామాజిక సమస్యలు- ఇవన్నీ ఈ కవి కవితా వస్తువులు. వీళ్ళంతా అంజుమన్ కవులనూ, రచయితలనూ ప్రోత్సహించిన వాళ్లే కాని తాము ఏ నిబంధన (కమిట్‌మెంట్)కు కట్టుబడక స్వేచ్ఛగా సర్వజన పఠనీయమైన సుందర కవితలు రాసిన వాళ్ళని మాటిమాటికి మనవి చేస్తున్నాను. ఒక కవిత వినండి.

సోనెవాలోంకె ఇక్‌దిన్ జగా దేంగె హమ్
రస్మొ- రాహే- గులామీ మిటాదేంగె హమ్
తేరె బైరీకె టుక్డే ఉడాదేంగె హమ్
ఆస్మానో-జమీఁకో హిలాదేంగె హమ్
కోన్ కహ్తాహై కమ్జోర్ నిర్బల్‌హై తూ
హర్ తరఫ్ ఖూఁకె దర్యా బహాదేంగె హమ్
జిస్ తరఫ్‌సే పుకారేగా హిందూస్తాన్
ఉస్ తరఫ్‌హీ వఫాకీ సదా దేంగె హమ్
అయ్‌వతన్, అయ్‌వతన్, అయవతన్
సరేసేబాంధే హువే హైఁ తిరంగా కఫన్

ఈ దేశభక్తి కవితలో అప్పటి పరిస్థితులు దృష్ట్యా హిందూ-ముస్లిముల సమరస భావాన్ని పరిపుష్టం చేయటానికి హిందీ ఫారసీ శబ్దాలను సమపాళ్లలో కలసి ఎంతటి సుందరమైన భాషను తయారుచేసినాడో చూడండి. ఈ కవులు అనేక రచనలు ఫారసీ (ఉర్దూ) లిపిలోనే కాక దేవ నాగర లిపిలోనూ అచ్చయి సర్వజన పఠనీయాలైనవి. దీని సారాంశం పఠితలు గ్రహించగలరన్న నమ్మకంతో నేను రాయటం లేదు.

పండిత్ ఆనంద్ నారాయణ్ ముల్లా జడ్జి పదవి నిర్వహించిన వాడు. ఇతనిది లఖ్నో శృంగార శైలి. ఒక షేర్ మాత్రం ఉదాహరిస్తాను.

అభీ షబాబ్‌హై కర్‌లూఁ ఖతాయెఁ జీ భర్‌కే
ఫిర్ ఇస్ మొఖామ్ పె ఉమ్రే- రవాఁ రహే నరహే

ఇంకా యవ్వనావస్థలో వున్నాను. తనివి తీర పాపాలు చేసుకుంటాను. వేగంగా గమిస్తున్న వయస్సు మళ్ళీ ఈ తావున నిలుస్తుందో నిలువదో?'

పాపాలంటే మద్యపానం, ప్రేమించటం మాత్రమే అని చాలా చోట్ల మనవి చేసినాను. ఈ కవి అధ్యయనం గొప్పదే. అవగాహన గొప్పదే. కవిత గొప్పదే.

అఖ్తర్ షీరానీ రోమాంటిక్ కవుల్లో అగ్రగణ్యుడు. యౌవనంలోనే మరణించి నాడు. అతని ప్రణయ శృంగార కవిత అతి మనోహరం. అతడు కూడా తన సమకాలికుల లాగా రాజకీయ, సామాజిక సమస్యలను స్పృశించి కవిత చెప్పే ప్రయత్నం చేసినాడు కాని నెగ్గుక రాలేకపోయినాడు. మంచి గద్యం రాసినాడు. పత్రికా సంపాదన చేసినాడు. ఎన్ని చేసినా అతని చిరకీర్తికి కారణమైంది శృంగార కవితే.

ఎహసాన్ దానిష్ కూడా మంచి కవే. వజ్ద్ ఔరంగాబాదీ చాలా మంచి కవి. 'అజంతా' అనే కవిత అమరమైంది. ఔరంగాబాద్ ఆ కాలంలో హైదరాబాద్ సంస్థానంలోని ఒక సుబా- ఉర్దూ భాషా వికాసానికి నిలయం. అజంతా చిత్రకారులు కాని ఎల్లోరా శిల్పులు కాని, ఇంకే శిల్పులు కాని ఎక్కడా తమ పేరు చెక్కుకోలేదు.

కామ్‌ఛోడా హై మగర్ నామ్ నహీ ఛోడాహై

"ఘన కార్యాన్ని మిగిల్చినారు కాని తమ పేరు నిల్పుకోలేదు" అనే మాట ఎల్లకాలం గుర్తుంచుకోదగింది కదా!

రవిష్ సిద్దీఖీ కవిత నొకదాన్ని ఉదాహరించి ఈ వ్యాసాన్ని ముగిస్తాను. ఈ కవి బహు భాషా ప్రవీణుడు. కవితలో ఫారసీ పదాలధికం. డా. ఎక్బాల్ ప్రభావం ఇతని పైన కనిపిస్తుంది. ఇతని కవిత:

జుల్మ్ బేదాద్‌కి బున్యాద్ కోఢానే కేలియే
బిజ్లియాఁ ఖర్సె- గులామీ పె గిరానే కేలియే
నఖ్షె-తన్వీరె- తమద్దున్ కొ మిటానేకేలియే
కిశ్వరే హింద్‌కో అజాద్ బనానే కెలియే
షమ్మె బేదారియె-మష్రిఖ్‌కు ఫరోజాఁ కర్‌దే.
జిస్ తమద్దున్ మె మసావాత్‌కె అన్వార్ నహీ
జిస్ తమద్దున్ మె కహీఁ జల్వయె- ఈసార్‌నహీ

జిస్ తమద్దున్ కా నిగెహ్బా౯ దిలె- బేదార్ నహీ
జిస్ తమద్దున్ మె గరీబోంకెలియే ప్యార్ నహీ
ఉస్ తమద్దున్ కె హర్ ఐవాన్ కో వీరా౯ కర్‌దే.

"దమన పీడనల పునాదులను పూడ్చటానికి, బానిసత్వపు సౌధం మీద పిడుగులు రాల్చటానికి, బాహ్యాడంబరపు సభ్యతను మట్టు పెట్టటానికి భారత భూమిని స్వతంత్ర్యం చేయటానికి, తూర్పుదెసనున్న జాగృత దీపాన్ని ప్రజ్వరిల్లజేయి."

ఏ సభ్యతలలో సమానత్వపు కాంతి రేఖలు లేవో,
ఏ సభ్యతలో మచ్చుకైనా త్యాగ ప్రకాశం లేదో,
ఏ సభ్యతను జాగృత హృదయం పరిరక్షించటం లేదో,
ఏ సభ్యతలో పేద వారి పట్ల ప్రేమ లేదో,
ఆ సభ్యతకు చెందిన సమస్త నిర్మాణాలను శిథిలాలుగా మార్చు.

◆ ◆ ◆

అంజుమన్ తరక్కీ పసంద్ ముసన్నిఫీన్

పరాయి ప్రభుత్వం భారత దేశాన్ని దాస్య శృంఖలాల్లో బంధించి అన్ని రంగాల్లో ఎంతటి క్షతి కలిగించిందో అదంతా తమ కళ్ళతో చూచిన కొందరు కవులూ, రచయితలూ ఎలా స్పందించినారో ఇంత వరకు మాట్లాడుకున్నాము. పాశ్చాత్య దేశాలు ఆసియా ఖండాన్ని మొత్తానికి మొత్తం తమ గుప్పిట్లో పెట్టుకోవాలనే ఆరాటంతో ఎలాంటి పన్నాగాలు పన్నుతుండేవో చేరువగా వుండి గ్రహించిన కొందరు మేధావులైన యువకులు రానున్న ఉపద్రవాన్ని నిలువరించ డానికి ఏమి చేయాలో తీవ్రంగా ఆలోచించినారు. ఎక్కడ? లండన్ నగరంలోని నాన్‌కింగ్ రెస్టారెంటులో కూర్చుండి. ఆ మేధావులు కేవలం ఆలోచించి మధన పడే వాళ్ళే కారు. తమ ఆలోచనలనుకార్య రూపంలో పెట్టి, తమ భావాలను

భారతీయులకు కలం ద్వారా తెలియజేసే సత్తాగల వాళ్ళు. ముల్క్‌రాజ్ ఆనంద్, ఫైజ్ అహ్మద్‌ఫైజ్, సజ్జాద్ జహీర్, రషీద్ జిహాఁ మరికొందరు. అప్పటికి భారత దేశం ముక్కలు కాలేదు. అంతా భారతీయులే. 1935వ సంవత్సరమది. భారతదేశంలో వుండే తమ మిత్రులకు తమ ఆలోచన తెలియజేసినారు. అంతా కలిసి, కలం పట్ట నేర్చిన ప్రతి వ్యక్తి తన కీర్తి ప్రతిష్ఠల కోసంకాక ప్రజలకోసం రాయాలని ప్రజలను జాగృత పరిచి చైతన్యవంతులుగా చేయాలని, అభ్యుదయ పథంలో నడిపించాలని నిర్ణయం చేసినారు. 'అంజుమనె-తరక్కీ పసంద్ ముసన్నిఫీన్' (అభ్యుదయ రచయితల సంఘం) అలా ఏర్పడింది. ముసన్నిఫ్ అనే పదం విస్తృతార్థం కలది. కవిత్వం, కథ, నవల, వ్యాసం, విమర్శరాసే వాళ్ళంతా ముసన్నిఫ్‌లే. ముసన్నిఫ్ బహువచన రూపం ముసన్నిఫీన్. మున్షీ ప్రేమ్‌చంద్ లాంటి కొందరు మొదటి నుంచి ఆ పద్ధతిలోనే రాస్తుండేవాళ్లు. ఆ సంఘంలో కొందరు పూర్వ రచయితలూ, కవులూ చేరిపోయినారు. ప్రేమ శృంగార కవితలు రాస్తూ కవులుగా గుర్తింపబడిన యువకులూ అందులో చేరిపోయినారు. సంఘం బలిష్ఠమయింది. టాగోర్, ప్రేమ్‌చంద్, సరోజినీనాయుడు, జవహర్‌లాల్ నెహ్రూ, అబ్దుల్ హఖ్, ఆచార్య నరేంద్ర దేవ్ లాంటి ప్రథమ శ్రేణికి చెందిన కవులూ, రచయితలూ, మేధావులూ సంఘానికి తమ మద్దతు తెల్పినారు. తమ హర్షాన్ని వ్యక్తం చేసినారు. 1936లో అంజుమన్ మొదటి వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నది. ఆ సభకు అధ్యక్షుడు మున్షీ ప్రేమ్‌చంద్. ఆ సంవత్సరమే అతడు దివంగతుడైనాడు. ఇంకా కొన్నాళ్ళు బ్రతికి వుంటే సంఘానికి ఆమహారచయిత మార్గ దర్శకత్వం లభించి వుండేది.

'అంజుమన్' తరక్కీ పసంద్ ముసన్నిఫీన్' కు చెందిన కొందరు కవుల గురించి ముందుగా మాట్లాడుకుందాం. కథలూ, నవలలూ, విమర్శలూ రాసిన వాళ్ల గురించి ఉర్దూ గద్యవికాసం గురించి మాట్లాడుకునేటప్పుడు తెలుసు కుందాం.

కవుల్లో మొట్టమొదట మాట్లాడలసింది ఫైజ్ అహ్మద్ ఫైజ్ గురించే. ప్రణయ శృంగారాలకే పరిమితమైన ఉర్దూ కవితను ప్రక్కదోవ పట్టించిన వాడతడే కనుక.

'ముఝసె పహెలీసి మొహబ్బత్ మెరె మహెబూబ్ నమాంగ్' అన్నాడతడు.
'ప్రేయసీ! నా నుంచి వెనుకటి ప్రేమను ఆశించకు.

ఔర్ భి గమ్‌హైఁ జమానే మొహబ్బత్ కే సివా
"ప్రపంచంలో ప్రేమ కాక ఇంకెన్నో సమస్యలున్నవి."

'అతడు కాలేజీ లెక్చరర్‌గా పనిచేసినాడు. సైన్యంలో మేజర్‌గా పని చేసినాడు. పత్రికల సంపాదకత్వం నిర్వహించినాడు. పాకిస్తాన్‌లో గృహ నిర్బంధంలో గడిపినాడు. రష్యాలో వున్నాడు. నిలుకడగల జీవితం కాదతనీది. అతని వాణి చాలా బలమైనది. ఛందో బందోబస్తును కావాలని ఫటాఫట్ తెంపలేదతడు. తీవ్రమైన తన భావ వ్యక్తీకరణ కాటంకమనిపించినప్పుడే ఉల్లంఘించినాడు. అంతే అతడు అనవసరప్రయోగవాది కాడు.

ఇస్రారుల్ హఖ్ మజాజ్, మెయియిన్ హసన్ జజ్బీ, మఖ్దూమ్ మొహియుద్దీన్, అలీ సర్దార్ జాఫరీ, సాహిర్ లుధ్యాన్వీ, హస్రత్ జైపూరీ, కైఫీ అజ్మీ, అహ్మద్ నదీమ్ ఖాస్మి, జగన్నాథ్ ఆజాద్, నరేశ్ కుమార్ షాద్, అర్ష్ మలిస్యానీ, ఖతీల్ షిఫాయీ, అబ్దుల్ హమీద్ అదమ్. ఇలా అంజుమన్‌కు చెందిన కవుల లిస్టు రాస్తే పేజీలు చాలవు. ఈ కవులందరి కవితలు ఉదాహరించటం కూడా సాధ్యం కాదు. వీళ్ళు రాసినవన్నీ దీర్ఘకవితలు. గజల్లయితే కొన్ని షేర్లు ఉదాహరించవచ్చు. వీళ్ళు తొలుత గజల్లు రాసినవాళ్ళే కాని అప్పటికి అభ్యుదయ వాదం వైపు మొగ్గిన వాళ్ళు కారు.

మజాజ్, జజ్బీలు తొలుత శృంగార గజల్లు చెప్పి తర్వాత క్రమక్రమంగా అభ్యుదయభావాల కవిత చెప్పినారు. ఇద్దరూ సుప్రసిద్ధ కవులే. ఇద్దరి వాణి శక్తివంతమయింది. ఈ యిద్దరి గజల్లు కొన్ని సినిమాల్లో వాడుకున్నారు. జజ్బీ తొలుత తన గజల్లను ఫానీ చేత దిద్దుంచుకునే వాడు కనుక అతని తొలినాళ్ళ కవితలో విషాదం, నిరాశ కనిపిస్తాయి. ఫానీ గజల్లలాంటి సుందరమైన గజల్లే అతనివి.

హైదరాబాద్‌కు చెందిన మఖ్దూమ్ మొహియుద్దీన్ చెప్పిన కవిత తక్కువే. కొన్ని గజల్లు. చాలా మనోహరమైన గజల్లు. కొన్ని ఛందో రహితమైన కవితలు. అతడు తన జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలకే అంకితం చేసినాడు. అతడు చెప్పిన కవిత కొంచెమే అయినా అభ్యుదయ కవుల్లో అతని స్థానం అత్యున్నతం. అతని రెండు మూడు కవితలను సినిమాల్లో ఉపయోగించుకున్నారు. "ఇక్ ఛంబేలీ కె మంఢ్వే తలె" అనే పాట సినిమాల విజయానికి కారణమైనవి.

కామ్రేడ్ మఖ్దూమ్ రచించిన ఒక ఛందో రహితమైన కవిత వినండి. అప్పటి భారత దేశ పరిస్థితి చిత్రణ. శీర్షిక 'మష్రిఖ్' (తూర్పు).

ఝుడ్ చుకేహైఁ దస్తో బాజూ జిస్కె ఉస్ మష్రిఖ్ కో దేఖ్

ఖేల్తీ హైసాన్స్ సీనేమే మరీజే దిఖ్‌కో దేఖ్

ఏక్ నంగీ లాష్ బేగోరో కఫన్ ఠఠరీ హువీ

మగ్రబీ చీలోంకా లుఖ్మా ఖూన్‌మే లిథరీ హువీ

ఏక్ ఖబరిస్తాన్ జిస్మే హూ సివా కుఛ్‌బీ నహీ

ఇక్ భటక్తీ రూహ్ హై జిస్కా మకాం కోయీనహీ

ఇస్ జమీనే మోత్ పర్వర్దాకో ఢాయాజాయెగా

ఇక్ నయా దున్యా నయా ఆదమ్ బనాయాజాయెగా.

"చేతులూ, జబ్బలూ రాలి పోయిన తూర్పును చూడండి. ఎదలో ఒకింత శ్వాస ఆడుతున్న క్షయ రోగిని చూడండి.

గోరికాని, కఫన్‌కాని లేనిటువంటి ముడుచుకుపోయిన నగ్న శవం పడమటి గద్దలచే తినబడిన రక్తమోడుతున్న మాంసం ముద్ద.

ఏలాటి శబ్దం లేని శ్మశాసనం. ఏ ఆవాసం దొరక్క పరిభ్రమిస్తున్న ప్రేతాత్మ.

మృత్యువు పోషించే ఈ భూమిని పూడ్చివేసి ఒక క్రొత్త ప్రపంచాన్ని, క్రొత్త ఆదమ్ (మానవుడు)ను నిర్మించవలసి ఉన్నది."

అభ్యుదయ కవుల్లో ఇంకో పెద్ద కవి అలీ సర్దార్ జాఫరీ. అతనికి జ్ఞాన పీఠపురస్కారం లభించింది. ఉర్దూ కవితకు ఇది రెండవ జ్ఞాన పీఠ పురస్కారం. ఉర్దూ నవలకు గాను ఖురతుల్ ఐన్ హైదర్ జ్ఞాన పీఠ పురస్కారాన్ని పొందింది. అలీ సర్దార్ జాఫరీకి ఈ పురస్కారం ఎప్పుడో లభించవలసింది. ఇప్పటికైనా దొరికినందుకు సంతోషించవలసిందే.

◆ ◆ ◆

మరికొందరు అభ్యుదయ కవులు

'అంజుమన్ తరక్కీ పసంద్ ముసన్నిఫీన్'కు చెందిన కొందరు కవుల గురించి ముచ్చటించుకున్నాము. జాన్నిసార్ అఖ్తర్ ఈ ఉద్యమంలో అగ్రేసరుడైన కవుల్లో ఒకడు. నరేశ్ కుమార్ షాద్ అల్ప వయస్సులోనే చక్కని కవిత రాసి చాలా మెప్పుపొందినాడు. కాని ఏ కారణం వలననో జీవితం మీద విరక్తి పుట్టి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పండిత్ బాలముకుంద్ అర్ష్ మలిస్యానీ లబ్భూరామ్ జోష్ మలిస్యానీ కొడుకు. జోష్ మలిస్యానీని మనం స్మరించుకున్నాం.

అర్ష్ కవిత అందమయింది. జగన్నాధ్ అజాద్ త్రిలోక్ చంద్ మహరూమ్ కొడుకు. అతడు మంచి కవి. మంచి రచయిత. పంజాబ్‌కు చెందిన ఈ కవికి పంజాబ్‌కు చెందిన డాక్టర్ ఎక్బాల్ పట్ల ఎనలేని అభిమానం. ఎక్బాల్ కవితను గురించి అతడేది మాట్లాడినా అది ప్రామాణికం. అందుకే అతన్ని "మాహిరె ఎక్బాలియాత్" అంటారు. మాలిక్ రామ్‌ను "మాహిరె గాలిబ్‌యాత్" అనే వాళ్లు. ఆజాద్ కవితలో దేశ విభజన కారణంగా తన జన్మభూమి తనకు పరాయి దేశమయి పోయిందనే బాధ కనిపిస్తుంది.

ఒక కవిత వినండి;

బస్ ఏక్‌నూర్ ఝులక్తాహువా నజర్ ఆయా
ఫిర్ ఉస్కెబాద్ నజానే చమన్‌పె క్యాగుజ్రీ
మైకాష్ తుమ్‌కోభి అహలే వతన్ బతాసక్తా
వతన్‌సే దూర్ కిసీ బేవతన్‌పె క్యాగుజ్రీ
మెరే చమన్‌పెతో ఆయీతోథీ బహార్ మగర్
మైక్యా బతావూఁకె అహెలే చమన్‌పె క్యాగ్రుజీ
ఖమూష్ క్యోంహైఁ ఖతీలో నదీమ్ కుఛ్‌తో కహేఁ
హమారె బాద్ హమారే వతన్‌పె క్యాగుజ్రీ

"ఒక కాంతి కిరణం వెలిగింది. తర్వాత తోట పరిస్థితి ఏమయిందో తెలియదు."

ఆజాద్ జన్మభూమి (పాకిస్తాన్‌లోని భాగం) మీద పిడుగుపడింది.

ఏమైవుంటుందో స్పష్టమే.

"నా స్వదేశీయులకు స్వదేశానికి దూరమైన విదేశీయుని పరిస్థితి ఏమయిందో నేను వివరించగలిగివుంటే ఎంత బాగుండేది!"

"నా తోటలోనూ వసంతం వచ్చింది. కాని తోటవానుల పరిస్థితి ఏమయిందో ఏమి చెప్పను?"

"ఖతీల్, నదీములు మౌనం వహించినారేమి? నేను వెళ్లి వచ్చిన తర్వాత నా జన్మభూమి పరిస్థితి చెప్పరెందుకు?"

జగన్నాథ్ అజాద్ ఈ షేర్‌లో ప్రస్తావించినఖతీల్ నదీమ్‌లు పాకిస్తాన్‌లో వుండిపోయిన అభ్యుదయ కవులు. ప్రఖ్యాత కవులు. ఖతీల్ పూర్తిపేరు ఖతీల్ షిఫాయీ. నదీమ్ పూర్తి పేరు అహ్మద్ నదీమ్ ఖాస్మీ.

సినిమాల కోసం గజల్లూ పాటలూ రాసిన కవుల్లోనూ మహాకవులున్నారు. అభ్యుదయ భావాలు, విప్లవ భావాలుకల కవులున్నారు. అయితే వారి సినిమా కవిత ఆ సినిమాకు తగినట్లు, ప్రొడ్యూసర్లకిష్టమైనట్లు వుంటుంది కాని విడిగ ప్రచురించుకున్న గజల్ల సంగ్రహాలవలన, నజముల సంగ్రహాల వలన వాళ్ల కవితా వైశిష్ట్యం గోచరిస్తుంది. ఆర్జూ లఖ్నవీ, షకీల్ బదాయూనీ, హస్రత్ జైపూరీ, సాహిర్ లుధ్యాన్వీ, నఖ్షబ్, మజ్రూ సుల్తాన్ పూరీ సినిమాల కోసం సాహిత్య విలువలు గల గజల్లూ పాటలూ రాసినారు. కైఫీ అజ్మీ అభ్యుదయ కవే. సాహిర్ ఇప్పుడీ లోకంలో లేడు. జీవితంలో భగ్నప్రేమికుడు. అతని సినిమా పాటల్లోనూ అతని సొంత బాధ వ్యక్తమవుతుంది. బ్రహ్మచారిగానే జీవితం గడిపి వెళ్లిపోయినాడు. మజ్రూ సుల్తాన్ పూరీకి ప్రతిష్ఠాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు లభించింది.

మై అకేలాహీ చలాథా జానిబె మన్జిలె మగర్
లోగ్ సాథ్ ఆతేరహే ఔర్ కార్వాఁ బన్తాగయా

అందరి నోళ్లలో ఆడే ఈ షేర్ మజ్రూ చెప్పిందే.

"గమ్యం వైపు నేనొక్కనే బయలు దేరినాను. లోకులు వెంట వస్తూ కార్వాన్‌గా మారినారు."

ఇక్కడ మఖ్దూమ్ చెప్పిన ఈ షేర్ గుర్తుకు వస్తుంది;

"హయాత్ లేకె చలో, కాయెనాత్ లేకె చలో
చలోతో సారెజమానేకు సాత్ లేకెచలో"

ఉర్దూలో రాసే కవులూ, రచయితలూ చాలమంది మార్క్సిస్ట్ భావాలు కలవాళ్లే. కొందరు మార్క్స్ వాదులు. మరికొందరు ఫ్రాయెడ్ భక్తులు. ఫ్రాయెడ్ భక్తుల భావాలు చాలచోట్ల అస్పష్టంగాను, అశ్లీలంగాను వుంటాయి. ఫ్రాయెడ్ పేర అశ్లీల కవితలు రాసినవాడు మీరాజీ.

ఈ కాలంలో దేశంలోని పలు నగరాల్లో, విదేశాల్లో ముషాయిరాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముషాయిరాల్లో రాసే కవులు చాలమంది సాంప్రదాయికశైలిలో గజల్లు రాసేవాళ్లే.

ఈ ముషాయిరాల గురించి మాట్లాడుకునే ముందు కొన్నాళ్లక్రిందట హైదరాబాదుకు చెందిన ఒకగొప్ప రుబాయీ కవిని స్మరించుకుందాం. సూఫీ భావ విలసితాలయిన పెక్కు రుబాయీలు రాసిన అమ్జద్ హైదరాబాదీ యావద్భారత దేశంలో కీర్తిగాంచినాడు. రాఘవేంద్రరావు జజ్బ్ ఆలంపూరీ కూడా రుబాయీల కవే. అతని రుబాయీలు అందమైనవి. పాకిస్తాన్ కవి అబ్దుల్ హమీద్ ఆదమ్ కూడ రుబాయీల వలననే పేరుగాంచినాడు. అతని రుబాయీలు మధుపానానికి సంబంధించినవి. అహ్మద్ ఫరాజ్ కూడా పాకిస్తాన్ కవి. అతడు లండన్‌లో వుంటున్నాడు. అతని కవిత చాల శ్రేష్టమైంది.

హైదరాబాద్‌లోఎన్నో సాహిత్య సంస్థలున్నవి. అన్నీ ముషాయిరాలు నిర్వహిస్తాయి. ఏటేట జరిగే శంకర్‌జీ ముషాయిరాలు, అదబీ ట్రస్టు ముషాయిరాలు చాల ఘనంగా జరుగుతాయి. వాటిల్లో ఖుమార్ బారా బంక్వీ, బేకుల్ ఉత్సాహి, మనోహర్ రాణా లాంటి బయటి కవులే కాక నజీరలీ అదీల్, అలీ అహ్మద్ జలీల్, సలావుద్దీన్ నయ్యర్, ఖుర్షీద్ అహ్మద్ జామీ, ఖ్వాజా షౌఖ్, సయీద్ షహీదీ, మనోహర్‌లాల్ బహార్, జహాందార్ అఫ్సర్, సులేమాన్ అరీబ్, రాషిద్ ఆజుర్, యూసుఫ్ యక్తా, మంజూర్ అహ్మద్ మంజూర్ లాంటి స్థానిక కవులు పాల్గొనటం పరిపాటి. పైన పేర్కొనబడిన కవుల్లో కొందరు సాంప్రదాయిక కవులు. కొందరు అభ్యుదయ కవులు. కొందరు ఇప్పుడీ లోకంలో లేరు.

నజీరలీ అదీల్ ఇప్పుడు లేడు. ఉన్నంత కాలం ప్రతి ముషాయిరాలో పాల్గొన్నాడు. అతడుసిరాజ్ ఔరంగాబాదీ పరంపరకు చెందిన ఉస్తాదు. అలీ అహ్మద్ జలీల్ ఉస్తాద్ జలీల్ కుమారుడు. ఉస్తాదు జలీల్ ఏడవ నిజామ్ గురువని ఈ వరకే తెలుసుకున్నాము. సలావుద్దీన్ నయ్యర్, ఖ్వాజా షౌఖ్ గొప్ప కవులు.

అంజుమన్ తరఖ్ఖీ పసంద్ ముసన్నిఫీన్ సభలు కూడ హైదరాబాద్‌లో తరుచుగా జరుగుతుంటాయి.

కొన్నాళ్ళక్రిందట సర్వర్ దండా, గిల్లీ నల్గొండవీ అనే కవులు దకనీ భాషలో హాస్యరసపూరితాలయిన కవితలు రాసేవాళ్లు. గిల్లీడండా అంటే పిల్లలాడుకునే చిర్రగోనె ఆట.

హైదరాబాద్‌లో హాస్య కవులకు, రచయితలకు కొదువలేదు. రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ నరేంద్రలూథర్ ఆధ్వర్యాన 'జిందాదిలానె - హైదరాబాద్' అనే సంస్థ వెలసింది. ఆ సంస్థ మొదటి అధ్యక్షుడు అప్పటి సీనియర్ ఐ.ఎ.ఎస్.

ఆఫీసర్ భారత్ చంద్ ఖన్నా. నరేంద్ర లూథర్ ఉర్దూలోను, ఇంగ్లీషులోను మంచి రచయిత. జిందాదిలాన్ హైదరాబాద్ వాళ్లు ముషాయిరాలే కాక లతీఫాల సభలు, హాస్య వ్యంగ్య రచనల సభలు నిర్వహిస్తారు. హాస్యకవులు హైదరాబాద్ వాళ్లే కాక దేశం నలుమూలలనుంచి వస్తారు. వాళ్ల కలం పేర్లు హాస్యరసానికి తగినట్టుగా వుంటాయి. బంబాట్, అన్‌పఢ్, పాగల్, బేఢబ్- ఇట్లా వుంటాయి.

ఏడవ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రెండవ కొడుకు ప్రిన్స్ మొఅజ్జమ్ జాహ్ మంచి కవి. అతని దర్బారులో ఆనాటి మహాకవులు పాల్గొనేవాళ్లు. అతని కొడుకు షహామత్ జాహ్ కవితా రచనలో ప్రావీణ్యం సంపాదించి తమ 'ఫరన్‌విలా' భవనంలో ప్రతి మాసం సుప్రసిద్ధ కవులను ఆహ్వానించి గత కొన్ని సంవత్సరాలుగా ముషాయిరాలు జరుపుతున్నారు. ఆ ముషాయిరాల్లో అతని ముత్తాత మహబూబలీ పాషా కాలం నాటి షమా కవుల ముందుకు జరుపబడుతుంది. ముషాయిరా తర్వాత గజల్ గాయకులు వాద్య సహకారంతో ప్రిన్స్ మొఅజ్జమ్ జాహ్ షజీ గజల్లను గానం చేస్తారు. షజీ కాలంలోనే సాహెబ్ జాదా మైకష్ హైదరాబాదీ అనే కవి వుండేవాడు. అతని గజల్లు అత్యంత సుందరమైనవి.

ఇంతటితో ఉర్దూ కవుల ప్రసక్తిని ముగిస్తాను. చివరిగా ఒక మాట. నేడు ఎందరో మంచి కవులున్నారు. అందరినీ స్మరించటం సాధ్యం కాదు. ఇటీవల దివంగతుడైన కాళోజీ రామేశ్వరరావు షాద్ వరంగలీని స్మరించటం అవసరం. అతడు మహాకవి.

◆ ◆ ◆

ఉర్దూ గద్య వికాసం

ఏ భాషలోనైనా సాధారణంగా సాహిత్య విలువలు గలపద్య రచన ముదు జరిగినట్లు, గద్య రచన తర్వాత జరిగినట్లు తెలుస్తున్నది. దకనీ భాషలో కొందరు సూఫీ యోగులు మతపరమైన , సూఫీ వేదాంతపరమైన గద్య రచనలు చేసినట్లు చరిత్రకారులు చెప్పినారు. కాని ఆ రచనలిప్పుడు లభ్యం కావటంలేదు. గుల్బర్గాలో నివసించిన సూఫీ యోగి హజ్రత్ ఖ్వాజా బందా నవాజ్‌గేసూ దరాజ్ రచన 'మేరాజుల్ ఆషిఖీన్' లభించింది. ఆ తర్వాత రెండు శతాబ్దాల వరకు ఏలాటి గద్యరచన జరిగినట్లు లేదు. ఏవో రెండు మూడు చిన్నపాటి రచనలు జరిగినా వాటికి సాహిత్య విలువలు లేవు. మొహమ్మద్ ఖలీఖుతుబ్షా ఆస్థాన మహాకవి

ముల్లా వజీ సబ్‌రస్ అనే ఒక విశిష్టమైన గద్యరచన చేసినాడు. ప్రేమ, యౌవనం, హృదయం, బుద్ధి, విషయవాంఛలు పాత్రలుగా గల ఆ వేదాంత చంపూ రచనకు మూలమేదో తెలియదు. ఏదేని ఫారసీ రచన కావచ్చు. లేదా, సంస్కృతంలోని ప్రబోధ చంద్రోదయం కావచ్చు- దాన్ని చంపూ రచన అని ఎందుకన్నానంటే రచన అంత్యప్రాస నియమంగల వాక్యాల దకనీ వచనంలో వున్నది. మధ్యమధ్య కవిత్వపు ముక్కలున్నవి. వజీ మాత్రం ఆ కథ స్వకపోల కల్పితమని, అలాటి రచనకు తానే ఆద్యుడని చెప్పుకున్నాడు.

"అజ్‌లగన్ కోయి ఇస్ జహాన్‌మే, హిందుస్తాన్‌మే, హిందీ జుబాన్‌మే, ఇస్ లతాఫత్; ఇస్ ఛందాసోఁ నజమ్ ఔర్ నసర్ మిలాకర్, గులాకర్ నహీ బోల్యా" అంటాడు వజీ. నజమ్ ఔర్ నసర్ అంటే పద్య గద్యాలు కరిగించి కలిపి (చంపూ పద్ధతిలో) ఎవరూ చెప్పలేదంటాడు. తన భాష హిందీ అంటాడు. ఒకచోట హిందుస్తానీ అంటాడు. కానైతే అది దకనీ భాష. దకనీ భాషను కూడా ఆ కాలంలో హిందుస్తానీ అనే వాళ్ళు.

'సబ్‌రస్' నిజంగా చదువ దగిన అద్భుత రచన. ఉర్దూలో ఆద్యకవులు చేసిన వచన రచనల పేర్లే వింటాము కాని అవి అలభ్యాలు. అచ్చుయంత్రం పుట్టని ఆ కాలపు రచనలన్నీ చేతి వ్రాతలే కనుక చాల రచనలు నష్టమైపోయినవి. అన్ని భాషల్లోనూ అదే జరిగింది.

మొహమ్మద్ షా కాలం (1716-1748)లోనే ఉర్దూ వచన రచన ప్రారంభమైందని చరిత్రకారుల అభిప్రాయం. మొదటి వచన గ్రంథం కర్బల్ కథా. దాన్ని దహమజ్లిస్ అని కూడా అంటారు. దాని రచయిత ఫజ్లీ. 'రోజతుష్షొహదా' అనే ఫారసీ గ్రంథానికి అనువాదం. అయితే ఈ గ్రంథం నేడు లభ్యం కాదు. సాహిత్య చరిత్రల్లో ఉటంకించిన కొన్ని పేరాలు మాత్రం మనం చదువ గలుగుతున్నాము. దొరికిన పేరాల్లో ఒక చోట ఫజ్లీ ఉర్దూలో తనదే మొదటి వచన గ్రంథమని తెలుపుకున్నాడు. షాహ్‌వలీవుల్లా కొడుకు లిద్దరు పవిత్ర ఖురాను ఉర్దూలో అనువదించినారు. ఒక అనువాదం 1786లోను ఇంకో అనువాదం 1790లోను పూర్తి అయినది. ఈ రెండింటిలో భాష సరళం కాదు. వీటికి చారిత్రక మహత్యమే కాని సాహిత్య విలువలు లేవు. తర్వాత సాహిత్య విశిష్టతగల ఉత్తమ అనువాదాలెన్నో వెలువడినవి.

ఈ మధ్యకాలంలో అంటే, 1775లో అతాహుసేన్ తహసీన్ ఫారసీలోని 'ఖిస్సయే చహార్ దుర్వేష్'ను 'నౌతర్జేమురస్సా' అనే పేర ఉర్దూలో అనువదించి

నాడు. మూల రచయిత అమీర్ ఖుస్రూ అన్నాడు. అమీర్‌ఖుస్రూ పేర అనేక రచనలు ప్రచారంలో వున్నవి. అవన్నీ అతని రచనలు కావు. ఈ గ్రంథం కూడా అమీర్ ఖుస్రూది కాకపోవచ్చు.

తహసీన్ శ్రమ వ్యర్థమయిందనే చెప్పాలె. అతని భాష కఠినము. అందులో అరబీ ఫారసీ శబ్దాలధికం. రచయితకు అలంకార వ్యామోహం అతి వేలం. సామాన్యులకా రచన దుర్‌గ్రాహ్యం. అంతకంటే కవిత చదివి ఆనందించవచ్చు.

కలకత్తాలో ఫోర్ట్ విలియం కాలేజి స్థాపన జరిగిన తర్వాత అనేక రచనలు పఠనీయమైన శైలిలో అనువదించబడినవి. అన్నిటిలో ఉత్తమోత్తమయింది మీర్ అమ్మన్ రచన 'బాగొ-బహార్'. మీర్ అమ్మన్ ఆ గ్రంథాన్ని 1801-1803 మధ్య కాలంలో పూర్తిచేసినాడు. దాని అనువాదాలు పలువిదేశీ భాషల్లో పలు తడవలు ప్రచురింపబడినవి. ఉర్దూలోనే ఆరచన అనేక ప్రచురణలు పొందింది. ఇప్పటికీ ఆ కాల్పనిక రచనను ఆనందంగా చుదువగలం.

ఇంతా చేస్తే మీర్ అమ్మన్ రచన బాగొ బహార్ క్రొత్త కథ కాదు. తహసీన్ అనువదించిన నౌతర్‌జె-మురస్సానే అతడు అనుసరిస్తూ తనశైలిలో సజాతీయ భాషలో, హిందీ శబ్దాలు చేరుస్తూ కమ్మగా చదివించేట్లు రాసినాడు. అంటే మళ్ళీ చహార్ దుర్వేషుల (నలుగురుఫకీర్ల) కథను చెప్పినాడు. మూల ఫారసీ గ్రంథాన్ని అతడు చూచి వుంటాడు. చదివి వుంటాడు. కాని అతడు అనుసరించిందిమాత్రం తహసీన్ రచననే. తహసీన్ కొబ్బరి కాయను మనముందుంచితే అమ్మన్ పచ్చి కొబ్బరిని మన చేతి కందించినాడు. అతడు కూడా మూల రచన అమీర్ ఖుస్రూదే అని భ్రమపడ్డాడు.

పోర్ట్ విలియం కాలేజీ ప్రథమాధ్యక్షుడు డా. జాన్ గిల్‌క్రాయిస్ట్. అతన్ని గురించి తర్వాత మాట్లాడుకుందాం. మీర్ అమ్మన్ తనగ్రంథానికి ముందు మాట రాస్తూ ఇలా అన్నాడు:

".... జాన్ గిల్‌క్రాయిస్ట్ దొర, ఈ కథను ఉర్దూ తెలిసిన హిందువులు, ముసల్మానులు, స్త్రీలు, పురుషులు, బాలురు, వృద్ధులు, విశిష్ట వ్యక్తులు, సామాన్యులు, పరస్పరం మాట్లాడుకునే అచ్చయిన హిందుస్తానీ భాషలో అనువ దించవలసిందిగా ఆదేశించినారు. వారి ఆజ్ఞానుసారం వ్యావహారిక శైలిలో సజాతీయమైన భాషలో రాయటానికి ప్రారంభించినాను."

నిజంగానే అలాగే అనువదించినాడు. సజాతీయమైన అంటే జాతీయాలు గల భాష అని గ్రహించాలె. "బా ముహావిర" భాష అన్న మాట.

ఈస్టిండియా కంపెనీ అన్ని విధాల బలపడినతర్వాత ఐరోపీయ దేశాల నుంచి క్రైస్తవ మత ప్రచారకుల రాక ప్రారంభమైంది. వాళ్లు ఇక్కడి ప్రాంతీయ భాషలు నేర్చుకొని తమ వాళ్ళకు నేర్పటం కోసం వ్యాకరణాలు నిఘంటువులు రాసినారు. ఉర్దూలోను పాదిరీలు వ్యాకరణాలు, నిఘంటువులురాసినారు. అలా ప్రాంతీయ భాషల్లో రచనలు చేసిన వాళ్లు ఈ భాషల పట్ల గల అభిమానంతో కాదు. తమ వాళ్లు ఇక్కడి భాషలు నేర్చుకొని ఇక్కడి ప్రజలకు వాళ్ల వాళ్ల భాషలలోనే మత ప్రచారం చేయాలనే ఉద్దేశం తోనే. డా. జాన్ గిల్ క్రాయిస్ట్ మాత్రం ఇక్కడ ఉద్యోగం చేయడానికి పంపబడే ఇంగ్లీషు వాళ్ల ఉపయోగార్థం ఉర్దూలో పది పన్నెండు రచనలు చేసినాడు. అన్నీ వ్యాకరణానికి, భాషా శాస్త్రానికి మక్కువ యేర్పడింది. దూరప్రాంతాలనుంచి విద్వాంసులను పిలిపించి, వాళ్ళకు మంచి జీతాలిచ్చి మంచి మంచి అనువాదాలు చేయించినాడు. అతడుపోర్ట్ విలియం కాలేజీ మొదటి అధ్యక్షుడు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఇంగ్లాండుకు వెళ్ళి పోయి లండన్‌లోని ఓరియంటల్ ఇనిస్టిట్యూట్‌లో ఉర్దూ భాషా సాహిత్యాలతో మంచి పరిచయం కలిగిస్తూ పంపేవాడు. అతనికి ఉర్దూ భాషా సాహిత్యాల పట్ల మక్కువ యేర్పడింది. కాని ఆ మక్కువ ఫ్రెంచి విద్వాంసుడు గార్సాదతాసాకు ఫారసీ ఉర్దూ సాహిత్యాల పట్ల ఏర్పడిన మక్కువ లాంటిది కాదు. సి.పి. బ్రౌన్‌కు తెలుగు భాషా సాహిత్యాల పట్ల ఏర్పడిన మక్కువ లాంటిది కాదు. పై ఇద్దరు విద్వాంసులు సాహిత్యరసికులు. గిల్ క్రాయిస్ట్ మక్కువతన వాళ్ళకు ఉర్దూలో వ్యవహార జ్ఞానం కలిగించటం కోసమే. అతడు తయారు చేయించిన పుస్తకాలు ఇంగ్లీషు వాళ్ళు హాయిగా చదివి భాషా జ్ఞానం పొందటానికి పనికి వచ్చేవేకాని సాహిత్యాభిరుచి కలిగించేవి కావు. అతని ఉద్దేశ్యం ఏదైనా అతని కారణాన ఉర్దూలో వచన సాహిత్యం పెరిగింది. ఉర్దూకు అతడు ఉపకారమే చేసినాడు. అతడు ఇంకేమీ రాయించకున్నా మీర్ అమ్మన్‌చేత 'బాగొ-బహార్' ఒక్కటే రాయించినా ఉర్దూ వాళ్ళతన్ని స్మరించుకోకుండా ఉండలేకపోయేవాళ్లు. కవిత్వమే సాహిత్యమని భావించే ఉర్దూ వాళ్ళకు పఠనీయ వచన రచనలు చేసే ప్రేరణ కలిగించిన వాడు గిల్‌క్రాయిస్ట్.

పోర్ట్ విలియం కాలేజీలో చాలా మంది ఉర్దూ విద్వాంసులు, రచయితలు వుండేవాళ్లు. మనకు పదిహేనుగురి పేర్లు మాత్రమే తెలిసినవి. ఇక్కడ మనం కొన్ని మంచి వచన రచనల గురించే మాట్లాడుకుందాం.

హైదరీ (హైదర్ బఖ్ష్) కాలేజీ కోసం అందరికంటే అధికగ్రంథాలు రాసినాడు. అతని అనేక రచనల్లో "అరాయిషె-మహెఫిల్', 'తోతా కహానీ' అనే రెండు రచనలు మిక్కిలి ప్రజాదరణ పొందినవి. 'అరాయిషె-మహెఫిల్'లో అరబ్ దేశంలో సుప్రసిద్ధ దానవీరుడైన హాతిమ్ తాయీ చేసిన ఏడు సముద్ర యానాలు మనోహరంగా వర్ణించబడినవి. ఈ యాత్రలు కల్పితాలే. అయినా చదువాలనిపించే కథలు. ఈ రచన ఒకఫారసీ రచనకు అనువాదం. 'తోతా-కహానీ'ని దకనీ భాషలో మొహమ్మద్ ఖాదిరీ 'తోతీ-నామా' అనే పేర చాలా నాళ్ల క్రిందటే రాసినాడు. అది 'శుకసప్తతి' కథల అనువాదం. చిలుక చెప్పిన కథలు.

మజ్హరలీ విలా ఫారసీ ఉర్దూలే కాక సంస్కృతంలోనూ బ్రిజ భాషలోనూ పండితుడు. అతడు 'మాధనల్‌లో కామకుండలా' అనే ప్రేమ కథను, బేతాళ పచ్చీసీని అనువదించినాడు. అనువాదంలో అతనికి లల్లూలాల్‌జీ తోడ్పడ్డాడు. లల్లూలాల్జీ హిందీ పండితుడైనా ఫారసీ ఉర్దూలు చదివినాడు.

మిర్జా కాజిమ్ అలీ జవాన్ సంస్కృతంలోని శాకుంతల నాటకాన్ని ఉర్దూ వచన గ్రంథంగా రాసినాడు. ఇతనికీ లల్లూ లాల్జీ తోడ్పడ్డాడు. లల్లూ లాల్జీ కూడా కాలేజీ ఉద్యోగే. కనుక అతడు జవాన్ తోడ్పటుతో 'సింహాసన్ బత్తీసీ'ని అనువదించినాడు. ఆగ్రంథం దేవనాగరలిపిలోనూ అచ్చయింది.

మిర్జా అలీలుత్ఫ్ దిల్లీ నివాసి. గిల్ క్రాయిస్ట్ కోరికపై అతడొక కవుల చరిత్రరాసినాడు. ఫారసీలో అలీ ఇబ్రాహీమ్ రాసిన 'గుల్జారె-ఇబ్రాహీమ్' అనేకవుల చరిత్ర నమోనాలో అలీలుత్ఫ్ 'గుల్షనె-హింద్' అనే కవుల చరిత్ర ఉర్దూలో రాసినాడు. ఇతని భాషకఠినము. అయినా కవుల వివరాలు ప్రామాణికమైనవి. ఇతడు చివరి కాలంలో హైదరాబాద్‌లో నివసించి 1822న మరణించినాడు. 1906న హైద్రాబాద్‌లోని ఒక నదిలో ఇతని 'గుల్షనె-హింద్' వ్రాతప్రతి కొట్టుకుపోతూ ఎవరికో దొరికింది. అక్కడి విద్వాంసులేఆ గ్రంథాన్ని అచ్చువేసినారు. అలీలుత్ఫు అంతకష్టపడి రాసిన గ్రంథం వ్రాతప్రతిని పోగొట్టుకున్నాడు. అయినా ఉర్దూ వాళ్ల అదృష్టం కొద్దీ అది మళ్ళీ బయటపడింది.

మీర్ షేరలీ అఫ్సోస్ అనే కవి రాసిన గ్రంథాల్లో షేఖ్ సాదీ గులిస్తాన్ అనువాదం ప్రసిద్ధమైంది. జగత్ప్రసిద్ధమైన ఆ ఫారసీ రచనను అఫ్సోస్ 'బాగె-ఉర్దూ'అనే పేర అనువదించినాడు. అతని భాష ఫారసీ సమాస భూయిష్టము. ఫారసీలో సాదీ రచన సరళసుందరము. ఉర్దూలో అఫ్సోస్ అనువాదముకఠినము. తెలుగులో ఈ గులిస్తాన్‌నే దువ్వూరి రామిరెడ్డి చక్కగా అనువదించినాడు.

నిహాల్ చంద్ లాహోరీ గులే బకావళి కథను 'మజ్హబె-ఇష్క్' అనే పేర తీయని పలుకుబళ్లతో మృదువైన శైలిలోఅనువదించినాడు. ఈ కథనే తర్వాత దయాశంకర్ నసీమ్ 'గుల్జారె-నసీమ్' అనే పేర మస్నవీగా రచించినాడు.

పోర్ట్ విలియం కాలేజికి చెందిన కొందరిని గురించే మాట్లాడుకున్నాము ఈ వ్యాసంలో ఈ మాత్రం చాలు.

ఫోర్ట్ విలియం కాలేజితో సంబంధం లేని ఉర్దూ వచన వాఙ్మయం

ఫోర్ట్ విలియం కాలేజీ కారణంగా, జాన్ గిల్‌క్రాయిస్ట్ కారణంగా ఉర్దూలో వచన వాఙ్మయం వర్ధిల్లింది. అప్పట్లో ప్రతి నగరంలో జరిగేముషాయిరాల్లో పాల్గొంటూ వాహ్వాలు పొందటమే గర్వకారణం. జిజ్ఞాస కలవాళ్లు సాధన చేసి ఉస్తాదుల చేత దిద్దించుకొని తమ గజల్లు చదివేవాళ్లు. కేవలం కీర్తికాముకులైన సంపన్నులు మంచి కవులకు లంచమిచ్చి వాళ్ల గజల్లను తమ పేర మార్పించుకొని, అంటే, మఖ్తా మార్పించి అది తమ గజలే అయినట్లు ముషాయిరాల్లో చదివేవాళ్లు. ఉస్తాదుల్లో చాలా మంది పూట గడవని బీదవాళ్లు. ముస్హఫీ అంతటి మహాకవి కొన్ని వందల గజల్లు అమ్ముకున్నాడు. ఈలాటి సామాన్య కవులు, ఆ కవులు కొందరు వచన రచనను చేపట్టి అద్భుతమైన గ్రంథాలు రాసి చెరగని కీర్తిని ఆర్జించినారు. ముషాయిరాల వ్యామోహంగల కవులుగానే వుండి వుంటే సాహిత్య చరిత్రల్లో వాళ్ల పేర్లయినా నమోదయ్యేవికావు. ఇప్పటికీ నిత్య నూతనంగా కనిపించే 'బాగొబహార్ రాసిన మీర్ అమ్మన్ దహెల్వీ ఆ పుస్తకం ప్రకాశితమయ్యేంత వరకు అనామకుడు. గిల్‌క్రాయిస్ట్ ముద్రణ యంత్రాన్ని కూడా కాలేజీలో తెచ్చి పెట్టినాడు. కనుక తమ రచన అచ్చువుతుందన్న విశ్వాసంతో రచయితలు రాసేవాళ్లు.

ఇక మనం ఫోర్ట్ విలియం కాలేజీ ప్రసక్తి వదిలిపెట్టి అన్యత్రా జరిగిన వచన సాహిత్య నిర్మాణాన్ని గురించి మాట్లాడుకుందాం.

ఇన్షావుల్లాఖాన్ ఇన్షాను మహాకవిగా ఇంతకు ముందే స్మరించుకున్నాము. అనేక భాషల్లో పండితుడు. మహామేధావి. అతని కల్పనలు, భావనలు ఆశ్చర్యకరమైనవి. కాని ఈ పాండిత్యం, ఈ శేముషీ విశేషం అతని గజల్లలో కనిపించదు. అందుకు కారణం అతని పోషకులు సంపన్నులే, భోగలాలసులే కాని సాహిత్య వేత్తలు కారు. కవితా మర్మజ్ఞులుకారు. వాళ్ల అభిరుచికి తగిన నవ్వించే చమత్కారపు తేలిక కవిత చెప్పి వూర్కున్నాడు ఇన్షా. అతని పాండితీ గరిమను పట్టి చూపేవి

అతని వచన గ్రంథాలు. 'రాణీకేతకీ ఔర్ కుంవర్ ఉదయ భాన్‌కీ కహానీ' అనేవచన కావ్యం (దాన్ని కావ్యమనే అనాలె) అతని విలక్షణ ప్రతిభకు అద్దం పడుతుంది. అరబీ ఫారసీ శబ్దాలు లేని అచ్చయిన హిందుస్తానీ భాష. రమ్యమైన కథన శిల్పం. ఆశ్చర్యానందాలు కలిగించే వర్ణనలు. ఆ గ్రంథాన్ని ఉర్దూ వాళ్లు ఉర్దూ (ఫారసీ) లిపిలోనూ, హిందీవాళ్లు దేవనాగరి లిపిలోను అనేక పర్యాయాలు అచ్చు వేసుకున్నారు.

ఇన్షా రచించిన ఇంకొక మహాద్భుత వచన రచన "దర్యాయె-లతాఫత్' అది ఫారసీ రచనే కాని దానినిండా పలు ప్రాంతాల ఉర్దూ పలుకుబళ్ల చర్చే అధికంగా సాగింది. ఆగ్రంథ రచయిత ప్రతిభావ్యుత్పత్తులను అంచనావేయటం అందరికీ సాధ్యం కాదు.

ఇన్షా వచనరచనలీ రెండే అనుకున్నారు. కొన్నాళ్ల క్రిందట 'సిల్కె గొహర్' అనే ఇంకొక రచన బయటపడింది. అది సొంతం నిర్బిందుక రచన. అంటే చుక్కలు లేని అక్షరాల రచన. ఉర్దూ వర్ణమాలలోని అక్షరాల్లో చుక్కలు లేని అక్షరాలు చాలా తక్కువ. ఒక్క చుక్క, రెండు చుక్కలు, మూడు చుక్కలుగల అక్షరాలే ఎక్కువ. తక్కువ అక్షరాలతో ఎక్కడా తడబడకుండా ధారా రమ్యంగా గ్రంథానికి గ్రంథమే రాయటం ఇన్షాకే సాధ్యమయింది.

తెలుగులోనూ నిరోష్ఠ్య కావ్యాలు రచించి కీర్తిగాంచిన కవులున్నారు. అయితే తెలుగులోని యాభైయారక్షరాల్లో ఓష్ఠ్యాలు ఐదు మాత్రమే. ఐదక్షరాలు లేకుండా రాయటమే అద్భుతమనుకుంటాము. సగం కంటే ఎక్కువ అక్షరాలు వదిలిపెట్టి రాయటం ఎంత కష్టమో ఊహించండి. ఫారసీలో ఈలాటి చమత్కారాలు అమీర్‌ఖుస్రూ, ఫైజీలాంటి మహాకవులు చేసినారు.

ఆ తర్వాత ఇంకొక గొప్ప రచన మీర్జా రజ్జబలీ సరూర్ చేసినాడు. దాని పేరు 'ఫసానయే అజాయబ్.' ఆ రచన పురాణ కథలనూ నవలలనూ కలిపే సంకెల. నవలా లక్షణాలు గల మొట్టమొదటి ఉర్దూ గ్రంథమదే. సరూర్ భాష సరళము కాదు. ఫారసీ సమాసభూయిష్టము. అంత్యప్రాసనియమం గల దీర్ఘ దీర్ఘ వాక్యాలు. ఊహకందని అర్థాలంకారాలు. తానలా రాస్తే ఎవరికీ అభ్యంతరం లేదు కాని మీర్‌అమ్మన్ సరళ భాషను పనిగట్టుకొని పరిహసించినాడు సురూర్. సారళ్యం పాండిత్య లక్షణం కాదని, అది కళే కాదని అతని అభిప్రాయం.

సురూర్ మరికొన్ని రచనలు చేసినాడు. 'గుల్జారె సురూర్' అనే అతని ఇంకొక గ్రంథానికి మిర్జా గాలిబు పీఠికరాసినాడు. మిర్జా గాలిబు పీఠిక భాష

కఠినము. కృతకము. ఉత్తరాల్లో అతి సరళమైన, అతి సహజమైన భాషను ప్రయోగించే గాలిబు గ్రంథ పీఠికలు మాత్రం అప్పటి సంప్రదాయం ప్రకారం కఠినభాషలో కృతకశైలిలో రాసేవాడు.

ఆ కాలంలోనేలఖ్నోలో ఇంకొక గొప్ప వచన రచనవెలువడింది. ఫకీర్ మొహమ్మద్ ఖాన్ గోయా మంచికవి. నాసిఖ్ శిష్యుడు. కవిత్వం చెప్పి వూర్కుండి వుంటే అతని పేరు సాహిత్య చరిత్రల కెక్కేదికాదు. ఫారసీలో ప్రసిద్ధ గ్రంథమైన 'అన్వారె సుహైలీ'ని 'బూస్తానె-హిక్మత్' అనే పేర ఉర్దూ వచనంలో అనువదించి నాడు. అతని కీర్తికి ఆ అనువాదమే కారణం. గోయా భాష సరళం కాదు గాని సురూర్ భాషవలె అలంకార భూయిష్టమైన కృతక భాష మాత్రం కాదు. 'అన్వారె సుహైలీ' పంచతంత్ర హితోపదేశాల కథల సంగ్రహం. పెక్కు సంస్కృత రచనలు అరబీలో అనూదితాలై, ఫారసీలోకిదిగి, అక్కడి నుంచి ఉర్దూలోకి వచ్చినవి. ఇదీ అలాటిదే.

దిల్లీ కాలేజీ, దిల్లీ వర్నాక్యులర్ ట్రాన్స్‌లేషన్ సొసాయిటీలు ఏర్పడి కాలేజీకి అవసరమైన విజ్ఞాన శాస్త్రం, దర్శనశాస్త్ర, గణితశాస్త్రాల అనువాదాలేకాక రామాయణ, మహాభారతాల అనువాదాలు కూడా చేయించినవి. అనువాద కులందరూ గొప్పవాళ్లే కాని మాస్టర్ రామచంద్ర (గణితశాస్త్రం) అందరిలో గొప్పవాడు.

◆ ◆ ◆

ఉర్దూ నవలా రచన ప్రారంభదశ

ఉర్దూ కవితా రచన గౌరవ కారణంగా భావించేవాళ్లే జాబులు రాయ వలసి వస్తే మాత్రం ఫారసీలో వ్రాయటమే శిష్టసంప్రదాయమని భావించేవాళ్లు- ఒకవేళ ఉర్దూలో రాయవలసివస్తే మొహమ్మద్ షాహీయుగం సంప్రదాయాన్ని పాటిస్తూ రాసేవాళ్లు, అంటే ఎవరికి రాస్తున్నారో వాళ్ల వయస్సుకు, అర్హతను బట్టి దీర్ఘవాక్యంలో "హజ్రత్... ఖిబ్లావ కాబా" అని సంబోధించటం. సమాన్యులను సంబోధించే పద్ధతివేరు; చిన్నవాళ్లను సంబోధించే పద్ధతి వేరుగా పాటించటం. సలామ్, దువాల తర్వాత "మేమంతా ఇక్కడ అల్లాదయ వలనక్షేమంగా వున్నాము. మీరంతా క్షేమంగా వున్నారని భావిస్తున్నాము' అనే వాక్యాలు తప్పని సరిగా రాయటం, చివరికి పెద్దలకు సలాములు, పిన్నలకు దువాతో ముగించటం

అప్పటి జాబుల సంప్రదాయం. భాష పారసీ పదాలతో నిండి వాక్యాలు తికమకగా వుండేవి. ఈపద్ధతిని పరిహరించి ముఖాముఖి మచ్చటించుకున్నట్లు జాబులు రాయటం ప్రారంభించినాడు మిర్జాగాలిబు. ఒక శిష్యునికి జాబు రాస్తూ 'మియాఁ! ఇదేమి జాబు అని ఆశ్చర్యపడుతున్నావా? మహమ్మద్ షాహీ సంప్రదాయాన్ని నేనే కావాలని తొలగించినాను. ఆ దీర్ఘమైన సంబోధనలెందుకు? నేను క్షేమంగా వున్నాను కనుకనే ఈ జాబు రాస్తున్నాను. ఆమాట చెప్పట మెందుకు? ఒకప్పుడు మీరంతా నా చుట్టూ వుండేవాళ్ళు, మనం హాయిగా మాట్లాడుకునే వాళ్లం. ఇప్పుడు తలో దిక్కుకు వెళ్లిపోతిరి. మీతో మాట్లాడాలనిపించి నప్పుడు ఇదిగో ఈ జాబుల ద్వారా మాట్లాడతాను. మీరూ అలాగే మాట్లాడాలె. అణాపైసలు కర్చయితాయని లోభపడవద్దు. బేరంగులు (Unpaid Letters) పంపినా నేను సంతోషిస్తాను. ఎవరి జాబయినా వచ్చిందంటే ఆ మిత్రుడే వచ్చినాడని సంబరపడిపోతాను. ఏమహెల్లాలో వున్నా (గాలిబు యాభైయేళ్లు డిల్లీలో వున్నా సొంత గూడు కట్టుకునే స్తోమత అతని కెన్నడూ కలుగలేదు. కనుక ఐదు పదేళ్ల కొకమహెల్లా నుంచి ఇంకో మహెల్లాకు ఇల్లు మార్చేవాడు. అద్దె యిల్లు) తపాలా బంట్రోతు నాకు తెలిసిన వాడేవుంటడు. నా జాబులు వెంటనే తెచ్చియిస్తాడు." అని రాసినాడు. అతని జాబుల వలన అతని వ్యక్తిత్వం, అతని భావాలు అభిప్రాయాలు, అలవాట్లు అన్నీ గ్రహించవచ్చు. జాబులు మంచికాగితం మీదనే రాసేవాడు. కవర్లు తానే తయారుచేసి తపాలా బిళ్లలు అంటించేవాడు. కలాలు తనే చెక్కు కునేవాడు. సిరా తానే తయారు చేసుకునేవాడు. జాబులు రాయట మంటే అతని కంతటి సరదా. అతడు వద్దువద్దంటున్నా అతని జాబులు పుస్తక రూపంలో ప్రచురించబడ్డాయి. ఇంకా జాబుల సేకరణ జరుగుతూనే వున్నది. "ఖుతూతె గాలిబ్', 'నాదిర్ ఖుతూతె -గాలిబ్', 'ఉర్దూయె-మొఅల్లా' (రెండు భాగాలు) 'ఊదె-హిందీ', 'మకాతిబె-గాలిబ్' అనేవి అతని జాబుల సంకలనాల్లో కొన్ని.

ఆ తర్వాత మరి కొందరుకవులూ, విద్వాంసులూ తమ జాబులను సేకరించి సంకలనాలుగా ప్రచురించుకున్నారు. కాని ఎవరి జాబులకూ గాలిబు జాబులకు లభించిన ప్రజాదరణ లభించలేదు. గాలిబు జాబులలో వుండే సరళత, సహజత్వం, ఆత్మీయత ఇతరులకు అలవడలేదు. ఇప్పటికీ అలవడ లేదంటే ఆశ్చర్యపడనక్కరలేదు. చక్కని వచనానికి ఒరవడి దిద్దినాడు గాలిబు. ఆ తర్వాత సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్, హాలీ, ఆజాద్, నజీర్ అహ్మద్, షిబ్లీ నోమానీలు ఉర్దూ వచనంలో రాసిన ఉద్గ్రంథాల గురించి ఇంతకు ముందే మాట్లడుకున్నాము.

నజీర్ అహ్మద్‌ను గురించి ఇక్కడ మళ్లీ కొంత మాట్లాడుకోవటం అవసరం. అతడు గొప్పరచయిత. గొప్ప వక్త. అతని ఉపన్యాస సంకలనం ప్రచురితమైంది. దానిని చదివితే అతనికి ఎన్ని విషయాలపట్ల ఎంతటి విజ్ఞానం వుండేదో విశదమవుతుంది. ఎడింబరో విశ్వవిద్యాలయం, పంజాబు విశ్వవిద్యాలయం అతనికి గౌరవ డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేసినవి. కనుక అతన్ని డా. నజీర్‌అహ్మద్ అంటారు. కాని అతడుడిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా కొన్నాళ్ళు, డిప్యూటీ కలెక్టర్‌గా కొన్నాళ్లు పని చేసినందువలన డిప్యూటీ నజీర్ అహ్మద్‌గానే ప్రసిద్ధుడైనాడు.

అతని వచనశైలి విశిష్టమైనది. అతనికి చిరకీర్తిని ఆర్జించి పెట్టినవి అతని నవలలు- 'మేరాతుల్ - ఉరూస్' అనే నవల అతడు తన కూతురు చదువుకోవటానికేరాసినాడు. దాన్ని చదివిన ఒక ఇంగ్లీషు కలెక్టర్ అతన్ని ప్రోత్సహించి ఆ నవలను ప్రచురింపజేసినాడు. ఆ ఉత్సాహంతో అతడు ఏడు నవలలు రాసినాడు. అన్నిటిలో 'తోబతున్నసూహ్' అనేనవల ప్రసిద్ధమయింది. అతని నవలలన్నీ ఎన్నోసార్లు ముద్రింపబడినవి. కాలక్షేపం కోసం చదువుకోవటానికి రాసిన నవలలు కావవి. అతడు సర్ సయ్యద్, హాలీల సహచరుడు కనుక సంఘ సంస్కరణాభిలాషతో రాసిన నవలలు. ఉర్దూ నవలా రచనకు ఆద్యుడతడే అంటే సత్యదూరమైన మాట కాదు.

ఇంగ్లీషు నవలల శైలిలో మొదటి నవల రాసిన రచయిత పండిత్ రతన్ నాథ్ సర్షార్. అతడులఖ్నోలో జన్మించినాడు. మాతృభాష ఉర్దూ. ఫారసీ, అరబీ, ఇంగ్లీషు భాషల్లో మంచి జ్ఞానం సంపాదించినాడు. కొంతకాలం ఉపాధ్యాయ వృత్తి నిర్వహించి తర్వాత 'అవధ్ అక్బార్' అనే ప్రముఖ పత్రికకు ముఖ్య సంపాదకుడయినాడు. ఆపత్రికలోనే సీరియల్‌గా 'ఫసానయే-ఆజాద్' అనేనవల రాసినాడు. అదికాక'జామె-సర్షార్', 'సైరె-కోహ్సర్' మొదలయిన నాలుగైదు నవలలు రాసి 'డాన్ క్విక్జిట్'ను 'ఖుదాయీ ఫౌజ్‌దార్' అనే పేర అనువదించినాడు.

'ఫసానయే ఆజాద్' అతనికి అజరామరమైన కీర్తి తెచ్చిన నవల- నవాబీ నశించినా ఒకసంప్రదాయ రూపంలో వున్న అప్పటి లఖ్నో కృతక జీవనశైలిని చిత్రించే ప్రయత్నామా నవలలో జరిగింది. అందలి పాత్రలు కార్టూన్‌ల వలె వుంటాయి. సర్షార్ జీవంతమైన వచనం రాయగలవాడు. విస్తృతమైన లోకానుభవం కలవాడు. లఖ్నో జీవితాన్ని బాగా అధ్యయనం చేసినవాడు. మద్యపానరతడు. ఆ నిషాలో ఆ నవలను పాడిగిస్తూ పోయినాడు. వెనక్కి తిరిగి చూచి దిద్దుకునే ప్రయత్నం చేయలేదు. ఐదువేల పుటలతో నాల్గు సంపుటాల్లో అచ్చయిన

ఆ నవల అశేష జనాదరణ పొందింది. ప్రజలు విరగబడి చదివే వాళ్లు. ఇప్పటికీ దాన్నిచదివి ఆనందించవచ్చు. అందులో వున్న కథ నామ మాత్రమయిందే. కథకు సంబంధించని భాగాన్ని తొలగిస్తే వంద పేజీలు కూడా మిగలవు. మున్షీ ప్రేమ్‌చంద్ ఫసానయే ఆజాద్‌ను అతని అనుమతితోనే హిందీలో సంక్షిప్త పరచి ప్రచురించి నాడు. దాని అందం మిగులలేదు. ఆ మాటే సర్షార్ ఒకచోట రాసినాడు. ఆసక్తితో చదివించేది అతని భాష. అతని వర్ణనలు. కథ కాదు. కథను మాత్రమేమిగిలిస్తే చదివే ఆసక్తి చచ్చిపోతుంది. సర్షార్ ఇతరనవలల్లోనూ కథా భాగం స్వల్పమే. నిలుకడగల స్వభావం కాదతనిది. కొన్ని రోజులు అలహాబాద్‌లోనూ, కొన్నాళ్ళు హైదరాబాద్‌లోను నివసించి అతిపానం వలన ఆరోగ్యం దెబ్బతిని మరణించినాడు.

ఇంగ్లీషు నవలల పద్ధతిలో ఉర్దూ నవలలు రాసిన ఇంకొక రచయిత అబ్దుల్ హలీమ్ షరర్- అతడు లఖ్నోలోనే జన్మించినాడు. అరబీ, ఫారసీ, ఇంగ్లీషు భాషల్లో పాండిత్యం సంపాదించినాడు. అనేక విషయాలను గురించి లెక్కలేనన్ని వ్యాసాలు రాసినాడు. అతని వ్యాసాలు 'అవధ్ అక్బార్' లోనే అచ్చయినవి. అతని కీర్తి దూరదూరాలకు వ్యాపించింది. హైదరాబాద్ సంస్థానం అతన్ని పిలిపించుకొని గౌరవించింది. అక్కడతడు 'దిల్ గుదాజ్' అనే పత్రికను స్థాపించి దానిలో వ్యాసాలే కాకఅనేక నవలలు సీరియల్‌గా రాసినాడు. ఇంగ్లాండ్ కూడా వెళ్ళి వచ్చినాడు. అతనికి ముసల్మానుల గత చరిత్ర పట్ల ఆసక్తి మెండు. అతని నవలలన్నీ ముసల్మానుల యుద్ధాలను, విజయాలను వర్ణించేవే. రోమాంటిక్ నవల్లో వుండే ప్రేమకు గూడ అతనికి నవలల్లో మంచి స్థానం వున్నది. అతని భాష వ్యాసాల్లోనూ నవలల్లోనూ కావ్యభాష-ఛందోమయమైన భాష- అతని నవలలన్నీ ఒకే రకమైన ఇతివృత్తం కలవి. ఒకేరకమైన శైలి. ఒకే రకమైన పాత్రలు. ఒక నవలలోని పాత్రలనుఇంకో నవలలో పెట్టినా ఏమంత మార్పు జరిగినట్లనిపించదు. ఆ నవలల్లో గంభీర భావాలూ లేవు.

షరర్ తొమ్మిది పత్రికలు నడిపినాడు. కొన్ని కొన్నాళ్లే ఆగిపోయినవి. కొన్ని చాలా కాలం నడిచినవి. అతని రచనలు, చిన్నవి పెద్దవి 102- చాలవరకు నవలలు- మిగిలినవి వ్యాస సంపుటాలు.

లఖ్నో నుంచి చాల కాలం వెలువడిన ఎందరో ప్రముఖ రచయితలను కవులను చేరదీసిన పత్రిక 'అవధ్ పంచ్'. అది ప్రత్యేకంగా హాస్యరచనల కోసం ఉద్దేశింపబడింది. దాని ప్రథమ సంపాదకుడు సజ్జాద్ హుసేన్. అతడు దేశాభిమానం గల రచయిత. స్వాతంత్ర్య పోరాటానికి బాసటగా నిల్చి కాంగ్రెస్ ఉద్యమాన్ని

గురించి ప్రజల్లో ప్రచారం చేయటమే కాక ఆంగ్ల ప్రభుత్వపు దమననీతిని సుతిమెత్తని హాస్యంతో విమర్శించే వేదికగా మార్చినాడు సజ్జాద్ హుసేన్ తన పత్రికను. ఎందరో ప్రఖ్యాత రచయితలు, కవులు ఆ పత్రికకు తమ రచనలు పంపేవాళ్లు. 'అక్బర్ ఇలాహాబాదీ, రతన్ నాథ్ సర్షార్, బ్రజనారాయణ్ చక్ బస్త్ లాంటి గొప్పవాళ్లు తమ రచనలను ఆ పత్రికకు పంపేవాళ్లు. సజ్జాద్ హుసేన్ కూడా మంచి రచయిత. అతడురాజకీయ, సామాజిక వ్యాసాలేకాక'హాజీ బగ్లూల్', 'మిఠీఛురీ', 'కాయాపలట్' లాంటి పఠనీయాలైన చాల నవలలు రాసినాడు. అతని భాష లఖ్నో వ్యవహారికం. అతని శైలి అతి సుందరమైంది. అతని హాస్యం నవ్వించేదేకాక ఆలోచింపజేసేది.

ఆకాలపు ఇంకో గొప్పరచయిత మిర్జాహాదీ రుస్వా. అలవోకగా మూడు నాలుగు నవలలురాసి ఉర్దూ నవలా సాహిత్యంలో శాశ్వతకీర్తిని పొందినాడు. కానయితే అతని అభిరుచి నవలలు రాయటం కాదు. భౌతిక, రసాయనశాస్త్రాలు, ఇంజనీరింగ్, సంగీతం, కవిత్వం, దర్శన, తర్క, ధర్మశాస్త్రాలు విశేషంగా చదివి అనేక గ్రంథాలురాసినాడు. అన్నిరాస్తూ అతడుకొన్ని నవలలు రాసినాడు. సాహిత్యదృష్టితో చూస్తే అతని నవలలన్నీ విలువయినవే. కాని 'ఉమ్రావ్‌జాన్ అదా' అనేనవల వలన అతనికి కీర్తి లభించింది. అదొకవేశ్య తననోట చెప్పిన కథ. రుస్వా అందులో కొన్ని కల్పనలు చేసినాడు. ఉమ్రావ్ జాన్ అదా మంచి కవయిత్రి కూడా. ఉమ్రావ్ జాన్అదా అనే సినిమా కూడా తయారయింది కనుక ఆ కథను గురించి వివరాలు చెప్పటం అనవసరం. నవల చివరరచయిత ఉపదేశకుని వలె మాట్లాడుతాడు. అదే ఆ నవలలో బలహీనమైన భాగం.

ఆ కాలానికి చెందిన ఇంకొక నవలా రచయితను గురించి మాట్లాడి ఈ వ్యాసాన్ని ముగిస్తాను. ఆ రచయిత పేరు రాషిదుల్ ఖైరీ. అతడు స్త్రీ జనోద్ధరణనే ఇతివృత్తంగా గ్రహించి చాల నవలలు రాసినాడు. డిప్యూటీ నజీర్ అహ్మదే మొట్టమొదట స్త్రీల సమస్యలను స్పృశించిన రచయిత. రాషిదుల్ ఖైరీ స్త్రీల జీవితంలోని విషాదాన్ని గురించే నవలలురాసినాడు. అతన్ని 'ముసవ్విరె-గమ్' (విషాద చిత్రకారుడు) అనేవాళ్లు. అతని భాష శుద్ధమైన దిల్లీ వ్యావహారికం. స్త్రీల సమస్యలు చర్చించటానికే అతడురెండు పత్రికలు నడిపినాడు. 'ఇస్మత్' అనేపత్రికచాల ప్రసిద్ధమైనది. అతడుకొన్ని చారిత్రక నవలలు కూడా రాసినాడు. మధ్యమ వర్గానికి చెందిన ముస్లిమ్ స్త్రీలు అతని నవలలను ఇప్పటికీ ఆసక్తితో చదువుతారు.

◆ ◆ ◆

ఉర్దూ నవల

ఏ భాషలోనైనా చిన్న కథలు, పెద్ద కథలు ఎప్పుడూ వున్నాయి. వాగ్రూప భాషల్లోనూ తరతరాల నుంచి కథలు చెప్పుకుంటున్నారు. పిల్లలను అలరించి నిద్రపుచ్చేటందుకు ఏదేశంలోనైనా ఏ భాషలోనైనా నానమ్మ కథలు, తాతమ్మ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు ప్రచారంలో వున్నవి. చదువరాని జానపదులు చెప్పుకునే కథలను జానపద కథలంటున్నాము. ఈలాటి కథల్లో అద్భుత కల్పనలుంటాయి. నవరసాలుంటాయి. కథ చెప్పేవాని సంస్కారాన్ని బట్టి పాత్ర పోషణ, సన్నివేశ కల్పన జరుగుతూవుంటుంది. ఉర్దూలో దాస్తాన్‌గోయీ ఒక కళ. నిన్న మొన్నటి వరకు దాస్తాన్‌గో లుండేవాళ్లు. అలిఫ్ లైలా కథలు, దాస్తానె అమీర్ హమ్జా, చిలుక చెప్పిన కథలు, హంస చెప్పిన కథలు, బేతాళకథలు, ముప్ఫయి రెండుబొమ్మలు చెప్పిన సింహసన ద్వాత్రింశతిక, కథా సరిత్సాగరం, పంచతంత్ర హితోపదేశ కథలు- ఇలా ఎన్నో కథలు ప్రచారంలో వుండేవి. కథలు చెప్పేవాళ్ల (దాస్తాన్ గో) ప్రజ్ఞ ఎల్లలు లేనిది. అప్పటి సుగంధ ద్రవ్యాలు, సౌందర్య పోషణకు ఋతువును, సమయాన్ని బట్టి ఉపయోగించే పదార్థాలు, వాటి ఔషధ సుగుణాలు, రకరకాలు దుస్తులు, రంగు రంగుల దుస్తులు, అనేక విధాలయిన ఆభరణాలు, ఆ ఆభరణాల ఆకారాలు, వాటిలోపాదుగబడే నవరత్నాలు, శరీరం మీద, మనస్సు మీద ఆ నవరత్న ఖచిత ఆభూషణాల ప్రభావం, నవరత్నాలతో గ్రహాలకు గల సంబంధం-ఇవన్నీ కథకుడు చెప్పగలిగి వుండేవాడు. కథ అడుగు దూరం సాగేది కాదు- అయినా శ్రోతల ఆసక్తి అలాగే నిలిచి వుండేది. రాజకుమార్తె లేదా, ఇంకెవరైనా కథానాయిక తనప్రియుణ్ని కలుసుకోవటానికి చెలికత్తెల సహాయంతో రాత్రి తొలిజామున ప్రారంభించిన అలంకరణ పూర్తి అయ్యేవరకు కోడికూసేది. శ్రోతలు ఆవలిస్తూ తమతమ ఇళ్లకు వెళ్లిపోయే వాళ్లు. నగరాల్లోనే కాదు-గ్రామాల్లోనూ జానపద గాథలు ఈలాగేకొన్నిరాత్రులు, కొన్ని పగల్లు సాగిసాగి చివరికి కంచికిపోయేది. శ్రోతలు ఇళ్లకు పోయేవాళ్లు. కథలన్నీ దేవుని దయవలన సుఖాంతమయ్యేవి. మంచి జయించేది. చెడు నశించేది. "ఈ విధంగా వాళ్లంతా అన్ని కష్టాలు అధిగమించి చిరకాలం సుఖంగా జీవించినారు- దేవుడు మనందరిని ఈలాగే సుఖంగా జీవింపజేయాలె" అనే శుభాకాంక్షతో కథలన్నీ ముగిసేవి.

ఈ కథల ప్రధాన లక్ష్యం శ్రోతలకు ఆనందం కలిగించటమే అయినా మానవతా విలువలు, సామాజిక విలువలు శ్రోతలకు తెలియజేయబడేవి. మానవ హితాన్ని, మానవ సామాజికహితాన్ని ఆకాంక్షించని కథ ఏ భాషలోనూ, ఏ ప్రాంతం లోనూ వుండేది కాదు.

ఉర్దూ నవలకు మార్గదర్శక మయింది ఇంగ్లీషు నవల. భారతీయ భాషలన్నిటికి ప్రేరణ ఇంగ్లీషు నవలే. నవల శ్రోతలకు పఠితలకుఆహ్లాదం కలగించటానికి ఉద్దేశింపబడింది కాదు. దీనికొక స్పష్టమైన లక్ష్యం వుంటుంది. దీని పరిధి దాస్తాన్ల వలెదీర్ఘం కాదు. అట్లని మరీ క్లుప్తమూ కాదు. ఇందలి పాత్రలు సజీవమైనవి. ఏదో ఒక సమస్య నవలకు కారణం. ఆ సమస్యకు ప్రతిస్పందిచే పాత్రలు మనోభావాల చిత్రణ చాకచక్యంగా, సహజంగా జరుగాలె. కథా కథన పద్ధతి పఠనీయంగా వుండాలె.

నవల క్యాన్వాసు పెద్దది. కథల క్యాన్వాసు చిన్నది. నవలా రచయితలే సాధారణంగా కథా రచన చేసినారు. అయినా కొందరు నవలా రచనలో సిద్ధ హస్తులు. కొందరుకథా రచనలో సిద్ధ హస్తులుకాబట్టి నవలా రచయితలను ఒక వ్యాసంలోను కతా రచయితలను ఇంకో వ్యాసంలోను పరిచయం చేసినాను. ఉర్దూలో నవలను నావిల్ అన్నారు. కథను అఫ్సానా అన్నారు.

ఇప్పుడు నవలా రచయితలను గురించి మాట్లాడుకుందాం.

ఉర్దూలో మొట్టమొదటి నవల డిప్యూటీ నజీర్ అహ్మద్ రాసినాడని నిస్సంశయంగా చెప్పవచ్చు. మధ్యమ వర్గానికి చెందిన ముస్లిముల కుటుంబ సమస్యలేఅతని నవలలకు ఇతి వృత్తం. నజీర్ అహ్మద్ ఇంగ్లీషు చదివిన వాడే. కాని అతని నవలల మీద ఏఇంగ్లీషు నవలా రచయిత ప్రభావం కనిపించదు. అతని నవలల్లో అన్ని లక్షణాలు సమగ్రంగా లేవని కొందరు విమర్శకులన్నారు. కాని మొదటి ప్రయత్నంలో అన్ని లక్షణాలు ఆశించటం న్యాయం కాదు.

ఇంగ్లీషు నవలలు బాగా చదివి వాటిలోకొన్నింటిని మనదేశం, మన సమాజానికి అనువుగా మార్చి రాసిన వమొదటి నవలా రచయిత పండిత్ రతన్ నాథ్సర్షార్- అతని నవలల్లో అన్నిటి కంటేప్రఖ్యాతమయింది 'ఫసానయే-ఆజాద్'. నవాబీ పతనమైనా ఆదర్శాన్ని వీడని లఖ్నో సంపన్నుల జీవితాన్ని తన సజీవమైన లఖ్నో వ్యావహారిక భాషలో, హాస్యరస ప్రధానంగా చిత్రించినాడు. అతని పాత్రలన్నీ మన కళ్ల ముందు తిరుగాడుతున్నట్లు, మాట్లాడుతున్నట్లు ఆ బాస కలుగుతుంది.

అలనాటి లఖ్నో ప్రజాజీవనం మనకళ్లముందు సాక్షాత్కరిస్తుంది. అతని పాత్రాల్లో మియాఖోజ్ ఎన్నటికీ మరువలేని పాత్ర. అందులో ఏలాంటి లక్ష్యం లేదు కనుక, ఏలాంటి సంస్కారభావం లేదు కనుక, ఏలాంటి సమస్యలేదు కనుక అది నవల కాదని కొందరి విమర్శ. ఇంగ్లీషులో అలా దృశ్యాలను చూసే Plctusesque Novels నవలలని అంటారు. ఆ దృష్టితో సర్షార్ నవలలన్నీ నవలలన దగినవే.

ఇంగ్లీషు నవలల వలన ప్రభావితుడై రాసిన ఇంకో రచయిత అబ్దుల్ హలీమ్ షరర్. అతని నవలలు చాలా వరకు ముస్లిముల చరిత్రకు వాళ్ల విజయాలకు సంబంధించినవి. బంకింబాబు నవల దుర్గేశ నందినిని కూడ అతడు ఉర్దూలో అనువదించినాడు.

'అవధ్ పంచ్' పత్రిక సంపాదకుడు మున్షీ సజ్జాద్ హుసేన్ ఆ పత్రిక హాస్యరస పోషణకు, వ్యంగ్యరచనలకు ఉద్దేశించబడింది. సజ్జాద్ హుసేన్ నవలలు నవ్వించేవే కాని పేలవమైనవి. అతని పత్రిక ద్వారా గొప్పగొప్ప రచయితలు సాహిత్య జగత్తుకు పరిచయమైనారు.

ఆకాలంలో మిర్జారుస్వా మంచి నవలా రచయిత. ఉమ్రావ్‌జాన్‌అదా, షరీఫ్ జాదా, జాతె-షరీఫ్ అనే అతని నవలలన్నిటిలో ఉమ్రావ్‌జాన్ అదా అమరకృతి. ఒకవేశ్య చేత ఆమె కథ చెప్పించినాడు రుస్వా. అప్పటి లఖ్నోచరిత్ర అంతా ఆ నవల నేపథ్యంలో చిత్రించబడింది. ఉమ్రావ్‌జాన్ మనోభావాలను చాల కళాత్మకంగా ప్రదర్శించినాడు. ఉర్దూలో మనోభావాలు చిత్రణ గల మొదటి నవల అదే. ఆ నవల ద్వారా రుస్వా సమాజానికి ఏమి చెప్పదలచినాడో కాని శిల్పదృష్టితో ఆ నవల విశిష్టమైంది.

ఖాజీ సర్ఫరాజ్ హుస్సేన్ కూడ అతని లాగే వేశ్యల జీవితాన్ని చిత్రించే ప్రయత్నం చేసినాడు. కాని రుస్వా స్థాయికి చేరుకోలేకపోయినాడు. అతడు ప్రచారకుడుగానే వుండి పోయినాడు.

శాశ్వత విలువలు గల ఉర్దూ నవలలు రాసిన గొప్పరచయిత మున్షీ ప్రేమ్‌చంద్. అతని నవలలు, కథలు ఉర్దూ హిందీ రెండు భాషల్లోనూ అచ్చయినవి. మొదట్లో అతడు ఉర్దూలో రాసి తానే వాటిని హిందీలో అనువదించుకునేవాడు. తర్వాతి కాలంలో హిందీలోనే అధికంగా రాసి ఉర్దూలో అనువదించేవాడు. క్రీ.శ. 1890వ సంవత్సరాన బనారస్ సమీపంలోని ఒకచిన్న పల్లెటూరిలలో సామాన్య కాయస్థ కుటుంబాన జన్మించిన ప్రేమ్‌చంద్ పెద్ద చదువులు చదువలేక

పోయినాడు. ఉర్దూ ఫారసీ భాషల్లో ఎంట్రెన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణుడై ఉపాధ్యాయ వృత్తిని అవలంబించినాడు. తర్వాత ప్రైవేట్‌గా బి.ఎ. పరీక్షలో ఉత్తీర్ణుడై "డిప్యూటి ఇన్స్పెక్టర్ ఆఫ్‌స్కూల్స్'గా ప్రమోషన్ పొందినాడు. ఇరవైయేళ్ళు ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి గాంధీజీ వ్యక్తిత్వం వలనప్రభావితుడై ఉద్యోగానికి రాజీనామా చేసినాడు. శేషజీవితం రచనలకే వినియోగించు కున్నాడు. అతని అసలు పేరు ధన్‌పత్‌రాయ్. ప్రభుత్వోద్యోగి కనుక, రాసేవి ప్రభుత్వానికి అనుకూలమైన రచనలు కావు గనుక తొలుత నవాబ్ రాయ్ పేరుతోనూ, తర్వాత ప్రేమ్‌చంద్ పేరుతోనూ రాసేవాడు. ప్రేమ్‌చంద్ అనేపేరే స్థిరపడింది. అతని మొదటి కథా సంగ్రహం 'సోజె వతన్'ను ఆంగ్ల ప్రభుత్వం నిషేధించటమేకాక అతని కళ్ల ముందరే 'సోజ వతన్ ప్రతులన్నీ కుప్పవోసి తగుల బెట్టించింది. అందువలన అతడుమారు పేర్లతో రాయవలసి వచ్చింది.

సర్ అబ్దుల్ ఖాదర్‌నడిపే 'మక్జన్' అనే పత్రికలో ప్రేమ్‌చంద్ 1907 ప్రాంతాన తన వమొదటి కథ 'దున్యాకా సబ్ సే అన్‌మోల్ రతన్' ను ప్రచురింప జేసినాడు. తర్వాత అనేకపత్రికలకు రాసిరాసి తానే'హంస' అనేపత్రికను స్థాపించి, ఒక ముద్రాయంత్రాన్నికొని, తనరచనలన్నీ తన పత్రి ద్వారానే ప్రచురింపజేసినాడు. కొన్ని రోజులు సినిమాలకు రాసినాడుకాని ఆ పరిశ్రమలో నిలువ లేకపోయినాడు. యాభైయారేళ్లు జీవించిన ప్రేమ్‌చంద్ బ్రతికినంతకాలం అనారోగ్యంతోను, దారిద్ర్యంతోను, బాధపడ్డాడు కాని తన రచనా వ్యాసంగానికి ఎన్నడూ అంతరాయం కలిగించని కార్యశూరుడు. అతడురాసిన నవలలు, కథలే అతని శక్తికి మించినవి. అంతేకాక బంకిం శరత్ లాంటి బెంగాలీ రచయితల నవలలను కూడా అనువ దించినాడు.

తనకంటే ముందటి నవలా రచయితల కంటే ప్రేమ్‌చంద్ వంద సంవత్సరాలుముందు నడిచినాడని అజీజ్ హమిద్ చేసిన వ్యాఖ్యా అతిశయోక్తికాదు. అతడు పల్లెటూరిలో పుట్టిపెరిగినాడు. చిన్న ఉద్యోగం చేసినాడు. కనుక పల్లెటూరి రైతుల, కూలీల కష్టజీవితం అతనికి పరిచితమయింది. అలాగే జమీందారుల దౌర్జన్యం, వడ్డీ వ్యాపారుల రాక్షసత్వం, మతం పేర, దేవుని పేర అమాయక ప్రజలను దోచుకునే పూజారుల, మహంతుల కపట జీవితం అన్నీ అతని అనుభవంలో వున్నవే. ఆంగ్లప్రభుత్వ దమననీతి అతడు స్వయంగా అనుభవం ద్వారా గ్రహించిందే. అతని నవలలకు, కథలకు ఇవన్నీ ముడిసరుకు. రచనాకళలో ప్రవీణుడు కనుక అతని అన్ని రచనలు గొప్పవే.

అతని నవలలో ముఖ్యమైనవి, బాజారె హుస్న్, బేవా, నిర్మలా, గబన్, చౌగానె-హస్తీ, (హిందీ రంగ భూమి) మైదానె-అమల్(హిందీ కర్మభూమి) గొదాన్. అతని నవలలు సుమారు పన్నెండు. 'బాజారె-హుస్న్' తర్వాత 'సేవాసదన్' అనే పేర హిందీలో అనూదితమయింది. అతని నవలలన్నీ ఏదృష్టితో చూచినా గొప్పవే అయినా 'గొదాన్' అన్నిటికంటె గొప్పదని విమర్శకుల అభిప్రాయం.

మున్షీప్రేమ్‌చంద్ క్రీ.శ. 1930వ సంవత్సరాన దివంగతుడైనాడు. ఆ సంవత్సరమే జరిగిన 'అంజుమన్ తరక్కీ పసంద్ ముసన్నిఫీన్' ప్రథమ వార్షిక సభకు అతడు అధ్యక్షత వహించినాడు. అతడు తన జీవిత కాలంలో రాసిందంతా అంజుమన్ తరక్కీ పసంద్ ముసన్నిఫీన్‌కు చెందిన కవులూ, రచయితలూ రాయాలనుకున్నదే. "అతడుతన కాలానికి ఒకశతాబ్ది ముందుండేవాడు" అని ఒక విమర్శకుడు చేసిన వ్యాఖ్యను గుర్తుచేసుకోండి.

"అంజుమన్ తరక్కీ పసంద్ ముసన్నిఫీన్" రూపకల్పన లండన్‌లో జరిగింది. రూపకల్పన చేసిన ముఖ్యుల్లో సజ్జాద్ జహీర్ ఒకడు. అతడు "లండన్ కీ ఏక్ రాత్" అనే నవలిక రాసి దాని ముందు మాటలో "భారత దేశంలోని పీడిత తాడిత జనుల సమస్యలను గురించి లండన్‌లో కూర్చుండి రాయటం కంటే వాళ్ళ మధ్య కూర్చుండి రాయటమే మేలైన పద్ధతి" అని రాసుకున్నాడు. ప్రేమ్‌చంద్ ఆ పనే చేసినాడు. ఆ కాలంలో భారత దేశమంటే అవిభక్త భారత దేశమనే గ్రహించాలి.

అభ్యుదయవాదం, విప్లవవాదం ఈలాంటి మరికొన్ని వాదాలు ఒక ఉర్దూ సాహిత్యంలోనే ప్రవేశించలేదు. ఆ కాలంలో ఇంచుమించు అన్ని భారతీయ భాషల్లో ఈ వాదాలన్నీ ప్రవేశించినవి. మరాఠీలో కేశవసుత్ అభ్యుదయ వాదానికి చెందిన కవే.

ఏ క్రొత్తగా వినిపించే వాదాన్ని స్వీకరించినా అది అభ్యుదయ భావమే అని భావించినారు అప్పటి కవులూ, రచయితలూ- ఆ వాదాన్ని కళాత్మక శిల్పనైపుణి ద్వారా తమ రచనల్లో ప్రదర్శించిన వాళ్లు కొందరే. తదితరులు ప్రచార నినాదాలనే కళగా భ్రాంతి పడ్డారు. సజ్జాద్ హైదర్ మంచి రచయితే కాని మార్క్సిజాన్ని, సోషలిజాన్ని మాటిమాటికి వల్లించే ఘట్టాలు పేలవంగా వుంటాయి. సజ్జాద్ హైదర్, మరికొందరు కలిసి రాసి ప్రచురించిన 'అంగారే' అనే కథల సంగ్రహాన్ని గురించి తర్వాతి వ్యాసంలో మాట్లాడుకుందాం.

అజీజ్ అహ్మద్ తొలినాళ్ల రచనలు ఇంగ్లీషులోని రొమాంటిక్ రచనల పేలవమైన అనుకరణలు. ఆ మాట అతడే ఒప్పుకున్నాడు. 'గురేజ్' అనే అతని నవలలో రచనా శిల్పం పరిణతమయింది. ఆగ్, ఐసీ బులందీ ఐసీ పస్తీ, షబ్నన్ అనే మూడు ప్రసిద్ధ నవలలు రాసి అజీజ్ అహ్మద్ విదేశాలకు వెళ్ళి అక్కడే స్థిరపడ్డాడు. అజీజ్ అహ్మద్ తరానికి చెందిన రచయితలు రచయిత్రులు ప్రాయెడ్ మనో వైజ్ఞానిక విశ్లేషణ పట్ల ఆకర్షితులైన వాళ్లు. మానవ జీవితంలో సహజమైనవి, బలవత్తరమైనవి కామ వాంఛలే అనే సిద్ధాంతాన్ని వీళ్లు గట్టిగా పట్టుకున్నారు. అజీజ్ అహ్మద్ నవలల్లో ముఖ్యంగా చెప్పబడిన ఇతివృత్తమిదే. అయితే, పాత్రల మనో భావాల చిత్రణ మనోహరంగా చేయగలిగినాడు కనుక అతని నవలలు ప్రసిద్ధాలయినవి.

అజీజ్ అహ్మద్ కంటే అధికంగా కీర్తినో అపకీర్తినో సంపాదించిన రచయిత్రి ఇస్మత్ చొగ్తాయి. భాషా ప్రయోగంలో ఆమె ప్రదర్శించిన నైపుణ్యం అనితర సాధ్యం. పాత్రల స్వభావశీలాల, మనోభావాల చిత్రణ కూడా ఆమె సహజ సుందరంగా చేస్తుంది. ఆవమె నవలలే కాక అనేక కథలు కూడా రాసింది. ఆవమె ఏలాటి భావాలనైనా నిర్భయంగా, జంకుగొంకు లేకుండా వ్యక్తపరిచేది. ఆమె ఉన్నత విద్యా వంతురాలు కనుక ఇంగ్లీషులోని గొప్ప గ్రంథాలు చాలా చదివి వుంటుంది. కాని తన రచనలను గురించి 'నేను నా రచనల కోసం జీవితమనే ఉద్గ్రంథాన్ని చదివి ఎంత ఆకర్షకమో, ఎంత ప్రభావవంతమో గ్రహించి నాను" అని రాసుకున్నది. ఆ వాక్యాలు చదివిన ఒక విమర్శకుడు (డా. అబుల్‌లైస్ సిద్దీఖీ) ఇలా స్పందించినాడు; "జీవితమనే ఉద్గ్రంథంలో అనేక పుటలున్నాయి. కాని ఇస్మత్ దృష్టి సాధారణంగా సెక్స్‌ను గురించి వర్ణించిన పుటల మీదనే నిలుస్తుంది."

ఆమె నవలల్లో టేఢీ లఖీర్ నిస్సంశయంగా గొప్పది. జిద్దీ అనే నవలను సినిమాగా తీసినారు. మాసూమా, రుస్వాయీ అనేవి కూడా మంచి నవలలే.

ఉర్దూ రచయితల్లో ప్రేమ్‌చంద్ తర్వాత దాదాపు అంతటి కీర్తికి పాత్రుడైన రచయిత క్రిషన్ చందర్. అతని భాష కడు రమ్యం. పాత్ర పోషణ సజీవం. కథా కథన శిల్పం కళాత్మకం. క్రిషన్ చందర్ ఎన్నో కథలేగాక దాదాపు ముప్ఫయి నవలలు రాసినాడు. మొదటి నవల షికస్త్. కాశ్మీరి గ్రామ్య జీవన వర్ణన వాస్తవికంగా అందంగా చేసినా డందులో క్రిషన్ చందర్ మానవతా వాది. దమననీతి విరోధి. జబ్ ఖేత్ జాగే అనే నవల తెలంగాణా రైతాంగ పోరాటానికి సంబంధించిన ఇతివృత్తం కలది. చివరి చివరికి అతడు సినిమాలకు కథలు రాసినాడు.

ఇంత విరివిగా రాసినందు వలన క్రిషన్ చందర్ నవలలన్నీ ఒకే స్థాయికి చెందినవి కావు. అతని వాక్యాలు అందమైనవే. పదునైనవే. కాని కథా కథన శిల్పం పట్ల అన్ని నవలల్లోనూ ఒకే తీరు శ్రద్ధ చూపే అవకాశం అతనికి లభించ లేదు. చివరి నవలలు సినిమాల కొరకు రాసిన నవలల స్థాయికి దిగజారి నవి. అతని సుప్రసిద్ధ నవలల్లో 'ఏక్ గధేకి సర్ గుజిష్త్, 'గధేకీ వాపసీ', 'ఏక్ గధా నీషామే', 'పాంచ్ లోఫర్' మొదలైనవి.

సెక్స్ విషయంలో క్రిషన్ చందర్ అభిప్రాయాలు చాలా స్పష్టమైనవి. "ప్రపంచంలో స్త్రీ పురుషులున్నంత కాలం సెక్స్‌కు సంబంధించిన రచనలు జరుగుతూనే ఉంటాయి. ఈ ప్రభావం నుంచి తప్పించుకోవటం మృతులకు, ఆత్మహత్య చేసుకునే వాళ్ళకు, నపుంసకులకు మాత్రమే సాధ్యం' అంటాడు.

ఒక విమర్శకుడిలా అంటాడు ' ఈ వాదం క్రొత్తదేమీ కాదు. ప్రపంచంలోని గద్యపద్య సాహిత్యాల్లో సెక్స్ ఏదో విధంగా ఆది నుంచి ప్రాధాన్యం పొందుతూనే వున్నది. బరితెగించి రాయటమే వాస్తవికత అని భావించే వాళ్లు స్నానాల గదిలో చేసే పనిని నడి బజారులో చేస్తే తప్పా? అని నిలదీస్తున్నారు. తప్పని ఎవ రంటారు?" ప్రేమ్‌చంద్ క్రిషన్ చందర్‌కంటే ఎన్నోరెట్లు నిజాయితీగల రచయిత. ఉన్నతుడు.

క్రిషన్ చందర్ కంటే అధిక నవలలు రాసిన రచయిత ఎమ్.అస్లమ్. అతనికి ముస్లిముల పట్ల, ఇస్లాం పట్ల అభిమానం జాస్తి. ఈ భావాలతో నవలలు రాసే ఇంకో రచయిత నసీమ్ హిజాజీ.

డాక్టర్ అహసన్ ఫారూఖీ ఆంగ్ల సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేసిన విద్వాంసుడు. అతని నవలల్లో ఆంగ్ల రచనల ప్రభావం, నాటకీయత గోచరిస్తాయి. లఖ్నో గత సంస్కారాన్ని సజీవంగా ప్రదర్శించిన అతని 'షామె అవధ్' అనే నవల చాలా ప్రసిద్ధమైంది.

ఖదీజా మస్తూర్ కూడా లఖ్నో జీవితాన్ని గురించి 'ఆంగన్' అనే అందమైన నవల రాసింది.

ముమ్తాజ్ మఫ్తీ నవలలు, కథలు యాభైయేళ్ల నుంచి ప్రచురించబడుతూ ప్రజాదరణ పొందుతున్నవి. మున్షీ ఫయ్యాజ్ అహ్మద్ రాసిన 'షమీమ్', 'అన్వర్' అనే రెండు పెద్ద నవలలను ఎన్నివేల మంది ఎంతటి ఆసక్తితో చదివినారో చెప్పటం కష్టం. ఇంకా కొందరు మంచి నవలా రచయితలున్నారు. అందరినీ స్మరించటం సాధ్యం కాదు.

ఉర్దూ నవలా సాహిత్యానికి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహించిన ఖురతుల్ ఐన్ హైదర్ ప్రస్తావనతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. అంతకు ముందు ఇస్మత్ చొగ్తాయి అన్నగారైన మిర్జా అజీమ్ బేగ్ చొగ్తాయిని గురించి కొన్ని మాటలు మాట్లాడుకోవటం అవసరమనుకుంటాను. అతడు న్యాయవాద వృత్తి చేస్తూ అప్పట్లో చికిత్సలేని క్షయవ్యాధి గ్రస్తుడైనాడు. తాను నవ్వలేకున్నా ఇతరులను నవ్వించే ఉద్దేశంతో నవలలూ, కథలూ రాస్తూ మంచనా పడి వుండేవాడు. అతని రచనలు మొత్తం ఇరవై అచ్చయినవి. కొన్ని నవలలు- కొన్ని కథా సంగ్రహాలు. అతని నవలల్లో చెప్పుకోదగిన ఇతివృత్తం వుండదు. సమస్యలుండవు. మధ్యమ వర్గీయ ముస్లిమ్ కుటుంబాల ముచ్చట్లు హాస్య ధోరణిలో హాయిగా చదువుకునేట్లు చెప్తాడు. 'షరీర్ బీబీ', 'కోల్తార్', 'ఖానమ్', 'చమ్కీ', 'జన్నత్ కాభూత్' మొదలయినవి ప్రజాదరణ పొందిన అతని నవలలు. అతడు మరణించినప్పుడు అతని సోదరి ఇస్మత్ చొగ్తాయి 'దోజఖీ' అనే కథ రాసింది. ఆ కథ ఉర్దూ సాహిత్యంలో నిలిచి పోగల కథల్లో ఒకటి.

ఖురతుల్ ఐన్ హైదర్ తండ్రి సజ్జాద్ హైదర్ యల్దుర్మ్ కొంతకాలం తుర్కీలో వున్నాడు. ఇతర పాశ్చాత్య దేశాలనుకూడా పర్యటించినాడు. వాళ్లింట్లో మొదటి నుంచి సాహిత్యమే కాక సంగీతం మొదలైన కళలున్నట్లున్నాయి. ఉన్నత కుటుంబం. పెద్ద సోసాయిటీలో మసలిన వాళ్లు. సజ్జాద్ హైదర్ యల్దుర్మ్ ఉర్దూ కథా రచయితల్లో మొదటి తరానికి చెందినవాడు. అతడు కొన్ని తర్కీ భాష కథలనే గాక ఇతర భాషల కథలు కూడా అనువదించినాడు. అతని సొంత కథల గురించి తర్వాతి వ్యాసంలో రాస్తాను. ఖురతుల్ ఐన్ హైదర్ కుటుంబ జీవితాన్ని గురించి పైన కొన్ని మాటలు ఊహించి రాసినాను. అందుకు కారణం ఆవమె రచించిన నవలల్లోగాని, కథల్లోగాని దిగువ మధ్యతరగతికి చెందిన పాత్రలు, సామాన్యులు కనిపించరు. లఖ్నో తాలుక్దార్ల, రయీసుల పాశ్చాత్య నాగరికతతో కూడిన విలాసమయ జీవితం కనిపిస్తుంది. క్లబ్బులు, బాల్‌రూమ్ డ్యాన్సులు- ఇలాటి సామాన్య పాఠకుని అనుభవంలో లేని అంశాలే అధికంగా కనిపిస్తాయి. అట్లని కేవలం సంపన్నుల, నవ నాగరికుల విలాసమయ జీవితాన్నే చిత్రించటం ఆమె ధ్యేయమని భావించరాదు. ఆ వాతావరణంలోనూ ఆమె మానవతా విలువలను, సామాజిక సమస్యలను గూఢంగా, కళాత్మకంగా వెల్లడిస్తుంది. ఆమె భాష అతి సుందరమైంది. దేశ విభజన కలిగించిన అపారమైన దుఃఖానికి స్పందించని సహృదయ రచయితలెవరుంటారు? "మేరేభీ- సనమ్‌ఖానే" అనే నవలలో ఖురతుల్ ఐన్ హైదర్ అప్పటి హృదయ విదారకమైన దృశ్యాలను

తనదైన కళాత్మక శైలిలో ప్రదర్శించింది. ఆ యితివృత్తం మీద రామానంద్‌సాగర్ రాసిన "ఔర్ ఇన్సాన్ మర్‌గయా" అనే నవల పాఠకులను ఏడిపిస్తుంది.

"సఫీనయె గమెదిల్" 'సితారోంసె ఆగే" "షీషేకాఘర్" "పత్‌ఝున్ కీ అవాజ్" ఆమెకు పేరు తెచ్చిన ఇతర రచనలు. తన జీవితానుభవాలను దేశ చరిత్ర నేపథ్యంలో 'కారే జహాఁ దరాజ్‌హై" అనే పెద్ద గ్రంథంగా రచించిందామె.

◆ ◆ ◆

ఉర్దూ కథ

ఉర్దూ నవల వలెనే ఉర్దూ కథ కూడ ఇంగ్లీషు నుంచి వచ్చిందే. ఫ్రెంచి, రష్యా కథల శిల్పం కూడ ఉర్దూలోకి వచ్చింది కాని ఇంగ్లీషులోంచే వచ్చింది. ఇరువయ్యో శతాబబ్ది ప్రారంభంలోనే ఉర్దూలో కథా రచన ప్రారంభమయిందని చెప్పవచ్చు. ఇరవయవ శతాబ్ది ప్రసక్తి వచ్చింది. కనుక ఇక్కడొక ముఖ్యమైన విషయం గుర్తుకు వస్తున్నది. ఉర్దూలో ఖుష్తర్ గ్రామీ అనే పెద్ద మనిషి 'బీసివీఁ సదీ' (ఇరవయవ శతాబ్దం) అన పత్రికను చాలాకాలం తానే నిర్వహించినాడు. అదింకా నడుస్తున్న పత్రిక. ఆ పత్రిక కథలకోసమే ఉద్దేశింపబడింది. మంచికథలను మాత్రమే అతడు తన పత్రికలో వేసుకునేవాడు. నిన్నమొన్నటి వరకు, నేటివరకూ సుప్రసిద్ధ కథా రచయితలు, రచయిత్రులు ఎందరు వెలసినారో వాళ్లలో అధిక శాతం బీసివీ సదీ పత్రిక ద్వారా సాహిత్య జగత్తులో స్థానం సంపాదించిన వాళ్లే.

నవలా రచనకు కథారచనకు భేదమున్న దన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆ భేదం నిడివిలో, విస్తృతిలోనే కాక టెక్నిక్‌లోనూ వున్నది. కథ రాసే టెక్నిక్ నవలకు ఉపకరించదు. నవల క్యాన్వాస్ చాల పెద్దది. కాలవ్యవధి పెద్దది. పాత్రలూ సమస్యలూ, సన్నివేశాలు చాలా వుంటాయి. ఆ సమస్యల్లోంచి, సన్నివేశాల్లోంచి ఏదో ఒకదాన్ని రచయిత తన దృక్కోణంతో చూచి మన ముందుంచినా, విశ్లేషించి పరిష్కారమార్గం చూపినా అది కథ అవుతుంది. కథలో కాలవ్యవధి తక్కువ- పాత్రల సంఖ్య తక్కువ- సమస్యలు తక్కువ- అందువలన, మంచికథ రాయగలిగిన వాళ్లు మంచి నవల రాయగలరని ఆశించటం, మంచి నవల రాయగలిగిన వాళ్ళు మంచి కథ రాయగలరని ఆశించటం సబబు కాదు- ఒక నవలకు సరిపడిన ఇతివృత్తాన్ని ఒక కథలో కుదించి రాసే ప్రయత్నం చేస్తే

అది కుదురదు. అలాగే ఒక కథకు సరిపడే ఇతివృత్తాన్ని పెంచి పొడిగించి నవలగా రాస్తే అది నీరసంగా తయారవుతుంది.

మనమిప్పుడు సవ్యసాచి వలె కథా రచనలోనూ, నవలా రచనలోనూ సమానప్రజ్ఞ కనబరచిన కొందరు కథా రచయితలను, రచయిత్రులను గురించి మాట్లాడుకుందాం.

ఉర్దూ కథా రచయితగా కూడ మున్షీ ప్రేమ్‌చంద్ అగ్రగణ్యుడు. అతని వమొదటి కథా సంగ్రహం 'సోజె-వతన్', 'ప్రేమ్ పచ్చీసీ' 'ప్రేమ్ బత్తీసీ' ప్రేమ్ చాలీసీ' ' వరదాన్ ' జాదె రాహ్' ఖ్వాబొ-ఖ్యాల్' ఖాకె పర్వానా' ఆఖరీ తొహఫా' దేహాత్‌కే అఫ్సానే' దూధ్‌కీ ఖీమత్'. అతని ఇతర కథా సంగ్రహాలు. ప్రేమచంద్ తన కథల్లో ఎన్నడూ ప్రచారకుడు కాదు- అతడు రచనాకళలో నిపుణుడు.

ప్రేమ్‌చంద్ లాగే రాసిన పండిత్ సుదర్శన్ పల్లెటూళ్ల కంటే పట్టణాల్లో నివసించే మధ్యమ వర్గపు హిందువుల కౌటుంబిక సమస్యలను తన కథలకు ఇతివృత్తాలుగా ఎన్నుకున్నాడు. అలీ అబ్బాస్ హుసేనీ, ఆజమ్ కరేవీ, ఉపేంద్రనాథ్ అష్క్ ప్రేమ్‌చంద్ అనుయాయులు- ప్రేమ్‌చంద్ కథలలాగే అతని అనుయా యుల కథలు హిందీలోను అచ్చయినవి.

సజ్జాద్ హైదర్ యల్దుర్మ్, నియాజ్ ఫతెహ్‌పూరీ, సుల్తాన్ హైదర్ జోష్, హిజాబ్ ఇమ్తియాజ్‌లు మొదట తరానికి చెందిన రొమాంటిక్ కథలు రాసినవాళ్లు- లలిత సుందరమైన భాష, మనోహరమైన ప్రణయ వాతావరణం- ఈ రచయితలు పఠితలను మరో లోకానికి తీసుకెళ్తారు. అయితే, వీళ్లు కాలక్షేపం కోసం రాసిన వాళ్లనుకోగూడదు. ఏదో ఉద్దేశంతోనే రాసినారు. ఆవుద్దేశం మానవతకు, సమాజానికి అత్యంతావశ్యకమయింది. నియాజ్ ఫతెహ్‌పూరీ బహుముఖ ప్రజ్ఞాశాలి. పత్రికా సంపాదకుడు. సాహిత్య విమర్శకుడు. నాటక రచయిత- హేతువాది- మతం పట్ల ఆసక్తి లేనివాడు (ఇదొక లక్షణమే గాని ప్రజ్ఞ కాదు) హిజాబ్ ఇమ్తియాజలీ తొలుత హిజాబ్ ఇస్మాయిల్ పేర రాసేది. చాలా ఉత్తమ రచయిత్రి. ఈమె పరిచయం రాసినందుకే డాక్టర్ వృత్తిలో వున్న ఒక కథా రచయిత సాహిత్య జగత్తులో ప్రముఖ స్థానాన్ని పొందినాడంటారు. ఆమె ప్రతిష్ఠ ఎంతటిదో ఈ ఒక్క నిదర్శనంతో గ్రహించవచ్చు. సుల్తాన్ హైదర్ జోష్ కథలకు ఒక ఉద్దేశం వున్నది. ఒక వాస్తవికత వున్నది. మృదువైన హాస్యం వున్నది. కటువైన వ్యంగ్యం వున్నది. సందర్భానికి తగిన చక్కని పదజాలం వున్నది. అతని ఉద్దేశ్యం ఎక్కడా వ్యక్తం కాదు- అది అసాధారణమైన కళ.

ఉర్దూ కథల సందర్భంలో ప్రత్యేకంగా పేర్కొన దగిన కథా సంగ్రహం 'అంగారే'. అందులో పది కథలున్నవి. ఐదు సజ్జాద్ హైదర్ రాసినవి. రెండు డా. రషీద్ జహా రాసినవి. రెండు అహ్మదలీ రాసినవి. ఒకటి మహమూదుజ్జఫర్ రాసింది. ఆ కథా సంగ్రహం సభ్య సమాజం మీద బాంబు వలె పేలింది. ప్రభుత్వం దాన్ని వెంటనే నిషేధించింది. మత విశ్వాసాలను, ధార్మిక భావనలను, సామాజిక కట్టుబాట్లను నిర్దాక్షిణ్యంగా దుయ్యబట్టినవారు రచయితలు. కుళ్లిపోయిన సామాజిక శరీరం మీద అందమైన తెరగట్ట బడింది. ఆ తెరను తొలగించి, సమాజానికి దిగంబరంగా ప్రదర్శించాలన్నదే 'అంగారే' రచయితల ఉద్దేశం. అంగారే నిషేధింపబడినా దాని ఉద్దేశం నెరవేరింది. తర్వాత రాసే వాళ్లకు అలా రాసే సాహసం కలిగింది. వాస్తవికంగా అధివాస్తవికంగా రాయదలచుకున్నప్పుడు శ్లీలత, అశ్లీలత అనే వివక్ష వుండగూడదని ఆ రచయితల అభిప్రాయం. ఆ కథల్లో శిల్పాన్ని అన్వేషించటం అనవసర పరిశ్రమ. మాస్కోలో మరణించిన డా.రషీద్ జహా స్త్రీవాద రచయిత్రుల్లో ప్రథమ శ్రేణి రచయిత్రి. ఆమె రచనలన్నీ 'ఔరత్' అనే పేర సంకలన రూపంలో అచ్చయినవి.

క్రిషన్ చంద్ర గురించి ఇదివరకే తెలుసుకున్నాము. అతని కథా సంగ్రహాల్లో 'నజారే', 'జిందగీకే మోడ్ పర్', 'టూటే హువే తారే', అన్నదాత, 'తీన్ గుండే', 'సముందర్ దూర్‌హై', మై ఇంతెజార్ కరూంగా, అజంతాసే ఆగే, హమ్ వహెషీ హైఁ అనేవి ప్రఖ్యాతమైనవి.

ఇస్మత్ చొగ్తాయి కథా సంగ్రహాల్లో 'కలియాఁ' చోటేఁ' 'ఏక్‌బాత్, 'ఛూయీమూయి' మిక్కిలి ప్రసిద్ధమైనవి.

సాదత్ హసన్ మంటో కథలు చాల వరకు స్త్రీల సమస్యలకు సంబంధించినవే. అతని కథా కథన నైపుణ్యం అద్భుతమైనది. 'మంటూ కే అఫ్సానే' లజ్జతె-సంగ్,నమ్రూద్ కీ ఖుదాయి, ఖాలీ డిబ్బే- ఖాలీ బోతల్, ఠండా గోష్త్, సియాహ్ హాషియే, చొగద్, సడక్ కే కినారే, అతని సువిఖ్యాత కథా సంగ్రహాల్లో కొన్ని. అతనికి మానవులంతా సమానమే. దేశవిభజన అతన్ని చాల క్రుంగదీసింది. చచ్చేంతవరకు 15వ ఆగస్టును అతడు విభజన దినమనే అన్నాడు కాని స్వాతంత్ర్య దినమనలేదు.

రాజేంద్రసింగ్ బేదీ గొప్ప రచయిత. 'దానావ దామ్', 'గ్రహణ్',కోఖ్‌జలీ, అనేవి అతని కథా సంగ్రహాలు. 'ఏక్‌చాదర్ మైలీసీ' అనే నవలను తానే సినిమాగా తీసి నష్టపోయినాడు.

ఖ్వాజా అహ్మద్ అబ్బాస్ జగమెరిగిన రచయిత. పత్రికా విలేఖరి. 'ఏక్ లడ్కీ, జాఫ్రాన్ కేఫూల్, మై కోన్‌హూ, కహ్తే హై జిస్కు ఇష్క్' అనే అతని కథా సంకలనాలు ప్రసిద్ధమైనవి.

అహ్మద్ నదీమ్ ఖాస్మీ, ముమ్తాజ్ మఫ్తీ, హయాతుల్లా అన్సారీ మంచి కథా రచయితలు. ఖదీజా మస్తూర్, హాజ్రా మస్రూర్ మంచి కథా రచయిత్రులు. ఇబ్రాహీమ్ జలీస్, రజియా సజ్జాద్ జహీర్ పేర్లు విస్మరించదగినవి కావు. ఖాజీ అబ్దుల్ గఫార్ పత్రికాధిపతిగా శక్తివంతమైన వచన రచయితగా ప్రఖ్యాతుడు. 'లైలా కే ఖుతూత్' అనే పేర ఉత్తరాల రూపంలో ఒక వేశ్య కథ రాసినాడు. అది రుస్వా రచన స్థాయికి చేరలేదు కాని అందలి భాష చదివించగలది.

హైదరాబాదుకు చెందిన జీలానీ బానూ ఉర్దూ సాహిత్య జగత్తులో బాగా పేరున్న రచయిత్రి.

◆ ◆ ◆

ఉర్దూ సాహిత్యంలో వివిధ ప్రక్రియలు

ఉర్దూలో నాటకాలు చెప్పుకోదగినన్ని లేవు. లఖ్నో చివరి నవాబు షుజావుద్దౌలా సాహిత్య కళాపోషకుడు. అఖ్తర్ కలం పేరుతో చాల కవితలు రాసినాడు. చాల వరకు అచ్చయినవి. అఖ్తర్ పియా అనే ముద్రతో ఎన్నో ఠుమ్రీలు రాసినాడు. వాటిని ఇప్పటికీ ప్రఖ్యాత గాయనీ గాయకులు గానం చేస్తారు. భైరవీ రాగంలో 'బాబుల్ వమోరా నైహర్ ఛూటో హిజాయె' అనే ఠుమ్రీనీ ఉస్తాద్ ఫయ్యాజ్ ఖాన్, కె. యల్. సైగల్ పాడినారు. ఆ రికార్డులు ఇప్పుడు విన్నా సంగీత రసికుల తనువు పులకరిస్తుంది. అతని ఆస్థానాన్ని ఆశ్రయించి ఎందరో కవులు, గాయనీగాయకులు, నాట్యకత్తెలు, నాట్యకాళ్లు ఉండేవాళ్లు. విలాస జీవితం గడిపినాడతడు. అతని ఖైసర్‌బాగ్ (రాజసౌధం)లో ఎప్పుడు ఏదో ఉత్సవం జరుగుతూనేవుండేది. హిందూ ముసల్మానులు అన్ని ఉత్సవాల్లో పాల్గొనే వాళ్లు- అతడు రహస్ (రాసలీల) నిర్వహించేవాడు. తానే కృష్ణ పాత్ర పోషించేవాడు? ఆ రహస్‌నే ప్రజలందరు చూచి ఆనందించటానికి పురాణ కథల (హిందూ ఈరాన్ అరబ్ పురాణ కథలు) ఒక గొప్ప నాటకం రాయించి, పలుతడవలు ప్రదర్శింపజేసి

నాడు. దాని పేరు ఇంద్రసభ- రచయిత అమానత్. అమానత్ గొప్ప రచయితే కాని ప్రభువుల, ప్రజల అభిరుచికి అనుకూలమైన నాటకమే రాసినాడు. నాటకం నిండా నాట్యమూ సంగీతమే. పాత్ర పోషణ పట్లగాని కథా కల్పన పట్లగాని ప్రత్యేక శ్రద్ధ చూపలేదతడు.

ఆ తరువాత వెలువడిన నాటకాలు ఆస్థాయికి చెందినవి కాకున్నా ఆపద్ధతిలో రాసినవే.

షేక్స్పియర్ నాటకాలను మనదేశం వాతావరణానికి, ప్రజాభిరుచికి అనుకూలంగ ఇతివృత్తాన్ని కొంతమార్చి పాత్రల పేర్లు మార్చి రాసిన మహారచయిత ఆగా హషర్ కాశ్మీరీ. అతని సహచరులు కొందరు నాటకానువాదాలు చేసినారు. ఆగాహషర్ వ్యక్తిత్వం సాహిత్యంలో సమున్నతమయింది. అతనికి ఫారసీ, ఉర్దూ, ఇంగ్లీషు, సంస్కృతం, బ్రజ భాషల్లో ఎంతటి పాండిత్యం వుండేదో! భరతుని నాట్యశాస్త్రం, సంస్కృత నాటకాలు చదివినవాడు- చక్కని కవిత్వం రాయగల వాడు. అతని డైలాగ్ రచన అద్భుతమైంది. మొదట్లో సొహరాబ్ మోదీ (మినర్వా మూవీటోన్) తీసిన సికందర్, పృథ్వీవల్లభ్ లాంటి సినిమాల డైలాగులు ఆగాహషర్ ప్రభావం గలవే, కానైతే ఆరెండు సినిమాలకు కథ, డైలాగులు రాసినవాళ్లు ప్రఖ్యాత రచయితలే.

ఆగాహషర్ గ్రీక్, అరబ్; ఈరాన్, హిందూ పురాణ కథలను, నాటకాలుగా మలిచినాడు. బిల్వమంగళ్, సీతాబనవాస్, భీష్మప్రతిజ్ఞ- మొదలయిన హిందూ పౌరాణిక నాటకాలు రంగస్థలం మీద కాకున్నా చదివి ఆనందించవచ్చు- అయితే, అంత గొప్ప రచయిత కూడా ఆల్ఫ్రెడ్ కంపెనీ (పారసీ నాటక కంపెనీ)కి చెందిన వాడు కనుక సామాన్య దర్శకుల (నిజానికి నాటకాల పోషకులు వాళ్లే) మనోరంజనం కోసం నాటక లక్షణాల ప్రకారం కాక దర్శకుల మెప్పు పొందేట్లుగానే రాసినాడు.

ఉర్దూలో సాహిత్య విలువలతో రాయబడిననాటకం ఒక్కటే. ఇమ్తియాజలీ తాజ్ రాసిన అనార్కలీ నాటకం.

ప్రేమ్‌చంద్, క్రిషన్ చంద్, మంటో, బేదీ మొదలయిన అభ్యుదయ వాద రచయితలు సామాజిక నాటకాలూ నాటికలూ రాసినారు.

ప్రొఫెసర్ రషీదహమద్ సిద్దీఖీ గొప్ప సాహిత్య విమర్శకుడు. అతని ప్రతి వాక్యం ప్రమాణమైంది. శబ్దం సుందరమైంది. కొన్ని పేజీల్లో చెప్పవలసిన విషయాన్ని

ఒక్కవాక్యంలో చెప్పగల సామర్థ్య మతనిది. అతని వ్యాసాల్లోనూ, విమర్శలోనూ లలిత మధురమైన వ్యంగ్య హాస్య ధోరణి కనిపిస్తుంది. కన్హయ్యాలాల్ కపూర్ షౌకత్ థాన్వీ, మిర్జా అజీమ్ బేగ్ బొగ్తాయి, పత్రస్ బొఖారీ, ఫికర్ తోన్స్వీ హాస్య రచయితలుగా ప్రసిద్ధి వడసినవాళ్లు- తన హాస్య రచనల వలన, వాటి అనువాదాల వలన ప్రపంచంలోని సభ్యదేశాల్లో పేరుగాంచిన ముజ్తబా హుస్సేన్ ఉర్దూ సియాసత్ పత్రిక ఉపసంపాదకుడుగా పని చేసిన మహబూబ్ హుసేన్ జిగర్ తమ్ముడు. ఇంతకు ముందు నవలల సందర్భంలో ప్రస్తావించుకున్న ఇబ్రాహీమ్ జలీస్ కూడ జిగర్‌గారి తమ్ముడే.

పత్రికలు నడుపుతూ సాహిత్య వ్యాసాలు, సాహిత్య సవమీక్షలు రాసిన కొందరిని గురించి తెలుసుకున్నాము. అల్ హిలాల్, అల్ బిలాగ్ అనే రెండు పత్రికలు నడిపిన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గురించి చెప్పవలసిన అవసరం లేదు. అతని ఎరుగని వాళ్లెవరు? పవిత్ర ఖుర్‌ఆన్ కతడు టీకా సహిత వ్యాఖ్యానం రాసినాడు. అతని భాషలో అరబీ ఫారసీ పదాలధికంగా వున్నా శైలి మనోహరమైంది. 'అబుల్ కలామ్ గద్యం చదివిన తర్వాత హస్రత్ పద్యం నిస్సారమనిపిస్తున్నది." అన్నాడు గజల్ కవుల్లో ప్రముఖుడైన హస్రత్ మోహానీ, నియాజ్ ఫతెహ్‌పూరీ, అబ్దుల్ మాజిద్ దర్యాబాదీ మంచి విమర్శకులు- అబ్దుల్ మాజిద్ తొలుత నాస్తికుడు. తర్వాత పరమ ఆస్తికుడైనాడు. ఉర్దూ సమీక్షలు, విమర్శలు రాసిన ప్రొఫెసర్లు అనేకులు- కాని విషయం పరిమితమైంది కనుక అంతా రాసినదే రాసినారంటే ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు. చాలమంది ఇంగ్లాండులో భాషా సాహిత్య పద్ధతులు నేర్చుకొని వచ్చిన వాళ్లు. కలీముద్దీన్ అహ్మద్ ఉర్దూ గజల్లేగాక ఉర్దూ సాహిత్యం మొత్తానికి మొత్తం నిస్సారం నీరసం అని కటువుగా విమర్శించినాడు.

డా. అబ్దుల్ ఖాదర్ జోర్ దక్కనీ సాహిత్యాన్ని వెలికతీసి విలువైన విమర్శ చేసినాడు. అతడూ లండన్‌లో చదివి వచ్చినవాడే- ప్రొ. రఫియా సుల్తానా, డా. జీనత్ సాజిదా, ప్రొ.సయ్యదా జాఫర్, జోర్ మార్గదర్శకత్వంలో మంచి విమర్శ గ్రంథాలు రాసినారు. నాసిరుద్దీన్ హాష్మీ దక్షిణ దేశాల్లో ఉర్దూ భాషా సాహిత్యాల గురించి రాసినాడు. అబ్దుల్ ఖాదర్ సర్వరీ, డా. అబ్దుల్లా, సులేమాన్ నద్వీ, ఆల్ అహ్మద్ సురూర్, మజ్నూ గోరఖ్‌పూరీ, ప్రొ. షహబాజ్, వహీదుద్దీన్ సలీమ్, గాలిబ్ అభిమాని డా. అబ్దుల్ రహమాన్ బిజ్‌నోరీ (అతడు జర్మనీలో చదివి వచ్చినాడు. గాలిబును గెటేతో పోల్చినాడు) డా. ఇబాదత్ బరేల్వీ, అఖ్తర్ రాయ్

పూరీ ప్రఖ్యాత సాహిత్య విమర్శకుల్లో కొందరు ప్రా.ఏజాజ్ హుసేన్, ప్రా. ఎహతెషామ్ హుస్సేన్ పేర్లు కూడా ప్రత్యేకంగా పేర్కొనదగినవి. ఇటీవల షమ్సుల్ రహమాన్ పారూఖీ నాల్గు సంపుటాల్లో (ఏడు వేల అయిదువందల పుటలు) ప్రచురించిన 'షేర్ షోరంగేజ్' అనే విమర్శ గ్రంథానికి మూడు లక్షల రూపాయల సరస్వతీ అవార్డు లభించింది.

చివరికి తన జీవితమంతా 'అంజుమనె తరక్కీ ఉర్దూ' ద్వారా ఉర్దూ భాషాభివృద్ధికి కోసమే అంకితం చేసిన ఒక మహావ్యక్తి అబ్దుల్ హఖ్‌ను స్మరించు కోవటం అవసరం. అతన్ని 'బాబాయె ఉర్దూ' అంటారు.

◆ ◆ ◆

మిర్జా గాలిబు గజళ్ల అందాలు

ఈ వ్యాస పరంపరకు ఈ శీర్షిక ఎందుకుంచినానంటే మొత్తం గజళ్లను ఎత్తిరాసి వ్యాఖ్యానించటం సాధ్యంకాదు. మీర్ తఖీమీర్ తర్వాత ఉర్దూ గజల్ కవుల్లో ద్వితీయుడైన మహాకవి మిర్జాగాలిబు గజళ్లలోని కొన్ని అందమైన షేర్లను ఎత్తిరాసి భావం వివరిస్తాను. ఎవరైనా అలాగే చేస్తారు. కీ.శే. దాశరథి గారు మిర్జా గాలిబు షేర్లు కొన్ని ఎంపిక చేసి, వాటిని కవితలో అనువదించి, తెలుగు సారస్వత ప్రియులకు గాలిబు గజళ్లతో చక్కని పరిచయం కలిగించినారు. నేను మొదటి నుంచి, అంటే యాభైయేళ్ల నుంచి, ఉర్దూ షేర్లకు వచనంలోనే అర్థం చెప్తున్నాను. అప్పుడప్పుడు పద్యానువాదం కూడా చేసినాను కాని గజళ్ల పద్యానువాదం నాలాంటి వానికి సాధ్యం కాదని మానుకున్నాను.

దేఖ్నా తఖ్రీర్ కి లజ్జత్‌కె జో ఉస్నే కహా
మైనె యే జానాకె గోయా యేభీ మేరే దిల్‌మెహై

ఇది మిర్జా గాలిబు షేర్- "ఆమె మాటలాడే విశిష్టశైలిని గమనించండి- ఆమె నా మనసులోని భావాలనే తన మాటల్లో చెప్పినట్లున్నది" అని భావం. ఏకవి కవిత్వమైనా సహృదయ పాఠకుని హృదయ భావాలతో సంవదించినట్లుంటే కలిగే ఆనందం వర్ణనా తీతం.ఉర్దూ మహాకవుల షేర్లు చాలవరకిలాగే వుంటాయి. కనుక ఉర్దూ చదువుకున్న వాళ్లు ఏ రంగంలో వున్నా సందర్భానికి సరిపడే షేర్లు వాళ్లనోళ్ల నుంచి అప్రయత్నంగా వెలువడుతాయి. మా తరం వాళ్లకు ఉర్దూ

నేర్పిన మోల్వీ సాహెబులు ఉర్దూ గజల్లపట్ల, షేర్ల పట్ల అంతటి మక్కువ కలిగించినారు.

దాదాపు యాభైయ్యేళ్ల క్రిందటి ముచ్చట చెప్పాలనుకుంటున్నాను.

సంవత్సరం 1962. నెల యేదో గుర్తులేదు. నేనొక ఆఫీసులో ఆఫీసు మేనేజర్‌తో మాట్లాడుతూ కూర్చున్నాను. అతడు ముస్లిమ్- ఉర్దూ మీడియంలో చదువుకున్న వ్యక్తి. నా వయస్సే అనుకుంటాను. అతని ముందర మేము షేరొ-షాయిరీ చర్చ లేవనెత్తితే పాల్గొనేవాడు కాడు. మౌనంగా ఫైల్లు రాసుకుంటూ కూర్చుండేవాడు. అతనికి సాహిత్యంలో ఆసక్తిలేదని, సాహిత్యపరిచయం లేదని నిర్ణయించుకున్నాము. అది చిన్నవూరు. మా నలుగురైదు గురి మిత్రమండలిలో అతడొకడు. అతని ఆఫీసులో అతనితో మాట్లాడుతూ కూర్చున్నప్పుడే పోస్ట్‌మ్యాన్ వచ్చి ఆఫీసు పోస్టుతో పాటు నా పేర వచ్చిన ఆ నెల భారతి పత్రిక యిచ్చినాడు. అందులో నేను చేసిన కొన్ని ఉర్దూ షేర్ల పద్యానువాదం పడింది. ఒక మిత్రుడు నలుగురు వినేట్లు నా అనువాదాన్ని పైకే చదివి వినిపిస్తున్నాడు. మేనేజరు పోస్టు చూచుకుంటున్నాడు. అస్గర్ గోండ్వీ షేర్ అనువాదం వినగానే చేతిలోని కాగితాలు టేబిల్ మీద పడేసి, "వాహ్! క్యా బాత్‌హై!" అని దాని మూలమైన ఉర్దూ షేర్ వినిపించినాడు మేనేజర్. భారతిలో నా అనువాదమే వున్నది కాని మూలమైన ఉర్దూ షేర్లు లేవు- ఉర్దూ షేరొషాయిరీలలో అభిరుచి లేదని మేమనుకునే మేనేజర్ నోట అస్గర్ గోండ్వీషేర్ వినగానే మాకు ఆశ్చర్యం కలుగటం సహజమే. మీర్, గాలిబ్,దాగ్, ఎక్బాల్, హస్రత్ మోహానీ,జిగర్ మురాదాబాదీ, ఫానీబదాయూనీ లాంటి కవుల షేర్లు కంఠస్థం చేసుకుంటారు సాధారణంగా. అస్గర్ గోండ్వీ షేర్లు ఎవరి నోటా వినలేదు. అతడు గొప్పకవే. అతని కవిత రాశిలో తక్కువయినా వాసిలో మిన్న. జిగర్ ఆధ్యాత్మిక గురువైన ఆ మహాకవి కవిత సూఫీ వేదాంత విలసితం. మేనేజర్ గారు చదివిన షేర్ ఇది;

రుఖే- రోషన్ పె మోజేఁహైఁ తబస్సుమ్-హాయె-పిన్హాఁ కీ

షువాయేఁ క్యాపడీఁ రంగత్ నిఖర్ ఆయీ గులిస్తాఁ కీ

నిస్సందేహంగా ఇది ఉర్దూషేర్లలోని అందమైన షేర్లలో ఒకటి.

"ప్రేయసి వదనం కాంతివంతమయింది. ఎందుకో ఆమె మందహాసాన్ని లోలోనే దాచుకునే ప్రయత్నం చేస్తున్నది. మందహాస రుచులామె వదనం మీద అలల్లాగా పొరాడుతున్నాయి. ప్రాభాత కిరణాలు సోకగానే పుష్పవాటికలోని పుష్పాల

వికాసం అతిశయించింది" అని దీని భావం- నా పద్యానుభావం గుర్తు లేదు. అది కుదిరి ఉండదు. నేను చెప్పదలచుకున్న విషయమేమంటే అందమైన గజల్ షేర్లు ఉర్దూ వచ్చిన సామాన్యులకు సైతం గుర్తుంటాయి. ఆ అల్లిక (బందిష్) అలావుంటుంది. ఆ శబ్ద ప్రయోగమలా వుంటుంది. ఆ భావ మలా వుంటుంది.

ఇంకొక ముచ్చట చెప్పి షేర్ల ఎంపిక ప్రారంభిస్తాను. ఎంపిక ముఖ్యమైంది. గాలిబే అన్నాడు;

ఖుల్తా కిసీపె క్యోం మెరే దిల్ కా ము ఆమిలా

షేరోం కె ఇంతెఖాబ్ నె రుస్వా కియా ముఝె

ప్రేమ వ్యవహారాలు రహస్యంగా ఉండవలసినవి. బైట బడితే బద్నామి. దాన్నే రుస్వాయీ అంటారు. "నా మనసులోని ప్రేమ ఇతరులకెలా తెలిసేది? షేర్ల ఎంపిక నన్ను రుస్వా చేసింది" అంటున్నాడు కవి.

నేనుచెప్పాలనుకున్న ఇంకొక ముచ్చట;

ఈ ముచ్చట 1980 వ సంవత్సరం నాటిది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాచేత ఏడవ తరగతి తెలుగు వాచకం రాయించుకున్నది. (Nationalized Text Book) పదేళ్ల క్రిందట ఐదవ తరగతి తెలుగు వాచకం రాయించుకున్నారు. ఏడవ తరగతి తెలుగు వాచకానికి సంపాదకులుగా ఆచార్య తూమాటి దొణప్పగారిని నియమించినారు. వారప్పుడు నాగార్జున యూనివర్శిటీలో రిజిస్ట్రారుగా వుండిరి. 4,5,6,7 తరగతుల పాఠ్య పుస్తకాలన్నీ రాయించే బాధ్యత Direcor School education గారిది. వారి ఆఫీసులో ఒక మహిళ Secretary, Text Book Commmittee. ఆమె ఆధ్వర్యంలో ఏ పుస్తకం ఎలా రాయాలనే చర్చ కొన్ని రోజులు జరిగేది. ఆ చర్చలో పాల్గొనేవాళ్లు రచయితలు, సంపాదకులు, ఆర్టిస్టులు, S.C.E.R.T కి సంబంధించిన విద్యావేత్తలు. నా పుస్తకంలో తిక్కన పరిచయం చేస్తూ ఒక పాఠం రాసి, తిక్కన భారతంలోని నాడీజంఘుని కథను ఇంకో పాఠంలో రాసినాను. మా ఆర్టిస్టు తిక్కన చిత్రపటాన్ని గీసి తెచ్చినాడు. చిత్రం బాగానే వున్నది కాని తిక్కనకు సన్నని మీసాలు దిద్దినాడు. "సోమయాజికి మీసాలేమిటి?" అని కోప్పడ్డారు దొణప్పగారు. "తెలుగు అకాడమీలోనో, కళా భవన్‌లోనో తిక్కన ఊహాచిత్రపటం వుంటుంది. దాన్నిచూచి మళ్లీ చిత్రం గీసి తెమ్మ"ని పంపినారు. ఆ ఆర్టిస్టు తన కళలో ప్రవీణుడే కాని అమాయకుడు. ఉర్దూ అకాడమీకో ఇంకెక్కడికో వెళ్లి మిర్జాగాలిబు చిత్రపటం తెచ్చినాడు. (గీటురాయిలో పడిన

చిత్రపటమే) దొణప్పగారికది బాగా నచ్చింది. "సదాశివగారూ! తిక్కన మీసాలు తీయిద్దాముగాని ఈ పటం బాగున్నది. గాలిబును గురించి కూడ ఒక పాఠం రాయండి" అన్నారు. "ఏడవ తరగతి పిల్లల వయస్సెంత? వాళ్ల అవగాహన ఎంత? తెలుగు కవుల గురించి వాళ్ల కర్థమయ్యేట్లు రాయటమే కష్టం. పర భాషల కవుల గురించి రాయటం నా చేతకాని పని" అన్నాను.

దొణప్పగారు వదిలిపెట్టలేదు. "ఎట్లయినా రాయవలసిందే" అని పట్టుపట్టినారు. "నేను రాయలేను" అని మనవి చేసినాను. మర్నాడు సెక్రెటరీకి చెప్పినారు; "మేడమ్! ఈ వాచకంలో మిర్జాగాలిబు గురించి ఒక పాఠం రాయ వలసిందిగా సదాశివగారికి చెప్తున్నాను. వారు నా మాట వినటం లేదు. మీరు చెప్తే వింటారేమో-"అని. పట్టుచీర, తల నిండా కనకాంబరాలు-ఇంగ్లీషు తప్ప ఇంకేమాట మాట్లాడే వారు కాదామె. తమిళ ప్రాంతానికో, దాని పరిసర ప్రాంతాలకో చెందిన మహిళ అనుకున్నాను. "దొణప్పగారూ! రచయితకు గాలిబు గురించి తెలియక పోవచ్చు- తెలియని కవిని గురించి ఎలా రాస్తాడు? బలవంతపెట్టకండి" అన్నారామె. "కాదు మేడమ్! ఇన్నాళ్లు వీరు రాసిన వ్యాసాలు, పుస్తకాలు ఫారసీ ఉర్దూ కవుల గురించినవే. 1969వ సంవత్సరాన గాలిబు శత జయంతిని పురస్కరించుకొని గాలిబు గురించి భారతిలో కొన్ని వ్యాసాలు రాసినారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వాళ్ల కోరిక మీద "మీర్జాగాలిబు జీవిత చరిత్ర" రాసి యిచ్చినారు. ఆ సంవత్సరమే అచ్చయింది" అని చెప్పినారు దొణప్పగారు. "ఇంకేమి? సదాశివగారూ! ప్రొఫెసర్‌గారి మాట వినండి" అన్నారామె. "అమ్మా! స్కూలు విద్య గురించి ఈ ప్రొఫెసర్లకు తెలియదు. మీరు D.E.O.గా పని చేసినారు గనుక మీకు తెలుసు. ఏడవ తరగతి చదివే విద్యార్థి వయసు, అవగాహనశక్తి గుర్తించి రాయాలె గదా- కవితనయితే అనువదించలేము. ఈ పాఠాల ద్వారా పిల్లలకు తెలుగు భాషా జ్ఞానం కలిగించటం మన లక్ష్యం గదా. పాఠాలయినా నీతి బోధకాలయిన కథలు, ఆదర్శప్రాయులైన వాళ్ల జీవిత కథలు కావాలె. మిర్జాగాలిబు జీవితంలో పిల్లలకు చెప్పవలసిందేమి వున్నదండీ. త్రాగుబోతు, జూదగాడు, జైల్ జీవితం గడిపినవాడు; అతని జీవితంలో పిల్లల బాగుకోసం చెప్పే అంశమేమున్నది?" అన్నాను. సెక్రెటరీ గారికి ఆవేశం వచ్చింది. "మిర్జాగాలిబు వంటి మహాకవి జీవిత మలావుంచండి. అతని కవితలో ఏసందేశం లేదా? అది తెలుసుకోవలసిన అవసరం లేదా? కడమ కవులంతా కడిగిన ముత్యాలా?" అంటూ మిర్జా గాలిబు షేర్లు చదువ సాగినారు. మధ్యమధ్య, "చెప్పండి- ఈ కవితలో ఏమీ లేదా?" అని ప్రశ్నిస్తూ గజల్లకు గజల్లు వినిపించి

నారు. గాలిబు ఫారసీ షేర్లు కూడా స్వచ్ఛమైన ఉచ్ఛారణతో చదవినారు. ఆశ్చర్యం! ఆనందం! "అమ్మా! మీకు ఉర్దూ రాదేమో అనుకున్నాను. గాలిబు కవిత కంఠో పాఠం చేసినట్లున్నారు" అన్నాను. "మా గురువులలా చెప్పినారు సదా శివగారూ! అదొక నల్లమందు- ఈ పనికి మాలిన భాషా సాహిత్యాలు పట్టుకొని వదలి పెట్టటం లేదు- తీరిక సమయాల్లో ఉర్దూ కవులను చదువుతాను" అన్నారామె. చివరికి తేలిందేమంటే ఆమెకు ఉర్దూ నేర్పిన గురువులే నాకు నేర్పినారు. "యె జుబాన్ కామ్‌కీహైన నామ్ కీ" అని ఆనాడే అన్నారామె. ఇరవయ్యేళ్ల తర్వాత గీటురాయి పాఠకుడొకడు, "పనికి మాలిన కవితతో మనకేమి పని?" అని లేఖ రాసిన తర్వాత యాభైయేళ్లుగా ఈ పనికి మాలిన భాషా సాహిత్యాలను పట్టుకొని పాకులాడు తున్నందుకు పశ్చాత్తాపపడుతున్నాను. "ఈ సాహిత్యం అక్కరకు వచ్చేది కాదు. కీర్తి తెచ్చేది కాదు. అయినా ఆపేక్ష కొద్ది చదివి నాలో నేను ఆనందిస్తాను." అని ఇరవయ్యేళ్ల క్రిందట అన్న డా. సరొజా ఆచార్య ఇప్పుడెక్కడున్నారో కాని ఆమె ఆవేదనలోని అర్థం గ్రహించివుంటే ఇరవయ్యేళ్ల క్రిందటే ఈ పనికి మాలిన వ్యాసంగాన్ని వదిలి పెట్టివుందును.

మిర్జాగాలిబు ప్రేమను ఉపాసించిన కవి. తసవ్వుఫ్ ఈ ప్రేమకొక పార్శ్వమే. అతడు సూఫీల జీవితం గడుపలేదు. అతనిలోని ప్రేమ తత్వమే అతని కవితకు సూఫీయిజం రంగు పూసింది. ప్రేమ యెలాంటిది? అదొక అగ్ని. అంటిస్తే అంటుకోదు. ఆర్పటం సాధ్యం కాదు.

"ఇష్క్‌పర్ జోర్ నహీ హై యె వొ ఆతిష్ గాలిబ్!!
జో లగాయే నలగే ఔర్ బుఝాయే నబనే"

అణు వణువునా పరమాత్మనే దర్శించే సూఫీ యోగికి స్వపర భేదాలుండవు.

"జల్లాద్ సె డర్తేహైం న వాయెజ్ సె ఝుగడ్తే
హమ్ సమేయి హువే హైం ఉసే జిస్ భేష్‌మే ఆయే"

"మరణశిక్ష విధించినప్పుడు తల నరుకటానికి వచ్చే జల్లాద్‌కు భయడను. పవిత్ర జీవనం కోసం హితబోధ చేసే ఉపదేశకునితో వాదుపెట్టుకోను- "అతడు" ఏ వేషంలో వచ్చినా గుర్తిస్తాను."

కష్టాలు అనుభవించిన గాలిబే ఈ క్రింది షేర్లు చెప్పగలడు. అతని జీవితమంతా కష్టాల్లోనే గడిచింది. అనుభవంలో అలవడిన సూఫీవేదాంతం సహనం నేర్పింది.

రంజ్ సే ఖూగర్ హువా ఇన్సాఁ తో మిట్ జాతాహై రంజ్

ముష్కిలేఁ ఇత్నీ పడీఁ ముఝ్‌పర్ కె ఆసాఁ హోగయీఁ

"మనిషి బాధల కలవాటుపడితే ఏదీ బాధ అనిపించదు- నా మీద ఎన్ని కష్టాలు విరుచుకపడ్డాయంటే ఇప్పుడేదీ కష్టమనిపించదు."

ఇన్ ఆబ్లోంసే పాంవ్ కె ఘబ్రాగయాథా మై

దిల్ ఖుష్ హువాహై రాహ్‌కు పుర్ ఖార్ దేఖ్ కర్

"ప్రియాణ్వేషణలో నడిచీ నడిచీ కాళ్లు బొబ్బలెక్కినవి. ముందెలా నడువాలె అని భయపడ్డాను. ముందు తోవలో పరుచుకున్న ముండ్లను చూచి సంతోషించినాను."

ఇది ఆలోచించ దగిన షేర్- దీని బందిష్ గూడా బిగువుగా వున్నది. శైలి సుందరం- ఇంకా వివరించాలనే ఉత్సాహం లేదు- ఆసక్తిగల పాఠకులు అర్థం చేసుకుంటారు. "ఈ పనికి మాలిన కవిత మన కెందుకు?" అనే బాబతు పాఠకులు పరిహరిస్తారు.

మనిషికి తన జీవితం మీద ఎంతటి అధికారమున్నది? మనిషి మజ్బూరీని ఇంతకంటే పటువుగా చెప్పిన పద్యాలు నా కంట పడలేదు. మీర్ తఖీమీర్, ఫానీ బదాయూనీలు మానవుని నిస్సహాయతను గురించి చెప్పినారు కాని అది "జబరో-ఎఖ్తియార్" సమస్యకు చెందినమాట. ఆ సమస్య అన్ని మతాల్లోనూ సమస్యే. గాలిబు ఆ సమస్యను తాకటం లేదు.

రౌమేహై రఖ్షె-ఉమ్ర్ కహాఁ దేఖియే థమే

నై హాథ్ బాగ్ పేహైన పాహై రికాబ్ మే

"జీవితమనే గుర్రం వేగంగా పరుగెడుతున్నది. ఎక్కడ ఆగి పోతుందో తెలియదు. మన పరిస్థితి యెలా వున్నదంటే చేతిలో కళ్లెం లేదు. రికాబు (అంకెం)లో అడుగులేదు."

ఏదీ చెంతలేక పోవటం నిశ్చింతే. ఉంటేనే చింతలన్నీ.

'న లుట్తాదిన్‌కో తో కబ్ రాత్‌కోక్యోం బేఖబర్ సోతా

రహా ఖట్‌కా న చోరీకా దువా దేతాహుఁ రహ్‌జన్‌కో"

వొ ఆయే హమారే ఘర్‌హైఁ ఖుదాకి ఖుద్రత్‌హై

కభీ హమ్ ఉన్‌కో కభీ అప్నె ఘర్ కో దేఖ్తేహైఁ

"వారు నా యింటికి వచ్చినారు. భగవల్లీల. ఒకసారి వారివైపూ, ఒకసారి నాయింటివైపూ చూస్తాను."

ఇది తరుచుగా ఉదాహరింప బడే షేర్. కవి భావమిది. "నా యిల్లు చాల చిన్నది. ఎలాంటి సౌకర్యాలు లేవు. నా యింటి కెన్నడేని రాగలరని ఊహించనంతటి గొప్పవారు వచ్చినారు. వారెక్కడ? నాయిల్లెక్కడ? అని మార్చిమార్చి చూస్తాను."

గాలిబు ప్రేమకవి (షాయరె-ఇష్క్) అనుకున్నాము గదా. అయితే ఈ భావం సరిపోదు. ఉర్దూ కవుల ప్రేమతత్త్వం తెలుసుకోవాలె. వాళ్ల ప్రేయసి అతిలోక సౌందర్యవతి. ఆ సౌందర్యం వర్ణనాతీతం. ఆమెను దూరం నుంచే ప్రేమించే వాళ్లనేకులు. వాళ్లంతా ఒకరికొకరు రఖీబులు. ఈ సంప్రదాయం సంస్కృతాంధ్ర కవులకు లేదు కనుక రఖీబ్ అనే పదానికి సమానార్థకమైన పదం మన భాషల్లోలేదు. రఖీబును గైర్ అని కూడ అంటారు. దాని బహువచనం అగ్యార్.

ప్రేమికుడైన కవికి ఒకరిద్దరు రహస్య మిత్రులుంటారు. వాళ్లకు మాత్రమే కవి ప్రేమ వ్యవహారం తెలుసు. సంస్కృత నాటకాల్లో ఒక నర్మసచివుడుంటాడు. విదూషకుడు.

ఈ దృష్టితో పై షేర్ భావమిలా గ్రహించాలె. ఉర్దూ కవిది విప్రలంబ శృంగారమే. ప్రేయసి మనసు శిల. ఎంతకూ కరుగదు. విరహతాపం భరించలేక ప్రేమికుడు చావుకు దగ్గరవుతాడు. రహస్య మిత్రులు బతిమాలి బామాలి ప్రేయసిని కవి యింటికి తెస్తారు.

"ఆమె నా యింటికి వచ్చింది. ఇది భగవల్లీల. ఆమెవైపు, నాయింటివైపు మార్చిమార్చి చూస్తాను" అని భావం.

రహస్య మిత్రులు బతిమాలి బామాలి ప్రేయసిని మరణోన్ముఖుడైన కవి యింటికి తెస్తారు. ఆమెను చూడగానే కవి ముఖం వికసిస్తుంది. శరీరంలో నూతనోత్సాహం ఆరోగ్యంగానే వున్నాడుగదా" అనుకొని ఆమె పరామర్శించ కుండానే వెళ్లిపోతుంది. ఈ భావం గల షేర్ చూడండి;

"ఉన్కె దేఖేసెజో ఆజాతిహై ముహ్ పర్ రోనఖ్

వో సమర్తెహైం కె బీమార్కా హాల్ అచ్ఛాహై"

రఖీబు గురించి తెలుసుకున్నాము గదా.

"జిక్ర్ ఉస్ పరీవష్కా ఔర్ ఫిర్ బయాన్ అప్నా

హోగయా రఖీబ్ అఖిర్ జోథారాజ్‌దాన్ అప్నా."

ఇది 'మారిఫత్'కు సంబంధించిన షేర్. లౌకికార్థంలో బాగుండదు. భావమేమంటే " అప్సరసల వంటి సౌందర్యరాశి ప్రసక్తి-నా ప్రత్యేక సుందర శైలిలో వర్ణన. వినీవినీ నా రహస్యమిత్రుడు రఖీబయి పోయినాడు." అంటే తానూ ఆమెను ప్రేమించసాగినాడు. సౌందర్యం భగవంతుని విభూతి. అదే శివం-అదే సుందరం - భగవంతున్ని అనేకులు ప్రేమిస్తారు- అందరూ ప్రేమిస్తారు. అందరూ రఖీబులే.

భద్రాచలంలో వుండగా ఈ షేర్ మాటిమాటికి స్మరణకు వచ్చేది. సౌందర్యానికి పరమావధి అయిన రాముని అందాలను నా శైలిలో వర్ణించటం మొదలు పెట్టినాను. నా వర్ణన చదివి కొందరైనా రఖీబులు కాకపోతారా అని. రాముడు హిందువునైన నాకు భగవంతుడు. వాల్మీకి రామాయణంలో రామున్ని భగవంతుడని ఎక్కడా అనలేదు. రామాయణమే కల్పితమని కొందరి అభిప్రాయం-భగవంతునికి పేరు లేదు- అన్ని పేర్లు అతనివే. ఏదో ఒక సంజ్ఞ లేనిదే కుదురదు.

హజ్రత్ అమ్జద్ ఇలా అన్నాడు. ఈ అమ్జద్ నాలాంటి హిందువుకాడు. స్వచ్ఛమైన ముసల్మాన్. సంపూర్ణ విశ్వాసి (మోమిన్) సూఫీ కవి.

రామ్‌కా జిక్ర్ హర్ నామ్‌మేహై

రామ్ సబ్‌మేహై సబ్ రామ్‌మేహై

"అన్ని పేర్లలో రాముని ప్రసక్తి వున్నది. రాముడంతటావున్నాడు. అంతా రామునిలో వున్నది."

ఈ రాముడు దశరథ రాముడు కాడు. అంతటా వ్యాపించిన పరమాత్మ.

"ఏక్ రామ్‌దశరథ్ కాజాయా- ఏక్‌రామ్ ఘట్ ఘట్‌మె సమాయా" అన్నాడు కబీర్. ఒక రాముడు దశరథుని కొడుకు- ఒక రాముడు అంతటా, అన్నిటా నిండివున్నవాడు.

ప్రఖ్యాత గజల్ కవి హస్రత్ మోహానీ కృష్ణున్ని గురించి ఈలాగే రాసినాడు. అతడూ స్వచ్ఛమైన ముస్లిమే. ఆ కాలపు ముల్లాలు పై యిరువురు మహాకవులు కాఫిరులనే ఫత్వా ఇయ్యలేదు.

"సర్వమత సామరస్యం, సర్వమానవ సౌభ్రాతృత్వం మా జమాఅత్ ధ్యేయాలు" అని సెలవిచ్చినారు జమాఅత్ కేంద్రాధ్యక్షుడు. వారికి సంబంధించిన ఒక ఫోరం, ఆదిలాబాద శాఖకు కార్యదర్శిగా నియమించినారు నన్ను. ఆ ధైర్యంతోనే 'గీటురాయి'కి ఈ వ్యాసాలు పంపుతున్నాను. కేవలం 'ఇస్లామీ' పత్రికే అయితే పంపేవాన్నికాను. నేను టీచరును. వాయెజును కాను కాలేను.

ఇప్పటికింతే- వినాలనుకుంటే ఇంకా కొన్ని గాలిబ్ షేర్లు వినిపిస్తాను. మద్యపాన ప్రసక్తి గల షేర్లు మాత్రం వినిపించను. ఉర్దూ కవుల అందమైన షేర్లన్నీ మద్యపాన ప్రసక్తి కలవే. కాని ఏమిచేస్తాం? కొందరు పాఠకుల కవి రుచించవు.

రేడియోలో ఎవరో కవి రచించిన గజల్‌ను ఎవరో గాయకుడు పాడుతున్నాడు. మత్లా ఇలా వున్నది;

చెహరాహై తెరా చాంద్, బదన్ తాజ్ మహెల్‌హై
యే తేరా సరాపాహైకె గాలిబ్‌కి గజల్‌హై

ప్రేయసి సౌందర్య వర్ణన: ముఖం చంద్రబింబం- శరీరం తాజ్‌మహల్. నీయీ నిలువెత్తు సౌందర్యం గాలిబు గజల్."

తన ప్రేయసి సౌందర్యాన్ని గాలిబు గజల్ అంటున్నాడు కవి. అంటే గాలిబు గజల్లు అంత సుందరంగా వుంటాయని కవి భావం. అందుకే గజల్లను గురించి ఎక్కడ రాసినా, గజలంటే ఒక ఛందో విశేషం మాత్రం కాదు. అదొక కల్చర్. ఆ కల్చర్‌తో బాగా పరిచయమున్నవాళ్లే దాని అందాన్ని గ్రహించగలరు. "గజల్‌ను ఉర్దూలోనే విని ఆనందించాలె. అనువాదంలో ఆ అందాలను తేలేము" అని రాస్తూ వుంటాను.

మైనె మజ్నూ పెలడక్ పన్‌మె అసద్!
సంగ్ ఉఠాయాథాకె సర్ యాద్ ఆయా.

అన్నాడు గాలిబు. ఉర్దూ కవి ప్రియ అతిలోక సౌందర్యవతి. అయినా పాషాణ హృదయ, అప్రాప్య, అలభ్య. ప్రియుడు తన ప్రేయసిని పొందటానికి తిరిగి తిరిగి పిచ్చి వాడవుతాడు. వియోగ తాపంలలో కృశించి కృశించి చచ్చి

పోతాడు. అదే సంయోగం (విసాల్). లైలా కోసం తిరిగి తిరిగి ఖైసు మజ్నూ అయినాడు. అంటే పిచ్చివాడయినాడు. పిచ్చివాళ్లను పిల్లలు రాళ్లతో తలకు తగిలేట్లు విసురుతారు. దెబ్బలు తిన్ని పిచ్చివాడు ఏది చేతికి దొరికితే దానితో కొడతాడు. పిల్లలు రెచ్చిపోయి అతని తలకు గురిచూచి రాళ్లు విసురుతారు. ఈ నేపథ్యంలో పైన ఉదాహరించిన గాలిబు షేర్‌ను ఇలా అనువదించవచ్చు. (గాలిబుకే అసద్ అనే ఇంకో కలం పేరుండేది).

"బాల్యంలోనే నేనూ మజ్నూ తలకేసి విసరటానికి రాయి ఎత్తినాను. అంతలో నా తల గుర్తుకు వచ్చింది."

ఉర్దూ కల్చర్, గజల్ కల్చర్ లభించినవాళ్లకు ఈ నేపథ్యం తెలుస్తుంది. కవి యేమంటున్నాడో వెంటనే తెలుస్తుంది. ఆ కల్చర్‌కు దూరంగా వున్నవాళ్లు కవి యేమంటున్నాడో వెంటనే తెలుసుకోలేరనుకుంటాను.

కవి మనకు చెప్పకుండా వదిలిపెట్టిన మాటలివి; బాల్యంలో అందరు బాలురతో పాటు తానూ ఓ పిచ్చివాని తలకు గురిచూచి విసరటానికి నేలమీది రాయి లేపినాడు. అంతలో అనిపించింది; వయసు వచ్చిన తర్వాత తానూ ఏ సుందరాంగినైనా ప్రేమించవచ్చు. లేదా ఏ వయసులోనో భగవంతున్నే ప్రేమించ వచ్చు. ఏ ప్రేమయినా ముదిరితే పిచ్చే- ప్రేయసి దొరికేది కాదు. భగవంతుడు దొరకడు. ఆ అన్వేషణలో పిచ్చివానిలా తిరిగేటప్పుడు బాలురు తన తలనిలాగే రాళ్లు పట్టి కొట్టరా? ఈ భావన రాగానే చేతిలోని రాయి జారిపోయింది. ఖాఫియా రదీఫులు అడ్డం వచ్చినా తాను చెప్పదలచుకున్న భావాన్ని సునాయాసంగా చెప్పినాడు గాలిబు.

ఉర్దూ కవులందరూ విరహవ్యధను, నిద్రలేని విరహ రాత్రులను గురించి చెప్పిన వాళ్లే కాని గాలిబు చెప్పే తీరే వేరు (కహ్తేహైఁ కె గాలిబ్ కాహై అందాజె బయాఁ ఔర్)

ఒక సుప్రసిద్ధ గజల్ మత్లా (తొలి ద్విపద).

యెనథీ హమారి ఖిస్మత్ కె విసాలె యార్ హోతా

అగర్ ఔర్ జీతే రహ్తే యెహీ ఇంతెజార్ హోతా

"నా భాగ్యంలో ప్రియా సమాగమం లేదు- ఇంకా బ్రతికి వుంటే ఈ నిరీక్షణే మిగిలేది."

కహూఁ కిస్ సె మైకె క్యాహై, షబె-గమ్ బురీ బలాహై

ముఝే క్యా బురా థా మర్నా అగర్ ఏక్ బర్ హోతా

"విరహ నిశి ఎంత బాధాకరమైందో ఎవరితో ఏమని చెప్పను?

ఒక్కసారి చచ్చిపోవటం సుఖం (అది తప్పదుగూడ) రోజూ రోజూ ఎంతకని చావాలె?"

మోత్ కా ఏక్ దిన్ మొ-అయ్యన్హై

నీంద్ క్యోం రాత్ భర్ నహీ ఆతీ

"మృత్యువు ఎప్పుడు రావాలో అప్పుడే వస్తుంది. తెల్లవార్లూ నిద్ర రాదెందుకు?" నిద్రయినా రావాలె. చావయినా రావాలె. రెండూరాక పోతే జీవితం దుర్భరం."

గాలిబు ఒకప్పుడు బాగా బ్రతికినవాడు. నవాబు గదా.

ఫలక్ సే హమ్‌కో ఐషే- రఫ్తకా క్యాక్యా తఖాజాహై

ముతాయె-బుర్ద కో సమ్ఝేహు యే హైఁ ఖర్జ్ రహజన్ పర్

అన్నిటికి కారణం ఆకాశమే. గ్రహాలక్కడే తిరుగుతూ మనుషుల భాగ్యాలను మారుస్తూ వుంటాయి. పిడుగులు అక్కడి నుంచే పడుతాయి. మంచి జరిగినా, చెడు జరిగినా కారణం ఆకాశభ్రమణమే (గర్దిషే- ఆస్మాన్) ఇక్కడ కవి అంటున్నదేమంటే, "ధన సమృధితో వైభవంగా గడిపిన కాలాన్ని మళ్లీ ఇమ్మని ఆకాశాన్ని మాటిమాటికీ కోరుతున్నాము- అంటే అపహృత విత్తాన్ని దారిదొంగకిచ్చిన అప్పుగా భావిస్తున్నాము" దోచుకున్న ధనాన్ని ఏ దొంగ అయినా తనకు తానుగా తెచ్చియిస్తాడా?

మృత్యువును, పరలోకాన్ని మరిచిపోయి ఈ జీవితమే శాశ్వతమని, ఈ భోగలాలసతే అవసరమని భావించే వాళ్లకోసం ఈ షేర్;

గఫ్లత్ కఫీలె- ఉమ్ర్ అసద్ఁ జామినే-నిషాత్

అయ్ మర్గెనాగహాఁ తుఝే క్యా ఇంతెజార్హై

జీవితం శాశ్వతమని ప్రమత్తంగా వున్నాము. భోగలాలసతను అవలంబించి నాము. ఓ అపమృత్యువా! ఇంకా దేనికోసం చూస్తున్నావు. రా."

లూఁ దామ్ బఖ్తె-ఖుఫ్త సె ఇక్ ఖ్వాబ్-ఖుష్, వలే

గాలిబ్! యె ఖోఫ్‌హై కె కహాఁ సే అదాకరూఁ?

"గాలిబ్! అదృష్టం (కనపడని భాగ్యం) లోంచి ఒక మధుర స్వప్నాన్ని ఉద్దెర అడిగి తీసుకుందామనుకుంటాను. కాని ఎలా తీర్చగలనని భయపడతాను."

ఇది అతని ఉత్తమమైన షేర్లలో ఒకటి.

కవికి మధురస్వప్నం వచ్చేదెప్పుడు? హాయిగా నిద్రపోతేనే కదా. హాయిగా నిద్రపోవటం అతని భాగ్యంలోనే లేదు. అతని భాగ్యం నిద్రిస్తున్నది. అతనికి నిద్రలేదు. అప్పు తీరేదెట్లా?

ఉర్దూ ఫారసీ గజళ్లలో ఉత్కృష్టమైన షేర్లు మద్యపాన ప్రసక్తి కలవే. గునాహ్ (పాపం) ప్రసక్తి కలవే. గునాహ్ అంటే ప్రేమించదగిన సుందరాంగులను ప్రేమించటం (అది విగ్రహారాధన లాంటిది కనుక పాపం) మద్యపానం (ఇది సాధారణంగా ప్రతీక). ఇవి రెండే పాపాలు. మద్యం ప్రసక్తి వస్తేనే ముక్కు విరిచే పుణ్యాత్ములు కొందరు చదివే పత్రికలో ఎలా రాయగలను? ఉర్దూ తెలిసినటువంటి పవిత్ర జీవితం గడిపే మోల్వీలు సైతం అంతరార్థం గ్రహించి ఆనందించే షేర్లకు ఈ పత్రిక పాఠకులు కొందరు ముక్కు మూసుకుంటారాయె. పాఠకుల్లో ఏ వొక్కరయినా ముక్కు మూసుకుంటే రచయిత నోరుమూసకోవాలనే రచయితలూ హితబోధ చేస్తారాయె- ఎలా రాసేది?

హర్‌చంద్ హో ముషాహిదయే- హఖ్‌కి గుఫ్తగూ

బన్తీ నహీహై బాద- వ- సాగిర్ కహే బగైర్

"ఈశ్వర సౌందర్యాలోకనాభిలాషకు సంబంధించిన మాటలే అయినా మద్యం, పానపాత్ర ప్రసక్తితేక తప్పదు." అన్నాడు గాలిబు.

మద్యం, పానపాత్ర, మధు కలశం, పానశాల-ఇవన్నీ అలామతులే. అంటే ప్రతీకలు.

డా. ఎక్బాల్ ఇస్లామియ జీవితం గడిపిన, ప్రబోధించిన మేధావి గదా? లండన్‌లో చదువుకుంటున్న తన కొడుకు జావీద్‌కు రాసిన పద్యమయ లేఖలో,

ఉఠా న షీష-గరానే-ఫరంగ్ కా ఎహసాన్

సిఫాలె హింద్ సె మీనావ జామ్ పైదాకర్

అని బోధించినాడు. భారతదేశం పట్ల అభిమానంతో రాసిన 'బాంగె-దరా' అనే కవితా సంకలనంలోనిదిది. జావీద్ నామా ప్రత్యేకంగా ప్రచురించబడింది.

షీషగర్ అనే పదానికి వేరే అర్థం కూడ వున్నది కాని ప్రస్తుతం మనం గ్రహించవలసిన అర్థం కాచపాత్రలు తయారుచేసేవాళ్లు. మధు కలశం, పానపాత్ర (చషకం) కాచపాత్రలే.

"కాచపాత్రాలు తయారు చేసే ఇంగ్లీషు వాళ్ల ఉపకారం పొందకు. భారతదేశపు మట్టితోనే నీ కవసరమైన మధుకలశాన్ని, పాన పాత్రను తయారు చేసుకో."

అంటే, డా. ఎక్బాల్ తన కొడుకుకు మద్యమవసరమని ఈ మాట చెప్పినాడా? మీనా, జామ్ అనే మాటలను ఏ అర్థంలో వాడినాడో గ్రహించాలె గదా! గాలిబు ప్రెంచి మద్యం తాగేవాడు కనుక ముక్కుమూసుకుంటిమి. ఎక్బాల్ మాటలకూ ముక్కుమూసుకుందామా?

"రహ్మత్ అగర్ ఖుబూల్ కరే క్యా బయీద్ హై
షర్మిందగీ సె ఉజ్ర్ న కర్నా గునాహ్ కా."

పాపం చేసిన వాళ్లు తమ పాపాన్ని అంగీకరించి అపార కరుణామయుడైన భగవంతుని అనుగ్రహాన్ని అర్థిస్తారు. ఇక్కడ గాలిబు ఆ పని చేయటంలేదు.

"పాపం చేసినానన్న లజ్జతో భగవంతుని ముందు పశ్చాత్తాప పడి అనుగ్రహాన్ని అర్థించలేకపోయినా అతని అపార కరుణ నా మౌన పశ్చాత్తాపాన్ని స్వీకరించవచ్చు- అందులో ఆశ్చర్యమేమి?" అంటున్నాడు.

భగవంతుని అపారకరుణపట్ల అంతటి దృఢ విశ్వాసం కలిగి వుండటం విశ్వాసి లక్షణమే కదా. అతన్ని మనం క్షమించకున్నా భగవంతుడు క్షమించే వుంటాడు. వాయెజ్ (ఉపదేశకుడు) ఎంత నిందించినా, నరకానికి పోతావని, అల్లాహ్ దయకు అర్హుడవుకావని, చెడ్డ వాడవని తిట్టినా బాధపడకూడదన్నాడు గాలిబు;

"గాలిబ్! బురా న మాన్ జొ వాయెజ్ బురా కహే
ఐసాభి కోయిహైకె సబ్ అచ్ఛా కహేఁ జిసే"

గాలిబ్! ఉపదేశకుడు నిందించినందుకు బాధపడకు- అందరి చేతమంచి వాడనిపించుకున్న మనిషి ఎవరైనా వుంటారా?

గాలిబు పట్లా, నా పట్లా జాలివేస్తుంది కాని ఇంకా కొన్ని గాలిబు షేర్లు వినిపిస్తాను. కొందరైనా వినకపోతారా?

మిర్జాగాలిబుకు ఇతర గజల్ కవులకు గల భేదమేమంటే ఇతర కవులు సులభంగా అర్థమయ్యేట్లు చెప్పే భావాలను గాలిబు సంక్లిష్టం చేసి చెప్తాడు. ఇతర కవులు సంక్లిష్టం చేయకుండా చెప్పలేని గంభీర భావాలను చాల సూటిగా సరళశైలిలో చెప్తాడు. అలా చెప్పేటప్పుడతడు మీర్ తఖీమీర్ స్థాయిలో కనిపిస్తాడు.

సాబిత్ హువాహై గర్దనె-మీనాపె ఖూనె-ఖల్క్

లర్జేహై మోజె మై తెరీ రఫ్తార్ దేఖ్ కర్

"హత్యానేరం మధు కలశం మెడకు చుట్టుకున్నది. ఓ ప్రేయసీ! నీ వయారపు నడకను చూచి మద్యం ధార భయంతో వణుకుతున్నది."

కవి యేమంటున్నాడో చప్పున స్ఫురించదు. వీళ్ల ప్రేయసి అతిలోక సౌందర్యవతి గదా. ఆమె అందానికి, ఆమె సౌకుమార్యానికి తగినట్లుగానే ఆమె నడక. సాఖీగా ఆమె తన 'మహెఫిల్'లో చేరిన ప్రేమోపాసకులకు మధు కలశంలోంచి పానపాత్రలో మద్యాన్ని వంపి స్వహస్తాలతో అందిస్తుంది. ఆ సౌందర్యాన్ని, ఆలాలిత్యాన్ని, ఆ వయారపు నడలను చూచే ప్రేమోన్మత్తులు కొందరు 'హాయ్' అని గుండె పట్టుకొని చచ్చిపోతున్నారు. తాగక ముందే చచ్చిపోతున్నరు. లోకులేమో అతిగా తాగి చచ్చిపోయినారని ఆ నేరాన్ని మద్యం మీద వోపుతున్నారు. అకారణ నేరారోపణకు భయపడి మద్యంధార వణుకుతున్నది. ద్రవపదార్థాన్ని ఒక పాత్రలోంచి ఇంకో పాత్రలోకి వంపేటప్పుడు వణకటం సహజమే.

ఆగె ఆతీథి హాలె దిల్ పె హంసీ

అబ్ కిసీ బాత్ పర్ నహీ ఆతీ

"వెనుకటికి ప్రేమలో నా స్థితి యెట్లయిందో దాని మీద నాకే నవ్వువచ్చేది. నా పిచ్చికి నేనే నవ్వుకునేవాన్ని. ఇప్పుడే విషయం మీదా నవ్వు రాదు." ప్రేమ పిచ్చి ముదిరిన తర్వాత తానెట్లున్నాడో తెలుసుకునే స్థితిలోనే లేనప్పుడు నవ్వేలా వస్తుంది?

గాలిబు కవితా సంకలనానికి (దీవాన్) వ్యాఖ్యానం రాసిన కొందరు సుప్రసిద్ధ కవి పండితుల్లో నజమ్ తబత్తబాయీ ఒకడు. అతడు ఉద్దేశపూర్వకంగానో,

అనుద్దేశపూర్వకంగానో గాలిబు కవితలోని లోపాలు వెదికే ప్రయత్నమే చేసినాడు. అలాటివాడు పై షేర్‌కు వ్యాఖ్యానం రాస్తూ "ఇంత సరళ శైలిలో ఒక సత్యాన్ని చెప్పిన ఈ షేర్ మీర్ తఖీమీర్ సైతం అసూయ పడదగింది." అన్నాడు.

మొదటి షేర్‌లో మద్యం ప్రసక్తి వచ్చింది కనుక ఎవరూ గాభరా పడవలసిన పని లేదు. ఒక షేర్ మద్యప్రసక్తి గలదే ఉదాహరిస్తాను?

గోహాథ్‌మె జుంబిష్ నహీ ఆంఖోఁమెతో దమ్‌హై

రహ్నేదో అభీ సాగిరో మీనా మెరే ఆగే

"చేయి కదిలే స్థితిలో లేదు. అయినా కళ్లలో ఇంకాప్రాణమున్నది. నా కెళ్లెదుట మధు కలశాన్ని, చషకాన్ని (పానపాత్రను) ఇంకా అలాగే ఉండనీయండి."

చావు సమీపించిందని తెలిసి కూడా మద్యాన్ని కళ్లముందే ఉండ నిమ్మంటున్నాడు- ఎంతటి వ్యామోహం! ఎంతటి వ్యసనం!

కాని మాలాంటి వాళ్లు ఇంకో అర్థం గ్రహిస్తారు. చావు సమీపించినా మనిషి ఇహలోక సంపదల వ్యామోహాన్ని, ఇహలోక సంబంధాల వ్యామోహాన్నీ చంపుకోలేడు. మధుకలశం, పానపాత్ర ప్రతీకలే యిక్కడ. ఇది మిర్జా గాలిబు గొప్ప షేర్లలో ఒకటని తబత్తబాయీ కూడా అంగీకరించినాడు. ఈ గజల్ మొదటి రెండు మూడు షేర్లు వేదాంతిలా చెప్పినాడు గాలిబు.

బాజీ చయె-అత్ఫాల్‌హై దున్యామెరే ఆగే

హోతాహై షెబో రోజ్ తమాషా మెరే ఆగే

"నా ముందర ఈ ప్రపంచమంతా పిల్లల ఆట- రేయింబవళ్లు ఈ తమాషా చూస్తూ వుంటాను. (నిర్లిప్తంగా)."

జుజ్‌నామ్ నహీ సూరతె-ఆలం ముఝే మంజూర్

జుజ్ వహం నహీ హస్తి-యె-అష్యా మెరే ఆగే

"నా దృష్టిలో ఈ దృశ్యమాన జగత్తు కేవలం నామమాత్రమయిందే. అస్తిత్వం లేదు. ప్రాపంచిక వస్తుజాలమంతా భ్రాంతి మాత్రమే."

తాత్విక కవితలో ఈ షేర్లు విలువైనవేకాని గజల్‌లో ఇవి చప్పటి షేర్లే. ఈలాటి షేర్లు మరికొన్ని గజల్లలలో మరికొన్ని చెప్పినాడు గాలిబు.

ఈమాఁ ముఝే రోకే హై తో ఖీంచే హై ముఝే కుఫ్ర్

కాబా మెరే పీ ఛే హై కలీసా మెరే ఆగే

"ఈమాన్ (విశ్వాసం) నన్ను ఆపుతున్నది. కుఫర్ (అవిశ్వాసం) నన్ను ఆకర్షిస్తున్నది. కాబా నా వెనుక వున్నది. కలీసా (చర్చి) నా ముందరున్నది."

ఈ సంఘర్షణను వ్యాఖ్యాత లందరూ గొప్ప షేరన్నారు.

"ఈ వొక్క షేర్ ముందు ఎన్నెన్నో దీవానులు దిగదుడుపే" అన్నాడు వ్యాఖ్యాతల్లో ఒకడైన ఆసీ.

ఖుష్ హోతేహై పర్ వస్ల్ మె యూఁ మర్ నహీ జాతే

ఆయీ షబె- హిజ్రాఁకి తమన్నా మెరే ఆగే

"సంయోగంలో సంతోషిస్తారుగాని ఇలా చచ్చిపోరు. విరహరాత్రాల్లో నేను చేసిన ప్రార్థన ఇలా నాముందుకువచ్చింది."

సంతోషం అధికమైతే చచ్చిపోతారు. దాన్ని 'షాదీ-మర్గ్' అంటారు. 'ఆగేఆనా' అనేది ఒక ముహావిరా. (జాతీయం) "చేసుకున్న పాపమో పుణ్యమో ముందుకు వస్తుంది" అంటారు.

దీన్ని వ్యాఖ్యానిస్తూ తబత్తబాయీ ఇలా అంటాడు-

"సంయోగంలో చచ్చిపోవటాన్ని గురించి చాలమంది కవులు రాసినారు. కాని ఈ మాటే వేరు. ముహావిరా, సార్థక శబ్ద ప్రయోగం మరణానికి సంబంధించిన ఈ భావానికి అమరత్వం కలిగించింది. గాలిబు రచించిన గొప్ప షేర్లలో ఇదొకటి."

ప్రియా సంయోగమెలాగూ కలుగదు గనుక వియోగ రాత్రుల్లో మృత్యువు రావాలని ప్రార్థించేవాడు కవి. ఆ ప్రార్థన సంయోగ రాత్రయే ఫలించింది.

గజల్ కవుల జీవితమంతా ఎదురు చూపుల్లో, సందేశహరుల కోసం తంటాలు పడటంలో గడుస్తుంది. ప్రేయసి వస్తుందనే ఆశ- వస్తానంటుందని ఆశ- ఆమె వస్తానని వాగ్దానం కూడ చేస్తుంది. కాని రాదు.

వాద ఆనేకా వఫా కీజియే, యెక్యా అందాజ్హై

తమ్నె క్యొం సోంపీహై మేరే ఘర్‌కి దర్బానీ ముఝే

"వస్తానని వాగ్దానం చేసినావు కనుక రా. ఇదెక్కడి సుతారం? నా యింటికి నన్నే ద్వార పాలకున్ని చేసినావెందుకు?"

తాఫిర్ న ఇంతెజార్‌మె నీంద్ ఆయె రాత్ భర్

అనేక వాద కర్‌గయే ఆయే హైఁ ఖ్వాబ్ మే

"స్వప్నంలో వచ్చి వస్తానని వాగ్దానం చేసింది. తెల్లవార్లూ నిద్రపోగూడదనే గదా." కల వస్తే కలలో ఆమె వస్తుందని ఎదురు చూస్తుంటే తెల్లవార్లూ నిద్రరాదు. నిద్రరానిదే కలయెలా వస్తుంది?

యె హమ్ జొ హిజ్రమె దీవారొ దర్‌కో దేఖ్తెహైఁ

కభీ సబాకు కభీ నామబర్‌కు దేఖ్తెహైఁ

"విరహనిశిలో నేనొకసారి గోడవైపు ఒకసారి ద్వారం వైపు ఎందుకు చూస్తానంటే అడ్డూ ఆపూ లేకుండా గోడ మీది నుంచి వచ్చేగాలి ఆమె సందశమేమైనా తెచ్చిందేమో అని. ద్వారం గూండా వచ్చే వార్తాహరుడు ఏవార్తయినా తెచ్చినాడేమో అని."

◆ ◆ ◆

ఒక మిత్రుడన్నాడు;

"భాషకో సంస్కారముంటుందన్న సంగతి నాకు తెలియదు. ఉంటే ఉండవచ్చు. నాది మాత్రం మానవతా సంస్కారం" అని. చాల మంచి మాట. మానవతను మించిన దేదీ లేదు. మానవున్ని (ఆదమ్ అలైస్సలామ్) సృష్టించి భగవంతుడు గర్వించినాడట. అంటే మానవునిలో నింపిన లక్షణాలకు తానే ముగ్ధుడైనాడట. అంటే, మానవుడు మానవుడుగా వుంటే భగవంతుడు సంతోషిస్తాడని మనం గ్రహించాలె. మానవునికి సిజ్దా చేయవలసిందిగా ఫరిష్తాలను, షైతానును ఆదేశించినాడట. కాంతి వలన సృష్టించబడిన ఫరిష్తాలకు అగ్ని వలన సృష్టించబడిన షైతానుకు భగవదాజ్ఞ రుచించలేదట. మట్టి వలన సృష్టించబడిన మానవుని ముందు సిజ్దా చేయటం నామోషీగా అనిపించిందట. అయితే, ఫరిష్తాలు (దేవదూతలు) భగవంతుని ఆగ్రహానికి భయపడతారు కనుక ఆజ్ఞపాటించినారట. షైతాను నిరాకరించినాడట. ఆ కారణంగా షైతాను భగవంతునికి దూరమైనాడు.

హైఁ ఆజ్ క్యోం జలీల్ కె, కల్ తక్ నథీ పసంద్

గుస్తా ఖి-యె ఫరిష్త హమారీ జనాబ్ మే

అంటున్నాడు గాలిబు.

"అయ్యా! భగవంతుడా! నిన్న నా ముందు తలవంచనన్న ఫరిష్తా ప్రవర్తన నీకు నచ్చలేదు గదా. నేడు ఇంతటి అవమానితున్నెందుకైనాను?" అని భగవంతున్ని ప్రశ్నిస్తున్నాడు. జవాబు తనకూ తెలుసు- మానవుడు మానవత కోల్పోయినాడు. అవమానితుడు కాకేమవుతాడు?

బస్కె దుష్వార్ హై హర్ కామ్‌కా ఆసాఁ హోనా

ఆద్మీకోభి మొయస్సర్ నహీ ఇన్సాఁ హోనా

గాలిబు తెలుసుకున్న సత్యమిది;

"ప్రతికార్యం కష్టసాధ్యమేకాని సుకరం కాదు. మనిషి మనిషికావటం కూడా కష్టమే."

ఈ ప్రేమ ఒకటి. ఇదొక రోగం లా తగులు కుంటుంది. మనిషిని పనికిరాని వాన్ని చేస్తుంది.

ఇష్క్‌నే గాలిబ్! నికమ్మా కర్‌దియా

వర్నా హమ్‌భీ ఆద్మీ థే కామ్‌కే

"నేనూ అన్నిటికీ పనికివచ్చే మనిషినే. కాని ప్రేమ వలన పనికిమాలిన వాన్నయినాను." అంటాడు గాలిబు.

ప్రేమ పనికి రానిది కాదు. భగవంతుని సృష్టిని ప్రేమించినవాడు భగవంతున్ని ప్రేమించినవాడే. వాన్ని భగవంతుడు ప్రేమిస్తాడు. తనను సేవించే వాళ్లనే భగవంతుడు ప్రేమిస్తాడనుకోవటం భ్రాంతి మాత్రమే. భగవంతున్ని ప్రేమించాలె. ప్రేమించిన వాడే సేవిస్తాడు. ప్రేమతో సేవించేవాడు ప్రతిఫలాపేక్షతో (కూలికి) సేవించేవాని కంటే శ్రేష్ఠుడు గదా. నిష్ఠతో సేవిస్తున్నాను కనుక స్వర్గసుఖాలందుకుంటానని ఆశించేవాడు భ్రమలో వున్నాడు. స్వర్గ సుఖాపేక్షతో భగవంతున్ని సేవించేవాళ్లను చూచిచూచి "స్వర్గాన్ని తీసుకవెళ్లి నరకంలో పడవేయండి" అన్నాడు గాలిబు. ఆ షేర్ ఉదాహరించ లేదు నేను. ఎవరికైనా ఆ షేర్ నచ్చకపోవచ్చు. శాంతంగా ఆలోచిస్తే గాలిబు మాటలో వుండే సత్యం గోచరిస్తుంది. స్వర్గమే లేకపోతే ఏమవుతుంది? భగవంతున్ని సేవించేవాళ్లు సేవించరా? ప్రేమించే వాళ్లు ఎలాగూ సేవిస్తారు. ప్రేమలో తనను తాను భగవంతునికి అర్పించుకోవటమే నిజమైన సేవ. సింధువులో బిందువు కలసి పోయినట్లు (ఫనాఫిల్బహర్) భగవంతునిలో కలిసిపోవటమే (ఫనాఫిల్లా;

ఫనాపిల్లాత్) జీవన పరమార్థం. "నేను" అనే భావం నశించాలె. అదెట్లా సాధ్యం? అటునుంచి కూడా ప్రేమదృష్టి పడాలె.

పర్తవే-ఖుర్ సే హై షబ్నమ్ కొ ఫనా కీ తాలీమ్

మైభి హూం ఏక్ ఇనాయత్‌కి నజర్ హోనే తక్

అంటాడు గాలిబు.

"సూర్యరశ్మి సోకగానే పాదలమీద పడిన మంచు బిందువులు ఆవిరై పోతాయి. సూర్య రశ్మిలో కలిసిపోతాయి. నేను గూడా ఒక అనుగ్రహపు చూపు ప్రసరించే వరకే వున్నాను. ఆ చూపు పడిందా "నేను లేను." ప్రేమకు ఫలితం దుఃఖమే. ఏడుపే. భగవంతుడు ఫరిష్తాల కియ్యని మనసు మనిషికిచ్చినాడు. మనసున్న మనిషి ప్రేమించకుండా వుండలేడు. దుఃఖించకుండా వుండలేడు.

దిల్ హీతో హైన సంగొఖష్త్- దర్దొసె భర్‌న ఆయెక్యోం

అన్నాడు గాలిబు. "రాయీ రప్పా కాదాయె- మనసాయె- బాధతో రోదించకుండా ఎలా వుంటుంది?"

ప్రేమ వలన ఫలితం దుఃఖమే అయితే ప్రేమించటమెందుకు? ప్రేమించని వాళ్లకు ప్రాపంచి దుఃఖాలు లేవా?

గమ్ అగర్ చె జాంగుసల్‌హై-పె కహాం బచేం కె దిల్ హై

గమె ఇష్క్ గర్ నహోతా-గమె-రోజ్‌గార్ హోతా

"బాధ ప్రాణాలను తోడేస్తుంది. నిజమే. కాని మనసున్న మనం బాధ నుంచి ఎలా తప్పించుకోగలము? ప్రణయ బాధ లేకుంటే ప్రాపంచిక బాధ."

విద్యుద్దీపాలు లేని కాలంలో సంపన్నులు గాజు కుప్పెలలో మైనపు వత్తులు వెలిగించేవాళ్లు. మైనపు వత్తి దీపం తెల్లవార్లూ కన్నీరుకారుస్తూ కాలేది. గాజుకుప్పెల్లో రంగుటద్దాలు అమర్చబడేవి. అవి తిరుగుతుండేవి.

గమె హస్తీ కా అసద్! కిస్ సెహో జుజ్ మర్గ్ ఇలాజ్

షమ్మ హర్‌రంగ్‌మె జల్తీహై సహెర్ హోనే తక్

"జీవిత దుఃఖానికి నివారణోపాయమే లేదు. షమ్మ ఏ రంగులోనైనా తెల్లవార్లూ కాలిపోవలసిందే."

ఇది గొప్ప కవిత్వమే కాదు. గొప్ప వేదాంతం.

"తుఝే హమ్ వలీ సమఝ్తే జొ న బాద ఖార్ హోతా"

అని జఫర్ బహాదుర్‌షా తననభినందించినట్లు ఒకగజల్‌లో చెప్పుకున్నాడు గాలిబు." నువ్వు మద్యపానం చేసేవానివి కాకపోతే నిన్ను 'వలీ' గా భావించే వాళ్లము." అని భావం. మద్యపానం మరుగున పడవేసిందంతటి బరువైన కవితను. ప్రెంచి మద్యం పేరెత్తకుండా చేసింది. అతని మాటల్లోనే,

"హఖ్ మగ్ఫరత్ కరే అజబ్ ఆజాద్ మర్ధథా" అనే ప్రార్థనతో ముగిద్దాం. దేనికీ కట్టుబడని స్వేచ్ఛా జీవి. భగవంతుడితన్ని అనుగ్రహించుగాక.

◆ ◆ ◆

మిర్జా గాలిబు గజళ్ల అందాలు

హకీమ్ షినాయీ, ఖ్వాజా పరీదుద్దీన్ అత్తార్, మోలానా రూమీ లాంటి సూఫీ కవులు ఫారసీలో వున్నారు. ఖ్వాజా మీర్ దర్ద్, మీర్ అసర్, అస్గర్ గోండ్వీ, అమ్జద్ హైదరాబాదీ లాంటి సూఫీ కవులు ఉర్దూలోనూ వున్నారు. వీళ్లంతా సూఫీల జీవితం గడిపినవాళ్లు. వీళ్లుకాక ఇతర కవులు చెప్పిన గజల్లలోనూ చాల వరకు సూఫీ భావాలు కనిపిస్తాయి. కానయితే వాళ్లు అందరిలాంటి సామాన్య జీవితాలు గడిపిన వాళ్లే. భోగలాలసులైన నవాబుల ఆస్థాన కవులు స్వచ్ఛమైన శృంగార కవితే చెప్పినారు. దాగ్ దహెల్వీ ఆలాటి కవే. అతడు ఆరవ నిజాం గురువు. ఉస్తాదె-షాహ్. అతని గజల్లలో సూఫీ భావాలు వెదకటం వృధా ప్రయాస. అయినా, అతని కవితలోనూ సూఫీ భావాలు చూచే దర్దీ (ఆర్ద్ర హృదయులైన) పాఠకులున్నారు. శ్రోతలున్నారు. ఉర్దూ గజల్లలో వుండే విశిష్టతే అది. ఎవరి సంస్కారాన్ని బట్టి, చిత్తవృత్తిని బట్టి వాళ్లు అర్థం గ్రహిస్తారు. అందుకే ఉర్దూ ముషాయిరాల్లో మచి కవిత చెప్పే ఏ కవికైనా 'దాద్' లభిస్తుంది.

ప్రేమ ద్వివిధమని చాలసార్లు చెప్పుకున్నాము. ప్రేమించబడేది మానవ కాంత అయితే ఆ ప్రేమ మజాజీ. ప్రేమించబడేది పరమాత్మ అయితే (మాషూఖా హఖీఖీ) ఆ ప్రేమ హఖీఖీ. కొందరు దర్దీలు మజాజీ ప్రేమను హఖీఖీ ప్రేమగా భావించి 'సుబహానల్లా'! అని ప్రశంసిస్తారు. పరవశులవుతారు.

గాలిబు బాహ్య జీవితం సూఫీలది కాదు. భక్తులది కాదు. కాని జీవితానుభవం అతన్ని సూఫీగా మార్చింది. విశ్వాసిగా మార్చింది. సూఫీ వేదాంతం అతనికి అనుభవైక వేద్యమయింది. అతడు సూఫీలలాగా మాట్లాడినాడు. సూఫీలలాగా జాబులు రాసినాడు. సూఫీ భావ విలసితాలైన అనేక కవితలు చెప్పినాడు. అతడు మూలతః ప్రేమకవి. తసవ్వుఫ్ స్వచ్ఛమైన ప్రేమే. ఈశ్వర ప్రేమ. అతని నోట ఎన్ని సూఫీ భావాలు వెలువడినా వాటిని సూఫీ భావాలనటానికి కొందరు పెద్దలే వెనుకాడినారు. అతని సమకాలీనులైన సూఫీయోగులు, షాహ్ గుల్షన్, మియా కాలేషా లాంటి వాళ్లు అతన్ని ఆదరించటమే కాక అభిమానించినారు. అతని షేర్లలో కనిపించే సూఫీ భావాలకు 'హాయ్' అని గుండెలు పట్టుకున్నారు. ఆనాటి సనాతన వాదులు సైతం అతని కవితనే గౌరవించినారు కాని అతని కవిత అందరి కవితలను అధిగమించినట్లు కనిపించగానే కొందరు అతని లోపాలను వెదుక నారంభించినారు. విదేశాల్లో చదువుకొని వచ్చిన డా. అబ్దుర్రహమాన్ బిజనోరీకి గాలిబు కవితలో అంతా మంచే కనిపించింది. అంతా అందమే కనిపించింది. గాలిబు దీవాన్‌కు అతడు రాసిన సుదీర్ఘమైన పీఠిక "మహాసినె-కలామె గాలిబ్" అనే పేర ప్రత్యేక గ్రంథంగా ప్రచురించబడింది. భారతదేశంలో వేదాల తర్వాత గాలిబు దీవాన్ ఆదరణీయమయిందన్నాడు. మహాసిన్ అంటేనే అందాలు.

విదేశాల్లో చదువుకొని వచ్చిన ప్రొ. సయ్యద్ అబ్దుల్ లతీఫ్ చాలాకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా పని చేసినాడు. పవిత్ర ఖురాన్ను ఇంగ్లీషులో అనువదించినాడు. అదేచేత పనిలేని పనిగా ఇంగ్లీషులో 'గాలిబ్' అనే పేర మిర్జాగాలిబు జీవితాన్ని కూడా రాసినాడు. అందులో అతనికి మంచి అంతగా కనిపించలేదు.

నథా కుఛ్‌తో ఖుదా థా, కుఛ్ న హోతా తో ఖుదా హోతా
డుబోయా ముఝుకో హోనేనే నహోతా మైతో క్యాహోతా

ఇది గాలిబ్ షేర్. "ఏదీ లేనప్పుడు, అంటే, అంతా శూన్యమే వున్నప్పుడు భగవంతుడున్నాడు. ఏదీ లేకున్నా భగవంతుడుంటాడు. నా ఉనికి నన్ను ముంచింది. నేను లేకుండా వుంటే ఏమి వుండేది?" భగవంతుడే వుండేవాడని జవాబు. ఆద్యంత రహితుడు. 'నేను' అనే భావం నాలో వున్నందున భగవంతుడు నాకు తెలియకుండా వున్నాడు. "నేను " అనేది అహంకారం. (ఈ అహంకారమూ, డా. ఎక్బాల్ చెప్పిన ఖుదీ ఒక్కటి కావు) ఏమున్నదీ షేర్‌లో? శబ్ద చమత్కారం"

అని చప్పరించి నాడు డా. అబ్దుల్ లతీఫ్. ఇందులో ఏమీ లేదా? ఈ షేర్ చెప్పిన కవి సూఫీ కాడా?

ఇంకో షేర్;

హర్ చంద్ సుబక్ దస్త్ హువే బుత్ షకనీమే

హమ్ హైం‹తో అభీరాహ్‌మెహైం‹ సంగె-గిరాం‹ ఔర్

"మూర్తి భంజనంలో నేర్పరులమైనాము. రాతి బొమ్మలు పగుల గొట్టినాము. కాని 'నేను' ఉంటే బాటలో పెద్ద బండ ఇంకా వున్నట్లే" కేవలం విగ్రహాలను పగుల గొట్టి అహంకారాన్ని పగుల గొట్టక పోతే వ్యర్థమే" ఇది సూఫీల మాట కాదా? సూఫీల లక్ష్యం ఫనా- ఫనాఫిల్లా. మన అస్తిత్వాన్ని నిలుపుకొని ఫనా మార్గంలో పయనిస్తే ఎన్ని మంచి పనులు చేసినా గమ్యం చేరుకుంటామా? గాలిబు పట్ల ఆనాడూ కొందరికి ద్వేషభావమున్నది. నేటికీ కొందరిలో వున్నది.

హమ్ కహాం‹కె దానాథే, కిస్ హునర్‌మె యక్తాథే

బే వఝే హువా గాలిబ్! దుష్మన్ ఆస్మాం‹ అప్నా

అన్నాడు గాలిబు.

ఆకాశం ఆపదల పుట్ట. అటువంటి ఆకాశం నాకు శత్రువైంది? (అంటే విజ్ఞులు నన్నెందుకు ద్వేషిస్తున్నారని భావం) నేను మేధావిని కానయితిని. ఏ కళలోనూ అసమాన ప్రజ్ఞ కలవాన్ని కానయితిని. (మేధావుల్లో, కళాకారుల్లో, కవుల్లో మాత్సర్యం అసహజం కాదు)

"అయ్యా! నేను అతి సామాన్యున్ని. భ్రష్టున్ని. నా జోలికి రాకండి" అని ఆనాడే గాలిబు ఈ షేర్ ద్వారా మేధావులను, శీలవంతులను, సంస్కార వంతులను వేడుకున్నాడు. అయినా ఊర్కుంటారా? అతడు జీవితంలో పడ్డ కష్టాలేచాలు. అతని శవాన్ని వెలికి తీసి చిత్రవధ చేస్తున్నారు పుణ్యాత్ములు.

మిర్జా గాలిబు తసవ్వుఫ్‌రంగులో, భక్తి భావనతో చెప్పిన షేర్లను రాసి, భావం వివరించటానికి ఉద్దేశించిన ఈ వ్యాసంలో మళ్ళీ అతని వ్యక్తిగత జీవితం

వైపు మళ్లుతున్నందుకు పాఠక మహాశయులు నన్ను మన్నించాలె. 1969వ సంవత్సరాన గాలిబు శతవర్ధంతి ఉత్సవాలు జరుపాలని భారత ప్రభుత్వం నిర్ణయించినప్పుడు కొన్ని మతపరమైన పత్రికలు, "తాగుబోతుకు, జూదగానికి సన్మానమా?" అంటూ వ్యాస పరంపర ప్రచురించసాగినవి. బాధనిపించింది. భారతిలో నేను గాలిబు గురించిన వ్యాసాలు ప్రచురించసాగినాను. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆ సంవత్సరమే నేనురాసిన వ్యాసాల సంకలనాన్ని 'మిర్జా గాలిబు జీవితం' అనే పేర ప్రచురించుకున్నది. గాలిబు వర్ధంతి సభలు మన దేశంలోనే కాక రష్యా, అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఈరాన్, తుర్కిస్తాన్‌లలో ఘనంగా జరిగినవి. దూషించిన వాళ్లు నోరు నొప్పిపెట్టి మానుకున్నారు. ఎన్నడో చచ్చిపోయిన గాలిబును దూషించడమే తన రచనల లక్ష్యంగా పెట్టుకున్న మహాకవి 'యగానా చంగీజీ, యాస్' ఎంత గౌరవం పొందినాడో ఇదువరకే రాసినాను. గాలిబు గురించి రాస్తూ ఒక చోట అతన్ని కించపరిచే మాట రాసినాను. విద్యలోనూ వయసులోనూ నాకంటే పెద్దవాడయిన కీ.శే. భావూరావు వైద్య ఆ మాట చదివి, "మీకు గాలిబు గురించి ఏమీ తెలియదు" అని లేచి వెళ్లి పోయినాడు. ఐదారు నెలల వరకు నాతో మాట్లాడలేదు. నేనతనికి ఆప్తున్ని. గాలిబు ఏమీకాడు. గాలిబు అభిమానుల ఈ 'సెంటిమెంటు'ను గౌరవించటమే సంస్కారం.

గాలిబు చివరి రోజుల్లో అతన్ని అనేకులు దూషిస్తూ జాబులు రాసినారు. 'బుక్-లెట్స్' వేసినారు. 'నువ్వు తాగుబోతువు-ముసల్మానువు కావు- నరకానికే పోతావు." అని హెచ్చరించేవాళ్లు. వాళ్లంతా అనామకులు. అతి సామాన్యులు. పత్రికల్లోనూ, పదుగురి దృష్టిలోనూ పడాలనే దురాశకలవాళ్లు. అమీనుద్దీన్ అనే బడి పంతులొకడు అసభ్యమైన భాష ప్రయోగించినాడు. "అంతగా తిడితే మీరు మిన్నకున్నారేమి?" అని ఒక మిత్రుడో శిష్యుడో ప్రశ్నిస్తే, "ఒక గాడిద నిన్ను తన్నిందనుకో. నువ్వూ దాన్ని తంతావా?" అని ఎదురు ప్రశ్నవేసినాడు గాలిబు.

ఇప్పటికే బాట తప్పి చాల దూరం నడిచినాను. మళ్లీ మొదటికి వస్తాను.

దిలే హర్ ఖత్రాహై సాజె అనల్ బహర్
హమ్ ఉస్కే హైఁ హమారా పూఛ్నా క్యా

"ప్రతి జల బిందువు హృదయ వీణలోంచి "నేనే సింధువును" అనే ఆలాపం వినవస్తున్నది. స్వల్పమైన బిందువు సింధువులో కలిస్తే అదీ సింధువే

అయిపోతుంది. నేను స్వల్పున్నే అయినా నేనూ అదే" అంటున్నాను. నా సంగతి అడిగేదేమున్నది?"

ఈ షేర్ ఎంత గంభీరమైనదో వేరే చెప్పాలా? అతడండీ గాలిబు!

జబ్ తెరే బిన్ నహీ కోయీ మోజూద్

ఫిర్ యె హంగామ అయ్ ఖుదా క్యాహై

"నువ్వు తప్ప అన్యమేదీ లేనప్పుడు భగవంతుడా! ఈ హంగామా అంతమేమిటి?" దృశ్యమాన మవుతున్న ఈ సమస్త మేమిటి? అంతా నీ ప్రకాశమే అని అంతరార్థం.

ఈ షేర్ భావాన్ని ఇంకో మూడు షేర్ల దాక పొడిగించినాడు. ఇది గజల్‌లో నిబద్ధమైవున్నది కనుక ఖితా బంద్ అంటారు. వేరేవుంటే ఖితా అంటారు. గజల్ షేర్ దేనికదే Unit భావాన్ని తర్వాతి షేర్లకు సాగదీస్తే ఖితాబంద్ అనబడుతుంది. మిగతా మూడు షేర్లు మాత్రం రాసి విరమిస్తాను.

యే పరీచెహరా లోగ్ కైసే హైఁ

ఘమ్జవో అష్వవో అదా క్యాహై

షికనె-జుల్ఫె అంబరీఁ క్యాహై

నిగహే-చష్మె సుర్మసా క్యాహై

లాలవోగుల్, కహాఁసే ఆయేహైఁ

అబ్ర్ క్యాచీజ్‌హై హవాక్యాహైఁ

(అంతా 'అదే', హమవూస్త్).

◆ ◆ ◆

సబ్ కహాఁ కుఛ్ లాలవో గుల్‌మే నుమాయాఁ హోగయీఁ

ఖాక్ మే క్యా సూరతేఁ హోంగీ కె పిన్హా హోగయీఁ

భావం తెలియకున్నా అందమైన షేర్ అనిపిస్తున్నది కదూ! ఔను. మిర్జా గాలిబు రచించిన అందమైన షేర్లలో ఇదొకటి. సౌందర్యారాధకునికి అన్నీ సుందరంగానే కనిపిస్తాయి. పుష్పవాటికలో తిరుగుతూవుంటే ఎన్నో రంగు రంగుల

అందమైన పూలు. ఇవి పూలేనా? కావు. "సుందర పుష్పాలలాంటి ఎన్నెన్ని సుందర వదనాలు ఈ భూమిలో దాక్కున్నావో! వాటిల్లోంచి, ఇదిగో ఈ కొన్ని సుందర పుష్పాలై పైకి వచ్చినాయి" అంటున్నాడు కవి.

ముసల్మానుల నమ్మకం ప్రకారం చనిపోయిన మనిషిని సమాధి చేసి సంబంధీకులంతా వెళ్లిపోయిన తర్వాత వెంటనే ఇద్దరు దేవదూతలు సమాధిలో కలాలూ, పత్రాలూ పట్టుకొని ప్రవేశిస్తారట. ఆ మనిషిని లేపి జీవితంలో అతడు చేసిన మంచి చెడులను గూర్చి ప్రశ్నించి రాసుకుంటారట. వాళ్లను మున్కిరొనకీర్ అంటారు. నకీరైన్ అని కూడ అంటారు. ప్రళయ దినాన ఆత్మలన్నీ భగవంతుని సమక్షాన సమావేశమవుతాయి. ఆ యిద్దరు ఫరిష్తాలు అన్ని ఆత్మల తప్పొప్పుల పట్టికలను ఒక్కొక్కటిగా భగవంతునికి నివేదించుకుంటారు. పాపాలకు తగిన నరక యాతనలు, పుణ్యానికి తగిన స్వర్గసుఖాలు విధించబడతాయి. అది లెక్కల దినం. కనుక రొజె-హిసాబ్ అంటారు. మహషర్ అంటారు. హషర్ అంటారు. ఖియామత్ అంటారు.

పక్డె జాతేహైఁ ఫరిష్తోంకె లిఖే పర్ నాహఖ్
ఆద్మీ కోయి హమారా దమె- తహ్రీర్ భీథా?

ఫరిష్తాలు రాసిన దాని మీద పట్టు బడుతున్నాము- శిక్షించ బడుతున్నాము. రాసేటప్పుడు మా మనిషి ఎవడైనా వున్నాడా? బయాన్ రాసుకునేటప్పుడు, న్యాయ విచారణ జరిగేటప్పుడు సాక్షి వుండాలె. అది న్యాయం- ఫరిష్తాలకు మనసు లేదాయె. కోరికలు లేవాయె. పాపాలు చేసే వీలు లేదాయె- మనసున్న మా మనిషి యెవడైనా అక్కడ ఉండివుంటే మనస్సు ఎలాటి కోరికలు కలిగిస్తుందో, మనిషి వివశుడై ఏమేమి చేస్తాడో వివరించి చెప్పి కాస్త సానుభూతి కలిగించే వాడు గదా. కనికరం కలిగించేవాడు కదా అంటున్నాడుకవి.

ఈ భావాన్నే మీర్ తఖీమీర్ సమకాలీనుడైన సౌదా ఇలా చెప్పినాడు.

"దోజఖ్ ముఝే ఖుబూత్ పె అయ్ మున్కిరో నకీర్
లేకిన్ నహీ దిమాగ్ సవాలో జవాబ్ కా."

"ఓ ఫరిష్తాలారా! నాకు నరకం సమ్మతమే - నన్ను నరకానికి పంపవల సిందిగా సిఫార్సు చేయండి. కాని మీరడిగే ప్రశ్నలకు సమాధాన మిచ్చే స్థితిలో లేను."

మీరడిగే ప్రతి ప్రశ్నకు జవాబు చెప్పేటప్పుడు కఠినురాలయిన నా ప్రేయసి ప్రస్తావన రాక తప్పదు. నాకు దుఃఖం రాక తప్పదు. అది నరకయాతన కంటే దుర్భరం అని కవి తాత్పర్యం.

గాలిబు భగవంతుని సన్నిధిలో ఇలా అంటున్నాడు;

నా కర్దా గునా హోంకి భి హస్రత్ కి మిలేదాద్

యారబ్! అగర్ ఇన్ కర్దా గునా హోంకి సజాహై

"భగవంతుడా! పాపం చేసిన వాళ్లకు శిక్ష తప్పదేని, పాపం చేయాలనే తీవ్రవాంఛను స్తోమత లేక మనసులోనే చంపుకున్న వాళ్లకు ప్రశంసలు లభించాలె." (పాపమంటే సుందరాంగులను (విగ్రహారాధనలాగా) ఆరాధించడం, మద్యపానం (పారవశ్యస్థితి) చేయటం- ఇవి రెండు మాత్రమే అని చాల సార్లు రాసినాను. హింస, హత్య, వ్యభిచారం, అసత్య భాషణం, పరనిందలాంటి పాపాలు ఇందులో చేరవు).

ఈ షేర్‌ను గురించి అందరు వ్యాఖ్యాతలు ఇది ప్రశంసల కందని షేర్ అన్నారు. గాలిబు కవితను సాధారణంగా విమర్శించే నజం తబత్తబాయి ఇలా రాసినాడు. "మీర్ తఖీమీర్ ఈ షేర్‌ను వినివుంటే ఇంతటి అందమైన భావం నాకు కాక మిర్జా నోషా పాలబడెనే అని ఈర్ష్య పొందేవాడు."

హైఖయాలే- హుస్నమే హుస్నే-అమల్ కాసా ఖయాల్

ఖుల్ద్‌కా ఎక్‌దర్‌హై మేరీ గోర్ కే అందర్ ఖులా

ముసల్మానుల విశ్వాసం ప్రకారం పుణ్యకార్యాలు చేసిన వాళ్ల గోరీలలో వాళ్ల ఆత్మలు రోజె-హిసాబ్ దాక అనుభవించే యాతన నుంచి తప్పించటానికి, లేదా, కొంత తగ్గించటానికి స్వర్గ ద్వారమొకటి వాళ్ల గోరీలో తెరుచుకొంటుంది. అందలి సుందర దృశ్యాలు చూస్తూ బాధనుమరిచిపోతారు. గాలిబు అంటున్నాడు; నా గోరీలో ఒకస్వర్గద్వారం తెరుచుకున్నది- అతిలోక సుందరి అయినటువంటి నా ప్రేయసిని నా భావాలలో నింపుకున్నాను కాని నేను చేసిన పుణ్య మేదీలేదు. అంటే నా జీవితం బాహ్యాచారాలలో కాక భగవదాలోచనలో గడిచింది. సుందర మైన భావన సుందరమైన ఆచరణకు సమానం. బాహ్యాచరణ ఎంత పవిత్రంగా

వున్నా అంతరంగం పవిత్రంగా లేకుంటే అది, "బూడిదలో పోసిన పన్నీరే."(ఈ లోకోక్తి ఇటీవలే ఎవరో రాసినారు- లోకోక్తులతోనే భాషకు అందం. భావానికి పుష్టి).

సౌందర్యారాధకుని, ప్రేమోపాసకుని దగ్గర వుండే సంపదేమిటి?

చంద్ తస్వీరె- బుతాఁ, చంద్ హసీనోంకె ఖుతూత్

బాద్ మర్నేకె మెరే ఘర్‌సె యే సామాఁ నిక్లా

"విగ్రహాల వంటి సౌందర్యవతుల చిత్రాలు కొన్ని; సుందరాంగుల జాబులు కొన్ని; నేను చనిపోయిన తర్వాత నా యింట్లో దొరికిన సామగ్రి యిదే."

ఏదో ఒక కళలో నిపుణుడైన మహెఫిల్‌లలో తన కళను ప్రదర్శిస్తే సుందరాంగులు ఆసక్తి చూపుతారు. పరిచయం పెంచుకుంటారు. అందగత్తెల నాకర్షించాలంటే ఏదో ఒక కళనునేర్చుకోవాలె;

సీఖేహైఁ మహరుఖోంకె లియే హమ్ ముసవ్వరీ

తక్రీబ్ కోయి బహరె-ములాఖాత్ చాహియే

"చంద్ర బింబిల్లాంటి వదనాలుగల సుందరాంగుల కోసం చిత్రకళ నేర్చుకున్నాను. వాళ్లతో పరిచయం పెంచుకోవటానికి ఏదో మిష కావాలె గదా!"

ఇష్క్‌నే గాలిబ్ నికమ్మా కర్‌దియా

వర్నా హమ్ భీ ఆద్మీ థే కామ్‌కే

"నేను ఏ పనికైనా సమర్థున్నే- ప్రేమలోపడి ఏ పనీ చేయలేని వాన్నయినాను."

◆ ◆ ◆

మిర్జా గాలిబు నీతిమంతుడని, పుణ్యవర్తనుడని అతని శత్రువులు కాదు గదా మిత్రులు కూడా అనలేదు. కాని అతడు దైవాన్ని నమ్మిన దైవ భక్తుడు. అతడు మోమిన్ కాకపోవచ్చు. అతన్ని ఆరిఫ్ అన్నారు హాలీలాంటి వాళ్లు. హాలీ మహాకవి అతని జీవిత విధానాన్ని, ఆలోచనా సరళిని పరిశీలించిన శిష్యుడు.

ఖత్రమే దజ్లా దిఖాయీనదే ఔర్ జుజు మే కుల్

ఖేల్ బచ్చోంక హువా దీదయె- బీనా నహువా

దజ్లా అనేది ఒక నది- నదిని దర్యా అంటారు. దర్యా అంటే సముద్రమనే అర్థం కూడా వున్నది. ఇక్కడ మనమా అర్థమే గ్రహించాలె- తాత్పర్యమేమంటే "బిందువులో సింధువు, అణువులో సమస్త విశ్వం కనిపించదేని అది పిల్లలాటే కాని నిజమైన చూపు కాదు."

ఈ భావాన్ని మరికొన్ని షేర్లలో చెప్పినాడు. ఇది మారిఫత్‌కు చెందిన మాట. ఆచరణ సక్రమంగా లేనప్పుడు ఈలాటి కవిత్వం చెప్పినందువలన అతన్ని ఆరిఫ్ అనవచ్చునా? అని కొందరికి సందేహం కలుగవచ్చు. అలాంటివాళ్లు మిర్జాగాలిబు వృత్తాంతం పేర రాసిన పన్నెండు వ్యాసాలలో ఎక్కడో హాలీ రాసిన వాక్యాలు మళ్లీ చదువుకో వలసిందిగా మనవి చేస్తాను. బాహ్యావర్తనను చూచి తొందరపడి ఎవరినీ నిందించగూడదని అన్ని మతాలు ఆదేశించినవి. అంతరంగం అల్లాహ్‌కే తెలుసు. అతడు సర్వజ్ఞుడు. అల్పజ్ఞులమైన మనం ఆక్షేపించటం అహంకారం. అహంకారం పతనానికి దారి తీస్తుంది కాని పైకెత్తదు. మిర్జా గాలిబు మారిఫత్ గురించి చర్చ ఇంతటితో ముగించి మామూలు భక్తుడుగా భగవంతుడే దిక్కని భావించి మొరపెట్టుకున్న రెండు మూడు షేర్లు చదువుకుందాము.

యారబ్! ముఝె జమాన మిటాతాహై కిస్‌లియే
లూహే జహాఁ పె హర్ఫె మకర్రర్ నహీహూఁ మై

"భగవంతుడా! కాలం నా జీవితాన్ని లా చెరిపివేస్తున్నదెందుకు? ప్రపంచ మనే కాగితం మీద మలిసారి రాయబడిన అక్షరాన్ని కాను గదా."

కాగితం మీద ఒకసారి రాయవలసిన అక్షరాన్ని పొరపాటున రెండవ సారి రాస్తే ఆరెంటిలో ఒక దాన్ని కొట్టివేస్తారు.

జిందగీ అప్ని జబ్ ఇస్ తౌర్ సే గుజ్రీ గాలిబ్
హమ్ భి క్యా యాద్ కరేంగే కె ఖుదా రఖ్తేథే

"గాలిబ్! జీవితం ఇలా గడిచింది. మాకో దేవుడుండెనని ఎలా జ్ఞప్తి చేసుకుంటాము?" దేవుడేవుంటే అతన్ని నమ్ముకున్న నేను ఇన్ని కష్టాలతో జీవితం గడిపేవాణ్ణా? అని భావం.

ఇది దేవుని అస్తిత్వాన్ని నిరాకరించే మాట కాదు. దేవుడు అపారకరుణా మయుడు గదా. నామీద అతని కరుణ ఎందుకు కలుగలేదు? నేను

పాపాత్మున్ననా? అతని కరుణా దృష్టి ప్రసరించేది పాపాత్ముల మీదనే కదా?

తన ఉర్దూ గజల్ల పట్ల గాలిబుకు ఎన్నడూ సదభిప్రాయం లేదు. చివరి చివరికి కలిగినట్లున్నది.

జోయే కహేకె రేఖ్తా-క్యోంకర్ హో రష్కె ఫారసీ

గుఫ్తయె గాలిబ్ ఏక్ బార్- పఢ్‌కె ఉసే సునాకె యూఁ

కవిత్వంలో ఉపయోగించే ఉర్దూను రేఖ్తా అనేవాళ్లు. రేఖ్తా అంటే సున్నం, ఇసుక, ఇటుకలు వగైరా కలిపిన మిశ్రమం. ఉర్దూ భాష మిశ్రభాష కనుక మొత్తం ఉర్దూకు ఈ పేరు వర్తిస్తుంది. కాని కవిత్వం భాషకే ఈ పేరు పరిమితం చేసినారు.

లఖ్నోలో రంగీన్, జురాత్ అనే కవులు స్త్రీల మనోభావాలను స్త్రీల భాషలో చెప్పినారు. ఆ భాషను రేఖ్తీ అన్నారు. అది ప్రజాదరణ పొందలేదు. అది స్త్రీవాద కవిత కాదు. స్త్రీలను అపహసించే కవిత.

పై షేర్ తాత్పర్యం- "ఎవరైనా ఉర్దూ కవిత, ఫారసీ కవిత ఈర్ష్య పడేట్లు ఎట్లుండగలదు? అని అంటే గాలిబు కవితను చూపి, ఇదిగో ఇట్లుంటుంది అని చెప్పండి."

తన ఉర్దూ కవితా శైలిపట్ల కూడా అతనికి చివరి కాలంలో అభిమానం పెరిగింది.

"హైఁ ఔర్‌భి దున్యామె సఖున్‌వర్ బొహత్ అచ్ఛే

కహ్తే హైఁకె గాలిబ్ కాహై అందాజె- బయాన్ ఔర్"

"ప్రపంచంలో (ఉర్దూ కవితా ప్రపంచం) గొప్ప కవులింకా వున్నారు. కాని (రసజ్ఞులు) గాలిబు శైలి ప్రత్యేకమయింది అంటారు." అని చెప్పుకున్నాడు.

మీర్ తకీమీర్‌తో పోటికి దిగలేదు. పైగా మీర్ గొప్పతనాన్ని అంగీకరించనివాడు దౌర్భాగ్యుడన్నాడు.

"రేఖ్తాకె తుమ్హీ ఉస్తాద్ నహీ హో గాలిబ్

కహ్తేహైఁ అగ్లె జమానేమె కోయీ మీర్‌భి థా."

"ఉర్దూలో నువొవ్వక్కనివే గొప్ప ఉస్తాదువు కావు గాలిబ్! వెనుకటికి మీర్ అనే గొప్ప ఉస్తాద్ వుండేవాడంటారు. (రసజ్ఞులు)"

"వెనుకటి కాలంలో అంటారు- "అనే మాటలన్నాడు కాని 14 సంవత్స రాల వయసులో ఆగ్రాలో మీర్‌ను చూచినాడు. అప్పుడా మహాకవి వయస్సు ఎనభై సంవత్సరాలకు పైనే.

పైన "ఉర్దూ కవిత ఫారసీ కవిత ఈర్ష్య పడేట్లుంటుందా?" అని అడిగే వాళ్లకు "గాలిబు కవిత చూపి, ఇదిగో ఇలా వుంటుంది." అనండి అనే షేర్ రాసినాను గదా. అంతకు ముందతడు తన భావాలను వ్యక్తీకరించటానికి ఉర్దూ భాష సరిపోదు అనేవాడు. ఎవరైనా అతని ఉర్దూ గజల్లను మెచ్చుకుంటే "సోదరా! నా ఉర్దూ గజల్లను మెచ్చుకుంటే సిగ్గుగా వుంటుంది. నా ఫారసీ గజల్లు చదువండి" అని జవాబు రాసేవాడు. ఈ సందర్భంలో ఒక ఫారసీ ఖితా కూడ రాసినాడు. అది రాజ కవి షేఖ్ ఇబ్రాహీం జోఖ్‌ను ఉద్దేశించి రాసినాడని ఆకాలంలోనే కొందరు అభిప్రాయపడ్డారు. జోఖ్ గొప్పకవి. భాషాతత్త్వవేత్త. అతని ఖసీదాలు గొప్పగా వుంటాయి కాని గజల్లు గాలిబు గజల్లకు సాటిరావు- జోఖ్ రాజకవిగా గౌరవం పొందటం, తాను ఆశ్రితుడుగా మాత్రమే వుండటం కారణంగా గాలిబు అప్పుడప్పుడు వ్యంగ్య బాణాలు విసిరే వాడంటారు. అతని అందమైన షేర్లను మాత్రం మనసారా మెచ్చుకునేవాడు. శిష్యులకు రాసే జాబుల్లో వాటిని ఉట్టంకించేవాడు.

ఒకనాడు రాజగురువు జోఖ్ పల్లకీలో వైభవంగా వెళ్తున్నాడు. రోడ్డు ప్రక్కన ఏ మిత్రునితోనో మాట్లాడుతూ నిల్చున్న గాలిబు ఆ దృశ్యం చూచినాడు. మత్సరం తలెత్తింది. ఒకమిస్రా ఆశువుగా అల్లి పైకే చదివినాడు;

హువాహై షహ్ కా ముసాహిబ్, ఫిరేహై ఇత్రాతే

"చక్రవర్తికి సన్నిహితుడైనాడు కనుక గర్వంగా తిరుగుతున్నాడు."అని భావం. పల్లకీలో వున్న జోఖ్ ఆ మిస్రా విన్నాడు. చక్రవర్తికి చెప్పుకున్నాడు. మర్నాటి సభలో చక్రవర్తి బహాదుర్‌షా జఫర్ ఆ మిస్రాను చదివి, "మిర్జా! ఇది మీరు రాసిన ఏ గజల్‌లోని మిస్రానో ఆ గజల్ వినాలని వున్నది" అన్నారు. కొంప మునిగిందనుకున్నాడు గాలిబు.

"హుజూర్! ఆ గజల్ నాదే. ఆ మిస్రానాదే. ఇదిగో ఇప్పుడు ఆ షేర్లన్నీ జ్ఞప్తికి తెచ్చుకొని వినిపిస్తాను" అని మనవి చేసి ఆశువుగా తొమ్మిది షేర్ల గజల్ చెప్పినాడు. పదవది మఖ్తా. మఖ్తాలో ఆ మిస్రాను తనను తాను పరిహసించు కున్నట్లు చెప్పినాడు.

హరేక్ బాత్ పె కహ్తే హో తుమ్‌కె తూ క్యాహై

తుమ్హీ కహోకె యె అందాజె గుఫ్తగూ క్యాహై

"ప్రతి మాటకు 'నువ్వెంత?' అంటావు. నువ్వేచెప్పు. సంభాషణ పద్ధతి ఇదేనా?" అని భావం.

ఇది మత్లా. తూ, గుఫ్తగూ అనేవి ఖాఫియాలు. క్యాహై అనేది రదీఫ్. ఈ ఖాఫియా రదీఫులతోనే గజలంతా చెప్పాలె.

మఖ్తా ఇలా చెప్పినాడు. అందులోనే మొదటి మిస్రాను చేర్చినాడు.

హువాహై షహ్‌కా ముసాహిబ్, ఫిరేహై ఇత్రాతా
వగర్ న షహర్‌మే గాలిబ్‌కి ఆబ్రూ క్యాహై

"చక్రవర్తి సన్నిహితుడైనాడు కనుక గర్వంగా తలెత్తుక తిరుగుతున్నాడు కాని దిల్లీ నగరంలో గాలిబు గౌరవమేపాటి?" ఎటువెళ్లినా అప్పుల వాళ్లేనయిరి. అవమానమేనాయె. అని భావం. గాలిబు సద్యస్ఫూర్తికి, ఆశు కవితా శక్తికి చక్రవర్తితో సహా అందరూ ఆశ్చర్యానందాలతో వహ్వాల వర్షం కురిపించినారు.

ఇట్లాంటిదే రాజకుమారుని వివాహసందర్భాన సహెరా (బాసికం) పేర రాసిన కవిత గురించి కూడ ఒక సంఘటనే జరిగింది. అది కాస్త పెద్దది. ఇంకో వ్యాసంలో మనవి చేస్తాను.

ఈ వ్యాసంతో గాలిబు గజల్ల అందాలు వివరించటం మానుకొని ఇతర కవుల కవిత్వాన్ని గురించి రాస్తాను. ముఖ్యంగా డా. ఎక్బాల్ గురించి రాయలె కదా.

మిర్జా గాలిబుకు తన కాలంలో దొరకవలసిన గుర్తింపు దొరకలేదనే బాధ వుండేది. అది నిజమే. సమకాలీనులైన జోఖ్, మోమిన్‌లకు లభించే ప్రశంసలు ముషాయిరాల్లో గాలిబుకు లభించలేదు. కానయితే అతడు ఆయిద్దరి కంటె గొప్ప గజల్ కవే. అతడు తన గజల్లను తరన్నుమ్ (రాగయుక్తంగా)తో చదివేవాడు.

ఎర్రకోటలో జరిగిన ఒక పెద్ద ముషాయిరాలో గాలిబు తన గజల్ చదివిన తర్వాత స్వయంగా కవి అయిన చక్రవర్తి బహాద్దుర్‌షా జఫర్, "మిర్జా! మీరు చక్కగా గజల్ పాడగలరు." అని ప్రశంసించినాడట. కవి ఆశించేది తనషేర్లలోని భావాన్ని ప్రశంసించటం. చక్రవర్తి పాడే పద్ధతిని మాత్రం ప్రశంసించినాడు. అటువంటి అరసికుల ముందు, లేదా, రసికులైనా గాలిబు కవితను ప్రశంసించటానికి మనసొప్పని వాళ్లముందు తన గజల్లు చదువటం ఎంత వ్యర్థమో స్పష్టమే కదా. ఒక లోకోక్తిని వాడాలంటే బూడిదలో పోసిన పన్నీరే గదా. తన ఫారసీ రచన గురించి గాలిబు ఒకసారి గర్వాన్నీ విషాదాన్నీ ఒకే వాక్యంలో ప్రకటించినాడు.

"నా కలం శ్రావణ మేఘంలా వర్షిస్తున్నది. కాని ఊషరక్షేత్రాల మీద."

"హమారె షేర్‌మె అబ్ సిర్ఫ్ దిల్లగీకె అసద్

ఖులాకె ఫాయిదా అర్జేహునర్‌మె ఖాక్ నహీ" అన్నాడు గాలిబు.

"నా షేర్లు పరాచికానికి, కాలక్షేపానికి పనికివచ్చేవే కాని వీటిలోని కవితా కళకు మట్టికున్న విలువ కూడా లేదని గ్రహించినాను."

ఎంతటి బాధ ఈ మాటలనిపించి వుంటుంది?

కర్తె కిస్ ముహ్‌సె హో గుర్బత్ కి షికాయత్ గాలిబ్

తుమ్‌కో బేమెహరి-యె-యారానె-వతన్ యాద్ నహీ

అని కూడ ఒక సారన్నాడు గాలిబ్.

"గాలిబ్! ప్రవాసంలో వున్నానని బాధ పడతావెందుకు? నీ స్వస్థానంలో నీ మిత్రుల అనుగ్రహ రాహిత్యం గుర్తులేదా?"

అయితే, దిల్లీలోను దేశం నలుమూలల్లోను గాలిబు కవితను అభిమానించే వాళ్లు లేకుండిరనుకోరాదు. అనేకులుండిరి. ఎందరో శిష్యులు తమగజల్లు దిద్దించుకోవటానికి అతనికి పంపించేవాళ్లు. చివరికి "ఇక నాచేతకాదు-ముసలివాన్నయిపోయినాను. దయచేసి పంపకండి." అని పత్రికల్లో ప్రకటన లిచ్చుకున్నాడు గాలిబు. బహదుర్ షా జఫర్ స్వయంగా కవి. జోఖ్ తన గురువు

కనుక అతన్ని అభిమానించేవాడు కాని గాలిబు కవితాశక్తి నెరుగని వాడు కాడు. జోఖ్ మరణించిన తర్వాత తన గజల్లను గాలిబు చేతనే దిద్దించుకున్నాడు. అయితే ఆ కాలపు సాహితీ ప్రియులందరు ప్రాచీన కవుల ప్రసన్నశైలికలవాటుపడ్డవారు కనుక ప్రారంభ దశలో గాలిబు అవలంబించిన కఠిన శైలిని స్వీకరించలేక పోయినారు. సాంప్రదాయిక శైలికి అలవాటుపడ్డవాళ్లు కనుక భావాలలోని నూతనత్వాన్ని, అభివ్యక్తీకరణంలోని నూతనత్వాన్ని మొదట్లో ఆమోదించలేకపోయినారు. కవితా కళ మర్మజ్ఞులుగా తర్వాత పేరుగాంచిన హాలీ, షెఫ్తాలు గాలిబు కవితలోని గొప్పదనాన్ని గుర్తించినారు. అతని శిష్యులందరు అతని శైలిని అలవర్చుకునే ప్రయత్నం చేసినారు. అతని శిష్యుడు రామపూర్ సంస్థానాధిపతి నవాబు యూసుఫలీ ఖాన్ "ఎందరో కవులున్నా నాకు మిర్జా గాలిబు శైలే ప్రియమయింది" అని ఒక గజల్లోనే చెప్పుకున్నాడు. అంటే, గాలిబు సమకాలీనులు అతని కవిత పట్ల ఆదరణ చూపకపోవటానికి కారణాలు అతని కవితలోనే వున్నవి. తర్వాత తర్వాత అతడే గ్రహించి కొంతమారినాడు. అతడు మరణించిన తర్వాత కొన్ని దశాబ్దాల కాలంలోనే సాహిత్య లోకం అతనికి బ్రహ్మరథం పట్టింది. గాలిబుకు కలిగిన ప్రచారం, ప్రఖ్యాతి ఈ దేశంలో ఇంకే ఉర్దూ కవికి కలుగలేదనేది నిర్వివాదాంశం. మీర్ స్థానం ఎన్నటికీ ఉన్నతమైందే. అతడు గాక ఇంకే కవి గూడా గాలిబ్ లాగా గాని అతనికంటె కొన్ని సందర్భాల్లో గొప్పగా సుందరంగా గాని కవిత చెప్పనే లేదని అనలేము. సాహిత్య విమర్శకులు గాలిబు తర్వాత డా. ఎక్బాల్‌ను పేర్కొన్నారు. అయినా, ఆయిద్దరి మధ్య ఇంకా ఎందరో ఉత్తమ గజల్లు చెప్పిన మహాకవులున్నారు. ఇప్పటికీ మనదేశంలోనూ పాకిస్తాన్‌లోనూ కమనీయ ఫక్కిలో గజల్లు చెప్పే కవులున్నారు. నిన్నమొన్నటి వరకు సినిమాలకు గజల్లు రాసిన కవుల్లోనూ ఎందరో మహాకవులు- హాలీ, దాగ్ దహెల్వీ, అస్గర్ గోండ్వీ, ఫానీ బదాయూనీ, జిగర్ మురాదాబాదీ, మజాజ్ లఖ్నవీ.... ఇలా ఎందరో స్మరణీయులైన మహాకవులు. ఈ కవుల నిర్మాణంలో మిర్జా గాలిబ్ ప్రభావం అంతో యింతో వుంటుంది. డా. ఎక్బాల్‌తో సహా వీళ్లంతా మిర్జా గాలిబును బాగా చదివినవాళ్లే. యగానా చంగేజీయాస్ కూడా చదివినవాడే. కాలం మారినా, పరిస్థితులు మారినా, ఉర్దూ గజల్ తన ఖాఫియా రదీఫుల పాబందీతో వ్యాకరణాన్ని

పాటిస్తూ ఇంకా నిత్యనూతనంగా ప్రజాదరణ పొందుతున్నందుకు ఆశ్చర్య పడవలసిందే. అన్యభాషల్లో చొచ్చుకపోయే ప్రయత్నం చేస్తున్నది గజల్. మరాఠీలో గజల్ నిలువలేకపోయింది. హిందీ గజల్లు ఉర్దూ గజల్లకు పోటీపడలేక వెనక్కి తగ్గుతున్నవి. తెలుగు గజల్ ఆశావహంగానే సాగుతున్నది.

ఉర్దూ అంటే గజల్- గజలంటే గాలిబు. ఇది జనాభిప్రాయం. గజల్‌కు గౌరవం దొరికినంత కాలం గాలిబును సాహిత్యలోకం మరచిపోజాలదు.

చదవండి ఒక వారం
చదువుతారు ప్రతి వారం

సహజీవన భావనల పావురాయి
గీతురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY

Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad - 500 002.
Ph.: 24564583